సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 14 వెల: ₹ 6.50
సంపుటి: 18
సంచిక: 232
గురువారం 13-11-2025

'నా ప్రస్థానంలో ప్రతి మలుపూ జన జీవితంతో ముడిపడి ఉంది'

విదేశీ ఉద్యోగులు ఉండాల్సిందే
హెచ్–1బీపై తొలిసారిగా సానుకూల ధోరణిలో మాట్లాడిన ట్రంప్ - 6లో

నితీశ్ స్థానంలో జురెల్
దక్షిణాఫ్రికాతో తొలి టెస్టులో బరిలోకి.. అసిస్టెంట్ కోచ్ వెల్లడి - 13లో

SIMULTANEOUSLY PRINTED AT GUNTUR | MANGALAGIRI | VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను నిరసిస్తూ నంద్యాల జిల్లా డోన్, నెల్లూరు జిల్లా కోవూరులో కదంతొక్కిన విద్యార్థులు, ప్రజలు, వైఎస్సార్‌సీపీ నాయకులు

కట్టలు తెగిన ప్రజాగ్రహం

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణపై రాష్ట్ర వ్యాప్తంగా నిరసన

175 అసెంబ్లీ నియోజకవర్గాల్లో వైఎస్సార్‌సీపీ నిరసన ర్యాలీలు

- స్వచ్ఛందంగా వేలాదిగా కదలివచ్చిన విద్యార్థులు, తల్లిదండ్రులు, మేధావులు, ప్రజా సంఘాల నేతలు
- 17 నెలల్లో చేసిన రూ.2.50 లక్షల కోట్ల అప్పులో కేవలం రూ.5 వేల కోట్లు వీటి కోసం ఖర్చు చేయలేరా?
- పేదలకు సూపర్ స్పెషాలిటీ వైద్యం అందకుండా చేస్తారా
- పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేస్తారా?
- తక్షణమే మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను విరమించుకుని ప్రభుత్వ రంగంలోనే నిర్మించాలి..
- ప్రజాగ్రహ జ్వాలల్లో చంద్రబాబు సర్కార్ కొట్టుకుపోతుందంటూ నినాదాలు
- తరలి వచ్చిన వారితో కలిసి అధికారులకు డిమాండ్ పత్రాలు అందజేసిన వైఎస్సార్‌సీపీ నేతలు
- పోలీసుల నోటీసులు.. బెదిరింపులకు ఏమాత్రం లొంగకుండా వైఎస్సార్‌సీపీ నేతలతో కలిసి కదంతొక్కిన జనం
- ప్రభుత్వంపై వెల్లువెత్తుతున్న ప్రజా వ్యతిరేకతకు నిరసన ర్యాలీలు మరోసారి అద్దం పట్టాయంటున్న రాజకీయ పరిశీలకులు

2,3 లో

ఇది ప్రజా విజయం

- నియోజకవర్గాల్లో నిరసన ర్యాలీలకు విశేష స్పందన
- వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్
- మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ప్రజల చరిత్రాత్మక ఉద్యమం
- విద్య, వైద్య వ్యవస్థలను కాపాడుకోవాలన్న వారి సంకల్పానికి నిదర్శనం
- ప్రజలు తమ ఆగ్రహాన్ని, ఆవేదనను స్పష్టంగా వ్యక్త పరిచారు
- స్వలాభం కోసం కాకుండా సమాజ భవిష్యత్తు కోసం నిలబడ్డారు
- అడ్డంకులు ఎదురైనా ఎక్కడా ఒక్క అడుగు కూడా వెనక్కు వేయలేదు
- ఇది రాష్ట్రంలో ప్రజాస్వామ్య స్ఫూర్తికి అద్దం పట్టింది.. చంద్రబాబూ.. ఇకనైనా మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కు తీసుకోండి
- ర్యాలీలు విజయవంతం చేసిన అందరికీ ధన్యవాదాలు

11 లో

భక్తుల మనోభావాలు

దెబ్బ తీయొద్దు

- టీటీడీ మాజీ ఈవో ధర్మారెడ్డి
- కొన్ని మీడియా సంస్థలు పనిగట్టుకుని అవాస్తవాలు ప్రచారం చేస్తున్నాయి
- అన్ని ప్రశ్నలకు సవివరంగా సమాధానాలు చెప్పా
- గతంలో టీటీడీలో పనిచేసిన అధికారులందరినీ విచారించడంలో భాగంగానే నన్నూ పిలిచారు

14 లో

కేజీహెచ్‌లో వైద్యం అందక గిరిజన పసికందు మృతి

వైద్యుల నిర్లక్ష్యంపై తల్లిదండ్రుల ఆందోళన
ఆస్పత్రిలో పిల్లల వార్డు వద్ద బైఠాయింపు
విచారణ చేస్తున్న సీఎస్ఆర్ఎంవో డాక్టర్ శ్రీహరి

5లో

పసికందు ధన్వీర్ మృతదేహం

బీసీ హాస్టల్ విద్యార్థికి

స్క్రబ్ టైఫస్ వ్యాధి

ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థి ఈశ్వరరావు

- విశాఖ కేజీహెచ్‌లో చికిత్స
- శ్రీకాకుళం జిల్లా కొత్తూరు మండలంలో ఘటన
- నల్లులు వంటి కీటకాలతో ఇవి సోకుతాయన్న వైద్యాధికారి

5లో

జగన్ ప్రభుత్వం కట్టిన ఇళ్లకు

బాబు 'కలరింగ్'

పేదలందరికీ స్థలాలిచ్చి ఇళ్లు కట్టిస్తామని మేనిఫెస్టోలో హామీ

- 17 నెలల్లో గజం స్థలం, ఒక్క ఇల్లు మంజూరు చేయని చంద్రబాబు
- నాడు నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకం కింద 31.19 లక్షల పేదింటి మహిళలకు ఉచితంగా ఇళ్ల స్థలాలిచ్చిన వైఎస్ జగన్.. వాటిలో 19 లక్షలకు పైగా ఇళ్ల నిర్మాణం మొదలు
- వీటికి 2.60 లక్షల టిడ్కో ఇళ్లు అదనం
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం దిగిపోయేనాటికి 9 లక్షలపైగా ఇళ్ల నిర్మాణం పూర్తి
- దాదాపు నిర్మాణం పూర్తయిన దశలో మరో రెండు లక్షలకు పైగా ఇళ్లు... మిగిలినవి వివిధ దశల్లో..
- వైఎస్ జగన్ ప్రభుత్వంలో నిర్మించిన వాటిలో చంద్రబాబు క్రెడిట్ చోరీ

10 లో

1. District	ANNAMAYYA
2. Mandal	CHINNAMANDAM
3. village	DEVAGUDIPALLI
4. Beneficiary ID	TI4507NPI4646193
5. Beneficiary Name	S Munthaj Begum
6. Father Name	S MOHAMMAD SHARIEF
7. Stage	COMP
8. Scheme	PMAY (U) BLC-UDA 2021-22 (Phase I)
9. Beneficiary is in Active State	Active

ముంతాజ్ బేగంకు 2021-22లో వైఎస్ జగన్ ప్రభుత్వం మంజూరు చేసిన ఇంటికి సంబంధించిన ఆధారం

ఈ ఇంటికే బుధవారం గృహప్రవేశం చేసి.. ఆ క్రెడిట్‌ను చంద్రబాబు తన ఖాతాలో వేసుకున్నారు.

- గత ప్రభుత్వం నిర్మించిన ఇళ్లకు స్టేజ్ అప్‌డేట్ చేసి 3 లక్షల ఇళ్లు కట్టేశామని చంద్రబాబు గొప్పలు
- ఆఖరికి సీఎం చంద్రబాబు నుంచి తాళాలు అందుకున్న వారికి ఇళ్లు మంజూరైంది జగన్ ప్రభుత్వంలోనే..
- ఆ స్థలాలు శవాలు పూడ్చడానికి సరిపోతాయని పేదల మనోభావాల మీద దెబ్బ కొట్టిన బాబు..
- నేడు అవే ఇళ్లను నిస్సిగ్గుగా తన ఖాతాలో వేసుకోవడానికి వెంపర్లాడుతున్న సీఎం

నేటి గుడ్లు & చికెన్ గుంటూరు జోన్ ధరలు
12 గుడ్ల రిటైల్ ధర ₹84
ఫారం దగ్గర లైవ్ బర్డ్ 111 కిలో
డ్రెస్డ్ స్కిన్‌తో 200 కిలో
రిటైల్ లైవ్ బర్డ్ 138 కిలో
స్కిన్ లెస్ 228 కిలో
Conditions Apply
వినియోగదారుల శ్రేయస్సు దృష్ట్యా జారీచేయడమైనది

ఇంటింటా...

ముఖ్యంగా పాలిటిక్స్‌లో లేరనిపిస్తోంది!

సాక్షి ఎడిటర్ ధనంజయరెడ్డికి మళ్లీ ప్రివిలేజ్ కమిటీ నోటీసులు

21వ తేదీన అసెంబ్లీ కమిటీ హాల్‌లో హాజరు కావాలని సమాచారం

కొనసాగుతున్న చంద్రబాబు సర్కారు కక్షసాధింపు
ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతోందని సాక్షిపై కత్తిగట్టిన వైనం
జర్నలిస్టు, ప్రజా సంఘాల నుంచి నిరసన వెల్లువెత్తుతున్నా ఆగని వేధింపులు

సాక్షి, అమరావతి: 'సాక్షి'పై చంద్రబాబు సర్కారు కత్తిగట్టింది. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతోందని కక్షసాధిస్తోంది. కేసులు, నోటీసుల పరంపరను కొనసాగిస్తోంది. ఎలాగైనా సాక్షి గొంతు నొక్కాలని శతవిధాలా యత్నిస్తోంది. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల శిక్షణ సదస్సు రద్దు, దానికి సంబంధించిన లోటుపాట్లపై గతంలో సాక్షి పత్రిక రాసిన కథనంపై ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డి, చీఫ్ రిపోర్టర్‌కి శాసనసభ వ్యవహారాల కార్యదర్శి సభా ఉల్లంఘన నోటీసులిచ్చిన విషయం తెలిసిందే. దీనిపై సాక్షి ఎడిటర్ హైకోర్టును ఆశ్రయించిన విషయమూ తెలిసిందే. హైకోర్టు ఆదేశాల తర్వాతా కూటమి సర్కారు వేధింపులు ఆపలేదు. తాజాగా ఎడిటర్ ధనంజయరెడ్డి, చీఫ్ రిపోర్టర్‌కు

మిగతా 11వ పేజీలో ▶

'ప్రైవేట్' అంటే పిచ్చిప్రేమ



కేంద్ర సంస్థలకు ఎకరం రూ.4.1 కోట్లు
ప్రైవేటు సంస్థలకు ఎకరం రూ.50 లక్షలు
రాజధానిలో భూకేటాయింపుల్లో చంద్రబాబు సర్కార్ తీరు ఇదీ

11లో

రహేజాకు విశాఖలో ఎకరం 99 పైసలకే 27.10 ఎకరాలు కేటాయింపు

- రిలయన్స్‌కు ఎకరం రూ.40 లక్షల చొప్పున అనకాపల్లిలో 30 ఎకరాలు
- పలు కంపెనీలకు భూములు, ప్రోత్సాహకాలు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ

11 లో

బాంబు పేలుడు ఘటనలో గాయపడ్డ యువతిని పరామర్శిస్తున్న ప్రధాని మోదీ

ముష్కరులు... ముమ్మాటికీ ఉగ్ర దాడే

ఢిల్లీ పేలుడు ఘటనను తీవ్రంగా ఖండించిన కేంద్ర మంత్రివర్గం

- పౌరుల మరణం పట్ల విచారం వ్యక్తం చేస్తూ తీర్మానం
- ప్రధాని మోదీ నేతృత్వంలో సమావేశమైన కేబినెట్
- విచారణ వేగవంతం చేయాలని దర్యాప్తు సంస్థలకు ఆదేశం
- పరిస్థితిని ఉన్నత స్థాయిలో సమీక్షిస్తున్నట్లు వెల్లడి
- ఉగ్రవాదాన్ని సహించే ప్రసక్తే లేదని స్పష్టీకరణ
- దేశ ప్రజల రక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉన్నట్లు ఉద్ఘాటన

11 లో

బయటపడిన భారీ కుతంత్రం
ఢిల్లీలో డిసెంబర్ 6న వరుస పేలుళ్లు జరిపేందుకు కుట్ర!

6లో

అర్థమైందా.. చంద్రబాబు?: నెల్లూరులో ఓ విద్యార్థిని ప్రశ్న ఇదీ..

శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరంలో ప్రజా ఉద్యమ ర్యాలీకి పోటెత్తిన జనం, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు

ఆలోచించు చంద్రబాబూ?: ఇదీ నెల్లూరులో మరో విద్యార్థిని ఆవేదన

కట్టలు తెగిన ప్రజాగ్రహం

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణపై రాష్ట్ర వ్యాప్తంగా నిరసన

175 అసెంబ్లీ నియోజకవర్గాల్లో వైఎస్సార్‌సీపీ నిరసన ర్యాలీలు గ్రాండ్ సక్సెస్

నెల్లూరు వీఆర్సీ సెంటర్ నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు భారీ ర్యాలీగా వెళుతున్న విద్యార్థులు, ప్రజలు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు

ప్రకాశం జిల్లా యర్రగొండపాలెంలో భారీ ర్యాలీ

శ్రీకాకుళం తహశీల్దార్ కార్యాలయం వద్ద పోలీసులు అడ్డుకోవడంతో నినాదాలు చేస్తున్న ధర్మాన ప్రసాదరావు, తమ్మినేని సీతారాం తదితరులు

అనంతపురం జిల్లా రాప్తాడు తహశీల్దార్ కార్యాలయం వద్ద ప్రజలు, వైఎస్సార్‌సీపీ శ్రేణుల నిరసన

సాక్షి, అమరావతి/సాక్షి నెట్‌వర్క్: రాష్ట్రంలో పేదలకు నాణ్యమైన వైద్యం, సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలను అందకుండా చేస్తూ.. పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేస్తున్న చంద్రబాబు సర్కారుపై విద్యార్థులు, తల్లిదండ్రులు, మేధావులు, ప్రజా సంఘాల నేతలు, సామాజిక కార్యకర్తలు తిరగబడ్డారు. రూ.లక్షల కోట్ల ప్రజల ఆస్తులను బినామీలకు కట్టబెట్టి, నీకింత నాకింత అంటూ పంచుకుతినేందుకు కొత్త ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరిస్తుండటంపై కన్నెర్ర చేశారు. వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు ప్రజా ఉద్యమంలో కదం తొక్కేందుకు ప్రభంజనంలా జనం కదలివచ్చారు. ర్యాలీలకు అనుమతి లేదు.. పాల్గొంటే అక్రమ కేసులు పెడతాం.. అంటూ పోలీసుల నోటీసులు, బెదిరింపులను ఏమాత్రం ఖాతరు చేయకుండా రాష్ట్ర వ్యాప్తంగా 175 అసెంబ్లీ నియోజకవర్గాల్లో బుధవారం వైఎస్సార్‌సీపీ నిర్వహించిన నిరసన ర్యాలీల్లో కదం తొక్కారు. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి దాకా రూ.2.50 లక్షల కోట్లు అప్పు చేశారని, అందులో రూ.5 వేల కోట్లు మెడికల్ కాలేజీల పనులు పూర్తి చేయడానికి ఖర్చు చేయలేరా.. అంటూ ర్యాలీల్లో దిక్కులు పిక్కటిల్లేలా నినదించారు. పేదలకు సూపర్ స్పెషాలిటీ వైద్యాన్ని దూరం చేస్తారా.. పేద విద్యార్థులకు వైద్య విద్యను అందకుండా చేస్తారా.. అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకుని ప్రభుత్వ రంగంలోనే నిర్మించాలంటూ డిమాండ్ చేశారు. ఒకవేళ కాదూ కూడదని ప్రైవేటీకరణ నిర్ణయాన్ని కొనసాగిస్తే వైఎస్సార్‌సీపీతో కలిసి మహోద్యమాన్ని నిర్మిస్తామంటూ కోటి గళాలు రణ నినాదాలు చేయడంతో దిక్కులు పిక్కటిల్లాయి. మెడికల్ కాలేజీలను ప్రభుత్వ రంగంలోనే నిర్మించాలని డిమాండ్ చేస్తూ వైఎస్సార్‌సీపీ నేతలతో కలిసి అధికారులకు డిమాండ్ పత్రాలను అందజేశారు. ప్రభుత్వంపై వెల్లువెత్తుతున్న ప్రజా వ్యతిరేకతకు ఈ నిరసన ర్యాలీలు మరోసారి అద్దం పట్టాయని రాజకీయ పరిశీలకులు స్పష్టం చేస్తున్నారు. మరోవైపు ఉద్యమంలో భాగంగా చేపట్టిన కోటి సంతకాల కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. ప్రతి నియోజకవర్గం నుంచి 50 వేల సంతకాలు సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నా, అంతకు మించి సంతకాలు చేస్తున్నారు.

పశ్చిమ గోదావరి జిల్లా తణుకులోని రాష్ట్రపతి రోడ్డులో ప్రజలు, వైఎస్సార్‌సీపీ శ్రేణుల ర్యాలీ

విజయవాడ తూర్పు నియోజకవర్గంలో ప్రజలు, వైఎస్సార్‌సీపీ శ్రేణుల ర్యాలీ

రాజమహేంద్రవరంలో ప్లకార్డులతో ప్రజలు, వైఎస్సార్‌సీపీ శ్రేణుల వినూత్న ర్యాలీ

నంద్యాల జిల్లా పాణ్యం నియోజకవర్గంలోని కల్లూరులో...

కాకినాడ జిల్లా తునిలో ర్యాలీకి పెద్ద ఎత్తున తరలివచ్చిన ప్రజలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు

వైఎస్సార్ కడప జిల్లా పులివెందులలో ర్యాలీకి భారీగా తరలివచ్చిన ప్రజలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు

రాజమహేంద్రవరం రూరల్ బొమ్మూరు సెంటర్ వద్ద జాతీయ రహదారిపై భారీ ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు, ప్రజలు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు

కర్నూలు తహశీల్దార్ కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన తెలియజేస్తున్న విద్యార్థులు, ప్రజలు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు

నెల్లూరు వీఆర్సీ సెంటర్‌లోని బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద చంద్రబాబు ప్రభుత్వ తీరును నిరసిస్తూ ప్లకార్డులు మెడలో వేసుకుని విద్యార్థుల నిరసన

కడపలో ప్రజలు, వైఎస్సార్‌సీపీ శ్రేణుల భారీ ర్యాలీ

ఇదీ శ్రీకాకుళంలో ఓ మహిళ ఆక్రోశం

శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట మెయిన్ రోడ్‌లో భారీ బైక్ ర్యాలీ

పదండి ముందుకు.. పదండి తోసుకు!

అడ్డంకులను అధిగమించి..

ర్యాలీలు విజయవంతం

సాక్షి, అమరావతి/ సాక్షి నెట్‌వర్క్: రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పెద్దల ఆదేశాల మేరకు పోలీసులు ఎక్కడికక్కడ ర్యాలీలను నిలువరించడానికి విఫల యత్నం చేశారు. ఎన్టీఆర్ జిల్లా మైలవరంలో బైకు ర్యాలీ నిర్వహిస్తుండగా పోలీసులు అడ్డుకుని, బైక్‌ల తాళాలు లాక్కునే ప్రయత్నం చేయగా యువత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయడంతో వెనక్కు తగ్గారు. గుంటూరులో పట్టాభిపురం సీఐ వెంకటేశ్వర్లు బెదిరింపు ధోరణితో వ్యవహరించడంపై నిరసన వ్యక్తమైంది. నెల్లూరులో మెడికల్ విద్యార్థులు ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ ప్లకార్డులు మెడలో వేసుకుని మానవహారంగా ఏర్పడి నిరసన తెలిపారు. ఒంగోలులో నిరసన ర్యాలీని పోలీసులు అడుగడుగునా అడ్డుకునే ప్రయత్నం చేశారు. టూ టౌన్ సీఐ మేడా శ్రీనివాసరావు తన సిబ్బంది ద్వారా చాలా సేపు నిలువరించారు. చివరకు ప్రజలు తోసుకొని ముందుకు సాగారు. పశ్చిమ గోదావరి జిల్లా ఆచంటలో వినతిపత్రం తీసుకునేందుకు అధికారులు, కార్యాలయ సిబ్బంది అందుబాటులో లేకుండా పోవడంతో అక్కడి తలుపునకు అంటించారు. డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరంలో వైఎస్సార్‌సీపీ నేతలను పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. దీంతో పార్టీ శ్రేణులు, ప్రజలు నిరసన ర్యాలీ నిర్వహించారు.

మంత్రి అచ్చెన్నాయుడు నియోజకవర్గమైన టెక్కలిలో ప్రజలను నియంత్రించడానికి పోలీసులు చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. విజయనగరం జిల్లా చీపురుపల్లిలో గరివిడి ఆర్వోబీ వద్ద పోలీసులు ర్యాలీని అడ్డుకోగా గంటపాటు వాగ్వాదం, తోపులాట చోటుచేసుకుంది. దీంతో పర్ల గ్రామానికి చెందిన సిరియాల పాపినాయుడు కిందపడి పోవడంతో కాలు విరిగింది. ఆయన్ను ఆస్పత్రికి తరలించి ర్యాలీ కొనసాగించారు. ఆయన వైద్య ఖర్చును వైఎస్సార్‌సీపీ భరిస్తుందని నేతలు తెలిపారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఎల్లవరం నుంచి రంపచోడవరం వరకు 35 కిలోమీటర్ల మేర బైకులు, కార్లతో ర్యాలీ నిర్వహించారు. అనంతపురం జిల్లా తాడిపత్రిలో మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ పార్టీ సమన్వయకర్త కేతిరెడ్డి పెద్దారెడ్డిని పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. ర్యాలీ నిర్వహించడానికి వీల్లేదంటూ ఆంక్షలు విధించారు. అయినా యాడికిలో ర్యాలీ కొనసాగింది. కుప్పంలో ఎమ్మెల్సీ భరత్ ఆర్డీవో కార్యాలయంలో డిమాండ్ పత్రం అందచేశారు.

గుంటూరులో ర్యాలీని అడ్డుకుని మాజీ మంత్రి అంబటి రాంబాబును బెదిరిస్తున్న పోలీసు అధికారి

గుంటూరులో ర్యాలీని అడ్డుకుంటున్న పోలీసులు

తిరుపతిలో నిరసన ర్యాలీ

ఏలూరు జిల్లా కైకలూరులో ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజలు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు

అన్నమయ్య జిల్లా రాయచోటిలో నిరసన ర్యాలీ

విజయనగరం జిల్లా చీపురుపల్లిలో ర్యాలీగా వెళుతున్న బొత్స సత్యనారాయణను అడ్డుకుంటున్న పోలీసులు

విశాఖ దక్షిణ నియోజకవర్గంలో ర్యాలీకి భారీగా తరలివచ్చిన ప్రజలు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు

పల్నాడు జిల్లా దాచేపల్లిలో భారీ ర్యాలీగా తరలివస్తున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు

విశాఖ ఉత్తర నియోజకవర్గంలో ర్యాలీలో పాల్గొన్న జనసమూహం

ప్రకాశం జిల్లా దర్శిలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజల ర్యాలీ

ఒంగోలులో ర్యాలీ నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులకు వేలు చూపిస్తూ ఆగ్రహంతో ఊగిపోతున్న సీఐ శ్రీనివాసరావు

శ్రీకాకుళం జిల్లా టెక్కలిలో ర్యాలీగా వెళుతున్న ప్రజలు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు

విశాఖ జిల్లా భీమిలిలో ప్రజలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తల భారీ బైక్ ర్యాలీ

దయతో వ్యవహరించండి.
కానీ కృతజ్ఞతను ఆశించవద్దు.
– కన్ఫ్యూషియస్

సాక్షి
గురువారం, 13 నవంబర్ 2025

మరి హంతకులెవరు?

తమ కంటి దీపాలు హఠాత్తుగా కనుమరుగైనప్పుడు తల్లితండ్రులకు ఒక్కసారిగా చుట్టూ ఉన్న ప్రపంచం కుప్పకూలినట్టవుతుంది. తమ పంచప్రాణాలనూ ఎవరో పిండేసినట్టు విలవిల్లాడిపోతారు. ఢిల్లీ శివారులో ఉన్న నోయిడా సమీపంలోని నిఠారి గ్రామంలో 19 ఏళ్ల క్రితం జరిగింది ఇదే. తప్పిపోయిన పిల్లలు ఇద్దరు దుర్మార్గుల చేతుల్లో కడతేరి పోయారని దర్యాప్తు అనంతరం సీబీఐ తేల్చి, న్యాయస్థానం ఉరిశిక్షలు కూడా విధించాక... దాదాపు రెండు దశాబ్దాలు గడిచాక కేసు వీగిపోతే? ఈ కేసులో ఒక దోషి వ్యాపారవేత్త మణిందర్ సింగ్ పంథేర్ లోగడే నిర్దోషిగా బయటపడగా... పదమూడు కేసుల్లో ఆరోపణలు ఎదుర్కొని 12 కేసుల్లో నిర్దోషిగా తేలి, ఒక కేసులో మాత్రం యావజ్జీవ శిక్ష అనుభవిస్తున్న మరో దోషి సురేందర్ కోలీ సైతం నిరపరాధేనని తాజాగా సర్వోన్నత న్యాయస్థానం తేల్చింది. శిక్షలు పడినప్పుడు, మరీ ముఖ్యంగా ఉరిశిక్ష పడిన తీవ్రమైన కేసుల్లో కేవలం ఊహల ఆధారంగా దోషాన్ని నిర్ధారించలేమని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ముగ్గురు న్యాయమూర్తుల ధర్మాసనం తెలిపింది. ఈ కేసులో కేవలం కోలీ ఒప్పుకోలు ప్రకటన, కూరగాయలకు ఉపయోగించే చాకు తప్ప సాక్ష్యాధారాలెక్కడని ప్రశ్నించింది.

జాతీయ స్థాయిలో పతాకశీర్షికలకెక్కిన ఈ కీలక కేసు విషయంలో పేలవమైన దర్యాప్తు సాగిందంటే ఎవరిని నిందించాలి? 2006 చివరిలో వెల్లడైన ఈ ఉదంతం దేశం మొత్తాన్ని కుదిపేసింది. మొదట 8 మంది ఆడపిల్లలకు సంబంధించినవిగా భావించిన మానవ కంకాళాలు మురికి కాల్వలో లభ్యమైనప్పుడు అంతకు రెండు మూడేళ్ల ముందు మాయమైన తమ పిల్లలకు సంబంధించినవే కావొచ్చని పేద కుటుంబాలు తల్లడిల్లాయి. ఛానెళ్లు అంతంత మాత్రంగానే ఉన్న ఆ కాలంలో కూడా మీడియాలో వెలువడే కథనాలు చదివి, విని దేశం దిగ్భ్రాంతి చెందింది. పిల్లల్ని ప్రలోభపెట్టి తీసుకెళ్లి అత్యాచారాలు చేసి హతమార్చారని, అందులో ఒక టీనేజ్ యువతి కూడా ఉందని దర్యాప్తులో వెల్లడైంది. మొత్తంగా 22 మంది కంకాళాలు దొరికాయని అప్పట్లో చెప్పారు. తాను ఆరుగురు పిల్లలపై, ఒక యువతిపై అత్యాచారాలు జరిపి హతమార్చానని కోలీ తెలిపాడు. అతను ఇచ్చిన సమాచారంతో ఇంటి సమీపంలో తవ్వినప్పుడు మృతదేహాలు లభ్యమయ్యాయన్నారు. ఈ వ్యవహారంలో అపహరణ, అత్యాచారం, హత్య, సాక్ష్యాధారాల ధ్వంసం మాత్రమే కాక నరమాంస భక్షణ, శరీరాంగాల కోత, శవసంభోగం వగైరాలున్నాయి. ఇందుకు ఒక డాక్టర్ సహకరించాడని అరెస్టు చేయగా, అతనిపై మొదట్లోనే కేసు వీగిపోయింది. హతమార్చటానికి ముందు ఈ పసిపిల్లలతో నీలిచిత్రాలు తీశారన్న కథనాలొచ్చాయి. పంథేర్ ఇల్లు 'భయంకరమైన కొంప'గా ముద్రపడింది. 12 కేసుల్లో కోలీని దోషిగా నిర్ధారించి ఉరిశిక్ష విధించారు. వాటన్నిటినీ అలహాబాద్ హైకోర్టు కొట్టేసింది. యావజ్జీవ శిక్ష అనుభవిస్తున్న మరో కేసులో సైతం ఇప్పుడు నిర్దోషిగా బయటపడ్డాడు. పదిహేనేళ్ల బాలిక అత్యాచారం, హత్య కేసులో పంథేర్ 2009లో విడుదలయ్యాడు.

న్యాయస్థానాలు ఒక రకంగా నిస్సహాయమైనవి. దర్యాప్తు తీరును కూలంకషంగా పరిశీలించి, నిందితులపై ఉన్న సాక్ష్యాధారాలేమిటో చూసి తీర్పునిస్తాయి తప్ప మీడియా కథనాలనుబట్టో, దర్యాప్తు సంస్థల లీకుల ఆధారంగానో వ్యవహరించవు. ఈ కేసులో ప్రశ్నార్థక ఒప్పుకోళ్లు, వాటి ఆధారంగా మీడియా సంచలన కథనాలే తప్ప దర్యాప్తు సక్రమంగా జరగలేదని ధర్మాసనం వెలువరించిన తీర్పే చెబుతోంది. ఏమాత్రం పసలేని ఆరోపణల ఆధారంగా కోలీకి శిక్ష విధిస్తే న్యాయవిఘాతం చేసినవారమవుతామనీ, న్యాయప్రమాణాలకు ఈ ఆధారాలు ఏమాత్రం నిలబడలేవనీ న్యాయమూర్తులు అనటం గమనార్హం. నేర నిర్ధారణలో ఎంతో అభివృద్ధి సాధించిన ఈ దశలో కూడా దేశం మొత్తాన్ని కుదిపేసిన కేసులో వైఫల్యం చెందటం దురదృష్టకరం. పంథేర్, కోలీలిద్దరూ నిర్దోషులు సరే... మరి అసలు హంతకులెవరు? వారు ఇప్పటికీ చట్టానికి దొరక్కుండా తప్పించుకుంటున్నారనుకోవాలా? కనీసం దేశవ్యాప్తంగా దర్యాప్తు విభాగాలన్నీ ఈ ఉదంతాన్ని ఒక గుణపాఠంగా స్వీకరించి ముున్ముందు మరింత జాగరూకతతో మెలగటం అవసరమని గుర్తిస్తే మంచిది.

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు కార్తిక మాసం, **తిథి:** బ.నవమి రా.3.48 వరకు, తదుపరి దశమి, **నక్షత్రం:** మఖ రా.12.16 వరకు, తదుపరి పుబ్బ, **వర్జ్యం:** ప.12.12 నుండి 1.48 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.9.53 నుండి 10.38 వరకు తదుపరి ప.2.21 నుండి 3.06 వరకు, **అమృత ఘడియలు:** రా.9.57 నుండి 11.33 వరకు.

సూర్యోదయం : 6.07
సూర్యాస్తమయం : 5.21
రాహుకాలం : ప.1.30 నుండి 3.00 వరకు
యమగండం : ఉ.6.00 నుండి 7.30 వరకు

సోషల్ టాక్

నేరుగా చూడు

సవాళ్లను ఎదుర్కొనే సామర్థ్యంలోనే నీ బలం ఉంది. నీ ముఖాన్ని ఎల్లప్పుడూ సూర్యకాంతి వైపు ఉంచు. నీడలు నీ వెనుకకు వెళ్లిపోతాయి. పట్టుదల, మానసిక స్థైర్యంతో ముందుకు సాగుతుంటే ఎలాంటి అవాంతరాలు, అడ్డంకులనైనా దాటేయొచ్చు.

– తాజిందర్ పాల్ సింగ్, షాట్ పుటర్

తర్ఫీదు ఇవ్వాలి!

జ్ఞాపకశక్తి అనేది బహుమతి కాదు. ఒక కండరం! దానికి అవిశ్రాంతంగా శిక్షణ ఇస్తుంటే మీ జీవితంలోని ప్రతి అంశాన్నీ ప్రకాశవంతం చేస్తుంది. సమస్యల కోసం కాదు, పరిష్కారాల కోసం దానికి తర్ఫీదు ఇవ్వండి. అప్పుడది అద్భుతమైన ఫలితాలను అందిస్తుంది.

– సబబ్బీ మంగళ్, మెమరీ ట్రైనర్

ఎదిగే అవకాశం

ప్రతి సవాలు లోపల, వెలుపల బలంగా ఎదగడానికి ఒక అవకాశం ఉంటుంది. నిజమైన యోధుడు ప్రత్యర్థులను మాత్రమే కాదు, తన సొంత పరిమితులను కూడా జయిస్తాడు. అదే ఎదుగుదల. యుద్ధ కళలోని ప్రతి కదలిక కూడా స్వీయ ఆవిష్కరణకు, అంతర్గత శాంతికి ఒక అడుగు.

– జాస్మిన్ సింహాళన్, డ్యాన్సర్ – మార్షల్ ఆర్టిస్ట్

అన్వేషణ

చీకటి దారులను తప్పించుకుని వెళితే మనం వెదుకుతున్న దానిని ఎప్పటికీ కనిపెట్టలేం. మార్గం అస్పష్టంగా ఉన్నప్పటికీ ముందుకే సాగాలి. పరిశోధనకు అవసరం అయిన ఉష్ణం అనే వెలుగును మెదడు తనకై తనే దారి పొడవునా ప్రసరింప జేసుకోవాలి.

– హోసహల్లి రామస్వామి, ఆహార శాస్త్రవేత్త

ఇంగిత జ్ఞానం

నాయకత్వం అన్నది సమస్య పరిష్కారానికి మాత్రమే పరిమితం అవకూడదు. తేలిగ్గా పరిష్కరించటం కూడా ముఖ్యమే. నేను చెప్పటం ఏంటంటే – ఇంజినీరింగ్‌తోనే సరిపెట్టకండి. ఇంగితజ్ఞానం కూడా కాస్త ఉపయోగించండి. మార్చటం అవసరమైన దానిని మార్చండి.

– అమృతా పటేల్, వ్యాపారవేత్త

ప్రణాళికలు

జీవితంలో ప్రతిదీ ప్రణాళిక ప్రకారమే జరగదు. నేను ప్లాన్ చేసినవన్నీ తలకిందులయ్యాయి! భవిష్యత్తు మనకు ఏం ఇవ్వాలని అనుకుంటుందో అదే ఇస్తుందని నేను గ్రహించాక భారీ ప్రణాళికలు వేయటం మానుకున్నాను. దేనికైనా సిద్ధంగా ఉండటమే మనం చేయగలిగింది!

– జూహీ చావ్లా, నటి

పత్తి రైతుకు మరో పాడుకాలం

విశ్లేషణ

టంకశాల అశోక్

పత్తి రైతులు ప్రస్తుతం ఎదుర్కొంటున్న సమస్యలను చూడగా, 1990ల కాలం అనివార్యంగా గుర్తుకు వస్తున్నది. అప్పుడు దేశంలోని పలు రాష్ట్రాలలో పత్తి రైతులు వరుసగా ఆత్మహత్యలకు పాల్పడ్డారు. ఆ రాష్ట్రాలలో అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కూడా ఒకటి. పొరుగు రాష్ట్రమైన మహారాష్ట్రలోని విదర్భ అయితే లెక్కలేనన్ని ఆత్మహత్యలతో ప్రపంచం దృష్టిని ఆకర్షించింది. అప్పటి నుంచి 30 సంవత్సరాలు గడిచిన తర్వాత అటువంటి విపత్కర పరిస్థితి ఇంకా ఏర్పడనైతే లేదు; కానీ, నెమ్మదిగా రూపు తీసుకుంటున్న పరిణామాలను చూడగా, ఆ దుఃస్థితి పునరావృతం కాగలదేమోననే అనుమానం కలుగుతున్నది.

1990లలో జరిగిందేమిటి?

పత్తికి, నూలు వస్త్రాలకు భారతదేశం క్రీస్తు పూర్వం నుంచే పేరెన్నిక గన్నది కాగా, బ్రిటిష్ వలస పాలన కాలంలో జరిగిందేమిటో తెలిసిందే. అక్కడి మిల్లుల కోసం ఇక్కడి రైతును కొల్లగొట్టి, స్థానిక చేనేత పరిశ్రమను ధ్వంసం చేసి, నేత కార్మికుడిని ఆకలి చావుల పాలు చేశారు.

స్వాతంత్ర్యానంతరం 1990లు వచ్చేసరికి అధికాదాయం పేరిట పత్తి పంటను విపరీతంగా ప్రోత్సహించి, అమ్మకాలను మాత్రం అంతర్జాతీయ మార్కెట్లతో అనుసంధానం చేసి, ధరలతో ఆటలాడారు. రైతు మరో పంటకు మారలేక, అక్కడే నిలవలేక, అప్పుల బాధకు తాళలేక, చావును ఎంచుకున్నాడు. ఆ సరికే భారత దేశపు డబ్ల్యూటీవో సభ్యత్వం, పశ్చిమ దేశాలకు కలసి వచ్చిన స్వేచ్ఛా వాణిజ్యం రైతు ఆత్మహత్యకు ఉరితాళ్లను పేనాయి.

డబ్ల్యూటీవో సమయంలో వ్యవసాయం, పాడి, మత్స్య ఉత్పత్తుల విషయమై ఇండియా, చైనా, బ్రెజిల్ తదితర దేశాలు ఒక్కటై గట్టిగా నిలబడి కొన్ని రాయితీలు సాధించాయి. ఆ యా రంగాలపై కోట్లాదిమంది ఆధారపడి జీవిస్తున్నందున వాటిని కాపాడుకునేందుకు పాశ్చాత్య దేశాల నుంచి దిగుమతులపై తగినన్ని సుంకాలు విధించే హక్కు సంపాదించటం వాటిలో ఒకటి. ముఖ్యంగా అమెరికా తమ రైతులకు పెద్ద ఎత్తున సబ్సిడీలు ఇస్తుండగా, ఇతర దేశాలు ఆ పని చేయరాదని ఆంక్షలు విధించటాన్ని అంగీకరించబోమన్నది మరొకటి. ఇంత జరిగినా పాశ్చాత్య దేశాలు పత్తి కొనుగోళ్లు, తమ పత్తి ఎగుమతులు, అందుకు కోటాలు, వస్త్రాల ఎగుమతిలో కోటాలు వగైరా ఎత్తుగడలతో సృష్టించిన సమస్యలు తక్కువ కాదు. అధిక దిగుబడి వంగడాలపై వారిదే ఆధిపత్యం అయ్యింది. దీనంతటి ప్రభావాలు బట్టల మిల్లులు, పత్తి వ్యాపారులపై కన్నా పత్తి రైతుపైనే పడింది. ఇపుడు, స్వేచ్ఛా వాణిజ్యం తమకు లాభసాటిగా లేనట్లు భావిస్తున్న ప్రస్తుత అమెరికా ప్రభుత్వం, డబ్ల్యూటీవో నిబంధనలను యథేచ్ఛగా ఉల్లంఘించజూస్తుండటంతో, పత్తి రైతుకు 1990ల కాలం వలె కారుమేఘాలు తిరిగి కమ్ముకొస్తున్నాయి.

◆ అమెరికా ఒత్తిళ్లతో పత్తి దిగుమతులపై ఉండిన 11 శాతం సుంకాన్ని భారత ప్రభుత్వం అకస్మాత్తుగా ఎత్తివేసింది. ఇది తాత్కాలిక చర్య అని చెప్తున్నారు గానీ, నమ్మదగినట్టు లేదు. ఎందుకంటే అమెరికాతో కొత్త వాణిజ్య ఒప్పందం కోసం ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో 11 శాతం సుంకం గణనీయంగా తగ్గవచ్చు. ఏది జరిగినా ఇక్కడి పత్తి రైతుకు ప్రమాదమే!

అమెరికా ఒత్తిడి

తమ కొత్త వ్యూహంలో భాగంగా స్వేచ్ఛా వాణిజ్యాన్ని గాలికి వదలిన అమెరికా, వేర్వేరు దేశాలతో విడివిడిగా వాణిజ్య ఒప్పందాల కోసం ప్రయత్నిస్తున్నది. అందుకోసం చర్చల పేరిట ఒత్తిడి, బ్లాక్‌మెయిలింగ్ పద్ధతిని అనుసరిస్తున్నది. ఇతరులను దారికి తెచ్చుకునేందుకు మొదటనే సుంకాలను భారీ ఎత్తున పెంచివేసి, అవతలి దేశాలు వాటి సుంకాలను తాము చెప్పినట్లు మార్చాలని, ఎత్తివేయాలని షరతులు పెడుతున్నది. తమ పత్తి, మొక్కజొన్న, సోయా వంటి ఉత్పత్తులకు పూర్తిగా గేట్లు తెరవాలంటున్నది. లేనట్లయితే, సుంకాలూ, వాణిజ్యాలతో సంబంధం ఉన్న రంగాలలోనే గాక, లేని విషయాలలోనూ ఏకపక్షపు చర్యలు తీసుకోగలమని హెచ్చరిస్తున్నది.

ఈ పరిస్థితుల మధ్య జరిగిందే అమెరికన్ పత్తి దిగుమతులపై ఉండిన 11 శాతం సుంకాన్ని భారత ప్రభుత్వం అకస్మాత్తుగా ఎత్తివేయటం. ఆ ఎత్తివేత మొదట గత ఆగస్టు నుంచి సెప్టెంబర్ వరకు మాత్రమే జరుగగా, తిరిగి డిసెంబర్ వరకు పొడిగించారు. ఇది తాత్కాలిక చర్య అని పైకి చెప్తున్నారు గానీ, నమ్మదగినట్టు లేదు. ఎందుకంటే, ఇదే సమయంలో అమెరికాతో కొత్త వాణిజ్య ఒప్పందం కోసం చర్చలు జరుగుతున్నాయి. ఆ ఒప్పందం ఈ సంవత్సరం ఆఖరు నాటికి జరగవచ్చునని భారత వాణిజ్య మంత్రి పీయూష్ గోయెల్‌తో పాటు అమెరికన్ అధికారులు కూడా చెప్తున్నారు. అందువల్ల, ఇప్పుడు తాత్కాలికం అంటున్నది దీర్ఘకాలికం కాగల ప్రమాదం పొంచి ఉంది. లేదా కనీసం 11 శాతం సుంకం గణనీయంగా తగ్గవచ్చు. ఏది జరిగినా ఇక్కడి పత్తి రైతుకు తీవ్ర ప్రమాదమే!

సుంకం ఎత్తివేత ప్రత్యేకంగా అమెరికాకు మాత్రమే చేయలేరు గనుక మౌలికంగానే రద్దు కావటంతో అమెరికా సహా వేర్వేరు దేశాల నుంచి పత్తి నిల్వలు వచ్చిపడటం మొదలైంది. భారత ప్రభుత్వం తన నష్టాలు తాను చేయటం మొదలు పెట్టింది. గతంలో రైతులు ఎంత పత్తి తెచ్చినా కొనుగోలు చేస్తుండిన కాటన్ కార్పొరేషన్, ఎకరానికి 12 క్వింటాళ్లు మాత్రమేనని ఈసారి సీజన్‌కు ముందు షరతు విధించింది. పంట మార్కెట్‌కు రావటం మొదలైన తర్వాత తన ప్రకటనను తానే ఉల్లంఘిస్తూ 7 క్వింటాళ్లు మాత్రమే అంటున్నది. తక్కిన పంటను వ్యాపారులు మద్దతు ధర కన్న తక్కువకు కొంటున్నా అధికారులు మాట్లాడటం లేదు. ఇదిగాక, 'కపాస్ కిసాన్' అనే కొత్త నిబంధన ఒకటి తీసుకువచ్చి, అందుకు అవసరమైన స్మార్ట్ ఫోన్లు లేని, ఆ సాంకేతికత తెలియని సామాన్య రైతులను యాతనలకు గురి చేయటం మొదలు పెట్టింది. ఇక, పత్తిలో తేమ నిబంధనలు ఎప్పుడూ ఉన్నవే.

ఒప్పందం ఇంకెలా ఉండగలదో!

అధికారికంగా సుంకాల ఎత్తివేత నుంచి మొదలుకొని, క్షేత్ర స్థాయిలో ఈ విధమైన ఎత్తుగడలు గానీ, కొత్త కాదు. అదే కథ తిరిగి నడుస్తున్నది.

అమెరికా ఒత్తిడికి కేంద్ర ప్రభుత్వం లొంగిపోతున్న తీరును చూసినప్పుడు, పత్తి రైతుకు 1990ల నాటి పరిస్థితి పునరావృతం కాగలదేమోననే భయం కలుగుతుండటం అందువల్లనే! మనం మరొకటి గమనిస్తున్నట్లు లేము. పత్తితో పాటు మొక్కజొన్నను, సోయాను కూడా అమెరికా బలవంతంగా ఎగుమతి చేసేందుకు ప్రయత్నిస్తున్నది. అందుకు సహకరిస్తున్నారా అనే అనుమానం కలిగేట్లు, మొక్కజొన్న పంటను రైతుల నుంచి కొనుగోలు చేయటంలోనూ పత్తి పంట తరహా షరతులు విధిస్తున్నారు. ఎకరానికి 18 క్వింటాళ్లు మాత్రమే కొనగలమన్నది ఆ నిబంధన. దీనిని బట్టి, అమెరికాతో వాణిజ్య ఒప్పందం ఎట్లుండవచ్చునో ఎవరి ఊహ వారు చేయవచ్చు.

వ్యాసకర్త సీనియర్ సంపాదకుడు

సువర్ణ గళ దేవత

దక్షిణ భారత ప్లేబ్యాక్ రంగంలో అగ్రగామి గాయకురాలు పి. సుశీల. 12 భాషల్లో వేలాది పాటలు పాడిన ఆమెను 'గాన సరస్వతి' అనడం అతిశయోక్తి కాదు. ఆంధ్రప్రదేశ్‌లోని విజయనగరంలో 1935 నవంబర్ 13న ప్రసిద్ధ క్రిమినల్ న్యాయవాది, సంగీత ప్రియుడు పులపాక ముకుంద రావు – శేషావతారం దంపతుల ఐదవ సంతానంగా ఆమె జన్మించారు.

సుశీల కర్ణాటక సంగీతంలో అత్యుత్తమ వయొలిన్ విద్వాంసులైన 'సంగీత కళానిధి' ద్వారం వెంకటస్వామి నాయుడు, ఆయన కుమారుడు ద్వారం భావనరాయణల వద్ద ఆరు సంవత్సరాలు కఠిన శిక్షణ పొంది, గాత్ర సంగీతంలో డిప్లొమా సాధించారు. మొదట్లో వివాహ వేడుకలలో శాస్త్రీయ సంగీతం ఆలపించేవారు. సినిమా పాటలు పాడటానికి చెన్నై చేరే ముందు కొన్ని ఆలయ కచేరీలు ఇచ్చేవారని కొద్దిమందికి మాత్రమే తెలుసు. సుశీల స్వరం మూడో స్థాయిని కూడా స్పష్టంగా దాటుతుందని అందరికీ తెలుసు. ప్రముఖ వీణా విద్వాన్ 'వీణ గాయత్రి'... సుశీల స్వరాన్ని ఒక గాత్ర వీణగా వ్యాఖ్యానించారు. ఆమె గొంతులో సూక్ష్మ గమకాలు సైతం అత్యంత స్పష్టతతో వినవచ్చు. ఈ గుణం సుశీలను శాస్త్రీయ గాయకులు కూడా భయపడే, గౌరవించే గాయనిగా చేసింది.

ఆమె 1970లో 'ఉయర్న్ద మనిదన్' (1969) చిత్రానికి ఉత్తమ మహిళా ప్లేబ్యాక్ గాయనిగా జాతీయ చలనచిత్ర అవార్డును గెలుచుకున్నారు. ఆ తర్వాత ఆమె తెలుగు, తమిళ చిత్రాలకు మరో నాలుగు జాతీయ అవార్డులను గెలుచుకున్నారు.

నేనెప్పుడూ ప్రసిద్ధి చెందాలని కోరుకోలేదు. పాటలు పాడి శ్రోతల్ని సంతోషపెట్టాలని మాత్రమే అనుకున్నాను. అభిరుచికి కట్టుబడి, నిజాయతీగా కష్టపడి పని చేస్తే మన ప్రతిభకు ఆశీర్వచనాలు లభిస్తాయి. నిరంతర సాధన, అభ్యాసం అనేవి కళాకారునికి శ్వాస వంటివి.

– పి. సుశీల (90), నేపథ్య గాయని

ఆ కాలంలోని ప్రముఖ గాయకులైన ఘంటసాల వేంకటేశ్వర రావుతో తెలుగులో, టి.ఎం. సౌందరరాజన్, పి.బి. శ్రీనివాస్‌లతో తమిళం, కన్నడ భాషలలో; తరువాత ఎస్.పి. బాలసుబ్రహ్మణ్యంతో తమిళం, తెలుగు, కన్నడ భాషలలో; కె.జె. ఏసుదాస్‌తో మలయాళంలో ఆమె యుగళగీతాలు పాడి దక్షిణాదిలో అగ్రగామి గాయనిగా నిలిచారు. 1991లో తమిళనాడు అత్యున్నత కళా పురస్కారం 'కలైమామణి', 2004లో తెలుగు సినిమా రంగంలో ఆమె జీవితకాల కృషికి 'రఘుపతి వెంకయ్య అవార్డు', 2008లో 73 ఏళ్ళ వయసులో 'పద్మభూషణ్' పురస్కారం వంటివి వరించాయి

ఆమె సమకాలీనులైన ఎస్.జానకి, ఎల్.ఆర్. ఈశ్వరి, బి. వసంత; ఆమె జూనియర్లు కె.ఎస్. చిత్ర, ఎస్.పి. శైలజ వంటివారందరూ ఆమె స్వర నాణ్యత, స్వాభావిక శ్రావ్యతను ఎంతో గౌరవించారు. ఆమె 1962 నుండి 1990ల చివరి వరకు 17,695 పాటలను రికార్డ్ చేయడం... పాట పట్ల ఆమె నిబద్ధతకు నిదర్శనం. గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రకారం 12 భారతీయ భాషలలో సోలోలు, డ్యూయెట్లు, కోరస్, నేపథ్య పాటలు ఆమె ఖాతాలో ఉన్నాయి. ఆమె అభిమానులు చాలా మంది ఆమెకు 'భారతరత్న' పురస్కారం ఆమె 90వ పుట్టిన రోజు కానుకగా వస్తే బాగుండు అనుకుంటున్నారు. అందుకు ఆమె ముమ్మాటికీ అర్హురాలు.

– డా॥ ఎం.ఎస్. నీలోత్పల్ | అసిస్టెంట్ ప్రొఫెసర్, వేలూరు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, తమిళనాడు

(నేడు గాన సరస్వతి పి. సుశీల 90వ జన్మదినం)

ఒడుదొడుకులే అసలు కారణం

ఇన్ బాక్స్

మధుమేహ బాధితుల పరంగా భారత దేశం ప్రపంచానికే రాజధాని అయితే, దక్షిణాది రాష్ట్రాలు భారతదేశానికి రాజధానులుగా మారాయని గణాంకాలు చెబుతున్నాయి. దేశంలో మధుమేహ బాధితుల సంఖ్య ఇప్పుడు 10.1 కోట్లకు చేరింది.

భారతదేశంలోనే కాదు, ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాలలో మధుమేహం క్రమంగా వేగాన్ని పుంజుకుంటోందని ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆందోళన వ్యక్తం చేస్తోంది. మధుమేహం నియంత్రణ, నిరోధం పట్ల అవగాహన కల్పించడానికి ఇన్సులిన్‌ను కనుగొన్న సర్ ఫ్రెడరిక్ బ్యాంటింగ్ పుట్టిన రోజైన నవంబర్ 14వ తేదీని 'ప్రపంచ మధుమేహ నిరోధక దినం'గా ప్రతి ఏడాదీ జరుపుకోవడం ముదావహం.



నేడు మనిషి జీవన విధానం, ఆహారంలో వచ్చిన విప్లవాత్మక మార్పులు... మధుమేహం వంటి జీవితకాల దీర్ఘ వ్యాధులకు ఆజ్యం పోస్తున్నాయి. అతి చిన్న వయసు నుండే ఏమాత్రం శారీరక శ్రమ లేక పోవడం, ఆహారంలో చోటు చేసుకున్న మార్పులు, కల్తీలు, పంట పొలాల్లో వేసే రసాయనిక ఎరువులు, క్రిమిసంహారక మందులు, విచ్చలవిడి ప్లాస్టిక్ వినియోగం, పర్యావరణ మార్పులు, కొత్త కొత్త వైరల్ వ్యాధులు, వృత్తిపర మానసిక ఒత్తిడి, జన్యువులలో ఉత్పరివర్తనలు... ఇలా ఎన్నో కారణాలు రక్తంలో షుగర్‌ను నియంత్రించే ఇన్సులిన్‌ను ఉత్పత్తి చేసే ప్యాంక్రియాస్ (క్లోమ గ్రంథి)ని అసాధారణ రీతిలో ప్రభావితం చేస్తున్నాయి. శరీర అవసరాలకు సరిపడా ఇన్సులిన్ ఉత్పత్తి కాకపోవటం, ఇన్సులిన్ పనితీరులోని లోపాలు (రెసిస్టెన్స్), శరీర కణాలు ఇన్సులిన్‌ను వినియోగించుకోలేకపోవడం... వెరసి రక్తంలో అసాధారణ స్థాయిలో చక్కెర శాతాన్ని పెంచేస్తున్నాయి.

మనం నిత్య జీవితంలో వాడే ప్లాస్టిక్‌ల అవశేషాల ప్రభావం వల్ల ప్యాంక్రియాస్ సహజసిద్ధంగా ఉత్పత్తి చేసే ఇన్సులిన్‌ను శరీర అవసరాలకు సరిపడా ఉత్పత్తి చేయలేకపోతోంది. ఇన్సులిన్ ఉత్పత్తి అయినా... శరీర కణజాలాలలో నిరోధకత వచ్చి అది ఉపయోగపడక పోవడం వల్ల రక్తంలో చక్కెర స్థాయి అసాధారణ రీతిలో పెరిగిపోతోంది. మందుల వాడకం, ఆహార నియమాలు పాటించటం, క్రమం తప్పక వ్యాయామం చేయడం ద్వారా జీవితాంతం అప్రమత్తంగా ఉండాలి.

– డాక్టర్ టి. సేవకుమార్
వ్యవస్థాపకులు, ఎస్.హెచ్.ఓ. హైపర్ టెన్షన్–దయాబెటిక్ క్లబ్, గుంటూరు
(రేపు 'ప్రపంచ మధుమేహ నిరోధక దినం')

చక్కెర తగ్గుతోంది!

డేటా పాయింట్

దేశంలో గత నాలుగేళ్లుగా చక్కెర ఉత్పత్తి తగ్గుతూ వస్తోంది. అయితే, 2025–26 సీజన్‌లో (అక్టోబరు–సెప్టెంబరు) 16 శాతం పెరుగుతుందని అంచనా వేస్తున్నారు.



ఆధారం: ఇండియన్ షుగర్ అండ్ బయో ఎనర్జీ మ్యానుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ (ఇస్మా)

పరోపకారానికి పరాకాష్ఠ

దత్తబోధ

శ్రీ గణపతి సచ్చిదానందస్వామి

దధీచి వలె ఇతరుల కోసం నిష్కపటంగా తమ ప్రాణాలను సైతం సమర్పించి లోకోపకారం చేసే మహాత్ములయిన సజ్జనులు కొంతమందే ఉంటారు. తమ జీవితాన్ని బాధాతప్తుల కోసం వెచ్చించే మహాత్ములు ఇప్పటికీ లేకపోలేదు. ఇలాంటి మహనీయుల సదాశయమే ప్రపంచ శాంతికి కీలకం. సవతి సోదరులైన దేవ దానవులకు తరచూ పోరు జరుగుతూనే ఉంటుంది. దానవులు మాటిమాటికీ స్వర్గం మీదకు దండెత్తటం, తాత్కాలికంగా దాన్ని కైవసం చేసుకోవటం, కొన్నాళ్ళ తరువాత దేవతల బలం పెరిగి వాళ్ళ చేతిలో ఓడిపోయి తిరిగి తపస్సు చేయటం, తమ శక్తిని పెంచుకోవటం... ఇదీ పరిపాటి. ఈ విధానాన్ని తప్పించి శాశ్వతంగా స్వర్గాన్ని తమ ఏలుబడిలో ఉంచుకోవాలంటే దేవతల ఆయుధ విశేషాలన్నింటినీ దొంగిలించాలని నిర్ణయానికి వచ్చారు. దేవతలకు తెలియకుండా మెల్లమెల్లగా ఒక్కొక్క ఆయుధాన్నీ దొంగిలించటం ప్రారంభించారు. కొన్నాళ్ళ తర్వాత వీళ్ళ దొంగతనాన్ని దేవతలు పసిగట్టారు. ఇంద్రాది దేవతలు దధీచి మహర్షి దర్శనం చేసుకొని తమ ఆయుధాలను భద్రపరచమనీ, అవసరమైనప్పుడు తిరిగి తీసుకుంటామనీ కోరారు. అందుకు ఆయన అంగీకరించాడు. అయితే ఆయుధాల రక్షణకే సమయం వెచ్చించాల్సి రావడంతో తపస్సు చేసుకోవడానికి కుదరడం లేదు. అందుకే ఒక నిర్ణయానికి వచ్చాడు. దేవతల ఆయుధాలను అన్నింటినీ పొడి చేసి ఆరగించాడు. అలా చేయటం వల్ల ఆయుధాల శక్తి అంతా సూక్ష్మరూపంలో ఆయన శరీరమంతా వ్యాపించి ఆయన శరీరం మహాశక్తి సంపన్నమయింది.

తమ ఆయుధాలను తిరిగి తీసుకోవడానికి వచ్చిన దేవతలతో... తాను దహనం అయిన తర్వాత తన ఎముకలతో ఆయుధాలు తయారు చేయించుకోమని చెబుతూ యోగాగ్ని సృష్టించి దగ్ధమయ్యాడు. దధీచి వెన్నెముక ఇంద్రునికి వజ్రాయుధమయింది. ఇలాగే దేవతలందరు తమతమ ఆయుధాలను దధీచి ఎముకలతోనే నిర్మింపజేసుకొన్నారు. ఇప్పుడు వారి ఆయుధాల శక్తి దధీచి తపశ్శక్తితో ఇనుమడించి, అమేయ శక్తిమంతాలయ్యాయి. పరోపకార బుద్ధితో లోక శ్రేయమును తలచి దధీచి చేసిన త్యాగం ఎంత మహనీయమైందో గమనించాలి.

కేజీహెచ్‌లో వైద్యం అందక గిరిజన పసికందు మృతి

వైద్యుల నిర్లక్ష్యంపై తల్లిదండ్రుల ఆందోళన

- ఆస్పత్రిలో పిల్లల వార్డు వద్ద బైఠాయింపు
- విచారణ చేస్తున్న సీఎస్‌ఆర్‌ఎంవో డాక్టర్ శ్రీహరి

పసికందును కేజీహెచ్ పిల్లల వార్డు నుంచి తీసుకొస్తున్న తండ్రి (ఇన్‌సెట్‌లో) ధన్వీర్

మహారాణిపేట: చంద్రబాబు పాలనలో వైద్యం అందక చిన్నారుల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. ఇటీవల కురుపాం గురుకుల ఆశ్రమ పాఠశాలలో పచ్చకామెర్లతో గిరిజన బాలికలు మరణించిన ఘటన అందరినీ కలచివేసింది. తాజాగా కేజీహెచ్ వైద్యుల నిర్లక్ష్యానికి మరో గిరిజన పసికందు బలి అయ్యాడు. పిల్లల వార్డులో చికిత్స పొందుతూ ఐదు నెలల ధన్వీర్ బుధవారం ఉదయం 8 గంటలకు మృతి చెందాడు. కేజీహెచ్‌లో సరైన వైద్యం అందించలేదని ధన్వీర్ తండ్రి అఖిల్ ఆరోపించారు. వైద్య సిబ్బంది నిర్లక్ష్యం వల్లే తన బిడ్డ మరణించాడని మీడియా ముందు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనకు సంబంధించి బిడ్డ తండ్రి తెలిపిన వివరాల ప్రకారం.. పార్వతీపురం మన్యం జిల్లా గుమ్మలక్ష్మీపురం మండలం వంగర గ్రామానికి చెందిన ఎ.అఖిల్ దంపతులకు రెండో సంతానంలో బాబు జన్మించాడు. ఈ బాబు ఈ నెల 8న అనారోగ్యానికి గురయ్యాడు. గుమ్మలక్ష్మీపురం పీహెచ్‌సీలో వైద్యం అందించారు. అక్కడి వైద్యులు విజయనగరం ప్రభుత్వ ఆస్పత్రికి పంపించారు. బ్లడ్ ఇన్ఫెక్షన్‌తో బాధపడుతున్న బిడ్డకు ప్రాథమిక చికిత్స అందించిన వైద్యులు అదే రోజు కేజీహెచ్‌కు రిఫర్ చేశారు. ఇక్కడకు వచ్చాక ఏం వైద్యం చేస్తున్నారో తల్లిదండ్రులకు తెలియలేదు. మంగళవారం రాత్రి పసికందు ఆరోగ్యంగా కనిపించాడని తండ్రి అఖిల్ అన్నారు. అర్ధరాత్రి తర్వాత పసికందు మళ్లీ తీవ్ర అనారోగ్యానికి గురయ్యాడు. ఈ విషయాన్ని వార్డులో ఉన్న వైద్యులకు, నర్సులకు సమాచారం ఇచ్చినా ఎవరూ వచ్చి చూడలేదని, మందులు కూడా ఇవ్వలేదని, అందువల్లే బిడ్డ మరణించినట్లు తండ్రి ఆవేదన వ్యక్తం చేశారు. ధన్వీర్ మృతితో తల్లిదండ్రులు, వారి బంధువులు కేజీహెచ్ పిల్లల వార్డు ఎదుట ఆందోళనకు దిగారు. తమ బాబుకు సరైన వైద్యం అందలేదని, నిర్లక్ష్యం చూపిన వైద్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మరొకరికి ఇలా జరగకూడదు: అఖిల్

కేజీహెచ్‌లో మరొకరికి ఇలాంటి పరిస్థితి రాకూడదని అఖిల్ ఆవేదన వ్యక్తం చేశారు. బాబుకు బాగోలేకపోతే ఆస్పత్రికి వచ్చామని, కానీ ఇక్కడ ఎవరూ పట్టించుకోలేదని వాపోయారు. వైద్యుల నిర్లక్ష్యం వల్లే తన బిడ్డ మరణించినట్లు కేజీహెచ్ సీఎస్ ఆర్‌ఎంవోకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. దీనిపై సీఎస్‌ఆర్‌ఎంవో డాక్టర్ శ్రీహరి విచారణ చేస్తున్నారు.

విషాద డోలిక

ఏడు కిలోమీటర్లు డోలీపై మోసుకెళ్లినా నిలవని ప్రాణం

సాక్షి, పార్వతీపురం మన్యం: ఏజెన్సీలో డోలీ మోతలు కొనసాగుతూనే ఉన్నాయి. గిరి శిఖరాలకు రహదారులు నిర్మిస్తామంటూ అధికార పార్టీల నాయకులు ఇచ్చిన హామీలు.. మాటలకే పరిమితమయ్యాయి. దీంతో సకాలంలో వైద్యం అందక ఓ వృద్ధురాలు ప్రాణాలు కోల్పోయింది. వివరాలు.. పార్వతీపురం మన్యం జిల్లా కొమరాడ మండలం రెబ్బ గ్రామానికి చెందిన తాడంగి వలసమ్మకు కొన్నిరోజులుగా ఆరోగ్యం బాగోలేదు. దీంతో కుటుంబసభ్యులు సోమవారం డోలీ కట్టి దాదాపు ఏడు కిలోమీటర్లు మోసుకెళ్లారు. మార్గమధ్యలో నాగావళి నదిని సైతం ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని దాటారు. కూనేరు రామభద్రపురం పీహెచ్‌సీకి తీసుకెళ్లగా.. అక్కడి సిబ్బంది ట్యాబ్లెట్లు ఇచ్చి.. జిల్లా ఆస్పత్రికి రిఫర్ చేశారు. ఆటోలో పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి వెళ్లేసరికి రాత్రి అయ్యింది. ఆమెను వైద్యులు పరీక్షించి.. బ్రెయిన్‌లో రక్తం గడ్డ కట్టిందని చెప్పారు. రాత్రి 10 గంటల సమయంలో విజయనగరం సర్వజన ఆస్పత్రికి రిఫర్ చేశారు. ఆ వెంటనే ఆమెను విజయనగరం తీసుకెళ్లగా.. మంగళవారం మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో ఆమె మరణించింది. బుధవారం ఉదయం వలసమ్మ మృతదేహాన్ని కుటుంబసభ్యులు స్వగ్రామానికి తరలించారు. తిరుగు ప్రయాణంలో కూడా మృతదేహాన్ని డోలీ కట్టే తేవాల్సి వచ్చింది.

బీసీ జనగణన ఎందుకు చేపట్టడం లేదు?

పిల్‌పై ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో బీసీ జనగణన, బీసీ వర్గీకరణ చేపట్టకుండానే రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సిద్ధమవుతోందని, దీనిని రాజ్యాంగ విరుద్ధంగా ప్రకటించాలని కోరుతూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్)పై హైకోర్టు స్పందించింది. బీసీ జనగణన ఎందుకు చేపట్టడం లేదో వివరణ ఇవ్వాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఇందులో భాగంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, పంచాయతీరాజ్, పురపాలక శాఖల ముఖ్య కార్యదర్శులు, రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌కి నోటీసులు జారీ చేసింది. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. తదుపరి విచారణను ఆరు వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ చల్లా గుణరంజన్ ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు హైకోర్టులో దాఖలు చేసిన పిల్‌పై బుధవారం సీనియర్ న్యాయవాది సత్యప్రసాద్ వాదనలు వినిపిస్తూ, ప్రతీ ఎన్నికల సమయంలో ప్రభుత్వం జనగణనను వాయిదా వేస్తూ వస్తోందని, దీనివల్ల బీసీలకు అన్యాయం జరుగుతోందని పేర్కొన్నారు.

పేదల సొంతింటి కలను సాకారం చేస్తాం

- 'పేదల సేవలో ప్రజావేదిక'లో సీఎం చంద్రబాబు
- పేదల ఇళ్లకు వర్చువల్‌గా గృహ ప్రవేశాలు

మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

రాయచోటి: సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనే లక్ష్యంగా పనిచేస్తున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అన్నారు. 2029 నాటికి పేదల సొంతింటి కలను సాకారం చేస్తామని ఆయన చెప్పారు. అన్నమయ్య జిల్లా చిన్నమండెం మండలం దేవగుడిపల్లె గ్రామంలో బుధవారం ఏర్పాటు చేసిన 'పేదల సేవలో ప్రజావేదిక' కార్యక్రమంలో సీఎం చంద్రబాబు పాల్గొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పేదలకు నిర్మించిన మూడు లక్షల గృహ ప్రవేశాల కార్యక్రమాన్ని వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ వచ్చే ఉగాదిలోపు వివిధ దశల్లో ఉన్న పేదల ఇళ్లను పూర్తి చేస్తామన్నారు. ఇంటి నిర్మాణం కోసం బీసీలకు రూ.50 వేలు, ఎస్సీలకు రూ.75 వేలు, గిరిజనులకు రూ.లక్ష అదనంగా నిధులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ముస్లింలకు కూడా అదనంగా ఇల్లు నిర్మించుకోవడానికి రూ.50 వేలు అందిస్తామన్నారు. రాయచోటి నియోజకవర్గంలోని 68 గ్రామ పంచాయతీలతో పాటు పీలేరు, తంబళ్లపల్లెలలో ఇంటింటికీ కుళాయి నీరు అందిస్తామని సీఎం చంద్రబాబు చెప్పారు. ఇటీవల కురిసిన వర్షాలకు పాడైన రోడ్లను రూ.500 కోట్లతో మరమ్మతులు చేస్తున్నామన్నారు. శ్రీనివాసపురం రిజర్వాయర్‌ను పూర్తి చేసి రాయచోటి నియోజకవర్గంలో భూగర్భజలాలను పెంచుతామన్నారు. రాష్ట్ర యువజన, రవాణా, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ రాయచోటి నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని ముఖ్యమంత్రిని కోరారు.

బీసీ హాస్టల్ విద్యార్థికి స్క్రబ్ టైఫస్ వ్యాధి

విశాఖ కేజీహెచ్‌లో చికిత్స
శ్రీకాకుళం జిల్లాలో ఘటన

ఈశ్వరరావు

కొత్తూరు: శ్రీకాకుళం జిల్లా కొత్తూరు మండలం కడుము బీసీ బాలుర వసతి గృహంలో ఉంటూ కడుము జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న గొర్లె ఈశ్వరరావు అనే విద్యార్థికి స్క్రబ్ టైఫస్ వ్యాధి సోకింది. ప్రస్తుతం ఈ విద్యార్థి విశాఖపట్నం కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయాన్ని అధికారులు స్థానిక కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. కలెక్టర్ ఆదేశాల మేరకు కేజీహెచ్‌లో వైద్యం పొందుతున్న విద్యార్థిని బుధవారం నరసన్నపేట డివిజన్ అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ (ఏబీసీ) బాలముకుంద రావు, వార్డెన్ గురువులు పరామర్శించారు. కడుము వసతి గృహాన్ని కురిగాం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ పి.ప్రసన్నకుమార్, ఎంపీడీవో నీరజ పరిశీలించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఈశ్వరరావు ఈనెల 3న జ్వరంతో బాధపడుతుండడంతో కడుము వెల్‌నెస్ సెంటర్‌కు తీసుకెళ్లి వైద్యం అందించారు. జ్వరం తగ్గకపోవడంతో తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. భామిని మండలం నేరడికి చెందిన విద్యార్థి తల్లిదండ్రులు గొర్లె రాంబాబు, కుమారి ఉపాధి కోసం విశాఖలో ఉన్నారు. దీంతో.. అక్కడ ఓ ప్రైవేటు ఆస్పత్రిలో బిడ్డను చేర్పించారు. జ్వరం తగ్గకపోవడంతో కేజీహెచ్‌కు తరలించారు. విద్యార్థి ఆరోగ్య పరిస్థితిపై కురిగాం వైద్యాధికారి పి. ప్రసన్నకుమార్ కేజీహెచ్ వైద్యులతో మాట్లాడారు. బాలుడి పరిస్థితి నిలకడగా ఉన్నట్లు తెలిపారు. నల్లులు వంటి కీటకాలవల్ల ఇలాంటి వ్యాధులు వస్తాయని ప్రసన్నకుమార్ తెలిపారు. ఈశ్వరరావుకు గుండె, ఊపిరితిత్తుల మీద ప్రభావం చూపించినప్పటికీ ఆరోగ్యం నిలకడగా ఉందని చెప్పారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
పంచాయతీరాజ్ శాఖ
నెం. 04/2025-26, **ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన** తేది : 05.11.2025
కార్యనిర్వాహక ఇంజినీరు, పి.ఆర్.డివిజన్, మార్కాపురం పరిధిలోని 21 పనులకు ఒక్కొక్క పనికి రూ. 36.00 లక్షలు ప్రకారం 21 పనులకు మొత్తం రూ.756.00 లక్షలకు గాను 15th Finance గ్రాంటు ఇ-ప్లాట్‌ఫారం ద్వారా టెండరు కోరబడుచున్నది. టెండరు లభ్యమగు తేది : 11.11.2025 మ ॥ 3.00 గం.ల నుండి 26.11.2025 మ॥ 3.00 గం. వరకు లభ్యమగును. పూర్తి వివరములకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లేస్ www.eprocurement.gov.in లో చూడగలరు.
సం/- కార్యనిర్వాహక ఇంజినీరు, పి.ఆర్.డివిజన్, మార్కాపురం
DIPR RO No.18025/CL/Advt/1/1/2021-22, Dt: 12.11.2025

AP POLICE HOUSING
ఎ.పి. స్టేట్ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ లిమిటెడ్
ఇ-ప్రొక్యూర్‌మెంట్ - టెండరు ప్రకటన - 5
సివిల్ పనుల కొరకు టెండర్ నం.లు 30 నుండి 37/2025-26, తేది:12-11-2025 కలిగిన 8 పనుల కొరకు టెండర్లు కోరబడుచున్నవి: **టెండర్ నం.లు 33 నుండి 35 కొరకు బిడ్ల దాఖలుకు చివరి తేదీ/సమయం: 01-12-2025న సా.5.00 గం., STN టెండర్ నం.లు 30, 31, 32, 36 మరియు 37 కొరకు బిడ్ల దాఖలుకు చివరి తేదీ/సమయం: 20-11-2025న సా.5.00 గం.** వివరాలకు దర్శించండి: **www.apeprocurement.gov.in**
DIPR RO No.4565PP/CL/Advt/1/1/2021-22, Dt: 12.11.2025 సం/- చీఫ్ ఇంజినీర్

EASTERN POWER DISTRIBUTION COMPANY OF A.P. LTD
Corporate Office, P&T Colony, Seethammadhara, Visakhapatnam-13.
"ape-Procurement Tender Notice"
Tenders are invited from APEPDCL for supply of Solar Smart Meters, MS Raw materials, 55 Sq. mm AAA Conductor, VCB Spares through ape-Procurement. For further details please visit **www.apeprocurement.gov.in**. Phone No.: **0891-2582302,303**. Email: **cgm_pmm@apeasternpower.com**
Advt-113 **Sd/- Chief General Manager /P&MM**

నియామక ప్రకటన 01/2025
కేంద్రీయ విద్యాలయ సంఘటన్ మరియు నవోదయ విద్యాలయ సమితిలో వివిధ బోధన మరియు బోధనేతర ఉద్యోగాల కోసం నియామకం
కేంద్రీయ విద్యాలయ సంఘటన్ (KVS) మరియు నవోదయ విద్యాలయ సమితి (NVS) తరపున సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెంకడరీ ఎడ్యుకేషన్ (CBSE) వారు నేరుగా ప్రాతిపదికన KVS మరియు NVS లో వివిధ బోధన మరియు బోధనేతర ఉద్యోగాల నియామకం కోసం అర్హులైన భారతీయ పౌరుల నుండి ఆన్‌లైన్ దరఖాస్తులు కోరుతున్నారు. అభ్యర్థులు ఈ నియామకానికి సంబంధించిన వివరమైన ప్రకటన, దరఖాస్తు విధానం మరియు ఇతర అధికారిక సమాచారం కోసం CBSE, KVS మరియు NVS అధికారిక వెబ్‌సైట్లు అనగా వరుసగా https://www.cbse.gov.in/, https://kvsangathan.nic.in/ మరియు https://navodaya.gov.in/ మాత్రమే చూడవలసిందిగా సూచించబడుతున్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు దాఖలు చేసేందుకు పోర్టల్ 14 నవంబర్, 2025 నుండి ప్రారంభం అవుతుంది మరియు ఆన్‌లైన్ దరఖాస్తు దాఖలు చేసేందుకు ఆఖరి తేది: 04 డిసెంబర్, 2025.
డైరెక్టర్ (CTET)
CBC 21107/12/0007/2526 CBSE

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం

జలుమూరు: శ్రీకాకుళం జిల్లా జలుమూరు మండలం అచ్యుతాపురం ఉన్నత పాఠశాల వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో లావేరు మండలం గుర్రాల పాలెంనకు చెందిన గట్టెమ అచ్చెయమ్మ(52), పద్మావతి(42) దుర్మరణం పాలయ్యారు. గట్టెమ సుమతి, సంతోట లక్ష్మీ, పద్మ, సీర ఉత్తర, బాద అశ్వినిలకు గాయాలయ్యాయి. వీరంతా బంధువులే. పోలీసుల కథనం ప్రకారం.. బుధవారం ఉదయం తొమ్మిది గంటల సమయంలో గుర్రాలపాలెం నుంచి 12 మంది జిల్లాలోని శైవక్షేత్రాలు దర్శించుకునేందుకు ఆటోలో బయల్దేరారు. టెక్కలి ఎండల మల్లికార్జున స్వామి దర్శనం అనంతరం శ్రీముఖలింగం వెళ్తుండగా అచ్యుతాపురం వద్ద వీరి ఆటోను ఎదురుగా వస్తున్న వాహనం ఢీకొట్టింది. దీంతో అచ్చెయమ్మ, పద్మావతి అక్కడికక్కడే చనిపోయారు. మిగతా వారికి గాయాలయ్యాయి.

మస్కట్‌లో శ్రీకాకుళం యువతి అనుమానాస్పద మృతి

నాగమణి

ఆమదాలవలస: మస్కట్ దేశంలో శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఓ యువతి అనుమానాస్పదంగా మరణించింది. కుటుంబసభ్యులు తెలిపిన వివరాలు.. ఆమదాలవలస మండలం వెదుళ్లవలసకు చెందిన సవాళాపురపు నాగమణి(25) నాలుగేళ్ల కిందట మస్కట్‌కు వెళ్లి, కొంతకాలానికి ఇంటికి వచ్చేసింది. మళ్లీ 4నెలల కిందట మస్కట్‌కు వెళ్లింది. మూడు రోజుల కిందట తల్లి సరోజినికి ఫోన్ చేసిన నాగమణి.. అక్కడి వాళ్లు చాలా ఇబ్బంది పెడుతున్నారంటూ కన్నీరుపెట్టుకుంది. ఇంటికి వచ్చేస్తానని చెప్పింది. ఆ తర్వాత సరోజినికి ఏజెంట్ ఫోన్ చేసి నాగమణి ఆత్మహత్య చేసుకుందని తెలిపారు. తన కుమార్తె మృతదేహాన్ని స్వదేశానికి తీసుకురావాలని, మరణానికి గల కారణాలపై దర్యాప్తు చేయించాలని కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడిని కోరినట్లు సరోజిని తెలిపింది.

మదనపల్లెలో గ్లోబల్ ఆస్పత్రి సీజ్

- కిడ్నీ రాకెట్ వ్యవహారంలో పోలీసుల అదుపులో ఆరుగురు
- యమున మృతదేహం తిరుపతి రుయాకి తరలింపు

గ్లోబల్ ఆస్పత్రిని సీజ్ చేస్తున్న ప్రభుత్వ వైద్యాధికారులు (ఇన్‌సెట్‌లో) యమున మృతదేహం

మదనపల్లె రూరల్/మహారాణిపేట: అన్నమయ్య జిల్లా మదనపల్లెలో వెలుగుచూసిన కిడ్నీ మార్పిడి వ్యవహారం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. జిల్లా ప్రభుత్వాస్పత్రుల సమన్వయాధికారి (డీసీహెచ్‌ఎస్) ఆంజనేయులుకు చెందిన గ్లోబల్ ఆస్పత్రిలో రహస్యంగా నిర్వహించిన కిడ్నీ ఆపరేషన్ వికటించి విశాఖకు చెందిన సాది యమున (29) మృతిచెందిన విషయం తెలిసిందే. డీఎంవో దేవశిరోమణి, డిప్యూటీ డీఎంహెచ్‌వో రమేష్‌బాబు, 104 జిల్లా నోడల్ అధికారి శ్రీధర్ తదితరులు బుధవారం గ్లోబల్ ఆస్పత్రిలో రికార్డులు స్వాధీనం చేసుకున్నారు. నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్నట్లు గుర్తించి గ్లోబల్ ఆస్పత్రిని సీజ్ చేశారు. కిడ్నీ ఆపరేషన్ వ్యవహారంలో మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రి డయాలసిస్ విభాగం టెక్నీషియన్ బాలరంగడు ప్రమేయంపై విచారణ నిర్వహించారు. మృతురాలు యమున తల్లి సూరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు ఆరుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. దళారులు పద్మ, సత్య, సూరిబాబు, డయాలసిస్ టెక్నీషియన్లు బాలరంగడు, మెహరాజ్, డీసీహెచ్‌ఎస్ ఆంజనేయులును అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. యమున మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు తిరుపతి నుంచి మదనపల్లెకు రప్పించారు. ఫోరెన్సిక్ వైద్యనిపుణులు, యూరాలజీ వైద్యులు లేకపోవడంతో పోస్టుమార్టం చేయడం సాధ్యం కాదని మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ రమేష్ రాతపూర్వకంగా తెలపడంతో యమున మృతదేహాన్ని మళ్లీ తిరుపతి రుయాకు తరలించారు. గురువారం పోస్టుమార్టం చేయనున్నారు.

9న కిడ్నీ ఆపరేషన్, 10న యమున మృతి

టూటౌన్ సీఐ రాజారెడ్డి మీడియాకి తెలిపిన మేరకు.. విశాఖపట్నం జిల్లా ఆనందపురం మండలం బొడ్డపాలేనికి చెందిన నరసింగారావు, సూరమ్మ దంపతుల కుమార్తె యమున. భర్త మరణించిన యమున విశాఖపట్నంలోని ఒక షాపులో పనులు చేసుకుంటూ కుమారుడిని పోషించుకుంటోంది. అక్కడే పని చేస్తున్న సూరిబాబుతోను, గాజువాకకు చెందిన పద్మ, అల్లిపురం జంక్షన్‌కు చెందిన సత్యతో యమునకు పరిచయం ఏర్పడింది. మదనపల్లె జిల్లా ఆస్పత్రి డయాలసిస్ విభాగంలో సీనియర్ టెక్నీషియన్ బాలరంగడు, కదిరి డయాలసిస్ టెక్నీషియన్ మెహరాజ్‌తో పద్మ, సత్యలకు కిడ్నీ క్రయవిక్రయాలకు సంబంధించి పరిచయాలున్నాయి. బాలరంగడు, మెహరాజ్ కిడ్నీ అవసరమని పద్మ, సత్యలను సంప్రదించారు. వారు యమునను ఒప్పించి సూరిబాబుతో కలిసి మదనపల్లె తీసుకొచ్చారు. 9న మదనపల్లెలోని గ్లోబల్ ఆస్పత్రిలో యమునకు ఆపరేషన్ చేసి కిడ్నీ తీసి మరొకరికి అమర్చారు. 10వ తేదీ ఉదయం పరిస్థితి విషమించి యమున చనిపోయింది. దీంతో మృతదేహాన్ని గ్లోబల్ ఆస్పత్రి నుంచి తిరుపతికి తరలించారు. మదనపల్లెకు చెందిన బాలరంగడు, మెహరాజ్, విశాఖకు చెందిన పద్మ, సత్య డబ్బు ఆశచూపి యమున కిడ్నీని మరొకరికి అమర్చారని, యమున చనిపోయిందని సూరిబాబు.. ఆమె తల్లి సూరమ్మకు తెలిపాడు. 112 నంబరుకు ఫోన్‌చేసి సమాచారం ఇచ్చాడు. దీంతో లొకేషన్ ఆధారంగా మంగళవారం తిరుపతి ఈస్ట్ పోలీసులు నిందితుల్ని అదుపులోకి తీసుకుని తమకు అప్పగించినట్లు మదనపల్లె టూటౌన్ సీఐ రాజారెడ్డి చెప్పారు. ప్రాథమిక సమాచారం మేరకు గ్లోబల్ ఆస్పత్రి వైద్యులు, డీసీహెచ్‌ఎస్ ఆంజనేయులు, కిడ్నీ ఆపరేషన్ చేసిన బయటిప్రాంతానికి చెందిన వైద్యుడు, దళారులు పద్మ, సత్య, సూరిబాబు, డయాలసిస్ టెక్నీషియన్లు బాలరంగడు, మెహరాజ్‌ను నిందితులుగా చేర్చినట్లు తెలిపారు. పూర్తిస్థాయిలో విచారించి ఈ ఘటనలో ఇంకా ప్రమేయం ఉన్న వారిని కూడా చేరుస్తామన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

కిడ్నీ తొలగించి తన బిడ్డను పొట్టనపెట్టుకున్నవారిని కఠినంగా శిక్షించాలని యమున తల్లి సూరమ్మ కోరారు. యమున తల్లిదండ్రులు సూరమ్మ, నరసింహులు, తమ్ముడు నాగేంద్ర, కుమారుడు సుధీర్‌రెడ్డి బుధవారం మదనపల్లె టూటౌన్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు. పిక్నిక్‌కు అరకు వెళుతున్నానని చెప్పిన యమున.. శవంగా మారిందంటూ విలపించారు.

ఏపీ మోడల్ కళాశాలలో అక్రమాలపై నిరసన

అధిక ఫీజులు వసూలు చేస్తున్నారంటూ విద్యార్థుల ఆందోళన

నిరసన తెలుపుతున్న విద్యార్థులు

చీరాల: బాపట్ల జిల్లా చీరాల రూరల్ పరిధిలోని ఏపీ మోడల్ స్కూల్, జూనియర్ కాలేజీలో రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన ఫీజుల కంటే ఎక్కువగా వసూలుచేస్తున్నారని ఆరోపిస్తూ విద్యార్థులు బుధవారం నిరసనకు దిగారు. ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్ తీరుకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ కాలేజీ ఎదుట బైఠాయించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ.. ప్రభుత్వ అడ్మిషన్ ఫీజు రూ.250 ఉంటే రూ.2,500లు, పరీక్ష ఫీజు రూ.500కు బదులు రూ.1,000 వసూలుచేస్తున్నారన్నారు. ఎక్కువ మొత్తంలో ఫీజులు చెల్లించలేకే ప్రభుత్వ కళాశాలలో చేరామని, తాము చెబితే ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్ తమపట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ఫీజులు చెల్లించలేని వాళ్లకు చదువులు అవసరమా అంటూ అవమానకరంగా మాట్లాడుతున్నారని విద్యార్థులు ఆవేదన వ్యక్తంచేశారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో సైతం విద్యార్థులు ఈ విషయమై ఫిర్యాదు చేశారు. విద్యాశాఖాధికారులకు కూడా ఫిర్యాదు చేయగా వారు విచారణ చేపట్టారు. ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశామనే అక్కసుతో తమను వేధిస్తున్నారని విద్యార్థులు ఆరోపించారు. మరోవైపు.. విచారణకు అధికారులు వస్తారని తెలుసుకుని ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్ విద్యార్థులకు కొంత నగదును తిరిగి ఇవ్వగా వారు తిరస్కరించినట్లు సమాచారం. మధ్యాహ్న భోజనం సైతం సక్రమంగా అమలు కావడంలేదని వారు ఆరోపించారు. పోలీసులు చెప్పినా నిరసనను విరమించబోమంటూ విద్యార్థులు తేల్చిచెప్పారు. ఈ విషయం మీడియాలో రావడంతో డీఈవో పురుషోత్తం, తహసీల్దార్ కె. గోపీకృష్ణ, మున్సిపల్ చైర్మన్ ఎం.సాంబశివరావు కళాశాలకు చేరుకుని విచారణ చేపట్టారు. నిజానిజాలు తేల్చి విద్యార్థులకు న్యాయంచేస్తామని డీఈవో హామీ ఇవ్వడంతో విద్యార్థులు ఆందోళన విరమించారు.

ట్రిపుల్ ఐటీ విద్యార్థి ఆత్మహత్య

సృజన్ (ఫైల్)

ఎచ్చెర్ల: శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో ఓ విద్యార్థి ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం ప్రకారం... గుంటూరుకు చెందిన పత్తిపాటి సృజన్(20) శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్లలోని ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో మూడో సంవత్సరం చదువుతున్నాడు. చదువులో వెనుకబడుతుండటంతో మనస్తాపానికి గురైన సృజన్.. బుధవారం క్యాంపస్‌లోని ఓ గదిలో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. గమనించిన కాలేజీ సిబ్బంది అతన్ని కిందకు దించి, రిమ్స్‌కు తరలించారు. అప్పటికే అతను మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. దీనిపై ఎచ్చెర్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. విద్యార్థి తల్లిదండ్రులు శివకృష్ణప్రసాద్, జ్యోతికి సమాచారం ఇచ్చినట్లు కాలేజీ సిబ్బంది తెలిపారు. కాగా, సృజన్ ఆత్మహత్యపై భిన్న కథనాలు వినిపిస్తున్నాయి. బ్యాక్‌లాగ్స్ 11 సబ్జెక్టులు ఉండటంతో ఒత్తిడితో ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని కొందరు భావిస్తున్నారు. అంతేగాక ఓ అమ్మాయితో స్నేహంగా ఉండటం.. ఆమె అన్నదమ్ములు అదే కళాశాలలో చదువుతుండటం.. వారు ఒకట్రెండుసార్లు సృజన్‌ను హెచ్చరించడం వంటివి చేశారని తెలిసింది. మంగళవారం రాత్రి పది మంది వరకు కళాశాలలో ప్రవేశించారని, వారి వెనుక ఆ విద్యార్థులు కూడా ఉన్నారని.. వీరు సృజన్‌ను కొట్టినట్టు తెలిసింది.

ముష్కరులకు శిక్ష తప్పదు

- కుట్రదారులను చట్టం ముందు నిలబెట్టడం తథ్యం
- తేల్చిచెప్పిన ప్రధాని నరేంద్ర మోదీ
- ఎల్‌ఎన్‌జేపీ ఆసుపత్రిలో బాధితులకు పరామర్శ

ఢిల్లీ బాంబు పేలుడులో గాయపడిన బాధితురాలిని పరామర్శిస్తున్న ప్రధాని మోదీ

న్యూఢిల్లీ: దేశ రాజధానిలో ఎర్రకోట వద్ద పేలుడుకు పాల్పడి, సామాన్య ప్రజల ప్రాణాలను బలితీసుకున్న ముష్కరులను కచ్చితంగా శిక్షించి తీరుతామని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పునరుద్ఘాటించారు. ఈ ఘటన వెనుక ఉన్న కుట్రదారులను చట్టం ముందు నిలబెట్టడం తథ్యమని తేల్చిచెప్పారు. పేలుడులో గాయపడి ఎల్‌ఎన్‌జేపీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను ప్రధాని మోదీ బుధవారం పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. బాధితులంతా త్వరగా కోలుకోవాలని దేవుడిని ప్రార్థిస్తున్నట్లు చెప్పారు. ఎవరూ అధైర్య పడొద్దని, అండగా ఉంటామని హామీ ఇచ్చారు. భూటాన్ నుంచి స్వదేశానికి చేరుకున్న మోదీ నేరుగా ఎల్‌ఎన్‌జేపీ ఆసుపత్రికి వచ్చారు. దాదాపు 25 నిమిషాల పాటు ఆసుపత్రిలోనే ఉన్నారు. అధికారులతో, డాక్టర్లతో మాట్లాడారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. కారు బాంబు పేలుడు పట్ల మోదీ ఇప్పటికే దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. దర్యాప్తు అధికారులతో ఎప్పటికప్పుడు మాట్లాడుతూ వివరాలు తెలుసుకుంటున్నానని మంగళవారం వెల్లడించారు.

పుడమి పొర చిరిగిపోతోందా?

- ఖండాల అంతర్భాగ పొర శిలాద్రవంలో కలిసిపోతోందా?
- ఇది కొత్తగా అగ్నిపర్వతాల పుట్టుకకు కారణమవుతోందా?
- అవుననే సమాధానమిస్తున్న శాస్త్రవేత్తలు

వాషింగ్టన్: ఆసియా, ఆఫ్రికా, ఆస్ట్రేలియా ఇలా ఖండాలుగా విడిపోయిన భూఉపరితలం కొన్ని కోట్ల సంవత్సరాలక్రితం ఒకే అఖండ గోండ్వానా ఉండేదని పుస్తకాల్లో చదువుకున్నాం. ఇప్పుడీ ఖండాలు నెమ్మదిగా మరింత దూరంగా వెళ్తున్నాయనే సిద్ధాంతమూ వింటున్నాం. అయితే ఈ ఖండాలు దూరంగా జరిగే క్రమంలో కేవలం ఉపరితల భూమి మాత్రమే చీలిపోవడంలేదని మహాసముద్రాల అడుగుల వందల కిలోమీటర్ల లోతులోనూ భూమి పొర చీలిపోతోందని తాజా అధ్యయనంలో తేలింది. దూరంగా జరిగినంత మాత్రాన మనకొచ్చే నష్టమేమీ లేదని అనుకోకూడదని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. ఖండాల భూగర్భ పొర చీలిపోవడంతో దాని అడుగున ఉన్న శిలాద్రవ మ్యాంటిల్ పొర నుంచి భడభాగ్నిలాంటి శిలాద్రవం బయటకు ఎగజిమ్మే ఆస్కారముంది. దీంతో కొత్తగా లెక్కలేనని అగ్నిపర్వతాలు పుట్టుకొచ్చే ప్రమాదముందని భూభౌగోళిక శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. కొత్త అగ్ని పర్వతాలు కోట్ల ఏళ్లపాటు అలాగే శిలాద్రవం, మాగ్మాను ఎగజిమ్మే పెనుముప్పు పొంచి ఉందని శాస్త్రవేత్తల తాజా అధ్యయనంలో స్పష్టమైంది. సంబంధిత పరిశోధన తాలూకు వివరాలు 'నేచర్ జియోసైన్స్' జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. సాధారణంగా వేర్వేరు భూఫలకాలకొనలు పరస్పరం ఢీకొనడం, రాపిడి సందర్భాల్లోనే అగ్ని పర్వతాలు పుట్టుకొస్తాయి. ఇప్పుడు కొత్తగా సముద్ర గర్భంలోనూ అగ్నిపర్వతాలు ఏర్పడి కోట్ల సంవత్సరాలపాటు అవి అలాగే క్రియాశీలకంగా ఉండిపోయే ప్రమాదం ఉందని అధ్యయనకారులు విశ్లేషిస్తున్నారు. అమెరికాలోని సౌతాంప్టన్ విశ్వవిద్యాలయం, పోట్స్‌డామ్‌లోని జీఎఫ్‌జెడ్ హెల్మ్‌హోల్ట్జ్ సెంటర్ ఫర్ జియోసైన్సెస్, పోట్స్‌డ్యామ్ యూనివర్సిటీ, కెనడాలోని క్వీన్స్ విశ్వవిద్యాలయం, స్వాన్‌సియా యూనివర్సిటీలోని పరిశోధకుల బృందం సంయుక్తంగా ఈ అధ్యయనం చేపట్టింది. కంప్యూటర్ స్టిములేషన్ విధానంలో ఖండాల చీలిక కారణంగా కొన్ని కోట్ల సంవత్సరాల తర్వాత జరగబోయే విపరిణామాలను వీళ్లు విశ్లేషించగలిగారు.

బయటపడిన భారీ కుతంత్రం

ఢిల్లీలో డిసెంబర్ 6న వరుస పేలుళ్లు జరిపేందుకు కుట్ర!

- ఫరీదాబాద్ ఉగ్రమాడ్యూల్ సభ్యుల విచారణతో వెలుగులోకి విస్మయకర విషయాలు
- జనవరి నుంచే పలు మార్లు రెక్కీ పూర్తి
- ఎర్రకోట పరిసరాలపై పట్టుసాధించిన ముజమిల్ ఘనీ
- వాహనాధారిత ఐఈడీతో విధ్వంసానికి పథక రచన
- ఆత్మాహుతి బాంబర్ ఉమర్‌కు చెందిన మరో కారు గుర్తింపు
- విదేశాల నుంచి నిధులు అందుకున్న ఉగ్రమాడ్యూల్ సభ్యులు
- గతంలో తుర్కియేకు వెళ్లొచ్చిన ఘనీ, ఉమర్

న్యూఢిల్లీ: కశ్మీర్‌లో ఉగ్రవాదులు అతికించిన పోస్టర్ చివరకు దేశరాజధానిలో వరుస బాంబు పేలుళ్ల ఉగ్రకుట్ర భగ్నానికి దారితీసింది. పదో తేదీన ఎర్రకోట సమీపంలో నడిరోడ్డుపై కారు పేలి పలువురి బ్రతుకుల్ని ఛిద్రం చేసిన ఉదంతం వెనుక భారీ ఉగ్ర కుట్ర దాగి ఉందని తాజా దర్యాప్తులో తేలింది. బాబ్రీ మసీదును కూల్చేసిన అదే డిసెంబర్ ఆరో తేదీన ఢిల్లీలో వరుస బాంబుపేలుళ్లు జరపాలని వైద్యుల ముసుగులో ఉన్న ఉగ్రవాదులు కుట్ర పన్నినట్లు బుధవారం జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) విచారణలో వెల్లడైంది. ఫరీదాబాద్‌లో 2,500 కేజీల అమ్మోనియం నైట్రేట్, పొటాషియం క్లోరేట్, సల్ఫర్‌ల స్వాధీనం, వాటి నిల్వతో సంబంధం ఉన్న ఉగ్రమాడ్యూల్ సభ్యుల అరెస్ట్ తర్వాత వారిని లోతుగా ప్రశ్నించగా ఈ కుట్ర విషయం బయటపడింది. గణతంత్రదినోత్సవం సందర్భంగా జనవరి 26న ఢిల్లీలో పేలుళ్లు జరగబోతున్నాయని తొలుత వార్తలొచ్చినా అసలు దాడి డిసెంబర్‌లోనే చేయాలని ఉగ్రవాదులు నిశ్చయించుకున్నారని తెలుస్తోంది. ఇందుకు బలం చేకూర్చే ఆధారాలను జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) అధికారులు సంపాదించారు. ఫరీదాబాద్‌లో అరెస్టయిన డాక్టర్ ముజామిల్ ఘనీ ఈ ఏడాది జనవరిలోనే పలుమార్లు ఎర్రకోట, దాని చుట్టుపక్కల ప్రాంతాల్లో పలుమార్లు రెక్కీ నిర్వహించాడని అతని మొబైల్ కాల్ డేటా, లొకేషన్ల ద్వారా ఢిల్లీ పోలీసులు గుర్తించారు. జనవరి 26న దాడులకు ప్లాన్‌చేసినా ఆరోజు అత్యంత కట్టుదిట్టమైన భద్రత ఉండే అవకాశం ఉండటంతో దాడుల ప్లాన్‌ను డిసెంబర్ ఆరో తేదీకి మార్చినట్లు దర్యాప్తు వర్గాలు వెల్లడించాయి. మొబైల్‌లోని డంప్ డేటాను విశ్లేషించడంతో ఈ విషయం స్పష్టమైంది. కారుతోపాటు పేలిపోయిన డాక్టర్ ఉమర్ నబీతో కలిసి ఘనీ 2021లో తుర్కియేకు వెళ్లొచ్చినట్లు వాళ్ల పాస్‌పోర్ట్‌ల మీది స్టాంపింగ్‌ల ఆధారంగా పోలీసులు కనిపెట్టారు. విదేశీ హ్యాండ్లర్‌ల నుంచి వీళ్లకు ఏ స్థాయిలో ఆర్థిక, ఆయుధ, పేలుడు పదార్థాల సరఫరా సాయం అందిందనే కోణంలోనూ దర్యాప్తు మొదలెట్టారు. పాక్ కేంద్రంగా పనిచేస్తున్న జైషే మొహమ్మద్ ఉగ్రసంస్థ సభ్యులతో ఉమర్, ఘనీ భేటీ అయినట్లు తెలుస్తోంది. ఉగ్రవాదుల రెండు టెలిగ్రామ్ గ్రూప్‌లలో ఉమర్, ఘనీలు సభ్యులుగా ఉన్నారు. వీటిలో ఒకదానిని పాకిస్తాన్‌లోని జైషే మొహమ్మద్ ఆపరేటివ్ ఉమర్ బిన్ ఖథాబ్ నిర్వహిస్తున్నాడు. మరో గ్రూప్‌లో కశ్మీర్‌కు చెందిన ఇమామ్ ఇర్ఫాన్ అహ్మద్ సభ్యునిగా ఉన్నాడు. 2008లో ముంబైలో మారణహోమం తరహాలో దాడులుచేయాలని ఉమర్, ఘనీలకు ఆదేశాలు అందాయి. దీపావళి రోజున దేశవ్యాప్తంగా రద్దీగా ఉండే ప్రాంతాల్లో దాడులుచేయాలని సూచించాడు.

రామ్‌లీలా మైదానం సమీపంలో 3 గంటలు

అత్యంత పేలుడు పదార్థం(ఐఈడీ)ను వాహనానికి అమర్చి వాహనాధారిత ఐఈడీని తయారుచేయడంలో ఉమర్ నిమగ్నమైనట్లు అరెస్టయిన ఉగ్రవాదులు చెప్పారు. వీబీఐఈడీలో డిటోనేషన్ సర్క్యూట్ ఏర్పాటు, తయారీకి సంబంధించిన సాంకేతిక నైపుణ్యం సాధించేందుకు ఉమర్ పూర్తిగా ఇంటర్నెట్‌పై ఆధారపడినట్లుతెలుస్తోంది. అయితే తోటి సహచరులు అందరూ పోలీసులకు చిక్కడంతో తాను దొరికిపోతానన్న తొందరలో పూర్తిస్థాయి ఐఈడీ తయారుచేయకుండానే అమ్మోనియం నైట్రేట్‌తో వాహనాన్ని తీసుకుని తన స్థావరం నుంచి పారిపోయాడని దర్యాప్తు సంస్థలు చెప్పాయి. పేలుడుకు ముందు ఉగ్రవాది ఉమర్ ఎక్కడెక్కడ తిరిగాడన్న విషయలు ఒక్కోటిగా బయటికొస్తున్నాయి. సీసీటీవీ ఫుటేజీ ప్రకారం పదో తేదీన కారు పేలడానికి ముందు ఉమర్ తన కారులో అసఫ్ అలీ రోడ్డులోని మసీదుకు వెళ్లాడు. దీని పక్కనే రామ్‌లీలా మైదానం ఉంది. ఉమర్ అక్కడే మూడు గంటలు ఉన్నాడు. తర్వాత నమాజ్ పూర్తిచేసుకుని ఎర్రకోట వైపు వచ్చాడు.

ఉమర్ పేరిట మరో కారు

చనిపోయిన ఉమర్ పేరిట ఎరుపు రంగు ఫోర్డ్ ఎకోస్పోర్ట్ కారు(డీఎల్10సీకే0458) ఉందని దర్యాప్తులో వెల్లడైంది. దీంతో దీని జాడ కనిపెట్టేందుకు ఢిల్లీ, హరియాణా పోలీసులు బృందాలు రంగంలోకి దిగి అన్ని చెక్‌పోస్ట్‌ల వద్ద జల్లెడపట్టాయి. చివరకు దానిని ఫరీదాబాద్ జిల్లాలోని ఖాండావాలీ గ్రామంలో పోలీసులు గుర్తించి స్వాధీనంచేసుకున్నారు. ఫరీదాబాద్‌లో అల్–ఫలాహ్ విశ్వవిద్యాలయం సమీపంలోని తన అద్దె ఇంట్లో పేలుడుపదార్థాలను దాచిపెట్టేందుకు ఉగ్రవాదులకు సాయపడిన ఇస్లాం మతబోధకుడు, మౌల్వీ ఇష్తియాఖ్‌ను బుధవారం పోలీసులు అరెస్ట్ చేశారు. దీంతో ఇప్పటిదాకా ఈ కేసులో అరెస్ట్‌ల సంఖ్య తొమ్మిదికి పెరిగింది. మేవాట్‌కు చెందిన మౌల్వీ తరచూ అల్–ఫలాహ్ విశ్వవిద్యాలయంలో మత సంబంధ కార్యక్రమాలు నిర్వహించేవాడు. అలా ఉమర్, ఘనీసహా పలువురు వైద్యులు, విద్యార్థుల మెదళ్లలోకి ఉగ్రభావజాలాన్ని నింపినట్లు తేలింది.

ఉమర్ పేరిట ఉన్న మరో కారు ఇదే

శక్తివంతమైన ఐఈడీల తయారీ!

అత్యంత శక్తివంతమైన 200 ఐఈడీల తయారీలో ఉగ్రమాడ్యూల్ సభ్యులు గతంలోనే మునిగిపోయారని దర్యాప్తులో తేలింది. ఢిల్లీలోని ఎర్రకోట, ఇండియాగేట్, కాన్స్టిట్యూషన్ క్లబ్, గౌరీశంకర్ ఆలయం, గురుగ్రామ్, ఫరీదాబాద్‌సహా దేశంలోని కీలక ఎయిర్‌పోర్ట్‌లు, రైల్వేస్టేషన్లు, మాల్స్ వద్ద పేలుళ్లు జరపాలని భారీ ప్రణాళిక వేసుకున్నట్లు తెలుస్తోంది. ఘటనాస్థలిలో అమ్మోనియం నైట్రేట్‌తోపాటు ఒక కొత్తతరహా రసాయనం అశేషాలను పోలీసులు గుర్తించారు. అది అమ్మోనియం నైట్రేట్ కంటే అత్యంత విస్ఫోటక గుణమున్న ధాతువు కావొచ్చని భావిస్తున్నారు. బుధవారం ఘటనాస్థలి నుంచి 40 శాంపిళ్లను ఢిల్లీ ఫోరెన్సిక్ విభాగం సేకరించింది. వీటితోపాటు ఇతర మందుగుండు, బుల్లెట్లను స్వాధీనంచేసుకున్నారు. పేలుడు తర్వాత పేరు మార్మోగిపోతున్న అల్–ఫలాహ్ వర్సిటీలో పోలీసులు ముమ్మర సోదాలు కొనసాగిస్తున్నారు. ఉమర్, ఘనీలతో సంబంధం ఉన్న వాళ్లను ప్రశ్నిస్తున్నారు.

కశ్మీర్‌లో 500 చోట్ల సోదాలు

బుధవారం ఒక్కరోజే కశ్మీర్‌లోని శ్రీనగర్, గందేర్బల్, బుద్గామ్, బారాముల్లా, బందీపొరా, కుప్వారా, అనంత్‌నాగ్, కుల్గాం, పుల్వామా, షోపియాన్ జిల్లాల్లోని 500 చోట్ల పోలీసులు విస్తృతస్థాయిలో సోదాలుచేశారు. జమాతే ఇస్లామీ ఉగ్రసంస్థ మళ్లీ క్రియాశీలకంగా మారిందన్న సమాచారంతో పోలీసలు ఆకస్మిక తనిఖీలు చేశారు. థానె, పుణెలో మహారాష్ట్ర ఏటీసీ బృందం సోదాలుచేసింది. అల్‌ఖైదాతో సంబంధమున్న ఒక సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అరెస్ట్ నేపథ్యంలో థానెలో ఒక టీచర్, పుణెలో మరో వ్యక్తికి చెందిన చోట్ల సోదాలు జరిగాయి.

భూటాన్ అభివృద్ధికి సహకరిస్తాం

- 13వ పంచవర్ష ప్రణాళికకు మా మద్దతు ఉంటుంది
- భారత ప్రధాని మోదీ స్పష్టీకరణ
- భూటాన్ మాజీ రాజు జిగ్మే సింగ్యే వాంగ్‌చుక్‌తో భేటీ

కాలచక్ర కార్యక్రమంలో ప్రధాని మోదీ

థింపూ: భూటాన్ సర్వతోముఖాభివృద్ధికి తమ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని భారత ప్రధాని నరేంద్ర మోదీ పునరుద్ఘాటించారు. భూటాన్ 13వ పంచవర్ష(2024–2029) ప్రణాళికకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. మోదీ భూటాన్ పర్యటన రెండో రోజు బుధవారం కూడా కొనసాగింది. మాజీ రాజు జిగ్మే సింగ్యే వాంగ్‌చుక్‌తో ఆయన సమావేశమయ్యారు. భారత్, భూటాన్ సంబంధాలపై వారిద్దరూ చర్చించుకున్నారు. ఇంధనం, వ్యాపారం, వాణిజ్యం, టెక్నాలజీ, అనుసంధానం తదితర కీలక రంగాల్లో పరస్పర సహకారంపై అభిప్రాయాలు పంచుకున్నారు. ద్వైపాక్షిక భాగస్వామ్యాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలని నిర్ణయించారు. భారత్–భూటాన్ సంబంధాల బలోపేతానికి జిగ్మే సింగ్యే వాంగ్‌చుక్ ఎంతగానో కృషి చేశారని ప్రధాని మోదీ ప్రత్యేకంగా ప్రశంసించారు. ఈ మేరకు సోషల్ మీడియాలో పోస్టుచేశారు. భారతదేశ యాక్ట్ ఈస్ట్ పాలసీ(తూర్పునకు ప్రాధాన్యం)లో భాగంగా భూటాన్‌లో చేపట్టిన గెలెఫూ మైండ్‌ఫుల్‌నెస్ సిటీ ప్రాజెక్టులో ప్రగతి పట్ల మోదీ సంతోషం వ్యక్తంచేశారు. భూటాన్ 13వ పంచవర్ష ప్రణాళిక అమలుకు రూ.10,000 కోట్ల సాయం అందిస్తామని భారత్ ఇప్పటికే హామీ ఇచ్చింది.

కాలచక్ర వేడుకలో మోదీ

భూటాన్‌లో జరుగుతున్న అంతర్జాతీయ శాంతి ప్రార్థన పండుగలో భాగంగా కాలచక్ర ఎంపవర్‌మెంట్ వేడుకను ప్రధాని మోదీ బుధవారం లాంఛనంగా ప్రారంభించారు. భూటాన్ రాజు జిగ్మే ఖేసర్ నామ్‌గేల్ వాంగ్‌చుక్‌తో కలిసి కాలచక్ర 'వీల్ ఆఫ్ టైమ్ ఎంపవర్‌మెంట్'ను ప్రారంభించడం ఆనందంగా ఉందని మోదీ సోషల్ మీడియా పోస్టులో పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న బౌద్ధులకు ఇదొక గొప్ప వేడుక అని తెలిపారు. కాలచక్రకు బౌద్ధమతంలో అత్యున్నత సాంస్కృతిక ప్రాధాన్యం ఉందని గుర్తుచేశారు. ఈ కార్యక్రమానికి ప్రపంచ దేశాల నుంచి పండితులు, గురువులు, భక్తులు హాజరయ్యారని వెల్లడించారు. భారత ప్రధాని మోదీ 'అనుకున్నది సాధించిన ఆధ్యాత్మిక గురువు' అని భూటాన్ ప్రధానమంత్రి త్సెరింగ్ టాబ్గే అభివర్ణించారు. మోదీ బుధవారం భూటాన్ పర్యటన ముగించుకొని స్వదేశానికి చేరుకున్నారు. తన పర్యటనతో భారత్–భూటాన్ మధ్య ద్వైపాక్షిక భాగస్వామ్యంలో వేగం మరింత పెరుగుతుందని ఆయన ఆకాంక్షించారు.

కాలచక్ర అంటే?

ఇదొక ఆధ్యాత్మిక వేడుక. బౌద్ధులు పరమ పవిత్రంగా భావిస్తారు. భగవంతుడి ఆశీస్సుల కోసం కాలచక్ర నిర్వహిస్తారు. గౌతమబుద్ధుడి మార్గంలో నడుస్తూ జ్ఞానోదయం పొందడానికి ప్రార్థనలు, ధ్యానం నిర్వహిస్తారు. మత గురువుల బోధనలు ఉంటాయి. భూటాన్ ప్రభుత్వం అధికారికంగా కాలచక్ర ఎంపవర్‌మెంట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది.

విదేశీ ఉద్యోగులు ఉండాల్సిందే

- అంతర్జాతీయ ప్రతిభ అమెరికాకు అత్యావశ్యకం
- అయితే ఉద్యోగాలన్నీ హెచ్–1బీలతో నింపకూడదు
- విదేశీయుల ప్రతిభను అమెరికన్లు అందిపుచ్చుకోవాలి
- హెచ్–1బీపై తొలిసారిగా కాస్తంత సానుకూల ధోరణిలో మాట్లాడిన ట్రంప్

ట్రంప్

న్యూయార్క్: విదేశీయులన్నా, హెచ్–1బీ వీసాలపై అమెరికాలో ఉద్యోగాలు చేసేవాళ్లన్నా అంతెత్తున లేచి గోలచేసే అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తొలిసారిగా హెచ్–1బీ వీసాదారుల ప్రాధాన్యతను గుర్తించారు. అమెరికా ఆర్థికాభివృద్ధికి చోదకశక్తి అయిన పరిశ్రమలు, సాంకేతిక రంగంలో విదేశీ ప్రతిభావంతుల కీలకపాత్రను ఆయన తొలిసారిగా కొనియాడారు. విదేశీయుల ప్రతిభ ఖచ్చితంగా అమెరికాకు అవసరమని, హెచ్–1బీ వీసా ఉన్న విదేశీ వృత్తినిపుణులు అమెరికాకు అత్యావశ్యకమని ఆయన కుండబద్దలు కొట్టారు. అయితే అమెరికాలోని నైపుణ్యసంబంధ ఉద్యోగాలన్నీ హెచ్–1బీ వీసాదారులకే కేటాయించకుండా స్థానిక అమెరికన్లకు తగు ప్రాధాన్యతనివ్వాలని ఆయన వెనువెంటనే తనదైన శైలిలో మాట్లాడారు. బుధవారం ఫాక్స్‌న్యూస్ వార్త సంస్థ వ్యాఖ్యాత లారా ఇన్‌గ్రహామ్‌తో ప్రత్యేక ఇంటర్వ్యూలో డొనాల్డ్ ట్రంప్ పలు అంశాలపై సుదీర్ఘంగా మాట్లాడారు.

లక్షలాది మంది విదేశీ కార్మికులు వద్దు

''కేవలం స్థానిక అమెరికన్ కార్మికులతో పని ముందుకు సాగదని నాకూ ఇప్పుడిప్పుడే బోధపడుతోంది. అమెరికాలోకి విదేశీ ప్రతిభ రావాల్సిందే. అలాఅని ఉద్యోగాలన్నీ లక్షలాది మంది విదేశీ కార్మికులతో నింపేస్తామంటే కుదరదు. స్థానికుల్లోనూ ఎంతో మంది ప్రతిభావంతులు ఉన్నారు. అయితే విదేశీయులకే ప్రత్యేకమైన అదనపు వృత్తి నైపుణ్యాలుంటే వాటిని స్థానిక అమెరికన్లు నేర్చుకోవాల్సిందే. స్థానికులకు నైపుణ్యం తప్పనిసరి. సెప్టెంబర్‌లో జార్జియా రాష్ట్రంలో దక్షిణకొరియాకు సంబంధించిన హ్యూందాయ్ ఫ్యాక్టరీల్లో అక్రమంగా అమెరికాకు వచ్చిన వలసదారులు కార్మికులుగా పనిచేస్తున్నారు. వాళ్లను గుర్తించి అమెరికా ఇమిగ్రేషన్, కస్టమ్స్ అధికారులు బహిష్కరించి స్వదేశానికి పంపేశారు. అయితే ఇక్కడ పెద్ద సమస్య వచ్చిపడింది. మేం పంపేసిన కార్మికులు బ్యాటరీలను తయారుచేయడంలో సిద్ధహస్తులు. బ్యాటరీల తయారీ అనేది అత్యంత సంక్లిష్టమైన, సమస్యాత్మకమైన ప్రక్రియ. అది అంత తేలికైన పని కానేకాదు. ఏమైనా తేడాలొస్తే పేలుళ్లు జరుగుతాయి. సమస్యలు మరింత పెద్దవవుతాయి. మేం బహిష్కరించిన బ్యాటరీ తయారీ కార్మికులు ఒక ఐదారు వందల మంది ఉంటారేమో. అలాంటి వాళ్ల నుంచి స్థానిక అమెరికన్లు వృత్తి మెళకువలను నేర్చుకోవాల్సిందే. ప్రతి రంగంలోనూ విదేశీ ప్రతిభావంతుల నుంచి స్థానిక అమెరికన్లు నైపుణ్యాలను నేర్చుకోవాలి'' అని ట్రంప్ వ్యాఖ్యానించారు.

నిరుద్యోగులతో క్షిపణులు అసాధ్యం

నిరుద్యోగులుగా ఖాళీగా ఉన్న వాళ్లను హఠాత్తుగా ఉద్యోగాల్లోకి తీసుకుంటే సానుకూల ఫలితాల కంటే తీవ్ర ప్రతికూల ఫలితాలే వస్తాయి. ఉదాహరణకు అమెరికాపై ఆసక్తితో ఏదైనా విదేశీ కంపెనీ 10 బిలియన్ డాలర్ల పెట్టుబడితో ఒక రక్షణరంగ కర్మాగారం స్థాపించేందుకు ఆసక్తి కనబరచిందనుకుందాం. అలాంటప్పుడు వెంటనే మేం ఖాళీగా ఉన్న నిరుద్యోగ అమెరికన్లను ఆ కొత్త ఫ్యాక్టరీలో కొలువుల్లో కూర్చోబెట్టలేం. ఐదేళ్లుగా ఎలాంటి ఉద్యోగం చేయని వ్యక్తులను కార్మికులుగా మార్చేసి ఏకంగా క్షిపణులను తయారుచేయించలేం''అని ట్రంప్ వ్యాఖ్యానించారు. కొత్త హెచ్–1బీ వీసా ఫీజును అనూహ్యంగా ఒకేసారి 1,00,000 డాలర్లకు పెంచేసి అమెరికాకు విదేశీ వృత్తినిపుణులు రాకుండా పరోక్షంగా కట్టడి చర్యలను ఆరంభించిన ట్రంప్ రెండు నెలలు తిరక్కుండానే హెచ్1బీ అనుకూల వ్యాఖ్యలు చేయడం గమనార్హం.

బహిరంగంగానే ఓట్ల చోరీ: రాహుల్

న్యూఢిల్లీ: బీజేపీ, ఎన్నికల సంఘం కలిసి బహిరంగంగానే ఓట్ల చోరీకి పాల్పడుతున్నాయని కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రజాస్వామ్యాన్ని పట్టపగలే హత్య చేస్తున్నాయని ధ్వజమెత్తారు. ఈ మేరకు బుధవారం ఎక్స్‌లో పోస్టుచేశారు. ఒకే వ్యక్తి హరియాణా, ఢిల్లీ, బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు వేశాడంటూ ఆధారాన్ని బయటపెట్టారు. లక్షలాది మంది బీజేపీ సభ్యులు దేశమంతటా తిరుగుతూ విచ్చలవిడిగా దొంగ ఓట్లు వేస్తున్నారని రాహుల్ ఆరోపించారు. వారంతా దొంగతనాన్ని దాచేస్తున్నారని, ఆధారాలు చెరిపేస్తున్నారని విమర్శించారు.

బిహార్ రెండో దశలో రీపోలింగ్ లేదు: ఈసీ

న్యూఢిల్లీ: బిహార్ అసెంబ్లీ ఎన్నికల రెండో దశ పోలింగ్ తర్వాత రీపోలింగ్ చేపట్టాల్సిన అవసరం ఎక్కడా రాలేదని ఎన్నికల సంఘం బుధవారం స్పష్టంచేసింది. రీపోలింగ్ లేకపోవడం బిహార్ అసెంబ్లీ ఎన్నికల చరిత్రలో బహుశా ఇదే మొదటిసారి కావొచ్చని వెల్లడించింది. మొదటి దశ ఎన్నికల్లోనూ రీపోలింగ్ చేపట్టాల్సిన అవసరం రాలేదు. మొత్తానికి రెండు దశల పోలింగ్ ప్రశాంతంగా ముగియడంతో ఎన్నికల సంఘం హాయిగా ఊపిరి పీల్చుకుంది.

రెండో దశ ఎస్ఐఆర్‌లో 37 కోట్ల పత్రాల పంపిణీ

న్యూఢిల్లీ: దేశంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్) రెండో దశ ప్రారంభమైంది. 9 రాష్ట్రాలు, 3 కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఈ ప్రక్రియకు ఎన్నికల సంఘం శ్రీకారం చుట్టింది. రెండో దశ ఎస్ఐఆర్‌లో ఇప్పటిదాకా 37 కోట్లకుపైగా ఎన్యూమరేషన్ పత్రాలను ఓటర్లకు పంపిణీ చేసినట్లు అధికార వర్గాలు బుధవారం తెలియజేశాయి. మొత్తం పంపిణీ చేయాల్సిన పత్రాల్లో ఇవి 72.66 శాతమని వెల్లడించాయి. ఈ ఎస్ఐఆర్‌లో 51 కోట్ల మంది ఓటర్ల అర్హతలను తేల్చబోతున్నారు.

బెంగాల్‌లో 13 లక్షల బోగస్ ఓటర్లు: బీజేపీ

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్‌లో అధికార తృణమూల్ కాంగ్రెస్ పార్టీ ఏకంగా 13.25 లక్షల బోగస్ ఓటర్లను చేర్పించిందని బీజేపీ కీలక నేత సువేందు అధికారి ఆరోపించారు. వచ్చే ఏడాది జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో నెగ్గడానికి అడ్డదారుల్లో వెళ్తోందని మండిపడ్డారు. బోగస్ ఓటర్ల పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించాల్సిందేనని తేల్చిచెప్పారు. ఈ మేరకు బుధవారం చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్‌కు ఫిర్యాదు చేశారు. బూత్ లెవెల్ అధికారులు తృణమూల్ కాంగ్రెస్ పార్టీతో కుమ్మక్కు అయ్యారని చెప్పారు.

కళంకిత నేతల తొలగింపు బిల్లు కమిటీకి

అపరాజిత సారంగి సారథ్యం

- వివరాలు వెల్లడించిన లోక్‌సభ సెక్రటేరియట్
- 31 మంది సభ్యులతో కమిటీ ఏర్పాటు

అపరాజిత సారంగి

న్యూఢిల్లీ: తీవ్ర నేరపూరిత కేసుల్లో 30 రోజులకు మించి జైల్లో గడుపుతున్న కళంకిత ప్రధానమంత్రి, ముఖ్యమంత్రులు, కేంద్ర, రాష్ట్ర మంత్రులను పదవుల నుంచి తొలగించేందుకు ఉద్దేశించిన బిల్లును సమీక్షించేందుకు ఏర్పాటుచేసిన సంయుక్త పార్లమెంటరీ కమిటీ(జేపీసీ)ని లోక్‌సభ బుధవారం ఏర్పాటుచేసింది. బీజేపీ మహిళా ఎంపీ అపరాజితా సారంగి జేపీసీకి సారథ్యంవహిస్తారని లోక్‌సభ సెక్రటేరియట్ ఒక ప్రకటనలో పేర్కొంది. అప్రతిష్ట మూటగట్టుకున్న నేతలను పదవుల నుంచి తొలగించేందుకు ఇటీవల కేంద్రప్రభుత్వం రాజ్యాంగ(130వ సవరణ)బిల్లు– 2025, జమ్మూ, కశ్మీర్ పునర్వ్యవస్థీకరణ(సవరణ)బిల్లు–2025, కేంద్రపాలిత ప్రభుత్వాల(సవరణ)బిల్లు–2025లను తీసుకురావడం తెల్సిందే. ఈ బిల్లులను సమీక్షించేందుకు లోక్‌సభ మొత్తంగా 31 మంది సభ్యులతో జేపీసీని బుధవారం ప్రకటించింది. విపక్ష పార్టీలు ఈ కమిటీని బహిష్కరించినప్పటికీ నలుగురు విపక్ష పార్టీల సభ్యులకు కమిటీలో చోటు కల్పించారు. ఒక నామినేట్ సభ్యుడు సహా బీజేపీ నుంచి 15 మంది, ఎన్‌డీఏ భాగస్వామ్య పార్టీల నుంచి 11 మంది ఈ కమిటీలో సభ్యులుగా ఉండనున్నారు. బీజేపీ లోక్‌సభ సభ్యులు రవిశంకర్ ప్రసాద్, భర్తృహరి మహతాబ్, ప్రదాన్ బారువా, బ్రిజ్‌మోహన్ అగర్వాల్, విష్ణుదయాళ్ రామ్, డీకే అరుణ, పురుషోత్తమ్‌భాయ్ రూపాలా, అనురాగ్ ఠాకూర్, బ్రిజల్ లాల్, ఉజ్వల్ నికమ్, నబామ్ రేబియా, నీరజ్ శేఖర్, మనన్ కుమార్ మిశ్రా, కె. లక్ష్మణ్‌లు కమిటీలో ఉన్నారు. ఎన్సీపీ–ఎస్పీ పార్టీ నాయకురాలు సుప్రియా సూలే, అకాలీదళ్ నాయకురాలు హర్‌సిమ్రత్ బాదల్, ఎంఐఎం చీఫ్ అసదుద్దీన్ ఒవైసీ, వైఎస్సార్‌సీపీ సభ్యుడు నిరంజన్ రెడ్డి తదితరులు ఈ కమిటీలో సభ్యులుగా ఉన్నారు. ఈ ప్యానెల్‌లో సభ్యత్వం తీసుకోబోమని ఇప్పటికే కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, బిజూ జనతాదళ్, భారత్ రాష్ట్ర సమితి(బీఆర్ఎస్) ప్రకటించాయి. ఎన్‌డీఏ కూటమిలోని దాదాపు ప్రతి పార్టీ తరఫున ఒకరికి కమిటీలో ప్రాధాన్యతదక్కింది.

బిహార్‌లో మళ్లీ ఎన్డీయేకే పట్టం

- 67 నుంచి 76 సీట్లతో ఏకైక అతిపెద్ద పార్టీగా ఆర్జేడీ
- యాక్సిస్ మై ఇండియా ఎగ్జిట్ పోల్ ఫలితాల్లో వెల్లడి

న్యూఢిల్లీ: బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ, జేడీ(యూ)తో కూడిన జాతీయ ప్రజాస్వామ్య కూటమి(ఎన్డీయే) ముందంజలో ఉన్నట్లు యాక్సిస్ మై ఇండియా ఎగ్జిట్ పోల్ వెల్లడించింది. కాంగ్రెస్, ఆర్జేడీలతో కూడిన మహాగఠ్‌బంధన్ మరోసారి ప్రతిపక్ష పాత్రకే పరిమితం కానుందని స్పష్టంచేసింది. ఎన్డీయేకు 121 నుంచి 141 వరకు, విపక్ష మహాగఠ్‌బంధన్‌కు 98 నుంచి 118 స్థానాలు వస్తాయని తెలియజేసింది. ప్రశాంత్ కిశోర్ నేతృత్వంలోని జన సురాజ్ పార్టీకి సున్నా నుంచి రెండు స్థానాలు రావొచ్చని అంచనా వేసింది. బిహార్ ఎన్నికలు మంగళవారం ముగిసిన సంగతి తెలిసిందే. యాక్సిస్ మై ఇండియా ఎగ్జిట్ పోల్ ఫలితాలను బుధవారం ప్రకటించారు. పార్టీల పరంగా చూస్తే రాష్ట్రీయ జనతాదళ్(ఆర్జేడీ) 67 నుంచి 76 స్థానాలు గెల్చుకొని ఏకైక అతిపెద్ద పార్టీగా అవతరిస్తుందని యాక్సిస్ మై ఇండియా పేర్కొంది. జేడీ(యూ)కు 56 నుంచి 62 స్థానాలు, బీజేపీకి 50 నుంచి 56, కాంగ్రెస్‌కు 17 నుంచి 21, వికాస్‌శీల్ ఇన్సాన్ పార్టీకి 3 నుంచి 5, వామపక్షాలకు 10 నుంచి 14 స్థానాలు దక్కుతాయని తెలియజేసింది. ఎన్డీయేకు 43 శాతం ఓట్లు, మహాగఠ్‌బంధన్‌కు 41 శాతం, జన సురాజ్ పార్టీకి కేవలం 4 శాతం ఓట్లు లభిస్తాయని వివరించింది. ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ తదుపరి ముఖ్యమంత్రి కావాలని 34 శాతం మంది, ప్రస్తుత సీఎం నితీశ్ కుమార్ మరోసారి సీఎం కావాలని 22 శాత మంది కోరుకుంటున్నట్లు వెల్లడించింది. ఎన్డీయేకు 41 శాతం పురుషుల ఓట్లు, 45 శాతం మహిళల ఓట్లు, మహాగఠ్‌బంధన్‌కు 42 శాతం పురుషుల ఓట్లు, 40 శాతం మహిళల ఓట్లు లభిస్తాయని అంచనా వేసింది.

సాక్షి గుంటూరు

గురువారం । 13 । నవంబర్ । 2025

16న సత్యనారాయణ వ్రతం

చిలకలూరిపేట: ఎన్‌హెచ్ పక్కన ఉన్న అయ్యప్ప ఆలయంలో ఈ నెల 16న సామూహిక రమాసహిత సత్యనారాయణస్వామి వ్రతం ఉంటుందని నిర్వాహకులు చెప్పారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి 10,600 క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా, దిగువకు 17,000 క్యూసెక్కులు వదులుతున్నారు.



విరలేశ్వరుడికి లక్ష బిల్వార్చన

భట్టిప్రోలు: స్థానిక శ్రీ గంగాపార్వతి సమేత శ్రీవిరలేశ్వర స్వామి ఆలయంలో బుధవారం 38వ కార్తిక వన సమారాధన, లక్ష బిల్వార్చన ఘనంగా నిర్వహించారు.

న్యూస్‌రీల్

ఏపీఐఐసీ భూములు పరిశీలించిన జేసీ

మాచర్ల రూరల్: పల్నాడు జిల్లాలోని రాయవరం, కొత్తపల్లి గ్రామాలలో ఏపీఐఐసీకి చెందిన భూములను జిల్లా జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే బుధవారం పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా నిర్మించనున్న పరిశ్రమల కోసం ఏపీఐఐసీకి చెందిన భూములను పరిశీలించి తగు సూచనలను చేశారు. పారిశ్రామికవేత్తలకు అనుకూలంగా భూములను సిద్ధం చేయాలని పేర్కొన్నారు. తహసీల్దార్ బి.కిరణ్ కుమార్, మండల సర్వేయర్లు, వీఆర్ఓలు ఆయన వెంట ఉన్నారు.

పిడుగురాళ్లలో మొసళ్ల కలకలం

పిడుగురాళ్ల: పిడుగురాళ్ల పట్టణంలో మొసళ్లు కలకలం రేపుతున్నాయి. 6వ వార్డులో హోసన్న మందిరం పక్కన ఉన్న ఎర్రవాగులో పెద్ద పెద్ద మొసళ్లు ఒడ్డుకు వస్తున్నాయి. బుధవారం ఉదయం కొందరు మహిళలు దుస్తులు ఉతికేందుకు వెళ్లారు. వాగు ఒడ్డు మీద ఉన్న రాయిపై పెద్ద మొసలి ఉండడంతో ఆ మహిళలు భయంతో పరుగులు పెట్టారు. అటవీ శాఖ అధికారులు స్పందించి మొసళ్లను పట్టుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

జెడ్పీ స్థలం వేలంపై విచారణ

బెల్లంకొండ: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్‌కు చెందిన 363 సర్వే నంబర్‌లోని స్థలం వేలంపాటపై జెడ్పీ డిప్యూటీ సీఈవో సీహెచ్ కృష్ణ బుధవారం విచారణ చేపట్టారు. కొద్ది రోజుల నిబంధనలకు విరుద్ధంగా వేలం పాట నిర్వహించారంటూ జెడ్పీటీసీ సభ్యుడు గాదె వెంకటరెడ్డి ఫిర్యాదు చేశారు. దీంతో డిప్యూటీ సీఈవో వివరాలు సేకరించారు. జెడ్పీ సీఈఓకు వివరాలు అందజేస్తామని తెలిపారు. ఎంపీడీవో సునీత, సూపరింటెండెంట్ శ్రీనివాసు నాయక్, జెడ్పీటీసీ సభ్యుడు గాదె వెంకటరెడ్డి, హెచ్ఎం శాంతి ఉన్నారు.

జిందాల్ వేస్ట్ ఎనర్జీ ప్లాంట్ సందర్శన

గుంటూరు రూరల్: నగరాల్లో చెత్త డంపింగ్ యార్డులు లేకుండా ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించడంలో వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్‌లు దోహదపడతాయని పంజాబ్ ప్రభుత్వ స్పెషల్ సెక్రటరీ పర్మీందర్ పాల్‌సింగ్ తెలిపారు. సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ స్టడీ టూర్‌లో భాగంగా బుధవారం పంజాబ్ నుంచి పర్మీందర్ పాల్ సింగ్, పగ్వారా కార్పొరేషన్ కమిషనర్ అక్షిత గుప్తా, పీఎంఐడీసీ సీనియర్ మేనేజర్ సిమర్జీత్‌కౌర్‌లు నగర కమిషనర్ పులి శ్రీనివాసులుతో కలిసి గుంటూరు నాయుడుపేటలోని జిందాల్ అర్బన్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్‌ను సందర్శించి, దాని పనితీరు తెలుసుకున్నారు. అవసరమైన వ్యర్థాలు, పర్యావరణ అంశాలు, ప్లాంట్‌కు పెట్టుబడి తదితర వివరాలను జిందాల్ ప్రతినిధులు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు.

వృద్ధురాలి నేత్రాలు దానం

ప్రత్తిపాడు: వృద్ధురాలి నేత్రాలను కుటుంబ సభ్యులు మానవత్వంతో బుధవారం దానం చేశారు. గుంటూరు జిల్లా కాకుమాను గ్రామానికి చెందిన కొప్పోలు సామ్రాజ్యం (60) కొద్దిరోజులుగా అనారోగ్యంతో చికిత్స పొందుతూ గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో మృతి చెందారు. దీంతో కుటుంబ సభ్యుల అభీష్టం మేరకు ఎల్‌వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ వైద్య బృందం బుధవారం ఆమె నివాసంలో భౌతికకాయం నుంచి నేత్రాలను సేకరించింది. అనంతరం కుటుంబ సభ్యులకు వైద్యులు సంబంధిత ధ్రువీకరణ పత్రం అందించారు.

- ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటుపరం చేయడంపై నిరసన ప్రదర్శనలు
- అన్ని నియోజకవర్గాలలో భారీ ర్యాలీలు చేసిన వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలు
- స్థానిక ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులకు వినతిపత్రాల సమర్పణ
- అన్ని నియోజకవర్గాల సమన్వయ కర్తల ఆధ్వర్యంలో కార్యక్రమాలు
- ప్రజా ఉద్యమానికి అడుగడుగునా ఆంక్షలతో అడ్డంకులు సృష్టించిన పోలీసులు

పేదలకు విద్య, వైద్యం అందించడం ప్రభుత్వం బాధ్యత. దాన్ని తుంగలో తొక్కి స్వలాభం కోసం ప్రైవేటుకు గంపగుత్తగా వైద్యం, కళాశాలను కట్టబెడుతూ మెడి'కిల్'కు పాల్పడుతున్న చంద్రబాబు ప్రభుత్వంపై వైఎస్సార్ సీపీ శ్రేణులు భగ్గుమన్నాయి. పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపుతో బుధవారం ప్రజా ఉద్యమం కదం తొక్కింది. వీధుల్లో వైఎస్సార్ సీపీ జెండాలు రెపరెపలాడాయి. పార్టీ శ్రేణులు వెంట ప్రజలు భారీగా తరలివచ్చి, ఉద్యమానికి అండగా నిలిచారు. చంద్రబాబు 'ప్రైవేటు' నామ స్మరణను ఎండగట్టారు. ప్రభుత్వ ఆధ్వర్యంలోనే వైద్య కళాశాలలు నడపాలంటూ నినదించారు. గుంటూరులో ముందస్తు అనుమతి తీసుకుని శాంతియుతంగా ర్యాలీ చేస్తుంటే పోలీసులు బారికేడ్లు పెట్టి అడ్డుకున్నారు. పోలీసుల అడ్డంకుల్ని అధిగమించి పార్టీ శ్రేణులు నిరసనలు తెలిపాయి. దీంతో అక్కడ ఘర్షణ వాతావరణం నెలకొంది. జిల్లావ్యాప్తంగా ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొనడంతో ప్రజా ఉద్యమ ర్యాలీ విజయవంతమైంది.

ప్రజా గర్జన

వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్ సీపీ ర్యాలీలు

జనసంద్రమైన ప్రత్తిపాడు ప్రధాన రహదారి

సాక్షి ప్రతినిధి, గుంటూరు: రాష్ట్రంలో వైద్య కళాశాలల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ గుంటూరు జిల్లా వ్యాప్తంగా ప్రజాగ్రహం వెల్లువెత్తింది. అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో భారీ ర్యాలీలు, నిరసన ప్రదర్శనలు జరిగాయి. ప్రజల నుంచి మద్దతు వెల్లువెత్తింది. గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో పట్టాభిపురం సీఐ గంగా వెంకటేశ్వర్లు ఓవరాక్షన్ చేశారు. ప్రతిసారి జిల్లావ్యాప్తంగా అనుమతి ఇచ్చినా పశ్చిమంలో అధికార పార్టీ మెప్పు కోసం ఆందోళనలను అడ్డుకుని అధిష్టానం దృష్టిలో పడేందుకు పట్టాభిపురం సీఐ అడ్డంకులు సృష్టిస్తూనే ఉన్న సంగతి తెలిసిందే. ముందస్తు అనుమతులు ఉన్నా అడ్డుకునే ప్రయత్నం చేయడం గమనార్హం. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్రవ్యాప్త పిలుపు మేరకు బుధవారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో పార్టీ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు భారీగా నిరసన ర్యాలీ నిర్వహించారు. పట్టాభిపురం మెయిన్ రోడ్డులో స్వామి థియేటర్ నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు.

మంగళగిరిలో..

ర్యాలీలో వేమారెడ్డి, ఎమ్మెల్సీ హనుమంతరావు తదితరులు

మెడికల్ కళాశాల ప్రైవేటీకరణ వ్యతిరేకంగా నిరసన ర్యాలీ మంగళగిరిలో నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి ఆధ్వర్యంలో చేపట్టారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఆప్కో మాజీ చైర్మన్ చిల్లపల్లి మోహన్‌రావు పాల్గొన్నారు. వైఎస్సార్ సీపీ కార్యాలయం నుంచి బైక్ ర్యాలీతో మిద్దె సెంటర్ మీదుగా మెయిన్ బజార్ నుంచి గాలిగోపురం వరకు నాయకులు బైక్ ర్యాలీ నిర్వహించారు. అక్కడి నుంచి నడుచుకుంటూ నిరసన ర్యాలీ చేపట్టారు. పార్టీ మహిళల విభాగం ఆధ్వర్యంలో గౌతమ్ బుద్ధ రోడ్డులో అంబేడ్కర్ సెంటర్ వద్ద మహిళలు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలియజేశారు.అనంతరం తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని, డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. నియోజకవర్గ ఇన్‌చార్జి వేమారెడ్డి మాట్లాడుతూ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణతో ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలు పెద్దఎత్తున నష్టపోతారని తెలిపారు. ఎమ్మెల్సీ హనుమంతరావు మాట్లాడుతూ ప్రైవేటీకరణను ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని, చంద్రబాబు ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

పోలీసుల స్వామి భక్తి

జిల్లా అధ్యక్షులు అంబటి రాంబాబును అడ్డుకుంటున్న పోలీసులు

వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త అంబటి రాంబాబు నేతృత్వంలో స్వామి థియేటర్ నుంచి ర్యాలీగా బయలుదేరిన పార్టీ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలను కంకరగుంట ఫ్లై ఓవర్ మీదకు రానీయకుండా పోలీసులు బారికేడ్లు పెట్టారు. వాటిని నెట్టుకుని ముందుకు వెళ్లేందుకు ప్రయత్నించిన నాయకులకు, పోలీసులకు మధ్య తోపులాట జరిగింది. ముందస్తు అనుమతి తీసుకుని శాంతియుతంగా నిరసన ర్యాలీ చేస్తుంటే అడ్డుకోవడంపై, పట్టాభిపురం సీఐ వెంకటేశ్వర్లు తీరుపై అంబటి రాంబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఐ అంబటి రాంబాబుకు వేలు చూపిస్తూ బెదిరించే ధోరణికి దిగారు. దీంతో అక్కడ ఘర్షణ వాతావరణం చోటు చేసుకుంది. పోలీసుల అవరోధాలను అధిగమించిన నాయకులు, కార్యకర్తలు బారికేడ్లు తోసుకుని ముందుకు వెళ్లారు. భూస్వాములు, కాంట్రాక్టర్లు, ధనవంతులకు మెడికల్ కళాశాలలను అమ్మేసే విధానాన్ని ఉపసంహరించుకుని, కళాశాలలను ప్రభుత్వ రంగంలోనే చేపట్టాలని అంబటి రాంబాబు డిమాండ్ చేశారు.

తాడికొండలో..

నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వనమా బాల వజ్రబాబు ఆధ్వర్యంలో తాడికొండ అడ్డరోడ్డు నుంచి బుల్లెట్‌పై బైకు ర్యాలీగా కార్యకర్తలు, నాయకులు వచ్చారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయం నుంచి ప్రదర్శనగా తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బాల వజ్రబాబు మాట్లాడుతూ సామాన్యుడికి అందనంత ఎత్తులో వైద్యాన్ని ఉంచడమే లక్ష్యంగా బాబు సర్కారు కుట్రలు చేస్తోందని మండిపడ్డారు. ప్రైవేటు ఆసుపత్రులకు దీటుగా కడుతున్న మెడికల్ కళాశాలలు ప్రైవేటీకరించడం వెనుక బాబు కుట్రలు దాగి ఉన్నాయని ఆరోపించారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యార్లగడ్డ మదన్‌మోహన్, నాలుగు మండలాల పార్టీ అధ్యక్షులు వంగా పోలారెడ్డి, మార్పుల శివరామిరెడ్డి, తాళ్లూరి వంశీ, మైనేని నాగమల్లేశ్వరరావు, ఫిరంగిపురం జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి కత్తిరేణమ్మ పాల్గొన్నారు.

తాడికొండలో వినతిపత్రం అందిస్తున్న సమన్వయకర్త బాలవజ్రబాబు, నేతలు

ప్రత్తిపాడులో..

ర్యాలీలో ప్రత్తిపాడు నియోజకవర్గ సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్

నియోజకవర్గంలో స్థానిక బస్టాండు సెంటరులోని అంబేద్కర్, జగ్జీవన్‌రామ్‌ల విగ్రహాలకు నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అక్కడి నుంచి ర్యాలీగా వెళ్లి పాతమల్లాపాలెం కూడలిలో ఉన్న దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కాంస్య విగ్రహానికి బలసాని కిరణ్‌కుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రెడ్ల రామాలయం, అంకమ్మ గుడి మీదుగా తహసీల్దార్ కార్యాలయం వరకు భారీ జనసందోహం మధ్య ప్లకార్డులు చేతబట్టి నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్ మాట్లాడుతూ పేద విద్యార్థుల వైద్య విద్య కలలను చిదిమేసేలా, వారి పొట్ట కొట్టేలా చంద్రబాబు ప్రభుత్వం ప్రైవేటీకరణ నిర్ణయం తీసుకుందని విమర్శించారు.

తెనాలిలో..

తెనాలిలో శివకుమార్ నేతృత్వంలో ర్యాలీ

పార్టీ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ నేతృత్వంలో పార్టీ శ్రేణులు, విద్యార్థులు ర్యాలీలో వందలాదిగా కదం తొక్కారు. స్థానిక పాత ప్రభుత్వ ఆసుపత్రి నుంచి ర్యాలీని శివకుమార్ ప్రారంభించారు. గాంధీచౌక్, బోసురోడ్డు మీదుగా ప్రదర్శన సబ్‌కలెక్టర్ కార్యాలయం వరకు సాగింది. సబ్ కలెక్టర్ కార్యాలయంలో డిమాండ్లతో వినతిపత్రాన్ని సీనియర్ అసిస్టెంట్ శివ త్రివేణికి అందించారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ మెడికల్ కాలేజీల వేటీకరణ దేశచరిత్రలోనే అతి పెద్ద మెడికల్ స్కామ్‌గా అభివర్ణించారు. ప్రై వేటుపరం చేస్తే పేదలకు వైద్య విద్య, రోగులకు వైద్యం అందకుండా పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు.

గుంటూరు ఈస్ట్‌లో..

ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా గుంటూర్పు తూరు నియోజకవర్గంలో సమన్వయకర్త షేక్‌నూరిఫాతిమా ఆధ్వర్యంలో పెద్దఎత్తున కార్యకర్తలు, అభిమానులతో ఆర్టీసీ బస్టాండ్ సెంటర్ నుంచి తహసీల్దారు కార్యాలయం వరకు భారీ ర్యాలీ కొనసాగింది. కార్యక్రమంలో విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకులు, మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాలరెడ్డి, సీఈసీ సభ్యుడు ఎస్.ఎం.జియావుద్దీన్, కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, అనుబంధ విభాగాల నేతలు, డివిజన్ కమిటీ నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మోదుగుల వేణుగోపాలరెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు ప్రభుత్వం పేద వాడి ఆరోగ్యాన్ని ధనవంతుల చేతిలో పెడుతోందని మండిపడ్డారు. షేక్ నూరిఫాతిమా మాట్లాడుతూ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ అంశంపై ప్రజల్లో భారీగా చైతన్యం వచ్చిందన్నారు. విద్యా, వైద్యం రెండు కళ్లు అని, అవి దూరం చేయడంపై ప్రజల్లో ఆగ్రహం వ్యక్తమవుతోందని తెలిపారు.

వినతిపత్రం అందజేస్తున్న నూరిఫాతిమా, మోదుగుల వేణుగోపాలరెడ్డి

పొన్నూరులో..

ర్యాలీలో నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ

నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ నేతృత్వంలో నేతలు, కార్యకర్తలు పట్టణ వీధులో నిరసన ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయానికి ప్రదర్శనగా వెళ్లి డెప్యూటీ తహసీల్దార్ అలేటి మాధవికి అంబటి మురళీకృష్ణ వినతి పత్రం అందజేశారు. పేద విద్యార్లులకు అన్యాయం, ప్రజలకు నష్టాన్ని కలిగించే ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణను నిలిపే విధంగా ప్రజల ఆవేదనను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని ఆయన కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనారిటీ కమిషన్ సభ్యులు షేక్ సైపుల్లా, వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షులు డాక్టర్ ఎన్. రూత్‌రాణి, యువజన విభాగం సంయుక్త కార్యదర్శి అమిరినేని సాంబశివరావు, జిల్లా అధికార ప్రతినిధి ఎండేటి వెంకట సుబ్బయ్య పాల్గొన్నారు.

క్లుప్తంగా

బంగారం,నగదు చోరీ కేసులో వ్యక్తి అరెస్ట్

లక్ష్మీపురం: గదిలో అద్దెకు ఉంటూ ఇంటి యజమాని లేని సమయంలో నకిలీ తాళాలతో ఇంట్లోకి చొరబడి బీరువాలోని 10 సవర్ల బంగారం, రూ.15వేలు చోరీ చేసిన ఘటనలో అరండల్‌పేట పోలీసులు బుధవారం ఓ వ్యక్తిని అరెస్ట్ చేశారు. అరండల్‌పేట పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెస్ట్ డీఎస్పీ కె.అరవింద్ వివరాలను వెల్లడించారు. శారదా కాలనీ 2వ లైన్‌కు చెందిన పల్లా శ్రీనివాసరావు ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పని చేస్తుంటారు. అదే ఇంట్లో ఓ గదిలో ఒంగోలు ప్రాంతానికి చెందిన గట్టి రాజశేఖర్ క్యాటరింగ్ పనులు చేస్తూ జీవనం సాగిస్తుంటాడు. అయితే, పల్లా శ్రీనివాసరావు అక్టోబర్ 30న కుటుంబ సభ్యులతో కలిసి చెన్నై వెళ్లారు. తిరిగి ఈనెల 10న ఇంటికి వచ్చి చూసే సరికి బీరువాలో 10 సవర్ల బంగారం, రూ.15వేలు చోరీకి గురి అయినట్లు గుర్తించారు. పల్లా శ్రీనివాసరావు అరండల్‌పేట పోలీస్ స్టేషన్‌లో ఇంట్లో అద్దెకు ఉంటున్న గట్టి రాజశేఖర్‌పై అనుమానం వ్యక్తం చేస్తూ ఫిర్యాదు చేశారు. పోలీసులు రాజశేఖర్‌ను విచారించగా నేరాన్ని అంగీకరించాడు. ఇంటి తలుపునకు పెట్టిన తాళం చెవిని దొంగతనంగా తీసుకు వెళ్లి నకిలీది చేయించినట్లు చెప్పాడు.

ల్యాప్ ట్యాప్ స్వాధీనం

కొరిటిపాడు నాయుడుపేట ప్రాంతానికి చెందిన చిలకా మౌనిక ఇంట్లో గత నెల 26న ల్యాప్ ట్యాప్ చోరీ అయింది. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు పల్లా శ్రీనివాసరావు ఇంట్లో బంగారం చోరీ చేసిన రాజశేఖర్‌ను తమదైన శైలిలో విచారించగా ల్యాప్ ట్యాప్ చోరీ చేసినట్లు ఒప్పుకున్నాడు. అతడి నుంచి పోలీసులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

న్యూమోనియా రహిత సమాజ స్థాపనే లక్ష్యం

జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, అధికారులు

గుంటూరు వెస్ట్: న్యూమోనియా రహిత సమాజ స్థాపనే లక్ష్యంగా వైద్యాధికారులు సిబ్బంది, పని చేయాలని జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా తెలిపారు. కలెక్టరేట్‌లో బుధవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ విజయలక్ష్మి, జిల్లా వ్యాధినిరోధక టీకాల అధికారి డాక్టర్ ఏ. శ్రవణ్‌బాబుతో కలసి వ్యాధిపై అవగాహన పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు.అనంతరం మాట్లాడుతూ ఏటా నవంబర్12న ప్రపంచ న్యూమోనియా దినోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నవంబర్12 నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి 28 వరకు న్యూమోనియా లక్షణాలను త్వరగా గుర్తిద్దాం.. పిల్లల బాల్యాన్ని ఊపిరి పీల్చుకోనిద్దాం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కలెక్టర్ చెప్పారు.

సజావుగా ధాన్యం, పత్తి కొనుగోలు చేపట్టాలి

జిల్లాలో రైతుల నుంచి ధాన్యం , పత్తి కొనుగోలు సజావుగా జరిగేలా అధికారులు ముందస్తు చర్యలు పటిష్టంగా తీసుకోవాలని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో బుధవారం ధాన్యం, పత్తి కొనుగోలు పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆమె ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో రైతు సేవా కేంద్రాలు, పౌర సరఫరాల సంస్థ ద్వారా ధాన్యం కొనుగోళ్లు, సీసీఐ ద్వారా పత్తి కొనుగోళ్లపై సంబంధిత శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ధాన్యం సేకరణలో రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అవసరమైన గోనె సంచులు ముందస్తుగానే రైతు సేవ కేంద్రాల్లో ఏర్పాటు చేయాలని రైస్ మిల్లర్లకు సూచించారు. జీపీఎస్ అమర్చిన వాహనాలు మాత్రమే ధాన్యం రవాణా కోసం ఉపయోగించాలని తెలిపారు. వివరాలను ముందస్తుగా పోర్టల్ లో నమోదు చేయాలని పేర్కొన్నారు. జిల్లాలో తాడికొండ, ఫిరంగిపురం, ప్రత్తిపాడు, గుంటూరులలో పత్తి కొనుగోలు కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. , ప్రత్తిపాడులో కూడా ప్రారంభించనున్నట్లు చెప్పారు. తేమ శాతం 12 కన్నా తక్కువ ఉన్న కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకోవచ్చని ఆమె రైతులకు సూచించారు. కార్యక్రమంలో జేసీ అశుతోష్ శ్రీవాత్సవ తదితరులుపాల్గొన్నారు.

అత్యాచారానికి పాల్పడిన న్యాయవాదిపై కేసు నమోదు

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్) : మనస్పర్ధలతో భర్తకు దూరం అయిన ఓ మహిళకు విడాకులు ఇప్పించి వివాహం చేసుకుంటా అంటూ మోసం చేసి, అత్యాచారానికి పాల్పడిన న్యాయవాదిపై బుధవారం రాత్రి నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీనివాసరావుపేట 7వ లైన్ ప్రాంతానికి చెందిన మహిళకు అదే ప్రాంతానికి చెందిన శ్రీనివాసరావుతో 2003లో వివాహమైంది. 2020లో భార్యాభర్తల మధ్య మనస్పర్ధల రావడంతో విడిగా ఉంటున్నారు. న్యాయస్థానంలో కేసు నడుస్తున్న నేపథ్యంలో న్యాయవాది అర్షద్ అహమ్మద్ ఇద్దరికీ విడాకులు ఇప్పించాడు. అనంతరం ఆమెను వివాహం చేసుకుంటా అని చెప్పి శారీరకంగా లొంగ దీసుకున్నాడు. ఈ క్రమంలో అర్షద్ అహమ్మద్‌కు వివాహం అయినట్లు తెలిసి నిలదీయడంతో, రెండో వివాహం చేసుకుంటానంటూ మోసం చేశాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు న్యాయవాదిపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేకాట ఆడుతూ పట్టుబడిన ఏఎస్ఐ, హెచ్‌సీలు సస్పెన్షన్

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): పేకాట ఆడుతూ పట్టుబడిన ఒక ఏఎస్ఐ, ఇద్దరు హెడ్ కానిస్టేబుళ్లను జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ సస్పెండ్ చేశారు. కొద్ది రోజుల కిందట పెదకాకాని పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ హోటల్‌లో పోలీసులు మద్యం తాగుతూ, పేకాట ఆడుతూ టాస్క్‌ఫోర్స్‌కు చిక్కారు. దీనిపై ఎస్పీ సమగ్రంగా విచారించారు. సస్పెండ్ అయిన వారిలో పెదకాకాని పీఎస్ ఏఎస్ఐ కె.వెంకటరావు, తుళ్లూరు ట్రాఫిక్ పీఎస్ హెచ్‌సీ సీహెచ్.రాధాకృష్ణ, తుళ్లూరు పీఎస్ హెచ్‌సీ ఆర్.రాజేంద్రప్రసాద్ ఉన్నారు. చట్టవ్యతిరేక కార్యకలాపాల్లో పాల్గొన్న, వాటికి సహకరించిన ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేదిలేదని జిల్లా ఎస్పీ హెచ్చరించారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

భరత్ చంద్ర కోర్టులో లొంగుబాటు

గుంటూరు లీగల్: చంద్రబాబు సర్కార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తిపై మంగళగిరి సీఐడీ పోలీసులు ఇటీవల కేసు నమోదు చేశారు. యూరియా కొరతపై రైతులను ఉద్దేశించి చంద్రబాబు నాయుడు చేసిన వ్యాఖ్యలను భరత్ చంద్ర ఫేస్‌బుక్, యూట్యూబ్‌లలో తప్పుడు ప్రచారం చేశాడనే ఆరోపణతో సీఐడీ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో భరత్ చంద్ర బుధవారం సీఐడీ కోర్టులో న్యాయమూర్తి ముందు లొంగిపోయాడు. విచారణ అనంతరం ఆరో జూనియర్ సివిల్ జడ్జి రిమాండ్‌కు పంపారు.

కిట్స్ చైర్మన్ కోయి సుబ్బారావుకు డాక్టరేట్

ప్రదానం చేసిన మాస్ట్రో గ్లోబల్ యూనివర్సిటీ

ప్రత్తిపాడు: విద్యా రంగంలో విశిష్ట సేవలందిస్తున్న కిట్స్ కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావుకు మలేషియా, అమెరికాలకు చెందిన మాస్ట్రో గ్లోబల్ యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. దీంతో పాటు ఆచార్య అవార్డు విభాగంలోనూ భారత్ ఎడ్యుకేషన్ ఎక్సలెన్స్–2025 అవార్డును కూడా ప్రదానం చేశారు. ఈ సందర్భంగా గుంటూరులోని గొట్టిపాటి కల్యాణ మండపంలో బుధవారం అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, ఆర్‌వీఆర్ కళాశాల కరస్పాండెంట్ అండ్ సెక్రెటరీ రాయపాటి గోపాలకృష్ణ, మలినేని పెరుమాళ్ల (గ్రూప్ చైర్మన్ మలినేని పెరుమాళ్లు, జేకేసీ షటిల్ ఫ్రెండ్స్, బీఎస్‌ఆర్ స్కూల్ అధినేత జి. సాంబశివరావులు సుబ్బారావును ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు దక్కిన ఈ అరుదైన గౌరవం కిట్స్ విద్యా సంస్థల సిబ్బందికి, విద్యార్థులకు దక్కినదిగా భావిస్తున్నానని చెప్పారు. కిట్స్ కళాశాల సెక్రటరీ కోయి శేఖర్ మాట్లాడుతూ విద్యాసంస్థలు ప్రారంభించిన నాటి నుంచి వేల మంది విద్యార్థులను దేశ విదేశాల్లో ఉన్నతస్థానాల్లో స్థిరపడేలా నిర్విరామ కృషి చేసిన దార్శనికుడు సుబ్బారావు అని కొనియాడారు. అనంతరం చైర్మన్‌ను కళాశాల ప్రిన్సిపాల్ పి. బాబు, డైరెక్టర్ కె. హరిబాబు, కళాశాల సిబ్బంది ఘనంగా సత్కరించారు.

బీపీఎస్‌కు దరఖాస్తుల స్వీకరణ

నెహ్రూ నగర్: అనుమతి లేకుండా, ప్లానుకు భిన్నంగా ఈ ఏడాది ఆగస్ట్ 31వ తేదీలోపు నిర్మించిన భవనాలను బీపీఎస్(బిల్డింగ్ పీనలైజేషన్ స్కీం) ద్వారా క్రమబద్ధీకరణకు అవకాశం కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం జీఓ ఎంఎస్ నం.225 జారీ చేసిందని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్తర్వులు జారీ చేసిన నాటి నుంచి 120 రోజులు మాత్రమే ఆన్‌లైన్ లో దరఖాస్తులు స్వీకరణ ఉంటుందని పేర్కొన్నారు. డిసెంబర్ 1, 1997కి ముందు నిర్మాణం చేసిన భవనాలకు పీనల్ చార్జీల్లో 25 శాతం రాయితీ, 60 చదరపు గజాల్లో జీ ప్లస్ ఒన్ నివాస భవనాలకు మినహాయింపుని ప్రభుత్వం కల్పించిందని తెలిపారు. నగరపాలక సంస్థ లైసెన్స్ పొందిన ఇంజినీర్ల ద్వారా భవనం ప్లాన్, దస్తావేజులు, పన్ను రశీదు, ఈసీ, మార్కెట్ వ్యాల్యూ సరిఫికెట్, గతంలో ఉన్న భవన ప్లాన్, ప్రస్తుత భవనం పాటోలు రెండు, అండర్ టేకింగ్ లెటర్స్‌తో పాటు రూ.10 వేల చలానా చెల్లించి ఆన్‌లైన్ లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. అనుమతి లేని లేఅవుట్‌లో నిర్మాణం చేసిన భవనాలకు కూడా ఎల్ఆర్ఎస్ పీనల్ చార్జీలు చెల్లించి, ఎల్ఆర్ఎస్ నిబంధనలకు లోబడి క్రమబద్ధీకరించుకోవచ్చని తెలిపారు. నగర ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఇప్పటికే ప్లాన్ లేకుండా అనధికారికంగా చేసున్న నిర్మాణాలను తొలగిస్తున్నామని కమిషనర్ పేర్కొన్నారు.

అక్రమ లే అవుట్ ధ్వంసం

తాడికొండ: ఏపీ సీఆర్డీఏ పరిధిలోని నందిగామ జోన్‌లో కంచికచర్ల మండలం పరిటాలలో అనుమతి లేని లే అవుట్‌ను తొలగించినట్లు కమిషనర్ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. సర్వే నంబర్ 468(పి)లోని 1.50 ఎకరాలలో ప్రభుత్వం నుంచి అనుమతులు తీసుకోకుండా వేసిన అక్రమ లే అవుట్‌లో రోడ్డును తవ్వేనట్లు పేర్కొంది. సదరు అనధికార లే అవుట్‌లో ప్లాట్లు కొనవద్దని, మౌలిక సదుపాయాలకు ఇబ్బందులు తప్పవని ప్రజల్ని హెచ్చరించింది. సీఆర్డీఏ నుంచి అనుమతి పొందిన లే అవుట్లలో మాత్రమే ప్లాట్లు కొనుగోలు చేసుకోవాలని సూచించింది. ఎక్కడైనా అనధికారి లే అవుట్లు, అనధికారిక కట్టడాలు ఉంటే వాట్సాప్ నంబర్ 7095599838 లేదా ఫోన్ 0866-2527154కు సమాచారం అందించాలని కోరింది.

విశ్రాంత అధ్యాపకుడు వీర ప్రకాశరావు మృతి

తెనాలి: తెనాలికి చెందిన విశ్రాంత అధ్యాపకుడు, పాత్రికేయుడు కొడాలి వీరప్రకాశరావు (86) నందులపేటలోని స్వగృహంలో బుధవారం ఉదయం గుండెపోటుతో మృతి చెందారు.ఆయనకు భార్య విజయలక్ష్మి, కుమార్తె నల్లూరి భువన, అల్లుడు భాను సురేంద్ర ఉన్నారు. ప్రకాశరావు సొంతూరు పెదరావూరు. తెనాలిలోనే స్థిరపడ్డారు. కాలేజీలో అధ్యాపకుడిగా పనిచేసి, పాతికేళ్ల క్రితమే రిటైరయ్యారు. దాదాపు రెండు దశాబ్దాలు ఒక దినపత్రిక రిపోర్టరుగా పని చేశారు. మున్సిపాలిటీలో అవినీతిపై రాసిన కథనానికి అప్పట్లో ఆయనపై కేసు నమోదైంది. కోర్టు విచారణలో కొట్టేశారు. 1991లో చుండూరు మారణకాండ తర్వాత వార్తల కవరేజీ సమయంలో దళిత ఉద్యమకారులతో పాటు ప్రకాశరావు పైనా పోలీసులు కేసు నమోదుచేశారు. కోర్టు విచారణతో నిర్దోషిగా రుజువు చేసుకున్నారు. పాత్రికేయ వృత్తిలోంచి బయటకొచ్చాక మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు వద్ద పీఆర్వోగా కొంతకాలం పనిచేశారు. తెనాలికి చెందిన రాజకీయ నాయకులు అందరితోనూ ప్రకాశరావు మంచి స్నేహ సంబంధాలు ఉండేవి. అమెరికాలో ఉంటున్న ఆయన కుమార్తె, అల్లుడు రావాల్సి ఉన్నందున అంత్యక్రియలు 14వ తేదీ ఉదయం జరుగుతాయని కుటుంబసభ్యులు తెలియజేశారు.సమాచారం తెలిసిన వెంటనే మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ మాజీ చైర్మన్ మారొతు సీతారామయ్య, తుమ్మల రాఘవరావు, సహ అధ్యాపకులుగా పనిచేసిన తాళ్లూరి సుబ్బారావు, పాటిబండ్ల విజయలక్ష్మి, నన్నపనేని సుగుణ, పట్టణా నికి చెందిన పలువురు భౌతికకాయాన్ని సందర్శించి శ్రద్ధాంజలి ఘటించారు.

అదనంగా 264 పోలింగ్ కేంద్రాల ఏర్పాటు

- జిల్లా రెవెన్యూ అధికారి షేక్ ఖాజావలి
- ప్రతిపాదనలు సిద్ధం

సమావేశంలో మాట్లాడుతున్న షేక్ ఖాజావలి

గుంటూరు వెస్ట్: జిల్లాలో రేషనలైజేషన్ ద్వారా అదనంగా 264 పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేశామని జిల్లా రెవెన్యూ అధికారి షేక్ ఖాజావలి వెల్లడించారు. స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో బుధవారం అధికారులు, రాజకీయపార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు 1200 మంది కంటే అధికంగా ఉన్న పోలింగ్ కేంద్రాలను నిర్దేశిత మార్గదర్శకాలు ప్రకారం రేషనలైజేషన్ చేయాలని తెలిపారు. ఇందులో భాగంగా అదనపు పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలను సిద్ధం చేసినట్లు చెప్పారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో 264 అదనపు పోలింగ్ కేంద్రాల ఏర్పాటుతో పాటు ఒకదాన్ని సమీప కేంద్రంలో కలిపి వేయడానికి ప్రతిపాదించామని వివరించారు. దీంతో గతంలో జిల్లాలో ఉన్న 1920 పోలింగ్ కేంద్రాలు 2183కు పెరుగుతాయని పేర్కొన్నారు. సమావేశంలో ఈఆర్వోలు డెప్యూటీ కలెక్టర్ గంగరాజు, జీఎంసీ అదనపు కమిషనరు చల్లా ఓబులేసు, ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ మల్లేశ్వరి పాల్గొన్నారు.

మహిళతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తికి జైలుశిక్ష

తెనాలి రూరల్: ఇంట్లోకి రాత్రిపూట ప్రవేశించి మహిళతో అసభ్యంగా ప్రవర్తించిన కేసులో నిందితుడికి జైలుశిక్ష , జరిమానా విధిస్తూ బుధవారం న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బాపట్ల జిల్లా కొల్లూరు మండలం తాడిగిరిపాడుకు చెందిన తుల్లిమిల్లి క్రీస్తురాజు 2022 ఏప్రిల్ 28 రాత్రి ఇంటి సమీపంలోని మరో ఇంట్లోకి అక్రమంగా ప్రవేశించి, మహిళతో అసభ్యంగా ప్రవర్తించాడు. ఆమెతో పాటు కుటుంబ సభ్యులు కేకలు వేయడంతో పారిపోయాడు. మహిళ పోలీసులను ఆశ్రయించింది. అప్పటి కొల్లూరు ఏఎస్ఐ కె. బాబూరావు కేసు నమోదు చేయగా, ఎస్ఐ జె. శామ్యూల్ రాజీవ్ కుమార్ చార్జిషీట్ దాఖలు చేశారు. కేసు బుధవారం విచారణకు రావడంతో సాక్ష్యాధారాలను పరిశీలించిన ప్రిన్సిపల్ సివిల్ జడ్జి(జూనియర్ డివిజన్) ఆకా పవన్‌కుమార్ నిందితుడికి నెల రోజుల జైలు శిక్ష, రూ. వెయ్యి జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరపున సీనియర్ ఏపీపీ పరిశపోగు సునీల్‌కుమార్ వాదించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

■ B.Sc. అగ్రికల్చర్-4సం॥ ; B.Sc. Forensic/ Cyber Forensic Science - 3 yrs ; BBA-AVIATION Mgt - 3 yrs. Good Internships & Jobs in VIJAYAWADA. - Ph: 99121 78237

■ BPT (Physiotherapy); B.Sc.Med. Lab.Tech; DIPLOMA in MLT, ANAESTHESIA, CARDIOLOGY, RADIOGRAPHY, O.T. Tech, Dialysis, Imaging. 100% Jobs. Scholarships & Free Seats to SC/ST/BC Students- VIJAYAWADA. Ph: 79959 45835.

REAL ESTATE

PLOT FOR SALE

■ కొలనుకొండ, జయభేరి కన్‌స్ట్రక్షన్ దగ్గర, KIA షోరూం పక్కన, 918 చ.గ. తూర్పు (హైవే) ఫేస్ త్రికోణకారంలో ఉన్న స్థలము అమ్మకము. సంప్ర॥ ✆ 99662 28370

SERVICES

GOLD FINANCE

■ బంగారం బ్యాంకులలో / ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) ఫోన్ : 81422 92071

■ బంగారం కొనబడును. బ్యాంకులలో ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకి తీసుకుంటాం, ✆ 88024 89999

■ బంగారం కొనబడును. బ్యాంకులలో ఇతర ప్రైవేటుసంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకు కొనబడును. (స్పాట్‌క్యాష్) సంప్ర॥ ✆ 8790741166

TOURS & TRAVELS

■ ఇండియన్ రైల్వేస్ -శబరిమల మరియు అరుణాచలానికి ప్రత్యేక రైలు, 10.12.25 న ప్రారంభం. రూ. 8,500 - 2SL, 3AC, 2AC, 1AC కలవు. వివరాలకు 93550 21516 www.tourtimes.in

WANTED

■ రుమాలి రోటీ పుల్కా చేయుటకు మాస్టర్స్ మరియు ఇండియన్ అసిస్టెంట్స్ మా రెస్టారెంటు నందు కావలెను. గుంటూరు సంప్రదించండి. 8712277968

■ 10th చదివిన షాప్‌లో డెలివరీ బాయ్స్ మరియు Tally అనుభవం కలిగి సేల్ డేటా ఎంట్రీతో పాటు గుమస్తా వర్క్ చేయుటకు కావలెను. 8142842888, 8639348560

■ గుంటూరు మాస్టర్‌మైండ్స్ కాలేజి నందు క్లాసు ఇన్‌ఛార్జ్‌స్, హాస్టల్ ఇన్‌ఛార్జ్‌స్, వార్డెన్స్‌గా పనిచేయుటకు పురుషులు కావలెను. జీతము: 12000/- నుండి 15000/- వరకు ఇవ్వబడును. (ఉచిత భోజనము, వసతి కల్పించబడును) విద్యా అర్హతలు: ఇంటర్ మరియు డిగ్రీ, వయస్సు: 22 సంవత్సరముల పైన ఉండవలెను. వివరముల కొరకు సంప్రదించగలరు: ఫోన్ నెంబర్: 89784 80429

■ గుంటూరు పరిసర ప్రాంతాలలోని ప్రముఖ పారిశ్రామిక సంస్థలలో మా సంస్థ తరుపున పని చేయుటకు అనుభవము కలిగిన సెక్యూరిటీ సూపర్ వైజర్లు, సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. సూపర్‌వైజర్స్ అర్హతలు: వయస్సు:30-45సం,ఇంటర్/ డిగ్రీ, ఎత్తు: 05'-06" పైన, రిటైర్డ్ ఆర్మీ, పారా మిలిటరీ వారికి ప్రాధాన్యత. గార్డ్ అర్హతలు: వయస్సు:23-45 సం, 10th,ఎత్తు: 05'-05"పైన లేబర్ యాక్ట్ ప్రకారం జీతం ఉదయం 11 గం.నుండి మీ ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో సం: సత్యా ఇన్వెస్టిగేషన్&సెక్యూరిటీ సర్వీసెస్,బృందావన్ గార్డెన్స్, స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రక్కన, గుంటూరు. 7095125556, 0863-2951838

■ గుంటూరు కొత్తపేటలోని హాస్పటల్ నందు ANM, GNM M/F Work అనుభవం ఉన్న నర్సింగ్ స్టాఫ్, నర్సింగ్ ఇన్‌చార్జ్ Female కావలెను. 7997777108

■ అమరావతిలో పని చేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ & సూపర్‌వైజర్స్ కావలెను. వెంటనే సంప్రదించండి. శ్రీ రాజరాజేశ్వరి సెక్యూరిటీ సర్వీసెస్. 9346138743, 8008202789

■ ఎలక్ట్రికల్ ఆటోలు & ట్రాక్టర్లుకు గుంటూరు జిల్లాలో బ్రాంచిల కొరకు 1.సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ Q:ఏదైనాడిగ్రీ (ఫ్రెషర్స్ / అనుభవం ఉన్న వారు) 2. సర్వీస్ టెక్నీషియన్స్ ITI/ ఎలక్ట్రికల్ బ్యాక్‌గ్రౌండ్ (ఫ్రెషర్స్/ అనుభవం ఉన్న వారు) కావలెను. నం. 80089 31038, 91338 65966, hr.shreelakshmi infraequipments@gmail.com

■ తెనాలి దగ్గర దుగ్గిరాల లో ప్రముఖ కాఫీ పరిశ్రమకు సాధారణ ఎంప్లాయిస్, ప్యాకింగ్ బాయ్స్ & సెక్యూరిటీ గార్డ్స్ కావలెను రూమ్ & కాంటీన్ సౌకర్యం ✆ 7093924466, 8096161777

సాక్షి క్లాసిఫైడ్స్ గుంటూరు ప్యాక్ రూ. 475/- మాత్రమే
ప్రతి అదనపు లైను రూ. 100 మాత్రమే
ప్రతి 3 ప్రకటనలకు 2 ప్రకటనలు
గుంటూరు
7075167663
7075167541

SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

స్ట్రెస్డ్ అసెట్స్ రికవరీ బ్రాంచి, 3వ అంతస్తు, కెనరా మేడపైన, సూర్యప్రకాష్ స్క్వేర్, గురునానక్ నగర్ రోడ్డు, ఎన్.టి.ఆర్.జిల్లా, విజయవాడ - 520008. ఆంధ్రప్రదేశ్. ఫోన్ :0866-2546922

అధీకృత అధికారి వివరములు : పేరు : శ్రీ పి. శ్రావణ్ కుమార్ (చీఫ్ మేనేజర్), మొబైల్ నెం. : 81217 65139
ఆస్తి తనిఖీ కొరకు : 8332835007

Appendix – IV –A
[See Proviso to Rule 8(6) R/w Rule 9(1)]

స్థిరాస్తుల అమ్మకం కొరకు అమ్మకం ప్రకటన

(సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 8(6)కు రూల్ 9(1) లోని నిబంధనలతో చదువుకోవలసిన సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకము కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన)

సెక్యూర్డ్ క్రెడిటార్ స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా (సెక్యూర్డ్ క్రెడిటార్) వారికి ఋణగ్రహీత: శ్రీ గొరిశెట్టి దినేష్, తండ్రి : గొరిశెట్టి మాధవరావు, హెచ్ నెం.1-115, రామాలయం గుడి దగ్గర, ముక్కపర్రు గ్రామం, కృష్ణా జిల్లా-521324. వేరొక చిరునామా: శ్రీ గొరిశెట్టి దినేష్, తండ్రి : గొరిశెట్టి మాధవరావు, ఫ్లాట్ నెం.203, లక్ష్మి నందన అపార్ట్‌మెంట్స్, మిర్చి యార్డు పడమర, నల్లపాడు రోడ్డు, సీతారామ నగర్, గుంటూరు. వేరొక చిరునామా: శ్రీ గొరిశెట్టి దినేష్, తండ్రి : గొరిశెట్టి మాధవరావు, ఫ్లాట్ నెం.209, లక్ష్మి నందన అపార్ట్‌మెంట్స్, మిర్చి యార్డు పడమర, నల్లపాడు రోడ్డు, సీతారామ నగర్, గుంటూరు. వారు డిమాండ్ నోటీసు తేదీ.18-09-2021 ప్రకారం తేదీ.17-09-2021 నాటికి చెల్లించవలసిన బకాయి మొత్తము రూ.78,57,087.32 పై (అక్షరాల డెబ్బై ఎనిమిది లక్షల యాభై ఏడు వేల ఎనభై ఏడు రూపాయల ముప్పై రెండు పైసలు మాత్రమే) + తేదీ. 18.09.2021 నుండి తదుపరి వడ్డీ, కాస్ట్స్ మరియు ఇతర ఖర్చులు, ఛార్జీలు మొదలగునవి (తదుపరి జమలు ఉన్నచో తీసివేయబడును) వసూలు కొరకు సెక్యూర్డ్ క్రెడిటార్ అయిన స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా యొక్క అధీకృత అధికారి వారిచే భౌతిక స్వాధీనత పరుచుకోబడిన బ్యాంక్ తనఖాలో నున్న దిగువ వివరించిన స్థిరాస్తి "ఎక్కడ ఎలా ఉన్నది అలానే" ఏది ఎలా వుంటే అలానే" "అక్కడ ఏది ఉన్నదో అది" మరియు "రీకోర్స్ లేకుండా" పద్ధతిపై" తేది. 01-12-2025న విక్రయించబడునని యావన్మంది ప్రజానీకమునకు మరియు ప్రత్యేకంగా ఋణగ్రహీతకు ఇందుమూలముగా సూచించటమైనది.

షెడ్యూలు ఆస్తుల వివరములు

డాక్యుమెంట్ నెం.7911/2019, తేదీ.23.12.2019 ప్రకారం శ్రీ గొరిశెట్టి దినేష్ గారు తనఖా పెట్టిన స్థిరాస్తి: షెడ్యూల్-ఎ: గుంటూరు జిల్లా, నల్లపాడు సబ్ డిస్ట్రిక్ట్, గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ ఏరియా పరిధి, గుంటూరు, అంకిరెడ్డిపాలెం గ్రామం, మిర్చి యార్డు పడమర,సీతారామ నగర్, నల్లపాడు రోడ్డు, నమోదు డోర్ నెం.25-16-268, డి.నెం.125/ఏలోని మొత్తం ఎ.4-46 సెంట్ల విస్తీర్ణంలో ఎ.1.04.3/4 సెంట్లలో 2516.8 చ॥గ॥ల స్థలం అందు లక్ష్మి నందన. హద్దులు: తూర్పు: సర్కారు డొంక, దక్షిణం: బిల్డర్స్ అపార్ట్‌మెంట్ వారి ఆస్తి, పడమర: మెట్టు రామిరెడ్డి గారి ఆస్తి, ఉత్తరం: సుధ రామయ్య మరియు ఇతరులకు చెందిన ఆస్తి.

పైన తెలిపిన హద్దుల మధ్యగల 2516.8 చ॥గ॥లు లేదా 2104.37 చ॥మీ॥ల స్థలం మరియు అన్ని సదుపాయములు, రుణమెంటరీ హక్కులతో సహా గల ఆస్తి.

షెడ్యూల్-బి: పైన తెలిపిన షెడ్యూల్-ఏలోని స్థలంలో 44 చ॥గ॥లు లేదా 36.78 చ॥మీ॥ల అవిభాజ్యపు మరియు అనిర్దేశపు అమ్మకందారుని వాటాతో గల స్థలం అందు నిర్మించిన లక్ష్మి నందన అపార్ట్‌మెంట్ నందు మొదటి అంతస్తులో 1236 చ॥అ॥ల పరిధిలో పూర్తి కాని ఫ్లాట్ నెం.203 (కామన్ ఏరియాలు మరియు ఒక కార్ పార్కింగ్ ఏరియాలతో కలిపి) (ప్లింత్ ఏరియా 933 అ॥ల). హద్దులు: తూర్పు: మెట్లు మరియు ఈ ఫ్లాట్‌కు మరియు ఫ్లాట్ నెం.202కు మధ్యగల ఓపెన్ టు స్కై, దక్షిణం: ఓపెన్ టు స్కై పడమర: లిఫ్ట్ మరియు ఈ ఫ్లాట్‌కు మరియు ఫ్లాట్ నెం.204కు మధ్యగల ఓపెన్ టు స్కై, ఉత్తరం: 6.6 అ॥ల వెడల్పు కామన్ కారిడార్.

పైన తెలిపిన హద్దుల మధ్యగల స్టిల్ట్, క్రింద అంతస్తు, మొదటి అంతస్తులతో కూడిన లక్ష్మి నందన అపార్ట్‌మెంట్ నందు మొదటి అంతస్తులో అసంపూర్ణంగా నిర్మించబడిన ఫ్లాట్ నెం.203 అన్ని సదుపాయములు మరియు రుణమెంటరీ హక్కులు మరియు స్టిల్ట్ ఫ్లోర్ నందు కేటాయించబడిన ఒక కార్ పార్కింగ్ ఏరియాతో సహా గల ఆస్తి. (డాక్యుమెంట్ నెం.7911/2019, తేదీ.23.12.2019 ప్రకారం).

రిజర్వు ధర : రూ.22,00,000/- ధరావత్తు : రూ.2,20,000/- బిడ్ పెంపుదల : రూ.10,000/-

ఇ-వేలం తేదీ : 01-12-2025, సమయము : ఉ॥ 11.00 గంటల నుండి సా॥ 04.00 గంటల వరకు

[illegible]

గురించి సర్వీసు ప్రొవైడర్ M/s. PSB Alliance & M/s. Baanknet యొక్క ఇ-వేలం పోర్టల్ : https://baanknet.com/eauction-psb/x-login & https://baanknet.com & టోల్ ఫ్రీ ఫోన్ నెం.: 91 - 8291220220, Mail ID : support.baanknet@psballiance.comను సంప్రదించండి.

2) ఆస్తిని రిజిస్ట్రేషన్ చేసుకొనుటకు వర్తించే స్టాంపు డ్యూటీలు ఇదిలే ఛార్జీలు, ఫీజు వగైరా మరియు చట్టపరమైన/నాన్ స్టేటుటరీ బకాయిలు, పన్నులు, రేట్లు, అసెస్‌మెంట్ ఛార్జీలు, ఫీజులు వగైరా కొనుగోలు దారే భరించవలెను.

గమనిక : ఆసక్తి గల బిడ్డర్లు ఇ-వేలం ముగిసేలోపు PSB Alliance నందు ప్రీ-బిడ్ ఇ.ఎమ్.డి (Pre-Bid EMD) జమ చేయవలెను. ప్రీ-బిడ్ ఇ.ఎమ్.డి మొత్తం PSB Alliance బ్యాంక్ అకౌంట్‌లో జమ అయిన సమాచారం వెబ్‌సైట్‌లో పొందుపరిచిన తరువాత మాత్రమే బిడ్డరు యొక్క 'వాలెట్'లో చూపించబడుతుంది. బ్యాంకింగ్ ప్రక్రియలో ఇది జరుగుటకు సమయం పట్టవచ్చు, కావున బిడ్డర్లు చివరి నిముషంలో ఇబ్బందులు ఎదుర్కొనకుండా తమ ప్రీ-బిడ్ ఇ.ఎమ్.డీను సాధ్యమైనంత త్వరగా జమ చేసుకోవాలని సూచించటమైనది.

తేదీ: 12-11-2025, ప్రదేశం: విజయవాడ సం/- అధీకృత అధికారి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

కెనరా బ్యాంక్ Canara Bank

ఎ ఆర్ ఎమ్ బ్రాంచ్, సర్కిల్ ఆఫీసు, డి.నెం. 54-15-4ఎ, క్రింది అంతస్తు, లక్ష్మి అవెన్యూ, శ్రీనివాసనగర్ బ్యాంక్ కాలనీ, రింగ్ రోడ్డు, విజయవాడ, ఏపీ-520008, ఫోన్: 8331011695, ఇ-మెయిల్: armvij@canarabank.com

స్థిరాస్తుల అమ్మకానికి వేలం అమ్మకం ప్రకటన

[illegible]

ఇ-వేలం తేది & సమయం: 28.11.2025, మ॥ 2.00 గం.ల నుండి సా॥ 4.00 గం.ల వరకు (అమ్మకం ముగిసేవరకు ప్రతి 5 నిమిషముల వ్యవధిలో అపరిమిత పొడిగింపుతో)

ధరావత్తు సమర్పించుటకు ఆఖరి తేది: 28.11.2025, మ॥ 12.00 గం॥ల లోపు

రిజర్వు ధరలో 10% ధరావత్తు సొమ్మును M/s. పీఎస్‌బి అలియన్స్ ప్రైవేట్ లిమిటెడ్ (baanknet) పోర్టల్ యొక్క ఇ-వ్యాలెట్‌లో నేరుగా గాని లేదా ఆ పోర్టల్‌లో చలానా జెనరేట్ చేసుకొని చలాన్‌లోని ఖాతా వివరములకు ధరావత్తును RTGS/NEFT ద్వారా తేది: 28.11.2025, మ॥ 12.00 గం॥ల లోపుగా పొందుపరిచి జమచేయాలి.

క్ర. నెం	ఋణగ్రహీతలు / హామీదారులు & బ్రాంచ్ వివరములు (అన్ని ఖాతాలు ఎ.ఆర్.ఎం బ్రాంచ్ విజయవాడకు బదిలీ చేయబడ్డాయి)	బకాయి మొత్తం	తనఖాలో ఉన్న ఆస్తి వివరములు	రిజర్వు ధర (రూ. లో)	ఇ.ఎం.డి (రిజర్వు ధరలో 10%)
1	గుంటూరు మెయిన్ బ్రాంచ్ M/s అనె మారియా ఎంటర్‌ప్రైజెస్, ప్రొప్రైటర్: శ్రీమతి [illegible]	రూ. 336.02 లక్షలు	ఆస్తి నెం.1: [illegible] తేది 29-05-1981 ప్రకారం 172.00 చ॥గ॥ [illegible]	రూ. 10.30 లక్షలు	రూ. 1.03 లక్షలు
			ఆస్తి నెం.2: గుంటూరు జిల్లా, ప్రత్తిపాడు సబ్-జిల్లా, [illegible] ఆర్.ఎస్. నెం.177/C నందు మొత్తం ఎ. 0.42 సెంట్లలోనున్న 239.40 చ॥గ॥ ఖాళీ స్థలం. హద్దులు డీడ్ ప్రకారం.	రూ.4.70 లక్షలు	రూ. 0.47 లక్షలు
			ఆస్తి నెం.3: గుంటూరు జిల్లా, ప్రత్తిపాడు సబ్ జిల్లా, [illegible] ఆర్.ఎస్. నెం.177/C నందు మొత్తం ఎ. 0.43 సెంట్లలోనున్న 1899.70 చ॥గ॥ ఖాళీ స్థలం. హద్దులు డీడ్ ప్రకారం.	రూ.27.55 లక్షలు	రూ. 2.755 లక్షలు

ఆస్తి తనిఖీ తేది & సమయం: 18.11.2025, ఉ॥ 11.00 గం॥ల నుండి సా॥4.00 గం॥ల వరకు.

అమ్మకానికి సంబంధించిన సవివరమైన నియమ నిబంధనలకు కెనరా బ్యాంక్ వెబ్‌సైట్ www.canarabank.com లో ఏర్పాటు చేసిన "ఇ-వేలం" లింకును రిఫర్ చేయండి లేదా కెనరా బ్యాంక్ ఎ.ఆర్.ఎం బ్రాంచ్, విజయవాడ అధీకృత అధికారి గారిని ఆఫీసు పనివేళలలో సంప్రదించగలరు. ఫోన్: 8331011695

❖ బ్యాంకుకు తెలిసిన/తెలియని బకాయిలు/టాక్స్‌లు ఏవైనా ఉన్నచో అవి వేలం కొనుగోలుదారే భరించాలి మరియు తుది బిడ్ మొత్తంతోపాటు అవి కూడా చెల్లించవలసి ఉంటుంది.

[illegible]

ఇ-వేలం విధానం, నియమ నిబంధనల కొరకు బిడ్డర్లు దయచేసి సర్వీసు ప్రొవైడర్ M/s. పీఎస్‌బి అలియన్స్ (baanknet), వెబ్‌సైట్ https://baanknet.com/eauction-psb ఫోన్: 7046612345/9354910172/8291220220/9892219848 / 8160205051, ఇ-మెయిల్: support.baanknet@psballiance.com

తేది: 10.11.2025, ప్రదేశం: విజయవాడ సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

క్లుప్తంగా

కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ ఇవ్వాలి

దుగ్గిరాల: భూ యజమానులతో సంబంధం లేకుండా కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ పథకం ఇవ్వాలని కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి మన్నవ నాగమల్లేశ్వరరావు అన్నారు. బుధవారం దుగ్గిరాల మండలం పెనుమూలి, పెదకొండూరు గ్రామాల్లో కౌలు రైతుల గ్రామ సభ నిర్వహించారు. కార్యక్రమంలో కె.పుల్లయ్య, బాబూరావు, జనార్ధనరావు, వీరరాఘవయ్య, రాజేను, వందనం, సుబ్బారావు, వెంకటేశ్వర్లు, సాంబయ్య, దయాసాగర్, తదితరులు పాల్గొన్నారు.

దాడి కేసులో ఇద్దరి అరెస్ట్

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలో వ్యక్తిపై మద్యం సీసాతో దాడి చేసిన ఘటనలో పోలీసులు ఇద్దరు వ్యక్తులను బుధవారం అరెస్ట్ చేశారు. సేకరించిన వివరాల ప్రకారం.. బైపాస్ రోడ్డులోని పెట్రోల్ బంక్ సమీపంలో మంగళవారం పాత కక్షల నేపథ్యంలో క్రిస్టియన్ పేటకు చెందిన ఇసుకపల్లి ప్రకాష్‌ను తాడేపల్లి బోసుబొమ్మ సెంటర్, సులభ్‌పేటకు చెందిన రౌడీషీటర్ అఖిల్ అలియాస్ బన్నీ, సాయి దాడికి పాల్పడి మద్యం సీసాతో పోడి చేందుకు ప్రయత్నించారు. అక్కడే విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ వారి ప్రయత్నాన్ని అడ్డుకుని ఇసుకపల్లి ప్రకాష్‌ను గాయాలు కాకుండా కాపాడారు. తాడేపల్లి పోలీసులకు నిందితులను అప్పగించగా ఎస్ఐ ప్రతాప్‌కుమార్ కేసు నమోదు చేసి అఖిల్, సాయిలను కోర్టుకు హాజరుపరిచారు.

రేపటి నుంచి జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని గాలిబాలిశాఖ గ్రంథాలయంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఈనెల 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు గ్రంథాలయాధికారి ఐడీ దుర్గారెడ్డి బుధవారం తెలిపారు. 14న బాలల దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు పాఠశాల పరిశుభ్రత గురించి చిత్రలేఖన పోటీ, 15న వ్యక్తిత్వ ప్రదర్శన, 'మనం.. మన ఆరోగ్యం' గురించి వ్యాసరచన నిర్వహిస్తామన్నారు. 16న కవిసమ్మేళనం, నీటి సమాజంలో గ్రంథాలయాల పాత్రపై వక్తృత్వ పోటీ, 17న విద్యార్థులకు మ్యూజికల్ చైర్ పోటీ, 18న జానపద గీతాలపై పాటల పోటీ, 19న బాలికలకు మెహిందీ పోటీ నిర్వహిస్తామని అన్నారు. 20న అర్థరాత్రి ఉద్యోతం, చదవడం మహోత్సవం నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేస్తామని పేర్కొన్నారు.

తాడేపల్లి రూరల్: తాడేపల్లి శాఖా గ్రంథాలయంలో ఈనెల14 నుంచి 20వ తేదీ వరకు 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ అధికారి షేక్ నాగూర్ బాషా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

మైక్రో ఫైలేరియా రక్తపరీక్షలు

తాడేపల్లి రూరల్: సులకపేట, డ్రైవర్స్ కాలనీ ప్రాంతాల్లో బుధవారం రాత్రి మైక్రో ఫైలేరియా రక్తపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా మలేరియా ఆఫీసర్ సుబ్బారాయన్ మాట్లాడుతూ.. జాతీయ కీటక జనిత నియంత్రణ వ్యాధుల్లో భాగంగా మైక్రో ఫైలేరియా నిర్ధారించడానికి రాత్రి సమయంలో పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. సుమారు 600 మందికి పైగా పరీక్షలు నిర్వహించామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మలేరియా అసిస్టెంట్ ఆఫీసర్ రాజనాయక్, గణేష్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అనుమతి లేని మట్టి తవ్వకాలపై జరిమానా

ఫిరంగిపురం: మండలంలోని అమీనాబాద్ ఫారెస్ట్ పరిధిని బుధవారం జిల్లా ఫారెస్ట్ అధికారి హిమశైలజ పరిశీలించినట్లు ఫారెస్ట్ బీట్ అధికారి సంతోష్‌కుమార్ తెలిపారు. అనుమతి లేకుండా మట్టిని సమీపంలోని రోడ్డుకు పోస్తున్న కొండారు వ్యక్తులు కనిపించారు. వారిని హిమశైలజ ప్రశ్నించగా తమకు రెవెన్యూ అనుమతి ఉందంటూ చెప్పారు. కాగా అనుమతి పత్రాలు చూపించక పోవడంతో వారికి రూ.60 వేలు జరిమానా విధించినట్లు ఆయన తెలిపారు. ఆమె వెంట ఫారెస్ట్ రేంజ్ అధికారి పోతురాజు, స్క్వాడ్ రేంజర్ సుబ్బారావు, డిప్యూటీ రేంజర్ వెంకటేశ్వరరావులు ఉన్నారు.

ఎస్ఏ–1 పరీక్షల పరిశీలన

మంగళగిరి టౌన్: ఎస్ఏ–1 పరీక్షల నేపథ్యంలో జిల్లా విద్యాశాఖ అధికారి సీవీ రేణుక మంగళగిరి నగర పరిధిలోని కేకే హైస్కూల్‌ను బుధవారం ఆకస్మికంగా విచ్చేశారు. పరీక్ష నిర్వహణ తీరును పరిశీలించారు. 10వ తరగతి విద్యార్థులతో మాట్లాడి పరీక్షల్లో పాటించాల్సిన నియమాలు, ఉత్తీర్ణతకు సలహాలను సూచించారు. పాఠశాల ప్రాంగణంలోని శుభ్రత, పారిశుధ్యాన్ని చూసి మెచ్చుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్య అధ్యక్షుడు చింతకింది కనకయ్య, సెక్రటరీ అంది కొండారెడ్డి రాజా చిరంజీవి, ప్రిన్సిపాల్ రత్నబాబు, ప్రధానోపాధ్యాయురాలు వరలక్ష్మి పాల్గొన్నారు.

ప్రైవేటీకరణపై ప్రజాగళం

- మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణపై కదిలిన విద్యార్థులు, తల్లిదండ్రులు
- భారీగా ర్యాలీలు, పాల్గొన్న వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు

ర్యాలీగా బయలుదేరిన వేమారెడ్డి, మురుగుడు, చిల్లపల్లి

తాడేపల్లి కుంచనపల్లిలో నిర్వహిస్తున్న బైక్ ర్యాలీ

డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మంగళగిరి టౌన్: ముఖ్యమంత్రి చంద్రబాబు తన అనుయాయులకు లబ్ధి చేకూర్చేందుకు కోట్లాది మంది రాష్ట్ర ప్రజల ఆరోగ్యంతో ఆటలాడేందుకు సిద్ధమయ్యారు. పేద విద్యార్థుల వైద్య విద్య కలను చిదిమేస్తూ నిరంకుశ నిర్ణయం తీసుకున్నారు. దీంతో బాబుపై పేద పిల్లలు, ప్రజానీకం కన్నెర్రచేసింది. ఈ నేపథ్యంలో వైఎస్సార్ సీపీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పిలుపు మేరకు ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణను నిరసిస్తూ ఊరూవాడా ఏకమై బుధవారం వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు స్వచ్ఛందంగా వచ్చిన ప్రజలు ఉద్యమించారు. ప్రభుత్వానికి కనువిప్పు కలిగేలా ర్యాలీ నిర్వహించారు.

ప్రజా ఉద్యమ ర్యాలీ..

ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ మంగళగిరిలో ప్రజా ఉద్యమ ర్యాలీ నిర్వహించారు. మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, మాజీ ఆప్కో చైర్మన్ చిల్లపల్లి మోహనరావు, నియోజకవర్గ పార్టీ కార్యాలయం నుంచి నియోజకవర్గ పరిధిలోని మంగళగిరి, తాడేపల్లి, దుగ్గిరాల మండలాల వివిధ విభాగాల నాయకులు, అధ్యక్ష, కార్యదర్శులు కార్యకర్తలతో ర్యాలీ నిర్వహించారు. బైక్ ర్యాలీ జాతీయ రహదారి సర్వీస్‌రోడ్ మీదుగా వడ్లపూడి సెంటర్, మిద్దెసెంటర్, పూల మార్కెట్ సెంటర్ మీదుగా గాలిగోపురం వరకు చేరుకుంది. వేలాది మంది నాయకులు, కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు. గాలి గోపురం వద్ద నుంచి కాలినడక ర్యాలీతో గౌతమ బుద్ధ రోడ్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్దకు చేరుకుని అంబేద్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యను వ్యాపారం చేయవద్దంటూ నినాదాలు చేశారు. అనంతరం ర్యాలీగా మంగళగిరి తహసీల్దార్ కార్యాలయం వద్దకు వెళ్లి డిప్యూటీ తహసీల్దార్‌కు నాయకులు వినతిపత్రం అందజేశారు.

ప్రైవేటీకరణ దుర్మార్గం..

నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలు పేద్ద ఎత్తున నష్టపోతున్నారని అన్నారు. ప్రైవేటీకరణ చేయడం దుర్మార్గమని విమర్శించారు. ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు మాట్లాడుతూ.. ప్రైవేటీకరణను ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని తెలిపారు. మాజీ ఆప్కో చైర్మన్ చిల్లపల్లి మోహనరావు మాట్లాడుతూ.. కళాశాలలను నిర్వహించేందుకు సర్కారు వద్ద డబ్బులు లేవా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో పార్టీ మంగళగిరి పట్టణ, రూరల్ అధ్యక్షులు ఆకురాతి రాజేష్, నాలి వెంకట కృష్ణ, తాడేపల్లి మండల అధ్యక్షులు అమరా నాగయ్య, దుగ్గిరాల మండల అధ్యక్షులు శివగోపయ్య, నాయకులు ఎలీషా, సయ్యద్ గౌస్, నందీశ్వరరెడ్డి, గోపీకృష్ణ, గోపిరెడ్డి, ఫిలోమినా, సంకెసునీత, వచ్చల రత్నకుమారి, మల్లవరపు సుధారాణి, ఈదులమూడి డేవిడ్‌రాజు, వివిధ విభాగ అధ్యక్షులు, కార్యదర్శులు, 42 గ్రామాల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పాల్గొన్నారు.

అడ్డుకున్న పోలీసులు..

ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయం వద్దకు చేరుకున్న నాయకులు, కార్యకర్తలను తహసీల్దార్ కార్యాలయం వద్ద బారికేడ్లు పెట్టి పోలీసులు అడ్డుకున్నారు. దీంతో వైఎస్సార్ సీపీ నాయకులు ఆసహనం వ్యక్తం చేశారు. కాగా మంత్రి నారా లోకేష్ నియోజకవర్గంలో ప్రజా ఉద్యమ ర్యాలీకి ప్రజల నుంచి విశేష స్పందన లభించడంతో టీడీపీ శ్రేణులు చెవులు కొరుక్కున్నారు.

ర్యాలీగా పార్టీ శ్రేణులు..

తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్‌లో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని బుధవారం చేపట్టారు. రూరల్ పార్టీ కార్యాలయం నుంచి అధ్యక్షులు అమరా నాగయ్య ఆధ్వర్యంలో భారీ ర్యాలీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ ర్యాలీని కుంచనపల్లి పార్టీ అధ్యక్షులు మిరియాల రాంబాబు ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు నల్లపు రాంబాబు, గుడిసె రాజేష్, సంకురు మరియబాబు, బండ్లరాజేష్, సంకురు దిలీప్, నల్లపు రవితేజ, కుక్కమళ్ల వసంత్, ప్రాతూరు ఏసు, సత్యనారాయణ, బుల్లా ఏసుబాబు, చిలువూరి సాయి పాల్గొన్నారు.

తాడికొండలో కదం తొక్కిన జనం..

బైకు ర్యాలీలో వనమా బాల వజ్రబాబు

తాడికొండలో తహసీల్దార్ కార్యాలయానికి నిరసనగా వెళుతున్న పార్టీ నాయకులు

తాడికొండ: దేశ చరిత్రలో ఏ ప్రభుత్వ హయాంలో రాని విధంగా నాడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో మెడికల్ కళాశాలల ఏర్పాటు జరిగిందని తాడికొండ నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి వనమా బాల వజ్రబాబు అన్నారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నియోజకవర్గ కేంద్రమైన తాడికొండలో నిర్వహించిన నిరసన ప్రదర్శనకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ముందుగా తాడికొండ అడ్డరోడ్డు నుంచి బైక్ ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన శిబిరంలో వనమా మాట్లాడుతూ.. పీపీపీ విధానమంటూ ప్రైవేటీకరణ జపం చేయడం దుర్మార్గం అన్నారు. పేదలకు వైద్య విద్యను దూరం చేస్తే చూస్తూ ఊరుకోబోమంటూ హెచ్చరించారు. అనంతరం ప్రదర్శనగా తహసీల్దార్ కార్యాలయానికి భారీ ర్యాలీగా వెళ్లి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు, మాజీ డీసీఎంఎస్ చైర్మన్ యార్లగడ్డ మదన్‌మోహన్, 4 మండలాల పార్టీ అధ్యక్షులు వంగా పోలారెడ్డి, మార్పూరి శివరామిరెడ్డి, తాళ్లూరి వంశీ, మైనేని నాగమల్లేశ్వరరావు, ఫిరంగిపురం జెడ్పీటీసీ దాసరి కతిరిణమ్మ, జిల్లా పంచాయతీరాజ్ అధ్యక్షుడు దాసరి రాజు, తాడికొండ మండల ముఖ్య నాయకులు మల్లంపాటి రాఘవరెడ్డి, బాకి వెంకటస్వామి, షేక్ అజీజ్, దమ్మాటి మోహనరావు, బొంతా శ్రీకాంత్, షేక్ బాజీ, గుంటి రఘువరన్, షేక్ బాబావలి, ఫిరోజ్ ఖాన్, లోకేష్ రెడ్డి, చిలకా రవి, జనుకుల్లి రమేష్, ఫిరంగిపురం మండల నాయకులు చేపూరి రామ్మోహనరెడ్డి, జక్కుల రవి, ఉడుముల పిచ్చిరెడ్డి, సయ్యద్ సైదా సాహెబ్, సాల్మన్ శ్యామలరెడ్డి, బిళ్లాల, అమానుల్లా, మస్తాన్ బీ, పెరకల చిన్నా, మస్తాన్ వలి, కంజుల భార్గవి, బయ్యగూర అంజిరెడ్డి, దేగల బాబు, సంపతి నాగరాజు, రాయప్ప, మేడికొండూరు మండల నాయకులు ఆవుల రమణారెడ్డి, తమ్మనపల్లి సుధాకర్, ముత్యాల బాలయ్య, షేక్ నాసర్ వలి(అబ్బాస్), షేక్ మస్తాన్ వలి, గండికోట రసూల్, లూర్థురాజు, గోపిదేశి శ్రీనివాసరావు, కొర్వి చెన్నయ్య, శివరామకృష్ణ, తుమ్మూరు వరప్రసాద్ రెడ్డి, బెజ్జం రాంబాబు, కొయ్యగూర వినోద్, ఆరేపల్లి జోజి, కొప్పుల శేషగిరిరావు, ఆలోకం సురేష్, జొన్నపాటి రాము, ప్రశాంత్, చుండు వెంకటరెడ్డి, రమణారెడ్డి, సైదావలి, సాగర్, డీజే శ్రీనివాసరావు, జె కిరణ్ పెదకూరపాడు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాబు పాలనపై తీవ్ర వ్యతిరేకత

శాఖమూరులో సంతకాలు సేకరిస్తున్న నాయకులు

ఆత్మకూరు కార్యక్రమంలో నాయకులు

శాఖమూరు(తాడికొండ): చంద్రబాబు సర్కారు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలతో పేదలు ఇబ్బందులు పడుతున్నారని తుళ్లూరు మండల పార్టీ అధ్యక్షులు మైనేని నాగమల్లేశ్వరరావు అన్నారు. బుధవారం శాఖమూరు గ్రామంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించి ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో గ్రామపార్టీ అధ్యక్షులు తుమ్మూరు వరప్రసాద్ రెడ్డి, పలు విభాగాల నాయకులు బెజ్జం రాంబాబు, కొయ్యగూర వినోద్, ఆరేపల్లి జోజి, కొప్పుల శేషగిరిరావు, జొన్నపాటి రాము, ప్రశాంత్, రమణారెడ్డి, సైదావలి, సాగర్, డీజే శ్రీనివాసరావు, జె.కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

మంగళగిరి టౌన్: చంద్రబాబు సర్కారుపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత నెలకొందని మంగళగిరి మండల వైఎస్సార్ సీపీ నాయకులు పేర్కొన్నారు. ఆత్మకూరు, యర్రబాలెం(2) గ్రామాల్లో ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా బుధవారం కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ అధ్యక్షులు కొల్లి శ్యామ్‌కుమార్ రెడ్డి, షేక్ జబీమియా, నాయకులు రాంబాబు, విజయ్, యేసుబాబు, జాలాది ప్రేమ్‌చంద్, సాంబశివరావు, కిషోర్ రెడ్డి, మేరుగ దాసు, బుజ్జిబాబు, వెంకటేష్, కోటేశ్వరరావు, వంశీ, శివ, షేక్ గౌస్, షేక్ షఫీ, మేరుగ నాగేశ్వరరావు, శంకర్, జిలానీ బాషా, అనిత, నాగయ్య, శ్రీరాములు, ఆసిఫ్, హుస్సేన్, షేక్ ఖాసిం, కర్నాటి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మసీదు నిర్మాణం నిలిపేయాలంటూ సీఐ సూచన

మసీదు నిర్మాణాన్ని నిలిపేయాలని సూచిస్తున్న తాడికొండ సీఐ వాసు

తాడికొండ: తాడికొండ చెరువు కట్టపై జరుగుతున్న మసీదు నిర్మాణాన్ని నిలిపివేయాలని తాడికొండ సీఐ కె.వాసు ఆదేశించారు. గ్రామానికి చెందిన నలుగురు వ్యక్తులు సోమవారం గ్రీవెన్స్‌లో చెరువు కట్టపై అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని.. వాటిని తొలగించాలని కోరుతూ జిల్లా కలెక్టర్, ఎస్పీలకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో తాడికొండ సీఐ బుధవారం ఉదయం పనులు జరుగుతున్న ప్రాంతాన్ని పరిశీలించి నిలిపేయాలని కోరగా ముస్లిం సోదరులు తాము నిలిపివేయమని తెల్చి చెప్పారు. తమ మసీదు నిర్మాణానికి పంచాయతీ తీర్మానం ఉందని తాముందుకు నిలిపివేయాలని ప్రశ్నించారు. ఎలాంటి అనుమతులు లేకుండా భజన మందిరం పేరుతో తమకు అనుకోని నిర్మిస్తున్న భవనం సంగతేంటి.. దానిని ఎందుకు అధికారులు అడ్డుకోలేదని ప్రశ్నించారు. దీంతో ఇరు వర్గాలు గ్రామంలో ఎక్కువ జన సామర్థ్యం ఉన్న వారే కావడంతో మతసామరస్యం దెబ్బతిని విభేదాలు తలెత్తి లా అండ్ ఆర్డర్ సమస్య ఉత్పన్నమవుతుందని పోలీసులు ఆదేవిధ చర్యలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సమస్య ఉన్నతాధికారులు ఎలా సర్దుబాటు చేస్తారో అనేది సర్వత్రా ఉత్కంఠగా మారింది.

ఘనంగా ఫర్టిజెన్ ఐడియేషన్ ఛాలెంజ్



విజేతలను సత్కరిస్తున్న అతిథులు

తాడికొండ: వీఐటీ–ఏపీ విశ్వవిద్యాలయంలో ఫర్టిజెన్(యూకే) ఆధ్వర్యంలో, ఐఈఎస్ ఇన్నోవేషన్, విట్–ఏపీ విశ్వవిద్యాలయం సంయుక్తంగా నిర్వహించిన 'ఫర్టిజెన్ ఐడియేషన్ ఛాలెంజ్–2025' బుధవారం విజయవంతంగా ముగిసింది. 'ఇన్నోవేట్ ఫర్ ఏ బెటర్ టుమారో'అనే థీమ్‌తో నిర్వహించిన కార్యక్రమానికి దేశవ్యాప్తంగా 900లకు పైగా విద్యార్థులు తమ సృజనాత్మక ఆలోచనలను సమర్పించారు. ముగింపు వేడుకలో భాగంగా విట్–ఏపీ వైస్ ఛాన్సలర్ ప్రొ.డా.ఎస్.వి. కోటారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని, నూతన ఆవిష్కరణల ఆధారిత విద్య ప్రాధాన్యాన్ని వివరించారు. ఫర్టిజెన్ వ్యవస్థాపకులు, సీఈవో శ్రీ ఫిలిప్ అవ్వన్ (స్విట్జర్లాండ్), క్లైమేస్ మాట్లాడుతూ.. విద్యార్థి ఆధారిత ఇన్నోవేషన్ ప్రపంచంపై చూపే ప్రభావం, ఫర్టిజెన్ దృక్కోణం వివరించారు. ఐఈఎస్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ రాజ్ వంగపండు, ప్రొ.డా.జెర్‌ట్రామ్ లోహ్ముల్లర్ విద్యా వ్యవస్థ, ఆవిష్కరణల మధ్య ఉన్న అనుసంధానం సమాజ అభివృద్ధికి ఎంత ముఖ్యమో తెలియజేశారు. అనంతరం విజేతలకు నగదు బహుమతులు, ఇన్క్యుబేషన్ సపోర్ట్ అందజేసి సత్కరించారు.

పత్తిలో తెల్లదోమ నివారణకు కృషి

రైతులకు వివరిస్తున్న ఏవో వాసంతి

ఫిరంగిపురం: మండలంలోని ఫిరంగిపురం సచివాలయం–2, 113.తాళ్లూరు గ్రామాల్లో బుధవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. పత్తిపొలాలను ఏవో వాసంతి పరిశీలించి రైతులకు తగిన సూచనలు చేశారు. కొన్ని ప్రాంతాల్లో పత్తిపైరులో తెల్లదోమను గుర్తించినట్లు ఆయన తెలిపారు. దాని నివారణకు 5 శాతం నూనె తీయని వేపగింజల కషాయాన్ని తయారు చేసుకొని ఎకరాకు 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. పంట నమోదు చేసుకున్న రైతులు రైతు సేవా కేంద్రంలోని వ్యవసాయ సహాయకుల వద్దా రిజిస్టర్ చేసుకొని సీసీఐ సూచించిన కాటన్ మిల్లులకు పత్తి అమ్మేందుకు తీసుకు వెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో విస్తరణాధికారి షేక్.సుభాని, దర్శర్ధర, ఎమ్మెస్సీ సుభాని, కిరణ్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

యార్డులో పసుపు దువ్వ వేలం

దుగ్గిరాల: దువ్వ, మిగిలిన కొమ్ముల వేలం పాటలో రూ.48 వేలు ఆదాయం లభించిందని యార్డు చైర్మన్ వి.యాన్నీరాణి తెలిపారు. మండల కేంద్రంలోని దుగ్గిరాల పసుపు యార్డులో ప్రకటించిన విధంగా బుధవారం బహిరంగ వేలం పాట చైర్మన్ ఛాంబర్‌లో నిర్వహించారు. రైతుల నుంచి విశేష స్పందన లభించిందని రూ.48 వేలకి పాట వెళ్లిందని ఆమె పేర్కొన్నారు.

కార్మికుల సమస్యను పరిష్కరించాలి

దీక్షా శిబిరంలో కార్మికులకు మద్దతు తెలియజేస్తున్న నాయకులు

తాడేపల్లి రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని యూనియన్ నాయకులు కె.స్వెన్, ఆదినారాయణలు డిమాండ్ చేశారు. తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్షా శిబిరాన్ని బుధవారం సందర్శించి కార్మికులకు మద్దతు తెలియజేశారు. నాయకులు మాట్లాడుతూ.. కార్మికులు నిర్వహిస్తున్న దీక్షలు 344వ రోజుకు చేరుకున్నాయని.. రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల సమస్య పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదని అన్నారు. ఎన్నికలకు ముందు నారా లోకేష్ కార్మికుల సమస్యను పరిష్కరిస్తానని ఇచ్చిన హామీని గుర్తుచేశారు. కార్యక్రమంలో మహిళలు రోజులీనా, లక్ష్మీ, రమణమ్మ, శారద, అంకయ్య, తుపాకుల నాగేశ్వరరావు, సుబ్బారావు, వెంకటేశ్వర్లు, మహిళా మండలి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీల వాగ్దానాలు అమలు చేయాలి

దుగ్గిరాల: ముస్లిం మైనార్టీలు ఎదుర్కొంటున్న సమస్యలపై లౌకిక శక్తులన్నీ ఏకం కావాలని ఆవాజ్ కమిటీ జిల్లా ప్రధాన కార్యదర్శి మహ్మద్ చిస్తీ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని దుగ్గిరాల అంజుమన్ షాదీ ఖానాలో జిల్లా కార్యదర్శి షేక్.బాషా ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. ఆవాజ్ భాగంగా నిర్మాణాత్మకంగా బలోపేతం కావాలని, అందుకు ఈనెల 16వ తేదీన గుంటూరు నగరంలో తలపెట్టిన జిల్లా మహాసభ విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బాలరాజు, వై.స్టాలిన్, బాషా, సాహెబ్, కరిముల్లా, వై.బ్రహ్మేశ్వరరావు, యోగేశ్వరరావు, పాల్గొన్నారు.

పట్టణ ఎస్టీయూ అధ్యక్షుడిగా సైదానాయక్

మంగళగిరి టౌన్: స్టేట్ టీచర్స్ యూనియన్ ఎన్నికలు మంగళగిరి నగర పరిధిలోని బీఆర్ నగర్ మున్సిపల్ హైస్కూల్‌లో బుధవారం నిర్వహించారు. పట్టణ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణ అధ్యక్షులుగా సైదా నాయక్, ఉపాధ్యక్షులు వరలక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా వి.శివకుమారి, ఆర్థిక కార్యదర్శిగా శామ్యూల్, గౌరవ అధ్యక్షులు ఉషాలక్ష్మి, జాయింట్ కార్యదర్శిగా పద్మజారాణిలు ఎన్నికయ్యారు. ఉపాధ్యాయుల సమస్యపై పోరాడతామని సైదా నాయక్ ఈ సందర్భంగా అన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సుబ్బారెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రసాద్, స్టేట్ కౌన్సిల్ సభ్యులు బాలకిషోర్ తదితరులు పాల్గొన్నారు. ఎస్టీయూ మంగళగిరి మండల నూతన కమిటీని సైతం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షులుగా వై.మస్తాన్‌రావు, ప్రధాన కార్యదర్శిగా నూతక్కి మునయ్యలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో స్టేట్ కౌన్సిల్ సభ్యులు బాలకిషోర్, సీనియర్ కార్యదర్శి సలార్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి ఆర్థిక సహాయం

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని విద్యార్థికి రామ్‌చారిటబుల్ ట్రస్ట్ బుధవారం ఆర్థిక సహాయాన్ని అందించింది. ట్రస్ట్ వ్యవస్థాపకులు, రామ్ హాస్పటల్ నిర్వాహకులు డాక్టర్ వలగాని శ్రీనివాసరావు ముందుగా కేశ్‌ధర్ చదువు నిమిత్తం రూ.10 వేలు, మరో దాత వలగాని శివాజీ రూ.10 వేలను చెక్కు రూపంలో కుటుంబ సభ్యులకు అందజేశారు.

మంగళగిరి టౌన్: యర్రబాలెం సవతారక నగర్‌కు చెందిన షేక్ మీరావలి అనే వృద్ధుడు ఇటీవల ప్రమాదవశాత్తు గాయపడ్డారు. ఆయన వైద్య ఖర్చుల నిమిత్తం ఖిద్మత్ టీమ్ సభ్యులు బుధవారం వృద్ధునికి రూ.5 వేలు ఆర్థిక సహాయం అందజేశారు.

డీపీవో సచివాలయాల పరిశీలన

మేడికొండూరు: మండలంలోని మంగళగిరిపాడు, డోకిపర్రు గ్రామాల సచివాలయాలను జిల్లా పంచాయతీ అధికారి సాయికుమార్ బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. తొలుత మంగళగిరిపాడు గ్రామపంచాయతీ పరిధిలోని చెత్త నుంచి సంపద తయారు చేసే కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం డోకిపర్రు సచివాలయంలో పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం రక్షిత మంచినీటి పథకాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చేనేత కార్మికులకు 40 శాతం మజూరీ పెంచాలి

ర్యాలీ నిర్వహిస్తున్న చేనేత కార్మికులు, సమన్వయ కమిటీ

మంగళగిరి టౌన్: చేనేత కార్మికులకు 40 శాతం మజూరి పెంచాలని డిమాండ్ చేస్తూ బుధవారం మంగళగిరి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. చేనేత కార్మిక సంఘాల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ ర్యాలీ పాత మంగళగిరి భావనారుషి కల్యాణ మండపం వద్ద ప్రారంభమై మెయిన్ బజార్ మీదుగా షరాఫ్ బజార్‌లోని మాస్టర్ వీవర్స్ అసోసియేషన్ కార్యాలయం వరకు జరిగింది. అనంతరం మాస్టర్ వీవర్స్ అసోసియేషన్ నాయకులకు, మంగళగిరి చేనేత వస్త్ర ఉత్పత్తిదారులు, విక్రయదారుల సంఘ ప్రతినిధులకు వినతిపత్రం అందజేశారు. రెండేళ్లకోసారి మజూరీ పెంపుపై చేనేత కార్మిక సంఘాలు, మాస్టర్ వీవర్స్ అసోసియేషన్ మధ్య చర్చలు జరిగే పద్ధతి ఉండగా, కాలపరిమితి ఈనెల 19వ తేదీతో ముగియనుండడంతో 40 శాతం మజూరీ పెంపునకు వినతిపత్రం అందజేసినట్లు పలువురు సమన్వయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. కార్యక్రమంలో మాస్టర్ వీవర్స్ అసోసియేషన్ అధ్యక్షులు జొన్నాదుల వరప్రసాద్, సమన్వయ కమిటీ కన్వీనర్ పిల్లలమర్రి బాలకృష్ణ, సభ్యులు ధనుంజయరావు, నాగేశ్వరరావు, రామనాదం పూర్ణచంద్రరావు, కోటేశ్వరరావు, వస్త్ర ఉత్పత్తిదారుల విక్రయాల సంఘ అధ్యక్షులు రవి, రామారావు, గిరి తదితరులు పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99122 25447 (మంగళగిరి)
7075167541 (తాడికొండ)
Office mail : sakshigntadvt@gmail.com

కట్టించింది జగన్..
క్రెడిట్ కొట్టేస్తున్నది బాబు

గత ప్రభుత్వంలోనే... అద్దె ఇంటి నుంచి సొంత గూటికి

మేం చాలాకాలం పాటు అద్దె ఇళ్లలో ఉన్నాం. జగనన్న ప్రభుత్వంలో మమ్మల్ని లబ్ధిదారులుగా గుర్తించి ఇంటి పట్టా ఇచ్చారు. ఆలస్యం లేకుండా బిల్లులు చెల్లించారు. ప్రస్తుతం ఆ ఇంట్లోనే ఉంటున్నాం. 2022లో గృహ ప్రవేశం చేసి ఇందులోనే నివసిస్తున్నాం. ఇంత సాయం అందించిన జగనన్న మా పాలిట దేవుడు.

–షేక్ నాగూర్ బి, గుంటూరు జిల్లా దుగ్గిరాల జగనన్న కాలనీ



జగనన్న ఇచ్చిన ఇంటి పట్టా

సొంతింటి కల నెరవేర్చింది జగనన్న

మాకు 2.50 సెంట్ల స్థలం ఉంది. కానీ, పక్కా ఇల్లు నిర్మించుకునేందుకు తగినన్ని డబ్బులు లేవు. చాలాకాలం పాటు అద్దె ఇళ్లలో ఉన్నాం. జగనన్న ప్రభుత్వం రాగానే భరోసా కల్పించారు. రెండు విడతలుగా బిల్లులు నా బ్యాంక్ అకౌంట్‌లో వేశారు. నిర్మాణం పూర్తి చేసి 2023లోనే గృహప్రవేశం చేశాం.

– నల్లమోతు రాణి, నెక్కలం గొల్లగూడెం, ఆగిరిపల్లి మండలం, ఏలూరు జిల్లా

జగనన్న హయాంలోనే మాకు ఇల్లు

నా భర్త, నేను వ్యవసాయ కూలీలం. మాకు ఇద్దరు పిల్లలు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నాటి సీఎం వైఎస్ జగన్ స్థలంతో పాటు ఇల్లు మంజూరు చేశారు. ఇంటి పట్టా, నిర్మాణానికి డబ్బులు కూడా ఇచ్చారు. సకాలంలో బిల్లులు రావడంతో కొంత నా డబ్బులు వేసుకుని ఇల్లు పూర్తి చేశా. ఇప్పుడు అందులోనే ఉంటున్నాం. చాలా ఆనందంగా ఉంది. జగనన్నకు మా కుటుంబం ఎప్పటికీ రుణపడి ఉంటుంది.

–సంగం త్రివేణి, గండేపల్లి గ్రామం, కంచికచర్ల మండలం, ఎన్టీఆర్ జిల్లా

ఆ ఇద్దరి ఇళ్లు నిర్మించింది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే

- అన్నమయ్య జిల్లా దేవగుడిపల్లె ముంతాజ్‌బేగం, హేమలతకు 2022లో ఇళ్లు
- కేవలం రంగులు వేసి గృహ ప్రవేశం అంటూ హడావుడి
- హేమలత ఇంటి పత్రాలు తీసుకున్న గృహ నిర్మాణ శాఖ అధికారులు

హేమలత ఇల్లు

హేమలత గృహప్రవేశ కార్యక్రమంలో చంద్రబాబు



ANDHRA PRADESH STATE HOUSING CORPORATION

Beneficiary Status Report

Beneficiary ID /Aadhar No./PFMS Code *

114807NPI4646212

Get Details

1. District	ANNAMAYYA
2. Mandal	CHINNAMANDAM
3. village	DEVAGUDIPALLI
4. Beneficiary ID	114807NPI4646212
5. Beneficiary Name	M Hemalatha
6. Father Name	MALEPATI ESHWARA
7. Stage	COMP
8. Scheme	PMAY (U) BLC-UDA 2021-22 (Phase I)
9. Beneficiary is in Active State	Active

2021-22లో వైఎస్ జగన్ ప్రభుత్వం హేమలతకు మంజూరు చేసిన ఇంటి ధ్రువపత్రం

అన్నమయ్య జిల్లా రాయచోటి నియోజకవర్గం దేవగుడిపల్లెకు చెందిన ఎస్.ముంతాజ్‌బేగం, ఎం.హేమలతకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 2022లో పక్కా ఇళ్లు మంజూరు చేయగా వారు పూర్తిచేశారు. గోడలపైనా ఇదే రాశారు. ఈ వివరాలు గృహనిర్మాణశాఖ లెక్కల్లోనే స్పష్టంగా ఉన్నాయి. కానీ, వీటిలో గృహ ప్రవేశాలంటూ బుధవారం సీఎం చంద్రబాబు ఆర్భాటం చేశారు. ముంతాజ్‌బేగంకు దేవగుడిపల్లెలో సొంత స్థలం ఉండగా పక్కా ఇంటికి 2022 మే 9న ఆమోదం వచ్చింది. ముంతాజ్‌బేగం పేరిట తహసీల్దార్ 2023 జూలై 6న పొసెషన్ సర్టిఫికెట్ ఇచ్చారు. 2022 ఏప్రిల్– 2023 జూన్ 4 వరకు మూడు బిల్లులు నా బ్యాంకు ఖాతాలో జమయ్యాయి. రోజుకు రూ.200 లెక్కన 90 రోజుల ఉపాధి హామీ పథకం బిల్లు వచ్చింది. కేవలం రంగులు వేయించి బుధవారం గృహ ప్రవేశం చేయించారు.

☛ హేమలతకూ సొంత స్థలం ఉండగా 2022 జూలై 9న పక్కా గృహం మంజూరైంది. 2024 మార్చికి పూర్తి చేశారు. ఈ బిల్లు బ్యాంకు ఖాతాలో జమ అయ్యింది. ఉపాధి హామీ బిల్లు కూడా అందింది. ఇప్పుడు చంద్రబాబు సర్కారు రంగులు వేసింది. ఇంటి స్థలం ధ్రువీకరణ పత్రం, ఇంటి మంజూరు పత్రం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే జారీ అయ్యాయని వాటిని గృహ నిర్మాణ శాఖ అధికారులు తీసుకున్నారని హేమలత చెప్పడం గమనార్హం.

అద్దె బాధల నుంచి విముక్తి

నా పేరు ఫాతిమా. ఇదిగో ఇది నాకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో వచ్చిన ఇంటి పట్టా. వ్యవసాయ కూలిగా జీవనం సాగించే నేను వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే పక్కా ఇంటి కోసం గ్రామ సచివాలయంలో దరఖాస్తు చేసుకున్నా. వెంటనే స్థలం, ఇంటి పట్టా ఇచ్చారు. రూ.1.80 లక్షల సాయం చేశారు. నెలనెల అద్దె కట్టడానికి ఇబ్బంది పడేవాళ్లం. జగనన్న పుణ్యాన సొంతింటి కల నెరవేరింది.

అచ్చంపల్లిలో ఫాతిమా నిర్మించుకున్న ఇల్లు

గత ప్రభుత్వంలోనే సొంతింటి సంబరం

నలుగురు ఆడపిల్లలు, ఒక కుమారుడు ఉన్న నన్ను భర్త కొన్నేళ్ల క్రితమే వదిలిపెట్టి వెళ్లిపోయాడు. 30 ఏళ్లు కళ్యాణదుర్గంలోని బాడుగ ఇంట్లో ఉన్నాం. నెలకు రూ.4 వేల వరకు అద్దె కట్టేదాన్ని. గాజులు అమ్ముతూ జీవనం సాగిస్తున్నాం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో జగనన్న పుణ్యమా అని కళ్యాణదుర్గం మున్సిపాలిటీ కురాకుల తోట జగనన్న కాలనీలో ఇల్లు వచ్చింది. మొత్తం బిల్లు రూ.1.80 లక్షలు మంజూరైంది. ఇప్పుడు సొంతింట్లో సంతోషంగా ఉంటున్నాం.

–నబియా భాను, జగనన్న కాలనీ, అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం

గత వైఎస్సార్‌సీపీ హయాంలో కళ్యాణదుర్గం మున్సిపాలిటీ గూబనపల్లిలో ఏర్పాటు చేసిన జగనన్న లేఅవుట్

15 ఏళ్ల నిరీక్షణ... వైఎస్సార్‌సీపీ హయాంలో సాకారం

సొంతిల్లు లేక చాలా ఇబ్బందిపడ్డాం. 15 ఏళ్ల పాటు అద్దె ఇళ్లలోనే ఉన్నాం. చిన్న గుడిసె, బడితెల గోడల ఇంట్లో మరికొన్నేళ్లు ఉన్నాం. ఆ సమయంలో వైఎస్ జగన్ ప్రభుత్వం మా స్వగ్రామం మెళియాపుట్టిలోనే జగనన్న కాలనీలో స్థలం ఇచ్చి ఇల్లు మంజూరు చేసింది. నిర్మాణం పూర్తి చేశాం. త్వరలోనే గృహప్రవేశం చేస్తాం. సొంతిల్లు అనే ఆలోచనే సంతోషంగా ఉంది. దీన్ని సాకారం చేసింది వైఎస్ జగన్.

– రిన్న మహంతి, మెళియాపుట్టి గ్రామం, పాతపట్నం నియోజకవర్గం, శ్రీకాకుళం జిల్లా

జగనన్న కాలనీలో ప్రభుత్వం మంజూరు చేసిన ఇంటి వద్ద రిన్న మహంతి



బ్యాంక్ ఖాతాలో పడిన సొమ్ము

అన్నీ అప్పుడే మంజూరు...

సుజాత.. ఆమె నిర్మించుకున్న పక్కా ఇల్లు

జగనన్న ప్రభుత్వంలోనే మాకు పక్కాగృహం మంజూరైంది. స్థలానికి పొసెషన్ సర్టిఫికెట్ ఇచ్చారు. బిల్లులన్నీ కూడా సకాలంలో చెల్లించారు. ఎలాంటి ఇబ్బంది లేకుండా ఇంటి నిర్మాణం పూర్తి చేసుకున్నాం. మొత్తం రూ.1.80 లక్షల బిల్లు ఇచ్చేశారు.

–సుజాత, బుచ్చయ్యగారిపల్లి, బుక్కపట్నం మండలం, శ్రీసత్యసాయి జిల్లా



Possession Certificate

SCHEDULE

సుజాతకు జగన్ ప్రభుత్వం మంజూరు చేసిన పొజిషన్ సర్టిఫికెట్

జగన్ ప్రభుత్వం కట్టిన ఇళ్లకు బాబు 'కలరింగ్'

నాడు

''సెంటు స్థలం ఇస్తారంట..! ఆ సెంటు స్థలం ఎందుకు పనికొస్తుంది...? ఒక్కదానికి సరిపోతుంది. చనిపోయిన తర్వాత పూడ్చడానికి సెంటు స్థలం పనికొస్తుంది. అంతకుమించి ఇళ్లు కట్టడానికి పనికిరాదు.

– వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాలపై చంద్రబాబు

చంద్రబాబు వ్యాఖ్యల వీడియో కోసం ఈ క్యూ ఆర్ కోడ్‌ను స్కాన్ చేయగలరు.

నేడు

అన్నమయ్య జిల్లా చిన్నమండెం మండలం దేవగుడిపల్లెకి చెందిన ఎస్.అల్తాబ్‌బేగమ్ వ్యవసాయ కూలీ. ఈమె పేరిట గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నవరత్నాలు–పేదలందరికీ ఇళ్ల పథకం కింద పక్కా గృహం మంజూరు చేశారు. 2022 ఏప్రిల్‌లో నిర్మాణం ప్రారంభించారు. నాటి ప్రభుత్వం రూ.1.80 లక్షలు మంజూరు చేసింది. ఉచితంగా ఇసుక, సబ్సిడీపై రూ.32 వేల విలువైన సిమెంటు, ఐరన్, ఇతర నిర్మాణ సామగ్రి సమకూర్చింది. వైఎస్ జగన్ ప్రభుత్వం ఇంత సాయం చేస్తే, కేవలం తాళంచెవి చేతిలో పెట్టి చంద్రబాబు క్రెడిట్ కొట్టేసేందుకు పాకులాడుతున్నారు. అల్తాబ్‌బేగమ్ మాత్రమే కాదు, బుధవారం సీఎం నుంచి తాళాలు అందుకున్న దేవగుడిపల్లెకు చెందిన తలారి రమాదేవి, చిన్ని, తిరుపతి మల్లక్కలకూ 2021–22లో వైఎస్ జగన్ ప్రభుత్వమే ఇళ్లు మంజూరు చేసింది. ఇలా పేదలందరికీ ఇళ్ల పథకం కింద వైఎస్ జగన్ ప్రభుత్వం కట్టిన ఇళ్లను చంద్రబాబు తన ఖాతాలో వేసుకుని క్రెడిట్ కొట్టేసే కుతంత్రానికి తెరలేపారు. శవాలు పూడ్చడానికి కూడా పనికి రావని గేలి చేసిన పెద్దమనిషి ఇప్పుడు అవే స్థలాల్లో వైఎస్ జగన్ ప్రభుత్వం నిర్మించిన ఇళ్లను తన ఖాతాలో వేసుకోవడానికి నానా పాట్లు పడుతున్నారు.



సీఎం చేతుల మీదుగా తాళం అందుకున్న మల్లక్కకి జగన్ ప్రభుత్వం 2021-22 లో ఇల్లు మంజూరు చేసినట్టు రుజువు (రెడ్ బాక్స్ లో)

సాక్షి, అమరావతి: ఏడాదిన్నర పాలనలో పేదలకు గజం స్థలమైనా పంచిన దాఖలాల్లేవు.. పట్టుమని పది ఇళ్ల నిర్మాణాలకు అనుమతులిచ్చిన పాపాన పోలేదు... కానీ, తమ ప్రభుత్వం 3 లక్షల ఇళ్లు నిర్మించేసిందని సీఎం చంద్రబాబు నిస్సిగ్గుగా ప్రకటించుకుంటున్నారు. అన్నింటిలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసిన పనులను తామే చేసినట్లు క్రెడిట్ కొట్టేస్తున్న సీఎం చంద్రబాబు... ఇప్పుడు పేదలకు ఇళ్లు కట్టించేశామంటూ నిస్సిగ్గుగా డప్పు కొట్టుకుంటున్నారు. ఈ మేరకు ఎల్లో మీడియాలో ప్రకటనలతో ఆర్భాటం చేశారు. ఇదంతా చూసి ప్రజలు అవాక్కవుతున్నారు. చంద్రబాబు మూడు లక్షల ఇళ్ల కథ కమామిషు ఏమిటి? అని చూస్తే అసలు విషయం బయటపడుతోంది. పాలనలో విఫలమైన బాబు పేదలకు తాను చేయని మేలును చేసినట్టు మభ్యపెడుతున్న కుతంత్రం బయటపడుతోంది.

గత ప్రభుత్వంలో నిర్మించిన ఇళ్లే

రాష్ట్రంలో పేదలందరికీ పక్కా ఇల్లు ఉండాలనే లక్ష్యంతో వైఎస్ జగన్ ప్రభుత్వం నవరత్నాలు– పేదలందరికీ ఇళ్లు పథకం అమలు చేసింది. వైఎస్ జగన్ సీఎంగా ఉండగా 71.8 వేల ఎకరాల్లో 31.19 లక్షల ఇళ్ల స్థలాలను ఉచితంగా మహిళల పేరిట ఉచితంగా పంచిపెట్టారు. వీటి మార్కెట్ విలువ రూ.1.15 లక్షల కోట్ల పైమాటే. పెద్దఎత్తున పట్టాలు మంజూరు చేయడం ద్వారా 17 వేలకు పైగా వైఎస్సార్, జగనన్న కాలనీల రూపంలో కొత్త ఊళ్లనే వైఎస్ జగన్ ఏర్పాటు చేశారు. అంతేకాక జగనన్న కాలనీల్లో 19 లక్షలకుపైగా ఇళ్ల నిర్మాణానికి అనుమతులిచ్చారు. వీటికి ఏపీ టౌన్‌షిప్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (ఏపీ టిడ్కో) ఇళ్లు 2.62 లక్షలు అదనం. ఎన్నికలు ముగిసేనాటికి 9 లక్షలపైగా ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి ప్రభుత్వం లబ్ధిదారులకు అందజేసింది. సాధారణ ఇళ్లలో 8 లక్షలకు పైగా వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయి. వీటిలో 1.28 లక్షలు శ్లాబ్ పూర్తయిన, 99 వేల ఇళ్లు శ్లాబ్ దశలో ఉన్నాయి. చాలావరకు తుది దశ నిర్మాణాలు కూడా పూర్తయినా ఎన్నికల కోడ్ నేపథ్యంలో స్టేజ్ అప్‌డేట్ చేయని పరిస్థితి. ఇలాంటి ఇళ్లకు స్టేజ్ అప్‌డేట్ చేసి తామే నిర్మించినట్టు బాబు సర్కార్ ప్రచారం చేసుకుంటోంది. బుధవారం చంద్రబాబు దేవగుడిపల్లెలో పంపిణీ చేసిన ఇళ్లు సైతం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మంజూరు చేసి నిర్మించినవే. అక్కడి రాజీవ్ కాలనీలో ఇళ్లు లేని పేదలకు 40 ఇళ్లను గత ప్రభుత్వం ఇచ్చింది. 30 మంది లబ్ధిదారులు నిర్మాణం మొదలుపెట్టగా, ఎన్నికలు ముగిసేనాటికే కొన్ని పూర్తయ్యాయి. మిగిలినవి దాదాపు నిర్మాణం పూర్తిచేసుకున్న దశలో ఉన్నాయి. ఇలా గత ప్రభుత్వంలో మంజూరు చేసి, నిర్మించిన ఇళ్ల తాళాలను సీఎం, మంత్రులు లబ్ధిదారుల చేతుల్లో పెట్టడం గమనార్హం.

పూర్తి అండగా వైఎస్ జగన్

2019–24 మధ్య సొంతింటి కల సాకారం చేస్తూ పేదలకు నాటి సీఎం జగన్ పూర్తి అండగా నిలిచారు. 31 లక్షల మందిపైగా పేద అక్కచెల్లెమ్మల పేరిట రూ.76 వేల కోట్లకుపైగా మార్కెట్ విలువ చేసే స్థలాలను పంపిణీ చేశారు. ఇంటి నిర్మాణానికి యూనిట్‌కు రూ.1.80 లక్షలు బిల్లు మంజూరు చేయడంతో పాటు, స్వయం సహాయక బృందాల ద్వారా లబ్ధిదారులైన మహిళలకు పావలా వడ్డీకి రూ.35 వేలు రుణం అందించారు. ఉచితంగా ఇసుక పంపిణీ ద్వారా రూ.15 వేలు, స్టీల్, సిమెంట్, ఇలా 12 రకాల నిర్మాణ సామగ్రిని సబ్సిడీపై ఇస్తూ మరో రూ.40 వేలు చొప్పున మొత్తంగా రూ.2.70 లక్షల ప్రయోజనం చేకూర్చారు. ఇక కాలనీల్లో నీరు కరెంట్, విద్యుత్, ఇంకుడు గుంతలు, ఇతర సదుపాయాలకు రూ.355 కోట్ల దాక ఖర్చు చేశారు. ఐదేళ్లలో ఇళ్ల పట్టాలకు భూ సేకరణ, లేఅవుట్‌ల అభివృద్ధి, ఇళ్లకు బిల్లు చెల్లింపులు, ఇతర రూపాల్లో దాదాపు రూ.35,300 కోట్లు వెచ్చించారు. మొత్తంగా పేదలందరికీ ఇళ్లు పథకం కింద ఇంటి స్థలం, ఇంటితో కలిపి కనీసం రూ. 6 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు విలువైన స్థిరాస్తిని మహిళలకు అందిస్తూ లక్షాధికారులుగా తీర్చిదిద్దారు. రూ.2 లక్షల కోట్ల నుంచి రూ.3 లక్షల కోట్ల సంపద సృష్టికి పాటుపడ్డారు.

బాబు పాలనలో గజం స్థలమైనా మిథ్య!

17 నెలల పాలనలో పేదలకు గజం స్థలం ఇవ్వకపోగా గత ప్రభుత్వంలో ఇచ్చినవీ రద్దు చేయడానికి చంద్రబాబు ప్రభుత్వం పూనుకుంటోంది. వైఎస్ జగన్ హయాంలో ఉచితంగా స్థలం ఇచ్చి, ఇళ్లు మంజూరు చేసినప్పటికీ పరిస్థితులు అనుకూలించక కొందరు నిర్మాణాలు వాయిదా వేసుకున్నారు. ఈ తరహా స్థలాలను రద్దు చేయాలని కలెక్టర్ల సదస్సులో చంద్రబాబు ప్రకటించారు. పేదల నుంచి స్థలాలు లాగేసుకుని పారిశ్రామికవేత్తలకు పంచిపెట్టాలని ఆదేశించారు. ఇదంతా పేదలను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అమరావతిలో 50 వేలమంది పేద మహిళలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేపట్టగా చంద్రబాబు అడ్డుపడ్డారు. పేదలకు స్థలాలిస్తే సామాజిక అసమతుల్యత వస్తుందని కోర్టు స్టే తెచ్చారు. గద్దెనెక్కిన వెంటనే ఆ పట్టాలను రద్దు చేశారు.

1,43,600 మంది నిరుపేదలకు ఉచితంగానే టిడ్కో ఇళ్లు

- మిగిలినవారికి లబ్ధిదారుల వాటా 50 శాతం తగ్గింపు
- లక్షమంది లబ్ధిదారులకు ప్లాట్లు అప్పగింత

2014–19 మధ్య టీడీపీ ప్రభుత్వం పట్టణ పేదలకు నాణ్యమైన ఇళ్లు కట్టించి ఇస్తామని, ఏపీ టిడ్కో ఏర్పాటు చేసి హంగామా చేసింది. తక్కువ ధరకే ఇల్లు వస్తుందన్న ఆశపడగా కఠిన నిబంధనలు పెట్టింది. కొన్నిచోట్ల పునాదులతో వదిలేయగా, చాలాచోట్ల స్థలాల సేకరణే చేయలేదు. 2019లో ఎన్నికలకు ముందు హడావుడిగా నెల్లూరు, రెండు–మూడు ప్రాంతాల్లో అసంపూర్తిగా ఉన్న ఇళ్లను లబ్ధిదారులకు కేటాయించింది. కానీ, వైఎస్ జగన్ సీఎం కాగానే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం టిడ్కో ఇళ్ల కోసం గత టీడీపీ ప్రభుత్వం పెట్టిన కఠిన నిబంధనలను సడలించారు. 88 పట్టణ స్థానిక సంస్థల (యూఎల్బీ) పరిధిలో, 163 ప్రాంతాల్లో జీ+3 విధానంలో 2,62,212 టిడ్కో ఇళ్ల నిర్మాణం చేపట్టారు. గత టీడీపీ ప్రభుత్వం నిర్ణయించిన యూనిట్ ధరలను పక్కనబెట్టి, 1,43,600 మంది నిరుపేదలకు ఉచితంగానే ప్లాట్లు కేటాయించారు. 2024 ఎన్నికల నాటికి రాష్ట్రవ్యాప్తంగా లక్ష ఇళ్లను లబ్ధిదారులకు అందించగా, మరో 77 వేల ఇళ్లను 90 శాతం పైగా వైఎస్ జగన్ ప్రభుత్వం పూర్తి చేసింది.

➤ 300 చదరపు అడుగుల విస్తీర్ణంలో 1,43,600 ఇళ్లను ఉచితంగా ఇవ్వగా రూ.10,339 కోట్ల మేర లబ్ధి చేకూరింది. వీరి నుంచి గత టీడీపీ సర్కారు లబ్ధిదారుల వాటాగా వసూలు చేసిన రూ.500 కోట్లను తిరిగి చెల్లింపు ప్రారంభించి రూ.250 కోట్లను వెనక్కిచ్చింది. 365, 430 చదరపు అడుగుల ఇళ్లకు గత టీడీపీ ప్రభుత్వం రూ.50 వేలు, రూ.లక్ష చెల్లించాలని నిబంధన పెట్టింది. వైఎస్సార్‌సీపీ సర్కారు దీన్ని 50 శాతం తగ్గించింది. ఈ రెండు యూనిట్లకు గాను 1,18,616 మంది పేదలపై రూ.482 కోట్ల భారం తగ్గింది. పైగా లబ్ధిదారులకు ఇళ్లను ఉచితంగానే రిజిస్ట్రేషన్ చేసింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 1,77,546 ఇళ్లు పూర్తి చేసిందని అసెంబ్లీ మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ సైతం ప్రకటించడం గమనార్హం.

సాయం పెంపులోనూ మొండిచేయి

పట్టణాల్లో రెండు, గ్రామాల్లో మూడు సెంట్లు చొప్పున పేదలకు స్థలాలు పంపిణీ చేస్తామని టీడీపీ మేనిఫెస్టోలో ప్రకటించారు. కానీ, గజం కూడా ఇచ్చింది లేదు. 2019లో వైఎస్సార్‌సీపీ సర్కారు వచ్చాక 6 నెలల్లోనే కోవిడ్ వ్యాప్తి మొదలైంది. ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడింది. ఈ పరిస్థితులను అధిగమించి 2020 డిసెంబరు 25న వైఎస్ జగన్ 31 లక్షల మందిపైగా మహిళలకు ఇళ్ల పట్టాలిచ్చి చరిత్ర సష్టించారు. కాగా, ఈ స్థలాలు శవాలు పూడ్చడానికి తప్ప దేనికీ పనికిరాదని పేదల మనోభావాలను చంద్రబాబు దెబ్బతీశారు. నాడు శ్మశానాలతో పోల్చిన స్థలాల్లోని ఇళ్లనే నేడు తన ఖాతాలో వేసుకోవడానికి తాపత్రయపడుతున్నారు.

➤ చంద్రబాబు కనీసం ఇళ్ల పట్టాల పంపిణీలో విఫలమయ్యారు. పేదలకు ఎన్నికల ముందు హామీలిచ్చి మోసం చేయడమే కాక సీఎం హోదాలోనూ దగా చేశారు. సీఎంగా బాధ్యతలు స్వీకరించాక గృహ నిర్మాణ శాఖపై తొలి సమీక్షలోనే పేదల ఇంటి నిర్మాణానికి రూ.4 లక్షలిస్తామని ఆర్భాటంగా ప్రకటించారు. అదనపు సాయం వస్తుందని లబ్ధిదారులు ఆశపడ్డారు. కొద్ది రోజులకే ఆ సాయం ఊసే లేకుండా చేసేశారు.

క్లుప్తంగా...

ఇద్దరు ఐపీఎస్‌లకు పోస్టింగులు

సాక్షి, అమరావతి: ఇద్దరు ఐపీఎస్ అధికారులకు ప్రభుత్వం బుధవారం పోస్టింగులు ఇచ్చింది. జి.కృష్ణకాంత్‌ను శాంతిభద్రతల విభాగం ఏఐజీగానూ, ఎ. సురేశ్ బాబును ఏసీబీ విభాగం జాయింట్ డైరెక్టర్‌గానూ నియమించింది.

28న కేబినెట్ సమావేశం

సాక్షి, అమరావతి: సీఎం చంద్రబాబు అధ్యక్షతన ఈ నెల 28న ఉదయం 10.30 గంటలకు సచివాలయంలోని మొదటి బ్లాక్‌లో రాష్ట్ర మంత్రివర్గ సమావేశం జరగనుంది. సమావేశానికి తీసుకువెళ్లాల్సిన ప్రతిపాదనలను ఈ నెల 26వ తేదీ సాయంత్రం 4 గంటలకల్లా సాధారణ పరిపాలన శాఖ (కేబినెట్ విభాగం)కు పంపాల్సిందిగా సీఎస్ విజయానంద్ అన్ని శాఖలకు బుధవారం ఆదేశాలు జారీ చేశారు.

రాజధానిలో రూ.99.62 కోట్లతో ఏక్యూసీసీ

సాక్షి, అమరావతి: రాజధాని ప్రాంతంలో అమరావతి క్వాంటమ్ కంప్యూటేషన్ సెంటర్(ఏక్యూసీసీ) నిర్మాణానికి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రూ.99.62 కోట్లతో ఏక్యూసీసీ నిర్మాణానికి బీవోసీఈ(బోర్డ్ ఆఫ్ చీఫ్ ఇంజినీర్స్) చేసిన సిఫార్సులను గత నెల 8న సీఆర్‌డీఏ అథారిటీ 53వ సమావేశం ఆమోదించింది. ఈ పనులకు టెండర్లు నిర్వహించి కాంట్రాక్టర్లకు అప్పగించడానికి సీఆర్‌డీఏ కమిషనర్‌కు అనుమతి ఇస్తూ పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

మూడేళ్లలో అమరావతిలో అద్భుతాలు చూపిస్తాం

మంత్రి లోకేశ్

సాక్షి, అమరావతి/తాడికొండ: వచ్చే మూడేళ్లలో అమరావతి నుంచి అద్భుతాలు చూస్తారని మంత్రి నారా లోకేశ్ అన్నారు. సీఐఐ సదరన్ రీజియన్-విట్ ఏపీ సంయుక్తంగా బుధవారం అమరావతిలో నిర్వహించిన హయ్యర్ ఎడ్యుకేషన్ కాన్‌క్లేవ్‌లో ఆయన ప్రసంగించారు. ఇప్పటి వరకు ఏపీకి 120 బిలియన్ డాలర్ల పెట్టుబడులు వచ్చాయని చెప్పారు. బోధనకు, మార్కెట్ అవసరాలకు మధ్య అంతరం ఉందన్నారు. మూడు, నాలుగేళ్ల కోర్సులు పూర్తి చేసినా ఉద్యోగావకాశాలు రావడం లేదని చెప్పారు. కానీ అమీర్‌పేటలో కోచింగ్ సెంటర్లు కేవలం 3, 4 నెలల శిక్షణతో అవకాశాలు కల్పిస్తున్నాయని పేర్కొన్నారు. యువత డిగ్రీ పొందడంతో పాటు నైపుణ్యాలపై దృష్టి సారించాలని సూచించారు. ఏపీలో స్కిల్ సెన్సెస్ ద్వారా ప్రతి పౌరుడి ప్రొఫైల్‌లోని నైపుణ్యాన్ని అంచనా వేసి.. లోటుపాట్లను గుర్తిస్తామన్నారు.

మాదక ద్రవ్యాల నిర్మూలనకు పోలీసుల సైకిల్ యాత్ర

పాయకరావుపేట నుంచి ఇచ్ఛాపురం వరకు నిర్వహణ

నక్కపల్లి/పాయకరావుపేట (అనకాపల్లి జిల్లా): మాదక ద్రవ్యాల నిర్మూలన కోసం 'అభ్యుదయం' పేరుతో పోలీసు శాఖ నిర్వహిస్తున్న సైకిల్ యాత్రను హోం మంత్రి వంగలపూడి అనిత, విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టి బుధవారం ప్రారంభించారు. గంజాయి, డ్రగ్స్ వంటి మాదక ద్రవ్యాలను నిర్మూలించడంతోపాటు వాటి వినియోగం వల్ల ప్రజలు ఎదుర్కొనే ఇబ్బందులు, కలిగే నష్టాలను వివరిస్తూ పోలీసు శాఖ ఉత్తరాంధ్రలో ఈ యాత్రను తలపెట్టింది. ఉమ్మడి విశాఖ జిల్లా సరిహద్దులోని పాయకరావుపేట నుంచి శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం వరకు 500 కిలోమీటర్ల మేర సైకిల్‌యాత్ర చేపట్టింది. ముందుగా హోం మంత్రి, పోలీసు అధికారులు మాదక ద్రవ్యాల నిర్మూలనకు విద్యార్థులు, స్థానికులతో ప్రతిజ్ఞ చేయించారు. అనకాపల్లి ఎస్పీ తుహిన్ సిన్హా, డీఎస్పీలు శ్రీనివాసరావు, మోహన్‌రావు, శ్రావణి, సీఐలు అప్పన్న, మురళి, రామకృష్ణ పాల్గొన్నారు.

రూ.1,863 కోట్లతో జోన్-8లో మౌలిక సదుపాయాలు

అనుమతిస్తూ పురపాలకశాఖ ముఖ్య కార్యదర్శి ఉత్తర్వులు

సాక్షి, అమరావతి: రాజధాని ప్రాంతంలోని జోన్-8 పరిధిలో కృష్ణాయపాలెం, వెంకటపాలెం, పెనుమాక, ఉండవల్లిలో ల్యాండ్ పూలింగ్ కింద భూములు ఇచ్చిన రైతులకు నివాస, వాణిజ్య స్థలాల లేఅవుట్ అభివృద్ధి పనులకు ప్రభుత్వం అనుమతిచ్చింది. ఆ లేఅవుట్‌లలో రోడ్లు, మురుగునీటి కాలువలు, నీటి సరఫరా, యుటిలిటి డక్ట్‌లు వంటి మౌలిక సదుపాయాలు కల్పించడానికి రూ.1,863 కోట్ల వ్యయం అవుతుందని అంచనా వేశారు. ఆ పనులు చేపట్టేందుకు గత నెల 8న సీఆర్‌డీఏ ఆమోదం తెలిపింది. ఆ పనులకు టెండర్లు నిర్వహించి, కాంట్రాక్టర్‌కు అప్పగించేందుకు సీఆర్‌డీఏ కమిషనర్‌కు అనుమతి ఇస్తూ పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేశ్ కుమార్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ముమ్మాటికీ ఉగ్ర దాడే

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో ఎర్రకోట వద్ద 12 మందిని బలి తీసుకున్న కారు పేలుడు ఘటన ముమ్మాటికీ ఉగ్రవాద దాడేనని కేంద్ర మంత్రివర్గం తేల్చిచెప్పింది. ఈ పేలుడుపై విచారణ వేగవంతం చేయాలని దర్యాప్తు సంస్థలను ఆదేశించింది. దుశ్చర్యకు కారకులైన దుండగులను, వారి భాగస్వాములను, వారి వెనుక ఉన్న అసలైన కుట్రదారులను సాధ్యమైనంత త్వరగా చట్టం ముందుకు తీసుకురావాలని నిర్దేశించింది. ఉగ్రవాద పోషకులను వదిలిపెట్టబోమని తేల్చిచెప్పింది. విచారణలో ఎలాంటి జాప్యం చేయొద్దని దర్యాప్తు సంస్థలకు సూచించింది. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో బుధవారం కేంద్ర కేబినెట్ సమావేశమైంది. ఈ సందర్భంగా పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఢిల్లీ దాడిలో మరణించివారి ఆత్మశాంతి కోసం ప్రధానమంత్రి, మంత్రులు రెండు నిమిషాలపాటు మౌనం పాటించారు. ఉగ్రవాద దాడిలో సామాన్య ప్రజలు మరణించడం పట్ల తీవ్ర విచారం వ్యక్తంచేస్తూ మంత్రివర్గ సమావేశంలో ఒక తీర్మానం ఆమోదించారు. మొత్తం పరిస్థితిని ఉన్నత స్థాయిలో ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నట్లు కేబినెట్ వెల్లడించింది. దర్యాప్తు జరుగుతున్న తీరు, కుట్రదారులను గుర్తించడానికి చేపట్టిన చర్యలను కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా మంత్రివర్గ సహచరులకు తెలియజేశారు. అంతకుముందు ప్రధాని మోదీ ఎల్ఎన్‌జేపీ హాస్పిటల్‌లో క్షతగాత్రులను పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. ఉగ్రవాదాన్ని సహించే ప్రసక్తే లేదని మంత్రివర్గం తమ తీర్మానంలో స్పష్టంచేసింది. ఉగ్రవాదం ఎక్కడ, ఏ రూపంలో ఉన్నాసరే అంతం చేయాల్సిందేనని పేర్కొంది.

'భద్రతపై కేబినెట్ కమిటీ' సమావేశం

ఢిల్లీ పేలుడు ఘటనను మతిలేని ఉగ్రవాద చర్యగా కేబినెట్ అభివర్ణించింది. ఈ పిరికిపంద చర్యను తీవ్రంగా ఖండిస్తున్నట్లు స్పష్టంచేసింది. బాధిత కుటుంబాలకు సంతాపం ప్రకటించింది. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించింది. బాధితులకు తగిన సాయం, చికిత్స అందించడంలో వైద్య సిబ్బంది, అత్యవసర సేవల సిబ్బంది, ప్రభుత్వ అధికారులు, దర్యాప్తు సంస్థల సిబ్బంది, సాధారణ పౌరులు చురుగ్గా వ్యవహరించారని ప్రశంసించింది. వారి అంకితభావం, విధి నిర్వహణలో చిత్తశుద్ధి శ్లాఘనీయమని ఉద్ఘాటించింది. బాధితులకు అండగా ఉంటామని ప్రకటించింది. దేశ పౌరుల రక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉన్నట్లు మంత్రివర్గం తేల్చిచెప్పింది. జాతీయ భద్రతకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు పేర్కొంది. మరోవైపు మోదీ నేతృత్వంలో 'భద్రతపై కేబినెట్ కమిటీ' సమావేశం జరిగింది. రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, హోంమంత్రి శాఖ మంత్రి అమిత్ షా తదితరులు హాజరయ్యారు. ఢిల్లీ పేలుడు ఘటనతోపాటు తాజా పరిస్థితిపై ఉన్నతాధికారులతో కలిసి సమీక్షించారు.

రూ.25,060 కోట్లతో ఎగుమతి ప్రోత్సాహక మిషన్

ఎగుమతి ప్రోత్సాహక మిషన్(ఈపీఎం)కు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలియజేసింది. ఆరు ఆర్థిక సంవత్సరాల్లో రూ.25,060 కోట్లతో ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనే ప్రారంభిస్తారు. భారత ఉత్పత్తులపై అమెరికా ప్రభుత్వం భారీగా సుంకాలు విధించిన నేపథ్యంలో దేశీయ ఎగుమతిదారులను ఆదుకోవడానికి ఈ కార్యక్రమం దోహదపడుతుందని ప్రభుత్వం చెబుతోంది. ఇందులో రెండు ఉప పథకాలు ఉన్నాయి. అవి నిర్యాత్ పోత్రాహన్(రూ.10,410 కోట్లు), నిర్యాత్ దిశ(రూ.14,659 కోట్లు).

- అరుదైన ఖనిజాలైన గ్రాఫైట్, సేసియం, రుబీడియం జిర్కోనియంపై రాయల్టీ రేట్ల హేతుబద్ధీకరణ ప్రతిపాదనను కేబినెట్ ఆమోదించింది. దీంతో మన దేశంలో ఇంధన భద్రత మరింత బలోపేతం అవుతుందని చెబుతున్నారు. ఆయా ఖనిజాలపై రాయల్టీని తగ్గించబోతున్నట్లు కేంద్రం వెల్లడించింది.
- మన దేశం నుంచి విదేశాలకు ఎగుమతులను మరింతగా ప్రోత్సహించడానికి వీలుగా క్రెడిట్ గ్యారంటీ పథకాన్ని ప్రవేశపెట్టడానికి మంత్రివర్గం ఆమోదించింది. ఇందులో భాగంగా ఎగుమతిదారులకు 100 శాతం క్రెడిట్ గ్యారంటీ కవరేజీని వర్తింపజేస్తారు. ఎగుమతిదారులకు, ఎంఎస్ఎంఈలకు అదనంగా రూ.20 వేలకోట్ల మేర రుణ సౌకర్యం కల్పించబోతున్నారు.

ఇది ప్రజా విజయం

వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: చంద్రబాబు సర్కారు ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేయడాన్ని నిరసిస్తూ 175 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ప్రజలు, విద్యార్థులతో కలిసి వైఎస్సార్‌సీపీ నిర్వహించిన ర్యాలీలు గ్రాండ్ సక్సెస్ కావడంపై వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ర్యాలీలను విజయవంతం చేసిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు, అన్ని వర్గాల ప్రజలు, ప్రజా సంఘాలు, భావసారూప్య పార్టీ శ్రేణులకు కృతజ్ఞతలు తెలిపారు. ఇది ప్రజా విజయం అని అన్నారు. ప్రజాభిప్రాయాన్ని గౌరవించి తక్షణమే మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరించాలనే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని సీఎం చంద్రబాబును డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం రాత్రి సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పోస్టు చేశారు. ఆ పోస్టులో వైఎస్ జగన్ ఏమన్నారంటే..

- వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు గళమెత్తారు. 175 నియోజకవర్గ కేంద్రాల్లో నిర్వహించిన ర్యాలీల ద్వారా ప్రజలు తమ ఆగ్రహాన్ని, ఆవేదనను, సంకల్పాన్ని స్పష్టంగా వ్యక్త పరిచారు. ర్యాలీల్లో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనడం.. ప్రభుత్వ రంగంలో విద్య, వైద్య వ్యవస్థలను కాపాడుకోవాలన్న వారి సంకల్పానికి నిదర్శనం. ఆ సంకల్పంతో స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన ప్రజలందరితోపాటు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంస్థలు, మిత్రపక్షాలు.. వివిధ ప్రజా సంఘాలకు హృదయపూర్వకంగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. ఈ ఉద్యమం ప్రజల నిబద్ధతను, సామాజిక న్యాయంపై ఉన్న విశ్వాసాన్ని ప్రతిబింబిస్తోంది. ప్రజలు స్వలాభం కోసం కాకుండా, సమాజ భవిష్యత్తు కోసం నిలబడ్డారు.
- తమ బాధ్యత మరిచి, ప్రభుత్వ పెద్దల మాటలు మాత్రమే వింటున్న పోలీసులు నిరసన ర్యాలీలను అడ్డుకోవడానికి అన్ని విధాలుగా ప్రయత్నించినా, ఎక్కడా ప్రజలు ఒక్క అడుగు కూడా వెనక్కు వేయలేదు. ధైర్యంగా, శాంతియుతంగా ర్యాలీల్లో పాల్గొన్నారు. ఇది రాష్ట్రంలో ప్రజాస్వామ్య స్ఫూర్తికి అద్దం పట్టింది. బలవంతంగా ప్రజల గొంతు నొక్కలేమని ప్రజా ఉద్యమ ర్యాలీ మరోసారి నిరూపించింది.
- చంద్రబాబు గారూ.. ఇకనైనా ప్రజల మనోభావాలు గుర్తించి, వైద్య కళాశాలల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోండి. ప్రజల సంకల్పాన్ని తక్కువగా అంచనా వేయడం రాష్ట్ర భవిష్యత్తుకు ప్రమాదకరం అవుతుందన్న విషయాన్ని గుర్తించండి. ఈ చారిత్రక ఉద్యమాన్ని విజయవంతం చేసిన అన్ని పార్టీల నాయకులు, కార్యకర్తలతో పాటు, విద్యార్థులు, అన్ని వర్గాల ప్రజలకు మరోసారి నా హృదయ పూర్వక ధన్యవాదాలు.

'ప్రైవేట్' అంటే పిచ్చిప్రేమ

- కేంద్ర సంస్థలకు ఎకరం రూ.4.1 కోట్లు
- ప్రైవేటు సంస్థలకు ఎకరం రూ.50 లక్షలు
- రాజధానిలో భూకేటాయింపుల్లో చంద్రబాబు సర్కార్ తీరు ఇదీ



సాక్షి, అమరావతి: రాజధాని ప్రాంతంలో భూకేటాయింపుల్లో ప్రైవేటు సంస్థలపై చంద్రబాబు ప్రభుత్వం మరోసారి వల్లమాలిన ప్రేమ చూపింది. కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్(కాగ్) వంటి రాజ్యాంగబద్ధ సంస్థలు, నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్(ఎన్‌టీపీసీ) వంటి కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలకు ఎకరం రూ.4.1 కోట్లు చొప్పున కేటాయిస్తే... బాసిల్‌వుడ్స్ ఇంటర్నేషనల్ స్కూల్, సెయింట్ మేరీస్ ఇంటర్నేషనల్ స్కూల్ తదితర ప్రైవేటు సంస్థలకు ఎకరం రూ.50 లక్షలకు కేటాయించింది. మంత్రుల బృందం సిఫార్సుల మేరకు రాజధాని ప్రాంతంలో కొత్తగా 11 సంస్థలకు 49.50 ఎకరాలను కేటాయిస్తూ పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో ఆరు సంస్థలకు కేటాయించిన 42.30 ఎకరాల భూముల్లో కొంత మార్పులు చేశారు. ఉద్యోగుల క్వార్టర్స్ నిర్మాణం కోసం ఎనిమిది సంస్థలకు 12.66 ఎకరాలు కేటాయించారు. గతంలో ఆరు సంస్థలకు కేటాయించిన 16.19 ఎకరాల స్థానంలో ఆ సంస్థలకు మరో చోట భూమి ఇచ్చారు.

రాజధాని భూకేటాయింపుల తీరు ఇదీ...

- బాసిల్‌వుడ్స్ ఇంటర్నేషనల్ స్కూల్‌కు ఐనవోలులో సర్వే నంబరు 132, మందడంలో సర్వే నంబర్లు 492, 493, 498లో 1.50 లక్షల చదరపు అడుగుల నిర్మిత ప్రాంతంతో భవనాలు నిర్మించేందుకు ఎకరం రూ.50లక్షలు చొప్పున 4 ఎకరాలను ఫ్రీహోల్డ్ (పూర్తి హక్కులు) కల్పిస్తూ కేటాయించారు.
- సెయింట్ మేరీస్ ఇంటర్నేషనల్ స్కూల్‌కు తుళ్లూరులో సర్వే నంబర్లు 162, 163, 164, 419, 421, 422లలో 2.40 లక్షల అడుగుల నిర్మిత ప్రాంతంలో భవనాలు నిర్మించేందుకు ఎకరం రూ.50 లక్షలు చొప్పున 7.97 ఎకరాల భూమిని ఫ్రీ హోల్డ్ కల్పిస్తూ కేటాయించారు.
- రాజ్యాంగబద్ధ సంస్థ కాగ్‌కు ఐనవోలులో సర్వే నంబర్లు 56, 57, 58, 64, 81లలో 8,90,774 చదరపు అడుగుల నిర్మిత ప్రాంతంతో భవనాలు నిర్మించేందుకు ఎకరం రూ.4.1 కోట్లు చొప్పున 12 ఎకరాలను ఫ్రీహోల్డ్ పద్ధతిలో ఇచ్చారు.
- కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ ఎన్‌టీపీసీకి రాయపూడిలో సర్వే నంబరు 143, 144లో 1.13 లక్షల చదరపు అడుగుల నిర్మిత ప్రాంతంతో భవనాలు నిర్మించేందుకు ఎకరానికి రూ.4.1 కోట్ల లీజు ప్రీమియం, 60 ఏళ్లపాటు ఏడాదికి చదరపు మీటరుకు ఒక రూపాయి చొప్పున అద్దె చెల్లించేలా 2 ఎకరాలను కేటాయించారు.
- ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు(ఐవోబీ), ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఐడీబీఐ), పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ), నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్(న్యాక్)కు ఒక ఎకరం లీజు ప్రీమియం రూ.4.1 కోట్లు, 60 ఏళ్లపాటు ఏడాదికి చదరపు మీటర్‌కు ఒక రూపాయి చొప్పున అద్దె చెల్లించేలా భూములు కేటాయించారు.

సాక్షి ఎడిటర్ ధనంజయరెడ్డికి మళ్లీ ప్రివిలేజ్ కమిటీ నోటీసులు

▶ మొదటి పేజీ తరువాయి

శాసనసభ వ్యవహారాల కార్యదర్శి ద్వారా నోటీసులు జారీ చేసింది. ఈ నెల 21వ తేదీ ఉదయం 11 గంటలకు వెలగపూడిలోని అసెంబ్లీ కమిటీ హాలులో ప్రివిలేజ్ కమిటీ ముందు హాజరు కావాలని ఆ నోటీసుల్లో పేర్కొంది. పత్రికలో రాసిన పలు కథనాలకు సంబంధించి గతంలో ఎప్పుడూ లేని విధంగా నేరుగా కేసులు నమోదు చేయడం, విచారణ పేరుతో సాక్షి కార్యాలయాలకు తరచూ పోలీసులను పంపి ఇబ్బందులకు గురి చేయడం ద్వారా ప్రభుత్వం పత్రికా స్వేచ్ఛను హరిస్తోంది. ప్రజాస్వామ్యానికే మచ్చ తెచ్చేలా ఎడిటర్ ధనంజయరెడ్డి, రిపోర్టర్లపై కేసులు నమోదు చేయడం, విచారణ పేరుతో సాక్షి కార్యాలయాలకు వచ్చి బెదిరింపులకు పాల్పడడంపై జర్నలిస్టు, ప్రజా సంఘాల నుంచి ఆందోళనలు, నిరసనలు వెల్లువెత్తుతున్నా.. బాబు సర్కారు కక్షసాధింపు పంథాను వీడడం లేదు. దీనిలోభాగంగానే తాజాగా మళ్లీ ప్రివిలేజ్ కమిటీ నోటీసులు జారీ చేయించింది.

కొండవీటి వాగుపై రూ.595.01 కోట్లతో మరో ఎత్తిపోతల

- ఉండవల్లి వద్ద 8,400 క్యూసెక్కులు ఎత్తిపోసేలా మరో నిర్మాణం
- ఇప్పటికే ఐదువేల క్యూసెక్కుల సామర్థ్యంతో ఒకటి పూర్తి
- రాజధానికి ముంపు ముప్పు తప్పించేందుకు పరిపాలన అనుమతి

సాక్షి, అమరావతి : కొండవీటి వాగు ముంపు ముప్పు నుంచి రాజధాని అమరావతిని తప్పించేందుకు ఉండవల్లి వద్ద మరో ఎత్తిపోతల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. రోజుకు 8,400 క్యూసెక్కులను ప్రకాశం బ్యారేజీలోకి ఎత్తిపోసేలా దీనిని నిర్మిస్తారు. రూ.595.01 కోట్ల అంచనా వ్యయంతో ఈ పనులు చేపట్టేందుకు ప్రభుత్వం పరిపాలన అనుమతిచ్చింది. ఈ మేరకు పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్. సురేష్‌కుమార్ బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. కొండవీటి కొండల్లో పేరేచెర్ల వద్ద జన్మించే కొండవీటి వాగు అచ్చంపేట, తాడికొండ, అమరావతి, మంగళగిరి మండలాల మీదుగా ప్రవహించి ప్రకాశం బ్యారేజ్ ఎగువన ఉండవల్లి వద్ద కృష్ణానదిలో కలుస్తుంది. రాజధాని ప్రాంతంలో 23.85 కిమీల పొడవున ప్రవహిస్తుంది. మరోవైపు, కృష్ణా వరద కొండవీటి వాగులోకి ఎగదన్ని రాజధాని ముంపునకు దారితీస్తోంది. అయినా బాబు ప్రభుత్వం ఇక్కడే రాజధాని నిర్మిస్తోంది. కొండవీటి వాగు వరద ముప్పు నుంచి రాజధానిని తప్పించేందుకు రోజుకు 5 వేల క్యూసెక్కులను ప్రకాశం బ్యారేజీలోకి ఎత్తిపోసేలా ఉండవల్లి వద్ద 2018లో రూ.260.48 కోట్ల వ్యయంతో ప్రభుత్వం ఎత్తిపోతలను నిర్మించింది. ఇప్పుడు మరో 8,400 క్యూసెక్కులు ప్రకాశం బ్యారేజీలోకి ఎత్తిసోసేలా మరో ఎత్తిపోతల నిర్మాణానికి సిద్ధమైంది.

రహేజాకు విశాఖలో 99 పైసలకే 27.10 ఎకరాలు కేటాయింపు

- రిలయన్స్‌కు ఎకరం రూ.40 లక్షల చొప్పున అనకాపల్లిలో 30 ఎకరాలు
- పలు కంపెనీలకు భూములు, ప్రోత్సాహకాలు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ

సాక్షి, అమరావతి: రియల్‌ఎస్టేట్ డెవలప్‌మెంట్ కంపెనీ కె.రహేజా రియల్ ఎస్టేట్ గ్రూపునకు విశాఖలో ఎకరం 99 పైసలకు 27.10 ఎకరాలు కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. మధురవాడలోని ఐటీ హిల్ నంబర్-3లో 27.10 ఎకరాలను ఏపీ ల్యాండ్ ఇన్సెంటివ్స్ ఫర్ టెక్ హబ్స్ (లిఫ్ట్) పాలసీ ప్రకారం కేటాయించినట్టు ఉత్తర్వుల్లో పేర్కొంది. దీంతోపాటు రూ.91.2 కోట్లతో రహదారులను కూడా అభివృద్ధి చేయనున్నట్టు తెలిపింది. అనకాపల్లి వద్ద రిలయన్స్ కన్జ్యూమర్ ప్రొడక్ట్స్ లిమిటెడ్ ఏర్పాటు చేయనున్న బ్రూవరేజస్ ప్లాంట్ కోసం ఎకరం రూ.40 లక్షల చొప్పున 30 ఎకరాలను కేటాయించింది. రూ.744 కోట్ల పెట్టుబడి పెట్టనున్న రిలయన్స్‌కు రూ.330.52 కోట్ల టైలర్ మేడ్ రాయితీలను ప్రకటించింది. అనంతపురంలో రూ.1,274 కోట్లతో ఏర్పాటు చేయనున్న సుగుణ స్పాంజ్ పవర్ ప్రైవేట్ లిమిటెడ్‌కు ప్రత్యేక రాయితీలు, రూ.700 కోట్లు పెట్టుబడులు పెట్టనున్న ఎపిటోమ్ కాంపోనెంట్‌కు 19.06 ఎకరాలు, కుప్పంలో ఎన్‌పీఎస్‌పీఎల్‌కు 130 ఎకరాలు, ఐస్పేస్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ 2 ఎకరాలు, ఫ్లూయెంట్ గ్రిడ్ రూ.150 కోట్ల పెట్టుబడులు, క్రేయాన్ టెక్నాలజీ రూ.1,079 కోట్లు, మదర్సన్ టెక్నాలజీకి రూ.109.73 కోట్లతో మధురవాడలో ఐటీ క్యాంపస్, ఉప్పాడలో కాకినాడ వద్ద రూ.44,000 కోట్లతో 1 మిలియన్ గ్రీన్ అల్యూమినియం స్మెల్టర్ ప్రాజెక్టులకు పలు రాయితీలు, ప్రోత్సాహకాలు ఇస్తూ పలు ఉత్వరులు విడుదలయ్యాయి.

కుప్పలు తెప్పలు.. ఎడాపెడా అప్పులు

బడ్జెట్ బయట అప్పులు ఏకంగా రూ.1,02,533 కోట్లు

- ఇందులో కార్పొరేషన్ల పేరుతో అప్పులు రూ.62,533 కోట్లు
- అమరావతి రాజధాని పేరుతో రూ.40,000 కోట్లు
- బ్యాంకుల ద్వారా పౌర సరఫరాల సంస్థ కొత్తగా రూ.5,000 కోట్లు అప్పు
- పౌర సరఫరాల సంస్థకు అనుమతి గ్యారెంటీ ఇస్తూ ఉత్తర్వులు జారీ
- పౌర సరఫరాల సంస్థ అప్పు గరిష్ట పరిమితి రూ.44 వేల కోట్లకు పెంపు
- అమరావతి రాజధాని పేరుతో కొత్తగా రూ.9,000 కోట్ల అప్పు
- ఇందులో ఏపీపీఎఫ్‌సీఎల్ నుంచి రూ.1500 కోట్లు.. ఎన్ఏబీఎఫ్ఐడీ నుంచి రూ.7,500 కోట్లు
- బ్యాంకు నుంచి పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ కొత్తగా రూ.1,000 కోట్లు అప్పు
- బ్యాంకుల నుంచి విద్యుత్ సంస్థలు రూ.1,150 కోట్లు
- వేర్వేరుగా ఉత్తర్వులు జారీ చేసిన చంద్రబాబు ప్రభుత్వం

సాక్షి, అమరావతి : బడ్జెట్ బయట వివిధ కార్పొరేషన్లు, అమరావతి రాజధాని పేరుతో చంద్రబాబు ప్రభుత్వం ఏడాదిన్నర తిరగకుండానే భారీ స్థాయిలో అప్పులు చేసింది. బడ్జెట్ బయట ప్రభుత్వ గ్యారెంటీలు ఇస్తూ అప్పులు చేయడానికి కేబినెట్ సమావేశాల్లో ఆమోదించడం.. ఆ తర్వాత ఆయా శాఖలు జీవోలు జారీ చేయడం ఏడాదిన్నర కాలంగా జరుగుతూనే ఉంది. కొత్తగా అమరావతి రాజధాని, పౌర సరఫరాల సంస్థ, ఆంధ్రప్రదేశ్ పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీపీఎఫ్‌సీఎల్), విద్యుత్ సంస్థల పేరుతో.. వివిధ బ్యాంకులు, ఆర్థిక సంస్థల నుంచి రూ.16,150 కోట్ల అప్పులు చేయడానికి బుధవారం ప్రభుత్వం జీవోలు జారీ చేసింది. దీంతో బడ్జెట్ బయట అప్పులు రికార్డు స్థాయిలో రూ.1,02,533 కోట్లకు చేరాయి. ఇందులో వివిధ కార్పొరేషన్ల పేరుతో బడ్జెట్ బయట గ్యారెంటీ అప్పులు రూ.62,533 కోట్లు ఉండగా, అమరావతి రాజధాని పేరుతో అప్పులు మరో రూ.40,000 కోట్లకు చేరాయి. బడ్జెట్ బయట ప్రభుత్వ గ్యారెంటీలతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అప్పులు చేయడాన్ని అప్పట్లో చంద్రబాబుతో పాటు ఎల్లో మీడియా తప్పుగా చిత్రీకరించాయి. అయితే బాబు సర్కారు బడ్జెట్ బయట కేవలం ఏడాదిన్నర వ్యవధిలోనే ఏకంగా రూ.1,02,533 కోట్లు అప్పులు చేస్తూ ప్రభుత్వ గ్యారెంటీలతో జీవోలు జారీ చేసినా ఎల్లో మీడియాకు తప్పుగా కనిపించడం లేదు. వాస్తవంగా ఎఫ్ఆర్‌బీఎం నిబంధనలకు లోబడే గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వివిధ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల కోసం బడ్జెట్ బయట అప్పులు చేసింది. ఆ అప్పులను తప్పుగా ప్రచారం చేసిన చంద్రబాబు.. ఇప్పుడు కేవలం ఏడాదిన్నరలోనే బడ్జెట్ బయట ప్రభుత్వ గ్యారెంటీతో భారీగా అప్పులు చేశారు.

ఎడాపెడా ఉత్తర్వులు

వాణిజ్య బ్యాంకులు, ఆర్థిక సంస్థల నుంచి పౌర సరఫరాల సంస్థ రూ.5,000 కోట్లు అప్పు చేసేందుకు గ్యారెంటీ ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. అంతే కాకుండా పౌర సరఫరాల సంస్థ అప్పుల గరిష్ట పరిమితిని రూ.39 వేల కోట్ల నుంచి రూ.44 వేల కోట్లకు పెంచుతున్నట్లు ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు నుంచి ఏపీపీఎఫ్‌సీఎల్ రూ.1,000 కోట్ల అప్పు తీసుకునేందుకు అసలుకు, వడ్డీకి గ్యారెంటీ ఇస్తూ కూడా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. బొగ్గు, విద్యుత్ కొనుగోళ్ల కోసం ఈ అప్పు తీసుకుంటున్నట్లు ఉత్తర్వుల్లో చెప్పింది. డిస్కమ్స్ (విద్యుత్ సంస్థలు) వివిధ బ్యాంకుల నుంచి రూ.1,150 కోట్ల అప్పులు చేసేందుకు అసలుకు, వడ్డీకి ప్రభుత్వం గ్యారెంటీ ఇస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. అమరావతి రాజధానిలో పనుల కోసం నేషనల్ బ్యాంక్ ఫర్ ఫైనాన్సింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ డెవలప్‌మెంట్ (ఎన్ఏబీఎఫ్ఐడీ) నుంచి రూ.7,500 కోట్లు అప్పు చేసేందుకు సీఆర్‌డీఏ కమిషనర్‌కు అనుమతిస్తూ మరో ఉత్తర్వులు జారీ చేసింది. ఆ అప్పుకు ఆర్థిక శాఖ నుంచి గ్యారెంటీని తీసుకుని రుణ ఒప్పందం చేసుకోవాల్సిందిగా సీఆర్‌డీఏ కమిషనర్‌కు ఉత్తర్వుల్లో సూచించింది. అలాగే రాజధాని పనుల కోసం ఏపీ పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ నుంచి రూ.1,500 కోట్లు అప్పు తీసుకునేందుకు సీఆర్‌డీఏ కమిషనర్‌కు అనుమతిస్తూ ప్రభుత్వం మరో ఉత్తర్వు జారీ చేసింది. ఈ అప్పునకు ఆర్థిక శాఖ నుంచి గ్యారెంటీ తీసుకుని అప్పు ఒప్పందం చేసుకోవాల్సిందిగా ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది.



బడ్జెట్ బయట వివిధ కార్పొరేషన్ల నుంచి బాబు సర్కారు అప్పులు

పౌర సరఫరాల సంస్థ	రూ.7,000 కోట్లు
మార్క్‌ఫెడ్	రూ.13,700 కోట్లు
ఏపీఐఐసీ	రూ.1,000 కోట్లు
ఏపీఎండీసీ	రూ.9,000 కోట్లు
ఏపీ పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్	రూ.6,710 కోట్లు
బ్యాంకుల నుంచి విద్యుత్ సంస్థలు	రూ.1,150 కోట్లు
ఏపీ విమానాశ్రయాల అభివృద్ధి కార్పొరేషన్	రూ.1,000 కోట్లు
ఏపీ జల జీవన్ మిషన్ కార్పొరేషన్	రూ.10,000 కోట్లు
ఏపీఐఐసీ ద్వారా	రూ.7,500 కోట్లు
ఏపీసీపీడీసీఎల్, ఏపీఎస్‌పీడీసీఎల్ ద్వారా	రూ.5,473 కోట్లు
మొత్తం	రూ.62,533 కోట్లు
రాజధాని అప్పులు	
ప్రపంచ బ్యాంకు,	
ఏసియన్ డెవలప్‌మెంట్ బ్యాంకు	రూ.15,000 కోట్లు
హడ్కో	రూ.11,000 కోట్లు
జర్మనీకి చెందిన కేఎఫ్‌డబ్ల్యూ సంస్థ	రూ.5,000 కోట్లు
ఎన్ఏబీఎఫ్ఐడీ నుంచి	రూ.7,500 కోట్లు
ఏపీపీఎఫ్‌సీఎల్ నుంచి	రూ.1,500 కోట్లు
మొత్తం	రూ.40,000 కోట్లు

సాక్షి ఫ్యామిలీ
గుంటూరు
గురువారం ॥ 13-11-2025



పుస్తకం
తెరిస్తే ఉన్న చోటు నుంచి మాయమైపోతాం. తూనీగల్లా మారిపోతాం. పుస్తకంలోని కథలు జరిగే చోటుకంతా రెక్కలాడిస్తూ ఎగిరెళ్లిపోతాం. 'గుడ్ బాయ్', 'గుడ్ గర్ల్' అనిపించుకోవాలని అందరూ అనుకుంటారు. మంచి నడవడిక ఉంటేనే గుడ్‌బాయ్, గుడ్‌గర్ల్ అయిపోరు. మంచి మార్కులు వస్తే అయిపోరు. ఆటలాడితే అయిపోరు. మంచి పుస్తకం కూడా చదవాలి. ఎన్ని పుస్తకాలు చదివితే అంత గుడ్ మనలోకి వచ్చేస్తుంది. నవంబర్ 14 'చిల్డ్రన్స్ డే' సందర్భంగా మీ అమ్మానాన్నలతో వెళ్లి మీకు నచ్చిన పుస్తకాలు కొనుక్కోండి. ఈ 10 పుస్తకాల్లో నుంచి కూడా ఎంచుకోవచ్చు.

పుస్తకాలే తూనీగ రెక్కలు

పంచతంత్రం

పంచతంత్ర కథల గురించి వినకపోయినా, తెలియకపోయినా మనం పిల్లలు అయినట్టే కాదు. అంత గొప్ప కథలు ఇవి. తన వద్దకు వచ్చిన రాజకుమారులకు విద్యాబుద్ధులు నేర్పే క్రమంలో ఒక గురువు చెప్పిన కథలే ఈ 'పంచతంత్రం'. సంస్కృతంలో విష్ణుశర్మ రాసిన ఈ కథల్ని ప్రపంచంలోని అనేక భాషల్లోకి అనువదించారు. తెలుగులోనూ అనేకమంది వీటిని అనువదించారు. రచయిత, అనువాదకుడు సహవాసి (జంపాల ఉమామహేశ్వరరావు) నుంచి వచ్చిన పుస్తకం ఇది. ప్రతి కథలోనూ ఓ నీతిని గ్రహించేలా ఈ కథల్ని తీర్చిదిద్దారు.



తెనాలి రామలింగని కథలు

'వికటకవి' తెనాలి రామలింగడంటే తెలుగు పిల్లలకు తెగ ఇష్టం. 'దేశభాషలందు తెలుగు లెస్స' అని చెప్పిన శ్రీకృష్ణదేవరాయల ఆస్థానంలోని అష్టదిగ్గజాల్లో ఒకడు తెనాలి రామలింగడు. ఈయన చాలా తెలివైనవాడు. ఎన్నో జటిల సమస్యలను యుక్తితో పరిష్కరించాడు. అలా ఆయన జీవితం చుట్టూ అల్లుకున్న కథలు తెలుగు జనబాహుళ్యంలో విస్తృతమైన పేరు పొందాయి. అనేకమంది రచయితలు వీటిని రాయగా పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి.

మర్యాద రామన్న కథలు

మర్యాద రామన్న కథలన్నీ తెలివితేటలు పెంచేవే. పేద కుటుంబంలో పుట్టి, రాజుగారి వద్ద గొప్ప పేరు సంపాదించి, ఊరంతటికీ ఉపకారం చేసిన వ్యక్తి మర్యాద రామన్న. సమస్యతో అతనివద్దకు వస్తే దానికి తప్పకుండా పరిష్కారం చూపుతాడు. ఆయన పరిష్కరించిన సమస్యలతో పాటు ఈ కథల్లో ఆనాటి జీవనం, వారి స్థితిగతులను చూడొచ్చు. వివేకం ఉంటే ఎంతటి సమస్యనైనా ఎదుర్కొని నిలబడవచ్చే విషయం ఈ కథల ద్వారా చిన్నారులకు చేరుతుంది.



పురాణాల్లోని 35 నీతి కథలు

పురాణాల ద్వారా పిల్లలు ఎన్నో విషయాలు నేర్చుకోవచ్చు. మంచి నడవడికను పొందొచ్చు. ఈ అంశాలను క్రోడీకరించి ప్రముఖ రచయిత శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి రాసిన 35 నీతి కథలివి. ఇందులో కథలన్నీ చాలా సులభరీతిలో అర్థమవుతాయి. ఇవి చదవడం ద్వారా పిల్లలకు పురాణాల మీద అవగాహన ఏర్పడటంతోపాటు జీవితంలో ఎలా మెలగాలో తెలుస్తుంది.

పేదరాశి పెద్దమ్మ కథలు

ఇప్పుడంటే రైళ్లు, విమానాలు వచ్చాయిగానీ ఒకప్పుడు కాలినడక మీదే ప్రయాణాలు చేసేవారు. అలాంటి బాటసారులకు తన ఇంట్లో ఆశ్రయం ఇచ్చి, వారికి కమ్మటి భోజనం పెట్టి, చెవికింపుగా కథలు చెప్పే పాత్రే పేదరాశి పెద్దమ్మ. పేదరాశి పెద్దమ్మ చెప్పే ప్రతి కథలోనూ నీతితోపాటు మంత్రాలు, మాయలు, హాస్యం, జంతువులు ఉంటాయి. అవన్నీ చిన్నారులకు ఆసక్తి కలిగించి, వారి ఊహాశక్తిని పెంచుతాయి.

రైలు బడి

జపనీస్ భాషలో 1981లో వెలువడిన ఈ పుస్తకం ప్రపంచవ్యాప్తంగా ముప్పై భాషల్లోకి అనువాదమై కోట్లాది మంది హృదయాలను గెలుచుకుంది. టెలివిజన్ వ్యాఖ్యాత టెట్సుకో కురొయనాగి బాల్యంలోని తన రైలు బడి, అక్కడి విశేషాల గురించి రాసిన విశేషాలు ఈ పుస్తకంలో ఉన్నాయి. ఈ పుస్తకం విద్యాబోధనతో వినోదాన్నీ, స్వేచ్ఛనూ, ప్రేమనూ కలగలిపిన ఆదర్శవంతమైన టోక్యో పాఠశాల గురించి వివరిస్తుంది. ఎన్.వేణుగోపాల్ ఈ పుస్తకాన్ని అనువదించారు.

అపూర్వ రష్యన్ జానపద కథలు

రష్యాలో బాలల సాహిత్యానికి చాలా ప్రాముఖ్యం ఇస్తారు. అక్కడి పెద్ద రచయితలు, చిత్రకారులు పిల్లల కోసం తప్పకుండా పుస్తకాలు సృష్టిస్తారు. అలా రష్యన్ భాషలో పిల్లల కోసం రాసిన 20 కథల తెలుగు అనువాదం ఈ పుస్తకం. రష్యన్ చిత్రకారులు వేసిన రంగుల బొమ్మలతో ఎంతో ఆకర్షణీయంగా ఉంటుంది. ఇందులోని సముద్రతీరంలో పిల్లవాడు, లెక్కల కుందేలు, అక్కాతమ్ముడు, చందమామ రొట్టె తదితర కథలన్నీ చదవడం చిన్నారులకు వివేకాన్ని, వినోదాన్ని అందిస్తుంది.

చందమామ కథలు

ఒకప్పుడు కథలంటే చందమామ కథలే. పిల్లల పత్రికంటే చందమామే. ఒకనాడు ప్రతి నెలా వెలువడిన మాసపత్రిక 'చందమామ' కోసం ఇంటిల్లిపాదీ ఎదురు చూసేవారు. చిన్నారులు చందమామ చదివి ఎన్నో విషయాలు నేర్చుకునేవారు. ప్రస్తుతం ఆ మాసపత్రిక అందుబాటులో లేకపోయినా, ఆ కథల్ని పదిలంగా ఉంచాలన్న సంకల్పంతో పుస్తకాలుగా మార్చి విడుదల చేశారు. వీటిలో ఆనాటి కథలతో పాటు రంగురంగుల బొమ్మలున్నాయి. పిల్లలు కథను చదివి అర్థం చేసుకునేందుకు అవి ఉపకరిస్తాయి.

ఓ చిన్నారి డైరీ

జర్మనీకి చెందిన అన్నా ఫ్రాంక్ అనే బాలిక రాసుకున్న డైరీలోని అంశాలే ఈ పుస్తకం. నాజీలు యూదులపై చేసిన అకృత్యాల కారణంగా తన కుటుంబంతో కలిసి రెండేళ్ల పాటు అన్నా ఫ్రాంక్ రహస్య జీవితం గడపాల్సి వస్తుంది. ఆ సమయంలో తను రాసిన డైరీలోని అంశాలు ప్రపంచాన్ని కదిలించాయి. అనారోగ్యంతో ఆమె మరణించినా ఆమె రాతలు నేటికీ ప్రపంచాన్ని కదిలిస్తున్నాయి. ఈ పుస్తకం అనేక భాషల్లోకి అనువాదమైంది. పిల్లల ఊహల్లో ప్రపంచం ఎంత అందంగా ఉంటుందో పిల్లలు ఈ ప్రపంచం నుంచి ఎంత మంచిని ఆశిస్తారో తెలుస్తుంది.

లిప్తకాలపు స్వప్నం

ఏడేళ్ళకే నూరేళ్లు నిండిన క్లింట్ అనే కేరళ బాలుడి జీవిత కథ ఇది. ఆ కాసింత కాలంలోనే ఇరవయ్యైదు వేల బొమ్మలు గీసి, వాటిని తన జ్ఞాపకాలుగా వదిలి వెళ్ళాడు. అతని ఆసక్తులు, అతని వేళ్ళలోని ప్రతిభ, అతని ఆలోచనల్లోని పదును, అతని అమ్మానాన్నల మురిపెం, అతని చుట్టూ ఉన్న వాళ్ళ అపేక్ష..ఇవన్నీ వ్యక్తపరిచే పుస్తకమిది. క్లింట్ గీసిన బొమ్మలు ఈ పుస్తకంలో ఉన్నాయి. స్వర్ణ కిలారి ఈ పుస్తకాన్ని అనువదించారు.

నాకు సూపర్ పవర్స్ వస్తే..!

- బేబీ శాన్వీ పటేల్

బుల్లితెరపై 'మల్లి' సీరియల్‌తో, వెండితెరపై 'రాబిన్ హుడ్' సినిమాతో పాపులర్ అయింది బేబీ శాన్వీ పటేల్. 'రాబిన్ హుడ్' సెట్‌లో హీరోయిన్ శ్రీలీల చేసిన సర్‌ప్రైజ్ గురించి, తనకు సూపర్ పవర్స్ వస్తే ఏం చేస్తుందో... ఇలా బోలెడన్ని కబుర్లు పంచుకుంది శాన్వీ.

- ప్రస్తుతం నేను ఐదో క్లాస్ చదువుతున్నాను. హైదరాబాద్‌లోనే ఉంటున్నాం. నాకు యాక్టింగ్ అంటే చాలా ఇష్టం. యాక్టింగ్‌తో పాటు సింగింగ్, డ్రాయింగ్ కూడా వచ్చు. కూచిపూడి డ్యాన్స్ నేర్చుకుంటున్నాను. అలాగే చదువుపై కూడా శ్రద్ధ ఉంది. స్టడీస్ విషయంలో అమ్మ చాలా స్ట్రిక్ట్‌గా ఉంటారు. ఒకవైపు చదువుకుంటూనే మరో వైపు సినిమాలు చేయడం నాకేం ఇబ్బంది లేదు. మా అమ్మ సహాయంతో బ్యాలెన్స్ చేసుకుంటున్నాను. సింగింగ్, డ్రాయింగ్‌లలో నాకు స్కిల్స్ ఉన్నప్పటికీ యాక్టింగ్ అంటేనే ఇష్టం. భవిష్యత్‌లోనూ యాక్టింగ్‌ని కంటిన్యూ చేస్తూనే స్టడీస్‌ని పూర్తి చేస్తాను.
- జవహర్‌లాల్ నెహ్రూగారి జయంతిని మనం చిల్డ్రన్స్ డేగా సెలబ్రేట్ చేసుకుంటామని నాకు తెలుసు. ఆయనకు పిల్లలంటే చాలా ఇష్టం. టీచర్స్ డే, చిల్డ్రన్స్ డేలను మా స్కూల్లో బాగా సెలబ్రేట్ చేస్తారు. మా క్లాస్‌లో ఉన్న బెంచలన్నింటినీ తీసేసి, మా టీచర్ గైడెన్స్‌తో అక్కడ కేక్ కట్ చేస్తాం. అలాగే అక్కడ కొన్ని సాంగ్స్‌కు సింగిల్‌గా, గ్రూప్‌గా డ్యాన్స్ కూడా చేస్తాం. బర్త్ డేలను మనం ఎలా సెలబ్రేట్ చేసుకుంటామో అలా చిల్డ్రన్స్ డేని సెలబ్రేట్ చేసుకుంటాం. ఈ ఏడాది చిల్డ్రన్స్ డేకి డ్యాన్సింగ్, సింగింగ్ పోటీల్లో పాల్గొంటున్నాను. మా స్కూల్లో టీచర్స్ అందరూ నాకు ఇష్టమే. ముఖ్యంగా నాకు మా తెలుగు టీచర్ లావణ్య మేడమ్, సైన్స్ టీచర్ నవ్య మేడమ్ అంటే చాలా ఇష్టం.
- నేను యాక్ట్ చేసిన 'కలివి వనం' సినిమా ఈ నెల 21న రిలీజ్ అవుతోంది. అడవులను రక్షించుకోవాలనే కాన్సెప్ట్‌తో ఈ సినిమాను తీశారు దర్శకుడు రాజ్ నరేంద్ర. ఇందులో నాగదుర్గ మేడమ్‌తో కలిసి నటించాను. నాతో పాటుగా మరో నలుగురు చైల్డ్ ఆర్టిస్టులు కూడా ఈ సినిమాలో యాక్ట్ చేశారు. సెట్స్‌లో మేం అందరం చాలా సరదాగా ఉండేవాళ్లం. మనమందరం అడవులను కాపాడుకోవాలి. సేవ్ ఫారెస్ట్స్... సేవ్ లైఫ్స్. నేను రెండు మొక్కలు నాటాను. ప్రతి రోజూ వాటికి నీళ్లు పోస్తాను. ఈ మొక్కల సంరక్షణను నేనే చూసుకుంటాను.
- తెలుగు హీరోస్‌లో ప్రభాస్, అల్లు అర్జున్‌గార్లు అంటే ఇష్టం. హీరోయిన్స్‌లో శ్రీలీల, నాగదుర్గ మేడమ్స్ ఇష్టం. శ్రీలీలగారు హీరోయిన్‌గా చేసిన 'రాబిన్‌హుడ్'లో నేను యాక్ట్ చేశాను. త్రీ డేస్ ముందు నా బర్త్ డే గురించి చెప్పాను. నా ఫ్యామిలీ మెంబర్స్‌ని పిలిపించి, సర్‌ప్రైజ్‌గా నా బర్త్ డేని సెలబ్రేట్ చేశారు శ్రీలీల మేడమ్. నేను సూపర్ హీరో సినిమాలూ చూస్తుంటాను. నాకు సూపర్ పవర్స్ వస్తే... సినిమాల్లో హీరోలు చేసినట్లుగా నేనూ మంచి పనులకే ఆ పవర్స్‌ని వాడతాను. నా ఫేవరెట్ కలర్ సిక్స్. సో... నాకు సిక్స్ కలర్స్ అంటే ఇష్టం. పింక్, పర్పుల్, బ్లాక్, మెరూన్, గ్రే వంటివి ఇష్టం.
- ఇప్పుడు ఇంద్రజ మేడమ్‌గారితో ఓ సినిమా చేస్తున్నాను. ఆమె కూతురు పాత్రలో నటిస్తున్నాను. 'మల్లి' సీరియల్‌లో మల్లిక క్యారెక్టర్ చేశాను. నేను నటించిన మరికొన్ని సినిమాలు విడుదలకు రెడీ అవుతున్నాయి. పిల్లల గురించి వచ్చే సినిమాలు, సందేశం ఇచ్చే సినిమాలంటే నాకు ఇష్టం. ఫైటింగ్ సినిమాలన్నా కూడా ఇష్టమే.

– ముసిమి శివాంజనేయులు

సాక్షి సినిమా

● రోషన్, ఎన్టీఆర్

ఆనందంగా ఉండాలంటే...

రోషన్ కనకాల హీరోగా నటించిన తాజా చిత్రం 'మోగ్లీ 2025'. 'కలర్ ఫోటో' ఫేమ్ సందీప్ రాజ్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో సాక్షి సాగర్ మడోల్కర్ హీరోయిన్. టీజీ విశ్వప్రసాద్, కృతీ ప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం డిసెంబరు 12న రిలీజ్‌కి సిద్ధమవుతోంది. ఈ మూవీ టీజర్‌ని హీరో ఎన్టీఆర్ లాంచ్ చేసి, చిత్రయూనిట్‌కి శుభాకాంక్షలు తెలిపారు. 'మనకెందుకు మావ్య ఈ కోపాలన్నీ... పావుగంట ఆపకుండా నవ్వాలంటేనే బుగ్గలు నొప్పెడతాయి... అలాంటిది జీవితాంతం ఆనందంగా ఉండాలంటే ఎలా చెప్పు...' అంటూ రోషన్ చెప్పే డైలాగ్స్ టీజర్‌లో ఉన్నాయి.

మందాకిని ఫైర్

● ప్రియాంకా చోప్రా

ఇక్కడున్న ఫొటో చూశారుగా..! చీరకట్టులో గన్ పట్టుకుని ఫైర్ చేస్తున్నారు మందాకిని. ఎందుకు అనేది తెలియాలంటే మరికొన్ని రోజులు ఎదురు చూడాల్సిందే. మహేశ్‌బాబు హీరోగా రాజమౌళి దర్శకత్వంలో 'ఎస్ఎస్ఎమ్‌బీ29' (వర్కింగ్ టైటిల్) సినిమా రూపొందుతున్న సంగతి తెలిసిందే. ప్రియాంకా చోప్రా, పృథ్వీరాజ్ సుకుమారన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. మందాకిని పాత్రలో ప్రియాంకా చోప్రా నటిస్తున్నట్లుగా వెల్లడించి, ఆమె ఫస్ట్ లుక్‌ను రిలీజ్ చేశారు. కేఎల్ నారాయణ, కార్తికేయ నిర్మిస్తున్న ఈ చిత్రం 2027 మార్చిలో విడుదలయ్యే అవకాశం ఉంది.

గోవా ట్రిప్ నేపథ్యంలో...

సాయికుమార్, అజిత్ మోహన్, రాజు శివరాత్రి, క్యాంప్ శశి, పవోన్ రమేశ్, మోనిక బుసం నటించిన చిత్రం 'గోపి గాళ్ల గోవా ట్రిప్'. రోహిత్– శశి దర్శకత్వంలో సాయికుమార్, సీతా రామరాజు, రమణా రెడ్డి నిర్మించిన ఈ సినిమా రేపు రిలీజ్ కానుంది. ఈ మూవీ ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో రోహిత్–శశి మాట్లాడుతూ–''హైవే మీద గోవా వరకు ప్రయాణం చేస్తూ ఈ సినిమా షూటింగ్ చేశాం'' అని తెలిపారు. ''ఇది ఇండిపెండెంట్ ఫిల్మ్స్‌లో అత్యుత్తమమైన సినిమా లాంటిది. అందరూ ప్రోత్సహించాలి'' అన్నారు సాయికుమార్.

● పవోన్ రమేశ్, సాయికుమార్, రోహిత్

సీత ప్రయాణం కృష్ణతో..

● దినేష్, రోజా భారతి

దినేష్ హీరోగా నటించిన చిత్రం 'సీత ప్రయాణం కృష్ణతో..'. రోజా భారతి, రాఖీ శర్మ హీరోయిన్లుగా నటించారు. డా. రాజీవ్ సమర్పణలో రోజా భారతి నిర్మించిన ఈ చిత్రం రేపు విడుదల కానుంది. ఈ సందర్భంగా దినేష్ మాట్లాడుతూ– ''ప్రేక్షకులను ఎంటర్‌టైన్ చేసే చిత్రమిది'' అన్నారు. ''యూనిట్‌లోని ప్రతి ఒక్కరూ ఈ సినిమాను తమ సినిమాలా భావించి, చేశారు కాబట్టే రిలీజ్ వరకు రాగలి గాం'' అన్నారు రోజా భారతి. ''ఈ సినిమాలో రాధికా అనే పాత్రలో నటించాను'' అని చెప్పారు రాఖీ. ఈ సినిమాకు సంగీతం: శరవణ వాసుదేవన్.

ఫుల్ బిజీగా...

● ప్రభాస్

సినిమా ఇండస్ట్రీలో నటుడిగా సక్సెస్‌ఫుల్‌గా 23 ఏళ్లు పూర్తి చేసుకున్నారు ప్రభాస్. ఆయన హీరోగా నటించిన తొలి చిత్రం 'ఈశ్వర్' 2002 నవంబరు 11న విడుదలైంది. ఈ చిత్రాన్ని జయంత్. సి పరాన్జీ దర్శకత్వంలో కె. అశోక్ కుమార్ నిర్మించారు. కాగా, హీరోగా ప్రభాస్ 23 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆయన తాజా చిత్రాల్లో ఒకటైన 'ది రాజాసాబ్' నుంచి కొత్త పోస్టర్‌ను రిలీజ్ చేశారు మేకర్స్. దర్శకుడు మారుతి తెరకెక్కిస్తున్న ఈ ఫ్యాంటసీ హారర్ కామెడీ చిత్రంలో మాళవికా మోహనన్, నిధీ అగర్వాల్, రిద్ధి కుమార్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. టీజీ విశ్వప్రసాద్, కృతీ ప్రసాద్ నిర్మిస్తున్న ఈ సినిమా సంక్రాంతి సందర్భంగా జనవరి 9న విడుదల కానుంది. ఇక ఈ సినిమా కాకుండా హను రాఘవపూడి దర్శకత్వంలోని పీరియాడికల్ సినిమా 'ఫౌజి'లో ప్రభాస్ హీరోగా నటిస్తున్నారు. ఇంకా 'అర్జున్ రెడ్డి' ఫేమ్ సందీప్‌రెడ్డి వంగా దర్శకత్వంలో ప్రభాస్ హీరోగా నటించనున్న 'స్పిరిట్' చిత్రం త్వరలోనే సెట్స్‌కు వెళ్లనుంది. ప్రభాస్ హీరోగా నాగ్ అశ్విన్ డైరెక్షన్‌లోని 'కల్కి 2' ('కల్కి 2898 ఏడీ' సీక్వెల్) చిత్రం షూటింగ్ వచ్చే ఏడాది ప్రారంభం కానుంది. అలాగే ప్రముఖ కన్నడ నిర్మాణ సంస్థ హోంబలే ఫిలింస్‌తో ప్రభాస్ మూడు కొత్త సినిమాలు కమిట్ అయిన సంగతి తెలిసిందే. ఈ చిత్రాలకు ఎవరు దర్శకత్వం వహిస్తారనే విషయంపై త్వరలో ఓ స్పష్టత రానుంది. ఇలా వరుస సినిమాలతో ఫుల్ బిజీగా ఉంటున్నారు ప్రభాస్.

అందులో స్ట్రగుల్ అవుతున్నానేమో!

- దుల్కర్ సల్మాన్

● రానా, దుల్కర్

''కాంత' నా కెరీర్‌లోనే స్పెషల్ ఫిల్మ్. ఇలాంటి చిత్రాలు జీవితంలో ఒకసారే వస్తాయి. ఈ సినిమాలోని ప్రతి క్యారెక్టర్‌కు ఒక ఎనర్జీ ఉంటుంది. డ్రామా, ఎమోషన్స్ అద్భుతంగా ఉంటాయి. ఆడియన్స్‌కు ఒక అద్భుతమైన సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్ అందిస్తుంది'' అని దుల్కర్ సల్మాన్ అన్నారు. దుల్కర్ సల్మాన్, భాగ్యశ్రీ బోర్సే హీరో హీరోయిన్లుగా నటించిన చిత్రం 'కాంత'. సముద్రఖని, రానా ముఖ్య పాత్రల్లో నటించారు. రానా, దుల్కర్ సల్మాన్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 14న విడుదల కానుంది. ఈ సందర్భంగా బుధవారం విలేకరుల సమావేశంలో దుల్కర్ సల్మాన్, రానా చెప్పిన విశేషాలు...

దుల్కర్ మాట్లాడుతూ – ''కాంత' కథ విన్నప్పుడే, నేను–రానా కచ్చితంగా ఈ సినిమా చేయాలనుకున్నాం. దర్శకుడు సెల్వ చాలా రీసెర్చ్ చేసి, తెరకెక్కించారు. ఇది ఎవరి బయోపిక్ కాదు. పూర్తిగా కల్పిత కథ. 'మహానటి' సినిమాలో సినిమాల ప్రస్తావన ఉంటుంది. అలాగే 'కాంత'లో ఫిల్మ్‌మేకింగ్ ప్రస్తావన ఉంది. 'కాంత'లోని మహాదేవ పాత్రను నేను ఎలా చేయాలి? ఎలా చేయగలను? అని నేను, దర్శకుడు చర్చించుకునేవాళ్లం. ● తెలుగులో వరుసగా సక్సెస్‌ఫుల్ సినిమాలు చేస్తున్నందుకు చాలా సంతోషంగా ఉంది. అలాగే రీసెంట్ టైమ్స్‌లో నా కెరీర్‌లో ఎక్కువగా పీరియాడికల్ చిత్రాలే ఉంటున్నాయి. బహుశా 2025 నాటి కథలను ఎంపిక చేసుకోవడంలో నేను స్ట్రగుల్ అవుతున్నానేమో (నవ్వుతూ).

రానా మాట్లాడుతూ – ''కాంత' సినిమా 1950 మద్రాస్ నేపథ్యంలో సాగే ఫిక్షనల్ స్టోరీ. ఎవరి తాత, నాన్నల కథ కాదు (నవ్వుతూ). ఇప్పుడు ఏ స్టూడియోలో ఏం జరిగినా వెంటనే అందరికీ తెలిసిపోతుంది. కానీ ఆ కాలంలో అలా కాదు. చాలా తక్కువమందికి తెలిసేది. ఆ కాలంలో జరిగిన కొన్ని సంఘటనల స్ఫూర్తితో ఈ సినిమా తీశాం. 'డార్క్ సైడ్ ఆఫ్ గ్రేట్ పీపుల్' అని చెప్పవచ్చు. ఇద్దరు గొప్ప ఆర్టిస్టులు (దుల్కర్, సముద్ర ఖని పాత్రలను ఉద్దేశించి) వాళ్ల ఆర్టిస్టిక్ బ్రిలియన్స్ కోసం గొడవలు పడిన నేపథ్యంలో 'కాంత' ఆసక్తిగా సాగుతుంది. ● ఒక ఫస్ట్ టైమ్ ఫిల్మ్‌మేకర్‌కు ఉండాల్సిన ప్యాషన్ సెల్వలో కనిపించింది. దర్శకుడు సెల్వ ఈ సినిమా కోసం చాలా రీసెర్చ్ చేశారు. ఇక టెస్ట్ షూట్ సమయంలో భాగ్యశ్రీ మోడ్రన్ డ్రెస్‌లో వచ్చారు. అది చూసి, 'కాంత' సినిమాలో భాగ్య పాత్రకు ఆమె సెట్ అవుతారా? అనిపించింది. కానీ కుమారి పాత్రలో భాగ్య చక్కగా ఒదిగిపోయారు. ● సురేష్‌బాబుగారి ఇన్‌పుట్స్ 'కాంత' సినిమాలో ఉన్నాయి. ఎందుకంటే అప్పటి స్టూడియో కల్చర్ గురించి ఆయనకు బాగా తెలుసు. 'పాతాళభైరవి' సినిమా కోసం వినియోగించిన కెమెరాలు, మరికొన్ని పాత సినిమాల పరికరాలు 'కాంత'లో కనిపిస్తాయి. కమర్షియల్ సినిమాలు తీయడం కాస్త సులువు. కానీ 'కాంత'లాంటి సినిమాలు చేయడం పెద్ద చాలెంజ్.

రష్మికది చాలా మంచి మనసు

- విజయ్ దేవరకొండ

''రష్మికని నేను 'గీత గోవిందం' సినిమా నుంచి చూస్తున్నా.. నిజ జీవితంలోనూ తను భూమానే. తను ఇన్నోసెంట్. తన గురించి ఆలోచించదు.. సెట్స్‌లో అందరూ సంతోషంగా ఉండాలి.. డైరెక్టర్ హ్యాపీగా ఉండాలని ఆలోచిస్తుంటుంది. డైరెక్టర్ ఏది చేయమంటే అది చేస్తుంటుంది. తన ప్రయాణం చూస్తుంటే చాలా గర్వంగా ఉంటుంది. 'నన్ను ఎవడన్నా ఏదైనా గెలికితే నేను మళ్లీ రివర్స్‌లో వెళతాను. కానీ, రష్మిక ఏంటంటే...

● రాహుల్, దీక్షిత్, రష్మిక, అల్లు అరవింద్, విజయ్ దేవరకొండ, ధీరజ్

ప్రపంచంలో ఎవరు ఎన్ని మాటలు అన్నా పట్టించుకోకుండా తన పనిపైనే దృష్టి పెడుతుంది.. అంత మంచి మనసు తనది. తను నిజంగా అమేజింగ్ ఉమన్'' అని హీరో విజయ్ దేవరకొండ తెలిపారు. రష్మికా మందన్నా, దీక్షిత్ శెట్టి జంటగా రాహుల్ రవీంద్రన్ దర్శకత్వం వహించిన చిత్రం 'ది గర్ల్ ఫ్రెండ్'. అల్లు అరవింద్ సమర్పణలో ధీరజ్ మొగిలినేని, విద్య కొప్పినీడి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 7న రిలీజ్ అయింది. ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా 5 రోజుల్లో రూ. 20.4 కోట్లు గ్రాస్ వసూళ్లను రాబట్టినట్లు చిత్ర బృందం పేర్కొంది. ఈ నేపథ్యంలో బుధవారం నిర్వహించిన 'ది గర్ల్ ఫ్రెండ్' గ్రాండ్ సక్సెస్ సెలబ్రేషన్స్ ఈవెంట్‌కి ముఖ్య అతిథిగా హాజరైన విజయ్ దేవరకొండ మాట్లాడుతూ–''ది గర్ల్‌ఫ్రెండ్' సినిమా నన్ను ఎంత భావోద్వేగానికి గురి చేసిందంటే చాలా చోట్ల కన్నీళ్లు ఆపుకోవాల్సి వచ్చింది. చాలా సన్నివేశాల్లో మనసు బరువెక్కిన అనుభూతి కలిగింది. ఈ మధ్య నేను చూసిన గొప్ప చిత్రాల్లో 'ది గర్ల్‌ఫ్రెండ్' ఒకటి. ఈ సినిమా ఇటు ఇండియాలో అటు విదేశాల్లో హ్యూజ్ సక్సెస్ అందుకుంది. ఇలాంటి సామాజిక ఇతివృత్తంతో తెరకెక్కిన సినిమాని నంబర్స్‌తో పోల్చలేం. ఈ చిత్రం సమాజంలో అవేర్‌నెస్ తీసుకొస్తుంది. ఈ సినిమాకి పని చేసిన అందరూ మీ లైఫ్‌లో 'ది గర్ల్‌ఫ్రెండ్' లాంటి మూవీ చేసి జీవితం పరిపూర్ణం చేసుకున్నారు'' అని చెప్పారు. **అల్లు అరవింద్ మాట్లాడుతూ–** ''ది గర్ల్ ఫ్రెండ్'కి హీరో మా డైరెక్టర్ రాహుల్. మా 'గీత గోవిందం'లో నటించిన రష్మిక.. 'ది గర్ల్ ఫ్రెండ్'తో మా సంస్థకు వన్నె తెచ్చింది'' అని పేర్కొన్నారు. **రష్మికా మందన్నా మాట్లాడుతూ–** ''ది గర్ల్‌ఫ్రెండ్'లో నేను చేసిన భూమా పాత్రలో ఏం జరిగిందో నా జీవితంలోనూ అలానే జరిగింది. మనందరి జీవితాల్లోనూ జరిగి ఉంటుంది. ఈ చిత్రం కోసం మొదటిసారి రాహుల్‌కి సరెండర్ అయిపోయి పనిచేశాను. ఈ సినిమాని మీరు (ప్రేక్షకులు) అర్థం చేసుకున్నారు.. బాగా కనెక్ట్ అయ్యారు.. అదే నాకు పెద్ద అవార్డుతో సమానం. ఈ సినిమాలో మొదటి నుంచి విజయ్ భాగమయ్యారు. తన లాంటి వ్యక్తి ప్రతి ఒక్కరి లైఫ్‌లో ఉంటే అదొక బ్లెస్సింగ్ అనుకోవాలి'' అని తెలిపారు. ''భూమా పాత్రలో నటించడం ద్వారా ఎంతోమంది మహిళలకు స్ఫూర్తి ఇచ్చారు రష్మిక'' అన్నారు విద్య కొప్పినీడి. ''మా సినిమాకి ప్రేక్షకులు ఇస్తున్న ప్రశంసలతో జాతీయ అవార్డు పొందినంత సంతోషంగా ఉంది'' అని ధీరజ్ మొగిలినేని పేర్కొన్నారు. ''నా గత సినిమా (మన్మథుడు 2) రిలీజై ఆరేళ్లయింది. 'ది గర్ల్ ఫ్రెండ్' చేస్తున్నప్పుడు ఈ సినిమా ఫలితం అనుకున్నట్లు రాకుంటే నా పరిస్థితి, నా ఫ్యామిలీ పరిస్థితి ఏంటి? అని భయపడ్డాను. కానీ సినిమా చూశాక నా కుటుంబ సభ్యులు గర్వపడుతున్నారు'' అని రాహుల్ రవీంద్రన్ అన్నారు. ఈ వేడుకలో మ్యూజిక్ డైరెక్టర్స్ ప్రశాంత్ విహారి, హేషమ్ అబ్దుల్ వహాబ్, ప్రొడ్యూసర్స్ బన్నీ వాస్, ఎస్‌కేఎన్, డైరెక్టర్ సాయి రాజేశ్, పాటల రచయిత రాకేందు మౌళి, కాస్ట్యూమ్ డిజైనర్ శ్రావ్య వర్మ, నటి రోహిణి తదితరులు మాట్లాడారు.

గ్రామీణ నేపథ్యంలో...

● ఆద్య, నాగార్జున

నాగార్జున పల్లా హీరోగా, ఆద్యా రెడ్డి, భావన నీలప్ హీరోయిన్లుగా రూపొందిన చిత్రం 'రోలుగుంట సూరి'. అనిల్ కుమార్ పల్లా దర్శకత్వంలో సౌమ్య చాందిని పల్లా నిర్మించిన ఈ సినిమా రేపు విడుదల కానుంది. ఈ చిత్రం ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో అనిల్ కుమార్ మాట్లాడుతూ– ''విలేజ్ బ్యాక్‌గ్రౌండ్‌లో 'రోలుగుంట సూరి'ని అద్భుతంగా చేశారని పాటల రచయిత చంద్రబోస్‌గారు ప్రశంసించడంతో మా యూనిట్‌కు ఎనర్జీ ఇచ్చింది'' అని తెలిపారు. ''నేను స్పోర్ట్స్ ఫీల్డ్ నుంచి ఇండస్ట్రీకి వచ్చాను. నాకు ఇది మొదటి చిత్రం'' అన్నారు నాగార్జున పల్లా. ''భావోద్వేగాలు, జీవిత సత్యాలు మిళితమైన చిత్రమిది'' అని తెలిపారు సౌమ్య చాందిని.

స్టాక్ మార్కెట్లు

(తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
595	181
84,467	25,876

విదేశీ సూచీలు

నాస్‌డాక్	23,331	▲	139
డోజోన్స్	48,309	▲	141
ఎఫ్‌టీఎస్‌ఈ 100	9,908	▲	8
డాక్స్	24,382	▼	187
షాంఘై	4,000	▼	3
నికాయ్	51,012	▲	169

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	88.20	89.22
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	115.11	118.05
€	యూరో	ఎస్‌బీఐ	101.33	104.12
¥	జపాన్ యెన్ (100)	ఎస్‌బీఐ	56.84	58.25
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	55.58	56.44
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	65.70	69.39
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	22.75	24.25
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	23.24	24.50
¥	చైనా యువాన్	థామస్‌కుక్	11.58	13.40

గ్రో.. అరంగేట్రం అదరహో!

ముంబై: బ్రోకరేజీ దిగ్గజం 'గ్రో' మాతృ సంస్థ బిలియన్ బ్రెయిన్స్ గ్యారేజ్ వెంచర్స్ షేరు లిస్టింగ్‌లో మెప్పించింది. ఇష్యూ ధర(రూ.100)తో పోలిస్తే బీఎస్ఈలో 14% ప్రీమియంతో రూ.114 వద్ద లిస్టయ్యింది. మార్కెట్ ర్యాలీలో భాగంగా ఈ షేరుకు మరింత డిమాండ్ లభించింది. ఇంట్రాడేలో 34% ఎగసి రూ.134 వద్ద గరిష్టాన్ని నమోదు చేసింది. చివరికి 31% లాభంతో రూ.131 వద్ద ముగిసింది. మార్కెట్ విలువ రూ.80,837 కోట్లుగా నమోదైంది.

టాటా మోటార్స్ సీవీ బంపర్ లిస్టింగ్

28% ప్రీమియంతో రూ. 335 వద్ద ఎంట్రీ

ముంబై: టాటా మోటార్స్ కమర్షియల్ వెహికల్స్ (టీఎంసీవీ) అరంగేట్రంలోనే అదరగొట్టింది. టాటా మోటార్స్ విభజన నేపథ్యంలో టీఎంసీవీ షేరు విలువను రూ.260గా నిర్ధారించగా.. ఎన్ఎస్ఈలో ఇది 28.48 శాతం ప్రీమియంతో రూ.335 వద్ద లిస్టయ్యింది. ఇంట్రాడేలో రూ.345 గరిష్టాన్ని తాకింది. చివరకు 26.56 శాతం లాభంతో 330 వద్ద స్థిరపడింది. ఇక బీఎస్ఈలో ఇది 26.09 శాతం ప్రీమియంతో 330.25 వద్ద అరంగేట్రం చేసింది. ఇంట్రాడేలో రూ. 346.75ను తాకి, చివరికి రూ.327.65 వద్ద క్లోజయ్యింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.1,21,517 కోట్లుగా నమోదైంది. టాటా మోటార్స్‌ను టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికల్స్ (టీఎంపీవీ), టీఎంసీవీగా విడగొట్టిన సంగతి తెలిసిందే. టాటా మోటార్స్ ఇన్వెస్టర్లకు 1:1 నిష్పత్తిలో ఒక టీఎంసీవీ షేరును కేటాయించారు. ఈ డీమెర్జర్ అక్టోబర్ 1 నుంచి అమల్లోకి వచ్చింది. కాగా, అక్టోబర్ 14 నుంచి టాటా మోటార్స్ షేరు టీఎంపీవీగా రూ. 400 వద్ద ట్రేడింగ్‌ను ప్రారంభించింది. ప్రస్తుతం ఇది రూ.402 వద్ద కదలాడుతోంది. టీఎంసీవీ మాత్రం టాటా మోటార్స్ లిమిటెడ్ పేరుతో ఇప్పుడు ట్రేడవుతోంది. కాగా, ఈ రెండింటి ఉమ్మడి మార్కెట్ విలువ ప్రస్తుతం రూ.2.7 లక్షల కోట్లకు చేరింది.

నిర్ణయాత్మక క్షణం: చంద్రశేఖరన్

టాటా మోటార్స్ కమర్షియల్ వెహికల్స్ లిస్టింగ్ అనేది కంపెనీ భవిష్యత్తు ప్రయాణానికి, అలాగే ఆటోమోటివ్ పరిశ్రమకు ఒక 'నిర్ణయాత్మక క్షణం' అని టాటా గ్రూప్ చైర్మన్ ఎన్. చంద్రశేఖరన్ పేర్కొన్నారు. బీఎస్ఈలో జరిగిన లిస్టింగ్ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టాటా మోటార్స్‌ను 'ఐకానిక్' కంపెనీగా అభివర్ణించారు. అటువంటి ప్రతిష్టాత్మక కంపెనీలో నిర్మాణాత్మక మార్పులు చేపట్టడం చాలా కష్టమే అయినా, విజయవంతంగా పూర్తి చేశామని చెప్పారు. ఈ ఏడాది జూలైలో ఇటాలియన్ వాణిజ్య వాహన దిగ్గజం ఇవెకో గ్రూప్‌ను (డిఫెన్స్ బిజినెస్ మినహా) 3.8 బిలియన్ యూరోలకు (దాదాపు రూ.38,240 కోట్లు) కొనుగోలు చేయనున్నట్లు టాటా మోటార్స్ ప్రకటించిన సంగతి తెలిసిందే.

బంగారం జంప్

- మరో రూ. 2,000 పెరుగుదల
- ఢిల్లీలో రూ.1,27,900
- రూ.5,540 ర్యాలీ చేసిన వెండి

న్యూఢిల్లీ: పసిడి, వెండి ధరలు పరుగందుకున్నాయి! ఢిల్లీ మార్కెట్లో బుధవారం 99.9 శాతం స్వచ్ఛత పసిడి 10 గ్రాములకు రూ.2,000 పెరిగి రూ.1,27,900కు చేరుకుంది. గత రెండు పనిదినాల్లో రూ.3,300 లాభపడింది. సోమవారం కూడా రూ.1,300 పెరగడం గమనార్హం. రెడ్‌ఫోర్ట్‌పై దాడితో మంగళవారం ఢిల్లీలో బులియన్ మార్కెట్లు పనిచేయలేదు. మరోవైపు వెండి సైతం కిలోకి రూ.5,540 పెరిగి రూ.1,61,300 స్థాయిని అందుకుంది. అంతర్జాతీయ మార్కెట్లో గోల్డ్ ధర ఔన్స్‌కు 94 డాలర్లు ఎగసి 4,210 డాలర్ల వద్ద ట్రేడయ్యింది. వెండి ఔన్స్‌కు ఒక డాలర్ వరకు పెరిగి 51.66 డాలర్లకు చేరింది. ''అంతర్జాతీయ మార్కెట్లో పసిడి ధరలు బలంగా ఉండడంతో దేశీ మార్కెట్లో ర్యాలీ చేశాయి. యూఎస్ ప్రభుత్వం తిరిగి తెరుచుకుంటుండడంతో సానుకూల సెంటిమెంట్ నెలకొంది'అని ఎల్‌కేపీ సెక్యూరిటీస్ కమోడిటీ విభాగం వైస్ ప్రెసిడెంట్ జతీన్ త్రివేది తెలిపారు.

ధరలు.. కూల్!

- రికార్డు కనిష్టానికి రిటైల్ ద్రవ్యోల్బణం
- అక్టోబర్‌లో 0.25 శాతంగా నమోదు

న్యూఢిల్లీ: నిత్యావసర ధరలు మరింత తగ్గుముఖం పట్టాయి. అక్టోబర్ నెలలో వినియోగ ధరల ఆధారిత సూచీ (సీపీఐ/రిటైల్ ద్రవ్యోల్బణం) రికార్డు కనిష్ట స్థాయి 0.25 శాతానికి తగ్గుముఖం పట్టింది. కూరగాయలు, పండ్లు, గుడ్ల ధరలు శాంతించడానికి తోడు, జీఎస్‌టీలో 380 ఉత్పత్తుల రేట్ల తగ్గింపు ఇందుకు అనుకూలించింది. సీపీఐ డేటా 2014 నుంచి సమీకరిస్తుండగా, ఇంత కనిష్ట స్థాయికి రిటైల్ ద్రవ్యోల్బణం చేరడం ఇదే ప్రథమం. ఈ ఏడాది సెప్టెంబర్‌లో రిటైల్ ద్రవ్యోల్బణం 1.44 శాతం కాగా, 2024 అక్టోబర్‌లో 6.21 శాతంగా ఉండడం గమనార్హం. జాతీయ గణాంక కార్యాలయం (ఎన్ఎస్‌వో) ఈ వివరాలను విడుదల చేసింది.

మైనస్‌లో ఆహార ద్రవ్యోల్బణం

ఆహార విభాగంలో ద్రవ్యోల్బణం మైనస్ 5.02గా నమోదైంది. జీఎస్‌టీ రేట్లు తగ్గడం, సానుకూల బేస్ ప్రభావం, నూనెలు, ఫ్యాట్స్, కూరగాయలు, పండ్లు, గుడ్లు, పాదరక్షలు, తృణ ధాన్యాలు, రవాణా ధరలు తగ్గడం వల్లేనని ఎన్ఎస్‌వో తెలిపింది. జీఎస్‌టీ రేట్ల సవరణ సెప్టెంబర్ 22 నుంచి అమల్లోకి రావడం తెలిసిందే. గ్రామీణ ప్రాంతాల్లో ద్రవ్యోల్బణం మైనస్ 0.25 శాతంగా ఉంటే, పట్టణ ప్రాంతాల్లో 0.88 శాతంగా ఉంది. కేరళలో అత్యధికంగా 8.56 శాతం, తమిళనాడులో అత్యల్పంగా 1.29 శాతం ద్రవ్యోల్బణం కనిపించింది. అసోం, బిహార్, ఛత్తీస్‌గఢ్, ఢిల్లీ, యూపీలో మైనస్‌గా నమోదైంది. 2025–26 సంవత్సరంలో రిటైల్ ద్రవ్యోల్బణం 2.6 శాతంగా ఉండొచ్చన్నది ఆర్‌బీఐ అంచనా. తాజా గణాంకాల నేపథ్యంలో దీన్ని మరింత దిగువకు సవరించొచ్చని ఇక్రా ముఖ్య ఆర్థికవేత్త అదితినాయర్ పేర్కొన్నారు. డిసెంబర్ భేటీలో రెపో రేటును పావు శాతం తగ్గించొచ్చని అంచనా వేశారు. అక్టోబర్‌లో రిటైల్ ద్రవ్యోల్బణం భారీగా తగ్గడానికి సెప్టెంబర్ చివర్లో అమల్లోకి వచ్చిన జీఎస్‌టీ రేట్ల తగ్గింపు కారణమని కేర్‌ఎడ్జ్ రేటింగ్స్ ముఖ్య ఆర్థికవేత్త రజని సిన్హా పేర్కొన్నారు.

టాటా స్టీల్ లాభం దూకుడు

క్యూ2లో రూ. 3,183 కోట్లు

న్యూఢిల్లీ: మెటల్ రంగ దిగ్గజం టాటా స్టీల్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025–26) రెండో త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జూలై–సెప్టెంబర్(క్యూ2)లో నికర లాభం 4 రెట్లుపైగా ఎగసి రూ. 3,183 కోట్లను అధిగమించింది. దేశీయంగా అమ్మకాలు పుంజుకోవడం ఇందుకు సహకరించింది. గతేడాది(2024–25) ఇదే కాలంలో కేవలం రూ. 759 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం 8 శాతం వృద్ధితో రూ. 59,053 కోట్లను తాకింది. గత క్యూలో రూ. 54,503 కోట్ల టర్నోవర్ అందుకుంది. నీలాచల్ ఇస్పాత్ నిగమ్‌సహా దేశీయంగా రూ. 38,592 కోట్ల అమ్మకాలు సాధించింది. ఈ కాలంలో టారిఫ్ అనిశ్చితులు, రాజకీయ, భౌగోళిక ఆందోళనలు తదితర అంశాలు సవాళ్లు విసిరినట్లు కంపెనీ సీఈవో, ఎండీ టీవీ నరేంద్రన్ పేర్కొన్నారు. అయినప్పటికీ పటిష్ట పనితీరు చూపినట్లు తెలియజేశారు.

ఫలితాల నేపథ్యంలో కంపెనీ షేరు బీఎస్ఈలో 1.3 శాతం నీరసించి రూ. 179 వద్ద ముగిసింది.

మార్కెట్ మూడోరోజూ

ముందడుగు

- కలిసొచ్చిన జాతీయ, అంతర్జాతీయ సానుకూలతలు
- సెన్సెక్స్ 595 పాయింట్లు ప్లస్
- 181 పాయింట్లు పెరిగిన నిఫ్టీ

ముంబై: జాతీయ, అంతర్జాతీయ సానుకూల సంకేతాల ప్రభావంతో దేశీయ స్టాక్ మార్కెట్ వరుసగా మూడోరోజూ ముందడుగేసింది. ఐటీ, కన్జూమర్ డ్యూరబుల్స్ షేర్ల ర్యాలీతో బుధవారం సెన్సెక్స్ 595 పాయింట్లు పెరిగి 84,467 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 181 పాయింట్లు బలపడి 25,876 వద్ద నిలిచింది. అమెరికా చరిత్రలో అత్యధిక కాలం కొనసాగిన ఆర్థిక షట్‌డౌన్ ముగింపు దశకు చేరుకోవడం, ఫెడరల్ రిజర్వ్ వడ్డీరేట్ల తగ్గింపు అంచనాలు ఇన్వెస్టర్లకు ఉత్సాహాన్నిచ్చాయి. బీహార్ ఎన్నికల్లో మెజార్టీ ఎగ్జిట్ పోల్స్ బీజేపీ–జేడీయూ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమికే పట్టం కట్టడం సెంటిమెంట్‌ను మరింత బలపరిచింది. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు అందుకున్న సూచీలు ఉదయమే లాభాలతో మొదలయ్యాయి. ట్రేడింగ్ ప్రారంభంలో కాస్త తడబడినా.., తిరిగి పుంజుకున్నాయి. దేశీయంగా ద్రవ్యోల్బణం దిగిరావడం, జీడీపీ వృద్ధి రేటు పెరుగుతుందనే అంచనాలు, మెరుగైన కార్పొరేట్ ఆర్థిక ఫలితాల వెల్లడి ప్రభావంతో కీలక రంగాల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. ఒక దశలో సెన్సెక్స్ 781 పాయింట్లు పెరిగి 84,652 వద్ద, నిఫ్టీ 240 పాయింట్లు బలపడి 25,935 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకాయి.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
మార్జిన్ ట్రేడింగ్‌పై పెరుగుతున్న ఆసక్తి | క్యూ2లో జీడీపీ వృద్ధి 7.2%: ఇండియా రేటింగ్స్

భారత షూటర్లకు నిరాశ

కైరో: ప్రపంచ షూటింగ్ పిస్టల్, రైఫిల్ చాంపియన్‌షిప్‌లో తొలి నాలుగు రోజులు పతకాలు గెలిచిన భారత షూటర్లు ఐదో రోజు నిరాశ పరిచారు. మహిళల 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్ ఈవెంట్‌లో భారత్ నుంచి ముగ్గురు షూటర్లు సిఫ్ట్ కౌర్ సామ్రా, ఆశీ చౌక్సీ, అంజుమ్ మౌద్గిల్ బరిలోకి దిగినా... ఒక్కరు కూడా ఫైనల్ చేరలేకపోయారు. కచ్చితంగా పతకం సాధిస్తుందనుకున్న ప్రపంచ రెండో ర్యాంకర్, భారత స్టార్ సిఫ్ట్ కౌర్ తడబడింది. 66 మంది షూటర్లు పోటీపడ్డ క్వాలిఫయింగ్‌లో సిఫ్ట్ కౌర్ 580 పాయింట్లు స్కోరు చేసి 48వ స్థానంలో నిలిచింది. ప్రపంచ 19వ ర్యాంకర్ ఆశీ చౌక్సీ 588 పాయింట్లతో 15వ స్థానంలో, ప్రపంచ 59వ ర్యాంకర్ అంజుమ్ మౌద్గిల్ 587 పాయింట్లతో 17వ స్థానంలో నిలిచారు. ఈ విభాగంలో ప్రపంచ నంబర్‌వన్ జానెట్ హెగ్ డ్యూస్టాడ్ (నార్వే) స్వర్ణ పతకాన్ని సాధించింది. ఎనిమిది మంది షూటర్ల మధ్య ఎలిమినేషన్ పద్ధతిలో జరిగిన ఫైనల్లో జానెట్ 465.8 పాయింట్లతో విజేతగా నిలిచింది.

బాబోయ్... మేమెళ్లిపోతాం!

- 8 మంది లంక క్రికెటర్ల నిర్ణయం
- పాకిస్తాన్‌తో నేటి రెండో వన్డేపై నీలినీడలు
- ఇస్లామాబాద్ ఆత్మాహుతి దాడితో భయాందోళనలు

కొలంబో: ప్రస్తుతం పాకిస్తాన్ పర్యటనలో ఉన్న శ్రీలంక క్రికెట్ జట్టును తాజా ఇస్లామాబాద్ ఆత్మాహుతి దాడి ఘటన కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. మంగళవారం జరిగిన ఈ హేయమైన ఉగ్రదాడిలో 12 మంది అమాయకులు ప్రాణాలు కోల్పోయారు. పదుల సంఖ్యలో క్షతగాత్రులయ్యారు. ఈ దాడి లంక జట్టులో భయాందోళనలు పెంచింది. ఏకంగా 8 మంది ఆటగాళ్లు తిరుగుముఖం పట్టాలని నిర్ణయించుకున్నారు. షెడ్యూల్ ప్రకారం మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా రెండో మ్యాచ్ గురువారం రావల్పిండిలో జరగాల్సి ఉంది. సింహళ క్రికెటర్లు స్వదేశానికి పయనమైతే నేటి వన్డే మ్యాచ్ రద్దయ్యే అవకాశాలున్నాయి. తొలి వన్డే నెగ్గిన పాక్ 1–0తో ఆధిక్యంలో ఉంది. ఇది మగిశాక జింబాబ్వే మూడో జట్టుగా పాల్గొనే ముక్కోణపు టి20 సిరీస్‌లోనూ లంక తలపడాల్సి ఉంది. దీంతో ఈ నెలాఖరుదాకా బిక్కుబిక్కుమంటూ పాక్‌లో ఉండలేమని లంక క్రికెటర్లు పేర్కొంటున్నారు. అయితే లంక బోర్డు (ఎస్ఎల్‌సీ) మాత్రం షెడ్యూల్ ప్రకారమే తమ జట్టు పాక్ పర్యటనను ముగిస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తోంది. అవసరమైతే 8 మంది క్రికెటర్లను రిజర్వ్ బెంచ్‌తోనైనా భర్తీ చేసేందుకు సిద్ధమని లంక బోర్డు సూచనప్రాయంగా పాక్ క్రికెట్ బోర్డు (పీసీబీ)కు అభయమిచ్చినట్లు తెలిసింది. సరిగ్గా 16 ఏళ్ల క్రితం పాక్ పర్యటనకు వెళ్లిన లంక బృందంపై పాక్ ఉగ్రమూక దాడి చేసింది. ఈ ఘటనలో పలువురు లంక క్రికెటర్లు తూటా గాయాలకు గురయ్యారు.

గంభీర్, పంత్

నితీశ్ స్థానంలో జురేల్

తుది జట్టులో ఇద్దరు కీపర్లు

- జట్టు కూర్పుపై స్పష్టత ఉంది
- కివీస్ సిరీస్ పాఠాలు నేర్పింది
- టీమిండియా అసిస్టెంట్ కోచ్ డస్కటే

కోల్‌కతా: ఫామ్‌లో ఉన్న వికెట్ కీపర్, బ్యాటర్ ధ్రువ్ జురేల్ దక్షిణాఫ్రికాతో జరిగే తొలి టెస్టులో బరిలోకి దిగుతాడని భారత అసిస్టెంట్ కోచ్ రియాన్ టెన్ డస్కటే వెల్లడించారు. ఆంధ్ర ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డి స్థానంలో జురేల్‌ను ఆడిస్తామని ఆయన చెప్పారు. 24 ఏళ్ల వికెట్ కీపర్ ఇప్పటివరకు టీమిండియా తరఫున ఏడు టెస్టులు ఆడాడు. దక్షిణాఫ్రికా 'ఎ' జరిగిన రెండు అనధికారిక టెస్టులు సహా గత ఐదు ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌ల్లో జురేల్ నాలుగు సెంచరీలు చేశాడు. రెగ్యులర్ వికెట్ కీపర్, స్టార్ బ్యాటర్ రిషభ్ పంత్ గైర్హాజరీలో జురేల్ ఇంగ్లండ్ పర్యటనలో నాలుగో టెస్టు ఆడాడు. అయితే ఇప్పుడు పంత్ పునరాగమనం చేయనుండటంతో జురేల్ స్థానంపై నెలకొన్న సందేహాల్ని సహాయ కోచ్ డక్కటే ఒక్క మాటతో నివృత్తి చేశాడు. ఫామ్‌లో ఉన్న జురేల్, రెగ్యులర్ వికెట్ కీపర్ పంత్ ఇద్దరిని తొలి టెస్టులో ఆడిస్తామని స్పష్టం చేశారు.

వ్యూహాలకు అనుగుణంగానే...

'కాంబినేషన్‌పై పూర్తి స్పష్టతతో ఉన్నాం. ఇద్దరు వికెట్ కీపర్లలో ఏ ఒక్కరిని పక్కనబెట్టే ఉద్దేశం జట్టు మేనేజ్‌మెంట్‌కు లేదు' అని డస్కటే వెల్లడించారు. గత ఆరు నెలలుగా నిలకడైన ఫామ్‌ను కొనసాగిస్తున్న ధ్రువ్ జురేల్ ఈడెన్ గార్డెన్స్‌లో శుక్రవారం మొదలయ్యే తొలి టెస్టులో ఆడతాడని చెప్పారు. నితీశ్‌ను పక్కనబెట్టడంపై స్పందిస్తూ... 'అతను వెస్టిండీస్‌తో రెండు టెస్టులు ఆడాడు. ప్రతి మ్యాచ్‌లోనూ మెరుగవుతూనే ఉన్నాడు. కాబట్టి అతని భవిష్యత్తుకు ఎలాంటి ముప్పులేదు. అయితే ప్రస్తుత జట్టు వ్యూహాలకు అనుగుణంగానే అతను తుది జట్టుకు దూరం



జురేల్

కానున్నాడు. బలమైన ప్రత్యర్థితో మ్యాచ్ గెలవాలంటే అందుబాటులో ఉన్న వనరుల్లో మరింత మెరుగైన బలగంతోనే బరిలోకి దిగుతాం. ఇప్పుడు ఇదే జరుగుతోంది. అంతేకానీ నితీశ్‌ను విస్మరించడం మాత్రం కాదు' అని డస్కటే వివరించారు.

పరుగులు చేసే స్పిన్నర్లు

ఇక లోయర్ మిడిలార్డర్‌లో వాషింగ్టన్ సుందర్, అక్షర్ పటేల్, రవీంద్ర జడేజాల రూపంలో భారత్ బ్యాటింగ్ లైనప్ మరింత పటిష్టంగా ఉందని అసిస్టెంట్ కోచ్ అన్నారు. వాళ్లు స్పిన్నర్లయి ఉండొచ్చు. కానీ బ్యాటింగ్ అవసరాల్ని తీరుస్తారని, కాబట్టి వారిపుడు బ్యాటర్లుగా పరిగణించవచ్చని చెప్పారు. తద్వారా కుల్దీప్ యాదవ్ స్థానంలో అక్షర్ పటేల్ తుది జట్టులో ఉంటాడనే విషయాన్ని డస్కటే చెప్పకనే చెప్పినట్లయ్యింది. దీంతో ఇద్దరు పేసర్లు ముగ్గురు స్పిన్నర్లతో కూడిన బౌలింగ్ దళాన్ని తొలి టెస్టులో దింపేందుకు భారత టీమ్ మేనేజ్‌మెంట్ సిద్ధమైంది. ముగ్గురు టాపార్డర్, ముగ్గురు మిడిలార్డర్ బ్యాటర్లతో స్పెషలిస్టు బ్యాటింగ్ విభాగానికి ముగ్గురు స్పిన్ ఆల్‌రౌండర్లు జట్టును నడిపించనున్నారు.

కసరత్తు చేశాం...

సొంతగడ్డపై న్యూజిలాండ్‌తో జరిగిన సిరీస్ నుంచి టీమిండియా పాఠాలు నేర్చుకుందని డస్కటే పేర్కొన్నారు. గతేడాది భారత్ పర్యటనకు వచ్చిన కివీస్ 3–0తో ఆతిథ్య జట్టును వైట్‌వాష్ చేసింది. మన సిన్ పిచ్‌పై ప్రత్యర్థి స్పిన్నర్లు ఎజాజ్ పటేల్ (15 వికెట్లు), మిచెల్ సాన్‌ట్నర్ (13), ఫిలిప్స్ (8) పండగ చేసుకున్నారు. ఈ ముగ్గురు కలిసి 36 వికెట్లు తీయడమే భారత్ కొంపముంచింది. దీనిపై అసిస్టెంట్ కోచ్ మాట్లాడుతూ 'స్పిన్నేయడమే కాదు... ప్రత్యర్థి స్పిన్‌ను ఎదుర్కోవడంపై కూడా కసరత్తు చేశాం. ఎందుకంటే సఫారీ జట్టులోనూ నాణ్యమైన స్పిన్నర్లే అందుబాటులో ఉన్నరు. కాబట్టి కివీస్ నేర్పిన గత పాఠాల అనుభవంతో జట్టు సిద్ధమైంది' అని అన్నారు.

'టైబ్రేక్'కు అర్జున్, హరికృష్ణ

నాలుగో రౌండ్‌లో కార్తీక్, ప్రణవ్ నిష్క్రమణ

అర్జున్

పనాజీ: సొంతగడ్డపై జరుగుతున్న పురుషుల ప్రపంచకప్ చెస్ టోర్నమెంట్‌లో భారత్ నుంచి ముగ్గురు గ్రాండ్‌మాస్టర్లు ఇరిగేశి అర్జున్, పెంటేల హరికృష్ణ, ప్రజ్ఞానంద బరిలో మిగిలారు. ఈ ముగ్గురు తదుపరి దశకు అర్హత సాధిస్తారో లేదో నేడు టైబ్రేక్ రౌండ్ తర్వాత తేలుతుంది. క్లాసికల్ ఫార్మాట్‌లో నిర్ణీత రెండు గేమ్‌ల తర్వాత అర్జున్–పీటర్ లెకో (హంగేరి); హరికృష్ణ–నిల్స్ గ్రాండెలియస్ (స్వీడన్); ప్రజ్ఞానంద–డానిల్ దుబోవ్ (రష్యా) 1–1తో సమంగా నిలిచారు. దాంతో విజేతలను నిర్ణయించేందుకు నేడు ర్యాపిడ్ ఫార్మాట్‌లో టైబ్రేక్ గేమ్‌లను నిర్వహిస్తారు. అర్జున్–పీటర్ లెకో రెండో గేమ్ 36 ఎత్తుల్లో... హరికృష్ణ–గ్రాండెలియస్ రెండో గేమ్ 38 ఎత్తుల్లో... ప్రజ్ఞానంద–దుబోవ్ రెండో గేమ్ 30 ఎత్తుల్లో 'డ్రా'గా ముగిశాయి. మరోవైపు మరో ఇద్దరు భారత గ్రాండ్‌మాస్టర్లు కార్తీక్ వెంకటరామన్, ప్రణవ్ నాలుగో రౌండ్‌ను దాటలేకపోయారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన రెండుసార్లు జాతీయ చాంపియన్ కార్తీక్ 0.5–1.5తో లె క్వాంగ్ లియెమ్ (వియత్నాం) చేతిలో... ప్రణవ్ 0.5–1.5తో నొదిర్‌బెక్ యాకుబొయెవ్ (ఉజ్బెకిస్తాన్) చేతిలో ఓటమి చవిచూశారు. రెండో గేమ్‌లో కార్తీక్ 68 ఎత్తుల్లో... ప్రణవ్ 38 ఎత్తుల్లో ఓడిపోయారు.

నొదిర్‌బెక్ యాకుబొయెవ్, లె క్వాంగ్ లియెమ్‌లతోపాటు లెవోన్ అరోనియన్ (అమెరికా), అల్కంటారా మార్టినెజ్ (మెక్సికో), అలెగ్జాండర్ డాన్‌షెంకో (జర్మనీ) కూడా ప్రిక్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించారు. నాలుగో రౌండ్‌లో అరోనియన్ 1.5–0.5తో రాడోస్లా (పోలాండ్)పై, అల్కంటారా 1.5–0.5తో సరానా అలెక్సీ (సెర్బియా)పై, డాన్‌షెంకో 1.5–0.5తో బ్లూబామ్ మథియాస్ (జర్మనీ)పై విజయం సాధించారు.

హరికృష్ణ

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

టెస్టు జట్టు నుంచి నితీశ్ విడుదల

తొలి టెస్టు ఆడే అవకాశం లేకపోవడంతో నితీశ్ కుమార్ రెడ్డిని డగౌట్‌కు పరిమితం చేయకుండా రెగ్యులర్ మ్యాచ్ ప్రాక్టీస్ కోసం టీమిండియా విడుదల చేసింది. దీంతో దక్షిణాఫ్రికా 'ఎ' జట్టుతో వన్డే సిరీస్‌లో ఈ ఆంధ్ర ఆల్‌రౌండర్ పాల్గొననున్నాడు. భారత్ 'ఎ' తరఫున అతను బరిలోకి దిగుతాడు. ఇరు జట్ల మధ్య మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా నేడు రాజ్‌కోట్‌లో తొలి మ్యాచ్ జరుగుతుంది. ఇదే వేదికపైనే 16, 19 తేదీల్లో రెండు, మూడో వన్డేలు నిర్వహిస్తారు.

క్లుప్తంగా...

కళా దర్శకుడు తోట తరణికి ఫ్రెంచ్ ప్రతిష్టాత్మక అవార్డు

అభినందనలు తెలిపిన తమిళ సీఎం స్టాలిన్

తమిళ సినిమా: ప్రముఖ సినీ కళా దర్శకుడు తోట తరణికి ఫ్రాన్స్ ప్రభుత్వం ప్రతిష్టాత్మక అవార్డు అయిన సెవాలియర్ అవార్డును ప్రకటించింది. తోట తరణి తమిళ, తెలుగు, మలయాళం, హిందీ తదితర భాషల్లో వందలాది చిత్రాలకు కళా దర్శకత్వం వహించారు. భారతీయ సినిమాకు 64 ఏళ్లుగా ఎనలేని సేవలు చేస్తున్నారు. సినిమా కోసం ఈయన సెట్ వేశారంటే అది వాస్తవికతకు దర్పణం పడుతుంది. శివాజీ చిత్రంలో వాజీ వాజీ పాటకు, దశావతారం, నాయకన్, వరలారు, సచ్చిన్, పొన్నియిన్ సెల్వన్ వంటి చిత్రాల్లో ఆయన వేసిన సెట్స్ గొప్ప పేరు తెచ్చుకున్నాయి. ఇటీవల ధనుష్, నాగార్జున కలిసి నటించిన కుబేర, హరిహర వీరమల్లు, ఘాటి చిత్రాలకు కూడా పని చేశారు. ఈ అవార్డును తోట తరణికి ఈ నెల 13న చెన్నైలో ఫ్రాన్స్ రాయబారి ప్రదానం చేయనున్నారు. ఫ్రాన్స్ ప్రతిష్టాత్మక అవార్డుకు ఎంపికైన తరణికి తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్, నామ్ తమిళర్ పార్టీ నేత సీమాన్ తదితరులు అభినందనలు తెలిపారు.

కొలకలూరి ఇనాక్‌కు గురజాడ విశిష్ట పురస్కారం

కొలకలూరి ఇనాక్

విజయనగరం టౌన్: మహాకవి గురజాడ అప్పారావు వర్ధంతిని పురస్కరించుకుని ప్రతి సంవత్సరం ప్రదానం చేసే గురజాడ విశిష్ట పురస్కారానికి ఈ ఏడాది సాహితీవేత్త, పద్మశ్రీ పురస్కార గ్రహీత ఆచార్య కొలకలూరి ఇనాక్‌ను ఎంపిక చేశారు. ఈ విషయాన్ని గురజాడ సాంస్కృతిక సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు, కాపుగంటి ప్రకాష్ తెలిపారు. విజయనగరంలోని గురజాడ స్వగృహంలో బుధవారం ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ 2000 సంవత్సరంలో ఈ పురస్కారాల ప్రదానోత్సవాన్ని ప్రారంభించామని చెప్పారు. ఇప్పటి వరకు జేవీ సోమయాజులు, గొల్లపూడి, డాక్టర్ సి.నారాయణరెడ్డి వంటి పలువురు సాహితీ ప్రముఖులకు గురజాడ విశిష్ట పురస్కారాలను అందజేశామన్నారు. విద్య, సాహిత్య రంగాలకు విశేష సేవలు అందించిన ఆచార్య కొలకలూరి ఇనాక్‌ను ఈ ఏడాది గురజాడ విశిష్ట పురస్కారానికి ఎంపిక చేయడం ఆనందంగా ఉందన్నారు. ఈ నెల 30వ తేదీన నిర్వహించే సభలో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్ చేతుల మీదుగా ఆచార్య కొలకలూరి ఇనాక్‌కు గురజాడ విశిష్ట పురస్కారాన్ని ప్రదానం చేస్తామని వివరించారు. ఈ సమావేశంలో గురజాడ సాంస్కృతిక సమాఖ్య ప్రతినిధులు డాక్టర్ ఎ.గోపాలరావు, ఇందిర, గురజాడ మునిమనవడు వెంకటేశ్వర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

17నుంచి 26 వరకు పాఠశాలల్లో ఆధార్ క్యాంపులు

సాక్షి, అమరావతి: గ్రామ, వార్డు సచివాలయాల శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 17 నుంచి 26వ తేదీ వరకు పాఠశాలల్లో మరో విడత ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వహించాలని ఆ శాఖ డైరక్టర్ శివప్రసాద్ బుధవారం కలెక్టర్లకు లేఖ రాశారు. రాష్ట్రంలో సచివాలయాల వ్యవస్థ ఏర్పాటు తర్వాత నాలుగేళ్లుగా మారుమూల ప్రాంతాల్లోనూ ఆధార్ సేవలు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చిన విషయం తెలిసిందే. ఆధార్ జారీ సంస్థ (యూఐడీఏఐ) గణాంకాల ప్రకారం.. రాష్ట్రంలో 15.46 లక్షల మంది పిల్లలు తమ ఆధార్‌లో బయోమెట్రిక్ అప్‌డేట్ చేసుకోవాల్సి ఉంది. ఈ మేరకు జిల్లా వారీ గణాంకాలను కలెక్టర్లకు రాసిన లేఖలో శివప్రసాద్ వివరించారు.

స్ట్రే వేకెన్సీ రౌండ్ కౌన్సెలింగ్‌కు నోటిఫికేషన్

సాక్షి, అమరావతి: 2025–26 ఎంబీబీఎస్ మేనేజ్‌మెంట్ కోటా స్ట్రే వేకెన్సీ (మూడు రౌండ్ల తర్వాత మిగిలిన సీట్లు) రౌండ్ కౌన్సెలింగ్‌కు బుధవారం ఆరోగ్య విశ్వవిద్యాలయం నోటిఫికేషన్ విడుదల చేసింది. విద్యార్థులు గురువారం సా.5 గంటల్లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని.. రిజిస్ట్రేషన్ ఫీజు రూ.తొమ్మిది వేలు చెల్లించాలని సూచించింది. గతంలో దరఖాస్తు చేసుకోని విద్యార్థులు గడువు ముగిసేలోపు దరఖాస్తు చేసుకోవాలని వర్సిటీ అందులో కోరింది.

చెన్నై–విజయవాడ వందేభారత్ నరసాపురం వరకు పొడిగింపు

జనవరి 12 నుంచి అమలులోకి..

సాక్షి, అమరావతి: చెన్నై సెంట్రల్–విజయవాడ వందేభారత్ రైలును నరసాపురం వరకు పొడిగించారు. గుడివాడ, భీమవరం టౌన్లలో కూడా హాల్ట్ కల్పించారు. ఈ పొడిగింపు జనవరి 12 నుంచి అమలులోకి వస్తుంది. చెన్నై సెంట్రల్‌లో ఉదయం 5.30 గంటలకు బయలుదేరి మధ్యాహ్నం 2.10 గంటలకు నరసాపురం చేరుకుంటుంది. మళ్లీ నరసాపురంలో మధ్యాహ్నం 2.50 గంటలకు బయలుదేరి రాత్రి 11.45 గంటలకు చెన్నై సెంట్రల్ చేరుతుందని దక్షిణ మధ్య రైల్వే బుధవారం ఓ ప్రకటనలో తెలిపింది.

భక్తుల మనోభావాలు దెబ్బ తీయొద్దు

టీటీడీ మాజీ ఈవో ధర్మారెడ్డి

విచారణ పూర్తయ్యాక బయటకు వచ్చిన ధర్మారెడ్డి

సాక్షి టాస్క్‌ఫోర్స్: అవాస్తవాలు ప్రసారాలు చేసి శ్రీవారి భక్తుల మనోభావాలు దెబ్బ తీయవద్దని టీటీడీ మాజీ ఈవో ధర్మారెడ్డి మీడియా ప్రతినిధులకు సూచించారు. విచారణలో ఒకటి జరిగితే.. కొన్ని ప్రసార మాధ్యమాల్లో మాత్రం మరొకటి ప్రచురించడం సరికాదన్నారు. అవాస్తవాలు ప్రసారం అలవాటు చేసుకున్న కొన్ని మీడియాలు పనిగట్టుకుని ఇలా చేయడం చాలా దారుణమన్నారు. సిట్ అధికారుల విచారణకు తాను పూర్తిస్థాయిలో సహకరించానని, విచారణ బృందం అడిగిన అన్ని ప్రశ్నలకు సవివరంగా సమాధానం చెప్పానని తెలిపారు. గతంలో టీటీడీలో బాధ్యతలు నిర్వర్తించిన అందరు అధికారులను ప్రశ్నించడంలో భాగంగానే తనను కూడా విచారించారన్నారు. టీటీడీ నెయ్యి వ్యవహారంపై సీబీఐ విచారణలో భాగంగా డీఐజీ మురళి లంబ, ఏఎస్పీ వెంకట్‌రావు బుధవారం రెండో రోజు తిరుపతిలోని భూదేవి కాంప్లెక్స్ సిట్ కార్యాలయంలో ధర్మారెడ్డిని విచారించారు. విచారణ అనంతరం బయటకు వచ్చిన ధర్మారెడ్డి ఈమేరకు ఓ పత్రికా ప్రకటన విడుదల చేశారు.

సూటిగా జవాబులిచ్చిన ధర్మారెడ్డి

విచారణ సమయంలో దర్యాప్తు అధికారులు పదేపదే అవే ప్రశ్నలు గుచ్చిగుచ్చి అడిగినప్పటికీ ధర్మారెడ్డి సూటిగా సమాధానాలు ఇచ్చినట్లు సమాచారం. కల్తీ జరగకుండానే ఏదో జరిగిపోయిందని అసత్య ప్రచారం చేశారని ధర్మారెడ్డి స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. టీటీడీలో జరిగే కొనుగోళ్లపై సిట్ అధికారులు పలు ప్రశ్నలు సంధించారని సమాచారం. పర్చేజింగ్ కమిటీ నిబంధనలు ఏమిటి? టెండర్ ఎలా ఖరారు చేస్తారు..? టీటీడీ బోర్డు పర్చేజ్ కమిటీని నియమిస్తుంది కదా..! అందులో వ్యక్తులకు ప్రమేయం ఉందా? తక్కువ కోట్ చేస్తే తీసుకోవాలనే నియమం ఉందా? పర్చేజ్ కమిటీ సభ్యులు అందరూ కలిసి కొనుగోలు చేయాలా..? కమిటీలో ఒక్కరు నిర్ణయం తీసుకున్నా అందరూ కొనుగోలు చేయవచ్చా..? అనే ప్రశ్నలు సంధించారని తెలుస్తోంది. లేబొరేటరీ తనిఖీలు ఈవో స్థాయివి కావని, ప్రతి దానికి ఒక వ్యవస్థ ఉందని, దాని ప్రకారమే టీటీడీ పని చేస్తుందని ధర్మారెడ్డి పేర్కొన్నట్లు సమాచారం. ఒకవేళ ఏదైనా జరిగి ఉంటే తమ దృష్టికి వచ్చేదని.. అప్పుడు దానిపై చర్యలు తీసుకునే వాళ్లమని స్పష్టం చేసినట్లు సమాచారం. టీటీడీ చరిత్రలో ఎప్పుడూ ఎక్కువ కోట్ చేసిన వ్యక్తులకు టెండర్ కేటాయించలేదని ధర్మారెడ్డి స్పష్టం చేశారు. ఏ ప్రభుత్వాలు అధికారంలో ఉన్నా.. తక్కువ ధరకు టెండర్లు వేసిన వారికే టీటీడీ కేటాయించడం ఆనవాయితీగా వస్తోందని, గత టెండర్లను పరిశీలిస్తే ఈ విషయం స్పష్టంగా బోధపడుతుందని విచారణ అధికారులకు ధర్మారెడ్డి స్పష్టంగా చెప్పినట్లు తెలుస్తోంది.

ఎల్లో మీడియా ఓవర్ యాక్షన్

సీబీఐ నేతృత్వంలోని సిట్ విచారణలో జరిగింది ఒక్కటైతే.. ఎల్లో మీడియా దుష్ప్రచారంతో ప్రజలను తప్పుదారి పట్టిస్తోంది. విచారణ అధికారులే తమకు పూసగుచ్చి చెప్పినట్లుగా అబద్ధాలను ప్రచారం చేస్తోంది. బుధవారం విచారణకు హాజరైన టీటీడీ మాజీ ఈవో ధర్మారెడ్డి అనివార్య కారణాల వల్ల భోజనానికి బయటకు రాలేకపోయారు. దీంతో టీవీ 5, ఏబీఎన్ దీన్ని వక్రీకరిస్తూ అబద్ధాలకు తెగబడ్డాయి. మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో ధర్మారెడ్డి అప్రూవర్‌గా మారారంటూ టీవీ 5 దుష్ప్రచారానికి తెర తీసింది. ఆ వెంటనే ఏబీఎన్ సైతం తానేం తక్కువ తినలేదంటూ ఆ విష ప్రచారాన్ని అందుకుంది.

నవభారత నిర్మాణంలో భాగస్వాములు కావాలి

గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్

ఎస్ఎస్‌వీ రామకుమార్‌కు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేస్తున్న గవర్నర్ అబ్దుల్‌నజీర్

కర్నూలు కల్చరల్: నవభారత నిర్మాణంలో యువత భాగస్వాములు కావాలని రాష్ట్ర గవర్నర్, రాయలసీమ యూనివర్సిటీ చాన్సలర్ జస్టిస్ ఎస్.అబ్దుల్‌నజీర్ పిలుపునిచ్చారు. రాయలసీమ యూనివర్సిటీ 4వ స్నాతకోత్సవం ప్రొఫెసర్ వి.వెంకట బసరావు అధ్యక్షతన బుధవారం జరిగింది. గవర్నర్ మాట్లాడుతూ.. విద్య బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దుతుందన్నారు. నైపుణ్యం కలిగిన శ్రామిక శక్తి ఆర్థిక వృద్ధిని నడిపిస్తుందని.. జాతీయ ఐక్యతను, సామాజిక పురోగతిని ప్రోత్సహిస్తుందన్నారు. ఎన్ఈపీ–2020 వల్ల ఉన్నత విద్య, వృత్తి విద్యతో సహా ఐఐటీ, ఐఐఎంలతో సమానంగా బహుళ క్రమశిక్షణా విద్య, పరిశోధనలో విశ్వవిద్యాలయాలు దేశంలో ప్రపంచ ప్రమాణాలకు నమూనాలుగా నిలుస్తున్నాయని చెప్పారు. ఏఎం గ్రీన్ చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ ఎస్ఎస్‌వీ రామకుమార్‌కు వర్సిటీ తరఫున గౌరవ డాక్టరేట్‌ను గవర్నర్ ప్రదానం చేశారు. పీజీ, ఇంజినీరింగ్‌లో టాపర్స్‌గా నిలిచిన 20 మంది విద్యార్థులకు గోల్డ్ మెడల్స్ అందజేశారు. ఉన్నత విద్యామండలి చైర్మన్ మధుమూర్తి, వీసీ వి.వెంకట బసరావు 55 మంది విద్యార్థులకు గోల్డ్‌మెడల్స్, 283 మంది పరిశోధకులకు పీహెచ్‌డీ పట్టాలను అందజేశారు. కలెక్టర్ ఏ.సిరి, ఎంపీ బస్తిపాటి నాగరాజు, కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, రెక్టార్ ఎన్‌టీకే నాయక్, రిజిస్ట్రార్ బి.విజయకుమార్‌నాయుడు, కళాశాల ప్రిన్సిపాల్ సీవీ కృష్ణారెడ్డి పాల్గొన్నారు. అనంతరం కర్నూలు ఏక్యాంప్ మాంటిస్సోరి పాఠశాలలో జరిగిన పాఠశాల గోల్డెన్ జూబ్లీ వేడుకల్లో గవర్నర్ అబ్దుల్ నజీర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

3 నెలలుగా జీతాల్లేవు.. ఎలా బతకాలి

- మంచినీటి ల్యాబ్‌ల ఉద్యోగుల ఆందోళన
- చంద్రబాబు సర్కారులో వీరు రోడ్డెక్కడం ఇది మూడోసారి

సాక్షి, అమరావతి: మూడునెలలుగా వేతనాలు ఇవ్వలేదని నీటినాణ్యత పరీక్షలు నిర్వహించే ఆర్‌డబ్ల్యూఎస్ ల్యాబ్‌ల ఉద్యోగులు ఆందోళన బాట పట్టారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ పరిధిలోని ఆర్‌డబ్ల్యూఎస్ ఈఎన్‌సీ ఆఫీసు ఎదుట బుధవారం ఆందోళన చేశారు. జీతాలివ్వకపోతే తాము ఎలా బతకాలంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్‌డబ్ల్యూఎస్ పరిధిలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 112 నీటినాణ్యత ల్యాబ్‌లలో 526 మంది పనిచేస్తున్నారు. ఈ ఏడాది ఆగస్టు నుంచి జీతాలు చెల్లించలేదని ఆందోళనలో పాల్గొన్న ఉద్యోగులు తెలిపారు. ప్రస్తుతం థర్డ్ పార్టీ ఏజెన్సీ ఆధ్వర్యంలో తాము ఔట్ సోర్సింగ్ విధానంలో కొనసాగుతుండగా.. గతంలో మూడేళ్లకు ఒకేసారి లేదంటే ఏడాదికి ఒకసారి ఉద్యోగం పొడిగించేవారని, చంద్రబాబు సర్కారు ప్రతి మూడు నెలలకు ఒకసారి పొడిగించే పరిస్థితి తీసుకొచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఏడాది ఆగస్టు నుంచి అక్టోబర్ వరకు మాత్రమే తమ ఉద్యోగాలను పొడిగిస్తూ ఈ నెల మొదటివారంలో ఉత్తర్వులు ఇచ్చారని తెలిపారు. 20 ఏళ్లుగా పనిచేస్తున్న తమకు జీతం పెంచాలని, నెలనెలా చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆర్‌డబ్ల్యూఎస్ ఈఎన్‌సీ గాయత్రీదేవికి వినతిపత్రం ఇచ్చారు.

పవన్‌కళ్యాణ్ ఆఫీసు ముందు రెండుసార్లు ఆందోళన

జీతాలు పెంచాలని, బకాయిలు చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈ ల్యాబ్‌ల ఉద్యోగులు చంద్రబాబు సర్కారు వచ్చిన తరువాత ప్రభుత్వ పెద్దలకు, ఉన్నతాధికారులకు పలుమార్లు వినతిపత్రాలు ఇచ్చారు. సంబంధిత శాఖ మంత్రి, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ కార్యాలయం ఎదుట మంగళగిరిలో గత ఏడాది సెప్టెంబర్ 13న, అక్టోబరు 6న ఆందోళనలు చేశారు. ఇప్పుడు బుధవారం మూడోసారి ఆందోళన చేశారు.

జగన్ ప్రభుత్వంలో వేతనాలు పెంచడంతోపాటు పీఎఫ్ అమలు

కాంట్రాక్టు ఉద్యోగులకు ఉండే కనీస సౌకర్యాలు కూడా నీటి నాణ్యత పరీక్ష ల్యాబ్‌లలో పనిచేసేవారికి లేవు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం తొలిసారి వారికి పీఎఫ్, ఈఎస్ఐ వంటి సౌకర్యాలు కల్పించి కనీస ఉద్యోగ భద్రతలను కల్పించింది. వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే వారికి వేతనాలు కూడా పెంచారు. అప్పటివరకు రూ.15 వేల చొప్పున వేతనం అందుకునే వారికి రూ.19,342 (పీఎఫ్‌గా జమచేసే డబ్బులు కాకుండానే), రూ.12 వేల చొప్పున వేతనం తీసుకునే వారిలో కొందరికి రూ.16,400, మరికొందరికి రూ.13 వేల చొప్పున జగన్ ప్రభుత్వం వేతనాలు పెంచింది. ఔట్ సోర్సింగ్‌లో పని చేసే ఉద్యోగులను కాంట్రాక్టు ఉద్యోగులుగా మార్చే ప్రక్రియను కూడ చేపట్టింది. ఇంతలో ఎన్నికలు రావడంతో ఆ ప్రతిపాదనలు ఆర్థికశాఖ వద్ద పెండింగ్‌లో ఉండిపోయాయి. చంద్రబాబు ప్రభుత్వం వీటిని ఆమోదించకపోగా.. ఉద్యోగులకు వేతనాలు అందడం కూడా గగనమైపోయింది.

అబద్ధపు వాంగ్మూలం ఇవ్వాల్సిందే

- ప్రభుత్వ పెద్దల ఆదేశాలతో వేధింపుల పర్వం
- ముంబై వ్యాపారిని వేధిస్తున్న సిట్
- వారం రోజులుగా అక్రమ నిర్బంధం

సాక్షి, అమరావతి: మద్యం విధానంపై అక్రమ కేసులో ప్రభుత్వ పెద్దల సూచన మేరకు సిట్ అధికారులు వేధింపుల పర్వం కొనసాగిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో జరగని కుంభకోణం జరిగినట్టుగా చూపించేందుకు విశ్వప్రయత్నాలు చేస్తూ, అడ్డదారులు తొక్కుతున్నారు. ఈ అక్రమ కేసు దర్యాప్తు పేరిట మొదటి నుంచీ కొనసాగిస్తున్న అబద్ధపు వాంగ్మూలాల కుట్రకు మరింత పదును పెడుతున్నారు. ముంబైకి చెందిన ఓ వ్యాపారిని సిట్ అధికారులు వారం రోజులుగా అక్రమంగా నిర్బంధించడం ఇందుకు తాజా నిదర్శనం. ప్రైవేటు బ్యాంకింగ్ రంగానికి చెందిన ఆయన్ని సిట్ అధికారులు వారం రోజుల క్రితం గోవాలో అదుపులోకి తీసుకున్నట్టు సమాచారం. అక్కడి నుంచి ముంబైకి తీసుకువెళ్లి విచారిస్తున్నారు. ఆయన ఆఫీసులో తనిఖీలు చేయగా, ఎటువంటి ఆధారాలు లభించలేదని సమాచారం. తన సంస్థ లావాదేవీలకు సంబంధించిన అన్ని రికార్డులను వ్యాపారి సిట్ అధికారులకు చూపించారు. దీంతో ఇక చేసేది లేక, తాము చెప్పినట్టుగా వాంగ్మూలం ఇవ్వాలని ఆయనపై తీవ్ర ఒత్తిడి తీసుకొస్తున్నారు. తాము చెప్పినట్టుగా అబద్ధపు వాంగ్మూలం ఇవ్వకపోతే అక్రమ కేసులో అరెస్టు చేస్తామని కూడా వేధిస్తున్నట్టు తెలుస్తోంది. దీనిపై ఆ వ్యాపారి కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఆయనతో అబద్ధపు వాంగ్మూలం ఇప్పించి, దాని ఆధారంగా ఈ కేసులో తాము లక్ష్యంగా చేసుకున్నవారిని వేధించాలన్నది సిట్ అధికారుల దురుద్దేశంగా అర్థమవుతోంది. త్వరలో చివరి ఛార్జ్‌షీట్ దాఖలు చేయాలని భావిస్తున్న సిట్.. అందుకు అనుగుణంగానే ఈ వేధింపులను తీవ్రతరం చేసినట్టు పోలీసు వర్గాలే వ్యాఖ్యానిస్తున్నాయి.

‘వైద్య’ భేరిపై పోలీసు జులుం తగదు

- శాంతియుత ర్యాలీలపై అణచివేత ధోరణా?
- ప్రజావ్యతిరేక చర్యలు చేపడుతున్న చంద్రబాబు సర్కారుపై పోరాటం ఉధృతం చేస్తాం
- శాసనమండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ ధ్వజం

విజయనగరం రూరల్: ప్రభుత్వ వైద్యకళాశాలల ప్రైవేటీకరణను నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పిలుపు మేరకు వైఎస్సార్‌సీపీ శ్రేణులు రాష్ట్రవ్యాప్తంగా బుధవారం చేపట్టిన శాంతియుత ర్యాలీలపై పోలీసుల అణచివేత ధోరణి సరికాదని శాసనమండలి ప్రతిపక్ష నేత, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. బుధవారం విజయనగరంలో మీడియాతో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్‌సీపీ చేపట్టిన ర్యాలీల్లో విద్యావంతులు, మేధావులు, విద్యార్థులు స్వచ్ఛందంగా పాల్గొన్నారన్నారు. శాంతియుత పద్ధతిలో చేపట్టిన నిరసన ర్యాలీలపై రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో పోలీసులు అణచివేత ధోరణి ప్రదర్శించారని మండిపడ్డారు. ప్రజాస్వామ్యంలో ప్రజావ్యతిరేక నిర్ణయాలు తీసుకుంటున్న ప్రభుత్వంపై నిరసన తెలిపే హక్కు ప్రతిపక్షాలకు ఉందన్నారు. పోలీసులు ప్రజల రక్షణ, శాంతి భద్రతల కాపాడేందుకు పనిచేయాలని, చంద్రబాబు మెప్పుకోసం కాదని అన్నారు. విజయనగరం జిల్లాలో ర్యాలీలో పాల్గొన్న వారిపై పోలీసులు లాఠీచార్జి చేయడం దారుణమన్నారు. చట్టం, వ్యవస్థ చేతిలో ఉందని తప్పుడు కేసులు పెట్టడం సరికాదని హితవు పలికారు. పేద విద్యార్థులకు వైద్య విద్య అందాలంటే ప్రభుత్వ వైద్య కళాశాలలే శరణ్యమని పేర్కొన్నారు. చంద్రబాబు సర్కారు ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణ పూనుకోవడం పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేయడమేనని ఆవేదన వ్యక్తం చేశారు. దోచుకోవడానికే ప్రైవేటీకరణ అంశాన్ని ఈ సర్కారు తీసుకొచ్చిందని విమర్శించారు. ప్రజల పక్షాన వైఎస్సార్‌సీపీ పోరాటం తీవ్రతరం చేస్తోందని స్పష్టం చేశారు.

వ్యవసాయం అంటే బాబుకు చిన్నచూపు

సీఎం చంద్రబాబుకు వ్యవసాయమన్నా, రైతులన్నా చిన్నచూపని, వ్యవసాయం దండగ అనేది ఆయన నినాదమని బొత్స దుయ్యబట్టారు. వైఎస్ జగన్ ప్రభుత్వ హయాంలో పంటల బీమా ప్రభుత్వమే చెల్లించిందని, దీంతో ప్రకృతి వైపరీత్యాల సమయంలో బీమాతో రైతులు ధీమాగా ఉన్నారని గుర్తుచేశారు. ఇప్పుడు చంద్రబాబు సర్కారు పంటల బీమా చెల్లించకపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 60 లక్షల మంది రైతులు పంట నష్టాన్ని చవిచూడాల్సి వచ్చిందన్నారు. అన్నదాత సుఖీభవ పథకాన్నీ బాబు అటకెక్కించారని విమర్శించారు. ప్రజానీకం తరఫున తమ పోరాటం ఆగదని బొత్స స్పష్టం చేశారు.

గృహప్రవేశాల కార్యక్రమం హాస్యాస్పదం

చంద్రబాబు సర్కారు బుధవారం చేపట్టిన గృహప్రవేశాల కార్యక్రమం హాస్యాస్పదమని బొత్స సత్యనారాయణ ఎద్దేవా చేశారు. గత ప్రభుత్వ హయాంలో స్థల సేకరణ, ఇంటి శంకుస్థాపనలు, ఇళ్ల నిర్మాణాలు చేపడితే, వాటిని తానే చేసినట్టు చంద్రబాబు చెప్పుకోవడం సిగ్గు చేటన్నారు. ఏనాడైనా పేదల సొంతింటి కల నెరవేర్చడానికి చంద్రబాబు స్థల సేకరణ గానీ, ఇంటి నిర్మాణాలకు శంకుస్థాపనగానీ చేశారా అని ప్రశ్నించారు. ఆయన చేయని పనికి పత్రికల్లో పెద్ద పెద్ద ప్రకటనలు ఇవ్వడం విడ్డూరంగా ఉందన్నారు.

నాడు ఉద్యోగాల విప్లవం నేడు అడుగడుగునా మోసం

2019-24 మధ్య వైఎస్ జగన్ ఇచ్చిన ప్రభుత్వ ఉద్యోగాలు 6,26,116

- పరిశ్రమల్లో 24,68,146 మందికి ఉద్యోగాల కల్పన
- విద్యాశాఖలో 21,608 ఉద్యోగాల భర్తీకి చర్యలు
- 2024లో 6,100 పోస్టులతో నోటిఫికేషన్.. రద్దు చేసిన చంద్రబాబు సర్కారు
- తొలి సంతకంతో డీఎస్సీ ప్రకటించి ఏడాదిన్నర కాలయాపన చేసిన చంద్రబాబు
- ఇతర ఉద్యోగాల కల్పన ఊసేలేదు



సాక్షి, అమరావతి: అబద్ధాలు చెప్పడంలో డబుల్ పీహెచ్‌డీలు చేసిన సీఎం చంద్రబాబు నిరుద్యోగ యువతకు ఉద్యోగాల కల్పనలోనూ అదే పంథాను అనుసరిస్తున్నారు. దేశంలోనే అత్యంత సీనియర్ సీఎంను అని చెప్పుకుంటున్న ఆయన హయాంలో డీఎస్సీ తప్ప ఇతర పోస్టులు భర్తీ చేసింది అరకొరే. అదీ తప్పులు చేసి, యువతను మోసం చేసి అభ్యర్థుల కన్నీటికి కారణమయ్యారు. 1998, 2018లో డీఎస్సీ పరీక్షలు నిర్వహించినా పోస్టులు భర్తీ చేయకలేకపోయింది. ఆ అభ్యర్థులకు న్యాయం చేసింది మాత్రం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డే అని రాష్ట్ర ప్రజలందరికీ తెలిసిందే. 2014–19 మధ్య టీడీపీ ప్రభుత్వం హయాంలో అన్నీ కలిపి మొత్తం 34,108 పోస్టులను మాత్రమే భర్తీ చేయగా, 2019–24 మధ్య వైఎస్ జగన్ సీఎంగా 6,26,116 ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేశారు. ఇక వివిధ పరిశ్రమలను స్థాపించి వీటిలో 24,68,146 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించారు. రెండేళ్లపాటు కోవిడ్ వంటి ప్రతికూల పరిస్థితులను తట్టుకుని ఒక్క విద్యాశాఖలోనే 21,608 పోస్టులు భర్తీకి చర్యలు తీసుకున్నారంటేవిద్యా రంగానికి వైఎస్ జగన్ ఎంత ప్రాధాన్యం ఇచ్చారో అర్థం చేసుకోవచ్చు. అలాగే, 2024లో 6,100 పోస్టులతో డీఎస్సీ ఇచ్చారు.

తొలి సంతకానికే దిక్కులేని పాలన

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చంద్రబాబు గత ఏడాది జూన్ 12న సీఎంగా ప్రమాణ స్వీకారం చేశారు. ఆ సందర్భంగా తొలి సంతకం డీఎస్సీ నోటిఫికేషన్ ఫైలుపై చేశారు. అయితే 14 నెలల తర్వాత నోటిఫికేషన్ ఇచ్చి ఇటీవల అరకొరగా పోస్టులు భర్తీ చేశారు. ఇంకా ఈ భర్తీలపై కోర్టుల్లో కేసులు నడుస్తున్నాయి. కానీ జగన్ ప్రభుత్వంలో గత టీడీపీ ప్రభుత్వంలో ఏర్పడిన న్యాయ చిక్కులను పరిష్కరించడంతోపాటు ఎలాంటి న్యాయ వివాదాలు లేకుండా పూర్తి పారదర్శకతతో ప్రభుత్వ, పారిశ్రామిక రంగాలలో 30,94,262 ఉద్యోగాలను భర్తీ చేసింది.

బాబు జమానాలో చేసింది అరకొరగానే..

చంద్రబాబు పాలనతో ప్రతి నోటిఫికేషన్‌ను వివాదాస్పదంగా మార్చేశారు, ఇందుకు 1998, 2018 డీఎస్సీలే ఉదాహరణ. వాస్తవానికి చంద్రబాబు హయాంలో డీఎస్సీని ఓ పెద్ద నాటకంగా మార్చేశారు. 2018లో డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చి కూడా సక్రమంగా నిర్వహించలేదు. ఫలితంగా అభ్యర్థులకు అన్యాయం జరగడంతో కోర్టును ఆశ్రయించారు. ఈ నోటిఫికేషన్‌లో 7,254 ఉపాధ్యాయ పోస్టులకు గాను.. చంద్రబాబు 300 పోస్టులను మాత్రమే భర్తీ చేయగా, మిగిలిన పోస్టులను వైఎస్ జగన్ 2021లో న్యాయ వివాదాలు పరిష్కరించి భర్తీ చేశారు. అలాగే, గత ఐదేళ్ల జగన్ పాలనలో 1998 డీఎస్సీ అభ్యర్థులు 4,059 మంది, 2008 అభ్యర్థులు మరో 2,193 మందికి ఎంటీఎస్‌గా విధుల్లోకి తీసుకున్నారు. స్పెషల్ డీఎస్సీ–2019 ద్వారా 602 మందికి, 2023లో కేజీబీవీల్లో 1,250 మందికి కాంట్రాక్టు విధానంలోను, ట్రిపుల్ ఐటీ, యూనివర్సిటీల్లో కాంట్రాక్టు ఫ్యాకల్టీగా మరో 450 మంది.. ఇలా మొత్తం 15,508 పోస్టులు భర్తీ చేశారు. 2024 డీఎస్సీ ద్వారా 6,100 పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోగా.. చంద్రబాబు ప్రభుత్వం రాగానే ఈ పోస్టులను నిలిపివేసింది. ఇవికూడా భర్తీ అయితే మొత్తం 21,608 పోస్టులను భర్తీ చేసినట్టు అయ్యేది.

విద్యా సంస్కరణలకు బ్రాండ్ వైఎస్ జగన్

గ్రామీణ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ బడి కీర్తిని ఐక్యరాజ్య సమితిలో నిలబెట్టారు వైఎస్ జగన్. నాడు–నేడుతో ప్రభుత్వ బడుల్లో 11 రకాల సదుపాయాలు కల్పించడంతో పాటు ఇంగ్లిష్ మీడియం విద్యతో పాటు టోఫెల్, ఐబీ సిలబస్‌ను ప్రవేశపెట్టారు. ‘మనబడి: నాడు–నేడు’ ద్వారా రాష్ట్రంలోని 45 వేలకు పైగా ప్రభుత్వ పాఠశాలలను మూడు విడతల్లో అభివృద్ధి చేసేందుకు ప్రణాళికను అమలు చేశారు. 2019–20లో తొలివిడతగా 15715 స్కూళ్లలో రూ.3,669 కోట్లతో 11 రకాల మౌలిక సదుపాయాలు కల్పించారు. ప్రభుత్వ స్కూళ్లతో పాటు జూనియర్ కాలేజీలు, హాస్టళ్లు, భవిత కేంద్రాలు, జిల్లా విద్యాబోధనా శిక్షణ కళాశాలల(డైట్స్)తో పాటు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమల్లోకి తెస్తున్న శాటిలైట్ ఫౌండేషన్ స్కూళ్లనూ నాడు–నేడులోకి చేర్చింది. నాడు–నేడు రెండో దశలో రూ.8000 కోట్లతో 22,344 స్కూళ్లలో పనులు చేపట్టారు. అంతేగాక దేశంలో ఎక్కడా లేనివిధంగా నూరు శాతం ప్రభుత్వ బడులను డిజిటలైజేషన్ ప్రవేశపెట్టడంపాటు సీబీఎస్ఈ సిలబస్‌ను సైతం ప్రభుత్వం బడిలో అమలు చేశారు. అలాగే, అంతర్జాతీయంగా పేరు పొందిన ఇంటర్నేషనల్ బాకలారియెట్ (ఐబీ) సిలబస్‌ను సైతం అమలు చేసేందుకు బాటలు వేశారు. కానీ ఏడాదిన్నర కాలంలోనే ఈ విద్యా సంస్కరణలు అన్నింటినీ కూటమి ప్రభుత్వం తన కుటిల బుద్ధితో ఒకొక్కటిగా రద్దు చేస్తూ వస్తోంది.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Published at D. No. 5 - 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503, (AP) and Printed at Jagati Publications Limited, D. No. 5 - 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503, (AP).,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of news under the PRB act) Phone No : 0863-2512581 Fax No: 0863-2512584, RNI Regn No. APTEL/2008/23801. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

క్లుప్తంగా...

నా డిఫాల్ట్ బెయిల్ పిటిషన్‌పై విచారణ జరిపేలా ఆదేశించండి

హైకోర్టులో సజ్జల శ్రీధర్‌రెడ్డి పిటిషన్

సాక్షి, అమరావతి: మద్యం అక్రమ కేసులో విజయవాడ ఏసీబీ కోర్టు తన డిఫాల్ట్ బెయిల్ పిటిషన్‌ను రిటర్న్ చేస్తూ గత నెల 29న జారీ చేసిన డాకెట్ ఆర్డర్‌ను కొట్టేయాలని కోరుతూ 6వ నిందితుడు సజ్జల శ్రీధర్‌రెడ్డి బుధవారం హైకోర్టును ఆశ్రయించారు. దానిపై విచారణ జరిపేలా ఏసీబీ కోర్టును ఆదేశించాలని పిటిషన్‌లో కోరారు. 'ఈ కేసులో నలుగురికి బెయిల్ మంజూరీపై సీఐడీ దాఖలు చేసిన పిటిషన్ తేలేంత వరకు మిగిలిన వారికి బెయిల్ మంజూరీపై వేచి ఉండాలని హైకోర్టు ఉత్తర్వులిచ్చిన నేపథ్యంలో నా పిటిషన్‌కు విచారణార్హతపై స్పష్టతనివ్వాలని ఏసీబీ కోర్టు కోరింది. దీంతో ప్రతీ బెయిల్ పిటిషన్‌ను కూడా ఆ కేసు పూర్వాపరాల ఆధారంగా విచారించాలని సుప్రీంకోర్టు స్పష్టంగా చెప్పిన విషయాన్ని ఏసీబీ కోర్టు దృష్టికి తీసుకొచ్చాను. అయితే సుప్రీంకోర్టు రెగ్యులర్ బెయిల్ పిటిషన్లను విచారించాలని చెప్పిందే తప్ప, డిఫాల్ట్ బెయిల్ పిటిషన్లను కాదని పేర్కొంటూ ఏసీబీ కోర్టు ఉత్తర్వులు ఇచ్చింది. వాస్తవానికి బెయిల్ పిటిషన్లపై విచారణ జరపకుండా ఏసీబీ కోర్టుపై హైకోర్టు ఎలాంటి ఆంక్షలు విధించలేదు. అందువల్ల ఏసీబీ కోర్టు ఇచ్చిన ఉత్తర్వులు చెల్లవు' అని శ్రీధర్‌రెడ్డి తన పిటిషన్‌లో పేర్కొన్నారు.

'గోవా ఐరన్ మ్యాన్' పోటీల్లో సీఐడీ ఎస్పీకి పతకం

సీఐడీ ఎస్పీ చక్రవర్తిని అభినందిస్తున్న డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా

సాక్షి, అమరావతి: సీఐడీ ఎస్పీ కె.చక్రవర్తి 'గోవా ఐరన్ మ్యాన్ 70.3'పోటీల్లో సత్తా చాటారు. గోవాలోని మీరామర్ బీచ్‌లో ఈ నెల 9న నిర్వహించిన ట్రైథ్లాన్‌ను 8గంటల్లోనే పూర్తి చేశారు. ట్రైథ్లాన్‌లో భాగంగా స్విమ్మింగ్ 1.9 కి.మీ, సైక్లింగ్ 90 కి.మీ, రన్నింగ్ 21.1 కి.మీ.లను 8.30 గంటల్లో పూర్తి చేయాల్సి ఉండగా ఆయన 8 గంటల్లోనే ముగించి పతకాన్ని సాధించారు. 65 దేశాలకు చెందిన 1,300 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. పతకం సాధించిన ఎస్పీ కె.చక్రవర్తిని డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా అభినందించారు.

'పీపీపీ'తో పేదల విద్యార్థులకు మేలు

సాక్షి, అమరావతి: మెడికల్ కళాశాలలను 'పీపీపీ'కి ఇవ్వడం ద్వారా పేద విద్యార్థులకు మేలు చేకూరుతుందని వైద్యశాఖ మంత్రి సత్యకుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీఎం చంద్రబాబుపై అక్కసుతో 'పీపీపీ'పై వైఎస్సార్‌సీపీ దుష్ప్రచారం చేస్తోందని విమర్శించారు. మొంథా తుపాను ప్రభావంతో 40 ప్రభుత్వాస్పత్రుల భవనాలు దెబ్బతిన్నాయని, వాటి మరమ్మతులకు రూ.13.13 కోట్లు అవుతుందన్నారు. అత్యధికంగా అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 14 ఆస్పత్రులు దెబ్బతిన్నాయన్నారు. వాటి మరమ్మతులకే రూ.9.54 కోట్లు వెచ్చించాల్సి వస్తుందని చెప్పారు.

చెవిరెడ్డి మెడికల్ బెయిల్ డిస్మిస్

విజయవాడ లీగల్: మద్యం అక్రమ కేసులో రిమాండ్‌లో ఉన్న మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి వెన్నునొప్పితో బాధపడుతున్నందున వైద్యం చేయించుకునేందుకు తనకు అనుమతివ్వాలని కోరుతూ ఆయన తరఫు ఎం.వాణిరెడ్డి దాఖలు చేసిన మెడికల్ బెయిల్ పిటిషన్‌ను ఏసీబీ న్యాయమూర్తి భాస్కరరావు డిస్మిస్‌చేస్తూ బుధవారం ఉత్తర్వులిచ్చారు. అలాగే, ఇదే కేసులో చెవిరెడ్డి భాస్కరరెడ్డి, చెరుకూరి వెంకటేష్‌నాయుడు, బాలాజీకుమార్ యాదవ్, నవీన్‌కృష్ణల బెయిల్ పిటిషన్ల విచారణను ఏసీబీ న్యాయమూర్తి గురువారానికి వాయిదా వేశారు.

నౌకానిర్మాణంపై భారత్ ఫోర్జ్ ఆసక్తి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో షిప్ బిల్డింగ్, ఎలక్ట్రానిక్స్ రంగంలో అడ్వాన్స్ ఉత్పత్తులపై భారత్ ఫోర్జ్ సంస్థ ఆసక్తి వ్యక్తం చేసింది. విశాఖలో సీఎం చంద్రబాబుతో ఆ సంస్థ వైస్ చైర్మన్ అమిత్ కల్యాణి బుధవారం భేటీ అయ్యారు. పర్యాటక రంగంలో గండికోట వద్ద రివర్ క్రూయిజ్ ప్రాజెక్టును చేపట్టేందుకు సుముఖంగా ఉన్నట్లు అమిత్ వెల్లడించారు. గండికోటతోపాటు పాపికొండలు, అరకు వ్యాలీ వంటి ప్రాంతాల్లోనూ టూరిజం ప్రాజెక్టులు చేపట్టేందుకు ఆస్కారం ఉందని అమిత్ కల్యాణికి సీఎం వివరించారు.

మొబైల్ ఆధార్ క్యాంపులు ఏర్పాటుచేయాలి

ఏపీటీఎఫ్ అమరావతి విజ్ఞప్తి

సాక్షి, అమరావతి: పాఠశాలల విద్యార్థులకు అనువుగా మండల స్థాయిలో మొబైల్ ఆధార్ క్యాంపులు ఏర్పాటుచేయాలని ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర అధ్యక్షుడు సీవీ ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బయోమెట్రిక్ అప్డేషన్ ఎక్కువగా పెండింగ్ ఉన్న పాఠశాలల్లో అప్డేషన్ ప్రక్రియ కొనసాగించాలని సూచించారు. అక్టోబరులో నిర్వహించిన కేంద్రాలు కొన్ని పాఠశాలలకు దూరంగా ఉండడంతో పూర్తిస్థాయిలో బయోమెట్రిక్ జరగలేదన్నారు.

వలిసెపూల తోటలు

అరకులోయ మండలం మాడగడ వ్యూ పాయింట్ వద్ద పర్యాటకులు

వంజంగి హిల్స్‌లోని ప్రకృతి అందాలను వీక్షిస్తున్న పర్యాటకులు

రా...రమ్మని

చుట్టూ ఎత్తైన కొండలు... ఆకాశాన్ని తాకుతున్నట్టు ఉండే భారీ వృక్షాలు... పరమశివుని జటాజూటం నుంచి జాలువారుతున్నట్టు జలపాతాల హొయలు... పాల సంద్రం భువిలో వెలిసిందా అనేలా శ్వేతవర్ణ మేఘాల సోయగాలు... పచ్చి గాలి మధురానుభూతి...మట్టి గంధం సువాసన... పక్షుల కిలకిలా రావాలు, ఆకుల సవ్వడులు... ఇలా పంచేంద్రియాలను ప్రకృతితో మమేకం చేసే మరెన్నో ప్రత్యేకతల స్వర్గధామం... అల్లూరి మన్యం. పర్యాటక సీజన్‌లో ఈ అందాలు ద్విగుణీకృతమవుతాయి. కొద్ది రోజులు సాధారణ జీవితం గురించి మరిచిపోయి ఎంచక్కా ప్రకృతితో మమేకమవ్వాలనుకుంటున్న వారికి ఇది సరైన సమయం.

- మన్యంలో ఆహ్వానిస్తున్న టూరిస్ట్ స్పాట్‌లు
- ఇప్పటికే ఆరంభమైన సందర్శకుల రాక

సాక్షి,పాడేరు: మన్యంలో పర్యాటక సీజన్ ప్రారంభమైంది. నవంబర్ మొదటి వారం నుంచి జనవరి నెలాఖరు వరకూ నెలకు రెండు లక్షల మంది పర్యాటకులు అల్లూరి జిల్లాలోని వివిధ ప్రాంతాలను సందర్శిస్తారు. దీంతో సుమారు నెలకు రూ.5 కోట్లపైనే బిజినెస్ జరుగుతుంది. సహజ ప్రకృతి అందాలకు నిలయమైన ఏజెన్సీలో ఈ సీజన్‌లో అప్పుడే పర్యాటకుల సందడి ఆరంభమైంది. జిల్లాలో బొర్రాగుహలు, వంజంగి హిల్స్, లంబసింగి, చాపరాయి జలపాతం తదితర ప్రాంతాలను ఎక్కువగా సందర్శిస్తున్నారు. పర్యాటకుల కోసం ఎకో టూరిజం ప్రాజెక్టులో భాగంగా వంజంగి హిల్స్ వద్ద అటవీశాఖ రూ.35 లక్షల వ్యయంతో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది.

నలుచెరగులా...

జిల్లాలోని 22 మండలాలున్నాయి. పర్యాటకంలో ప్రతీ మండలానికి ఓ ప్రత్యేకస్థానం ఉంది. అనంతగిరి నుంచి ఎటపాక వరకు అన్ని మండలాల్లోను పర్యాటక ప్రాంతాలు ఉన్నాయి. ప్రతి ఏడాది దేశంలోని పలు ప్రాంతాలతో పాటు విదేశాల నుంచి పర్యాటకులు భారీగా తరలివస్తారు. ఇక్కడి ప్రకృతి అందాలకు పర్యాటకులంతా ఫిదా అవుతారు.

- పాడేరు మండలంలోని వంజంగి హిల్స్ విశ్వవ్యాప్తంగా గుర్తింపుపొందాయి. ఈకొండలపై సూర్యోదయం, మేఘాల అందాలను చూసేందుకు పర్యాటకులు భారీగా తరలివస్తున్నారు.
- అరకులోయ మండలంలోని మాడగడ,చింతపల్లి మండలంలోని చెరువులవెనం, హుకుంపేట మండలంలోని సీతమ్మకొండ ప్రాంతాలు మంచి వ్యూపాయింట్‌లుగా పర్యాటకులను అలరిస్తున్నాయి. ఇక్కడ పొగమంచు,సూర్యోదయం అందాలు అబ్బుర పరుస్తున్నాయి. అనంతగిరి మండలంలోని బొర్రాగుహలతో పాటు అరకులోయలోని పద్మాపురం గార్డెన్,గిరిజన మ్యూజియం,లంబసింగి,సిలేరు,మారేడుమిల్లి.మోతుగూడెం పర్యాటక ప్రాంతాలకు పర్యాటకుల తాకిడి నెలకొంది.

జలపాతాల హోరు

జిల్లా వ్యాప్తంగా ఉన్న జలపాతాలను సందర్శించేందుకు పర్యాటకులు భారీ ఎత్తున తరలివస్తున్నారు. పెదబయలు మండలంలోని పిట్టలబొర్ర, అనంతగిరిలోని కటికి, తాడిగుడ, డుంబ్రిగుడ మండలంలోని చాపరాయి, జి.మాడుగుల మండలంలోని కొత్తపల్లి, సీలేరు ప్రాంతంలోని ఐస్‌గెడ్డ, మోతుగూడెంలోని పొల్లూరు, మారేడుమిల్లి ప్రాంతాలలో జలపాతాలకు పర్యాటకుల తాకిడి నెలకొంది. దేవీపట్నం, వి.ఆర్.పురం ప్రాంతాలలో పాపికొండల విహార యాత్రకు లాంచీలపై పర్యాటకులు తరలివెళుతున్నారు.

వలిసె పూల అందాలు అదుర్స్

ఈసీజన్‌లో వలిసెపూలు పర్యాటకుల మదిని దోచుకుంటున్నాయి.భూమికి పసుపు రంగేసినట్టు ఉండే వలిసెపూల తోటల్లో ఫొటోలు తీసుకునేందుకు సందర్శకులు ఎంతో ఇష్టపడుతున్నారు.

పెదబయలు మండలంలోని పిట్టలబొర్ర జలపాతం

ఏటా భారీగా వ్యాపారం

పర్యాటకులు అధికంగా తరలివస్తుండడంతో జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో ఈ సీజన్‌లో వ్యాపార లావాదేవీలు భారీగా జరుగుతాయి. నెలకు రూ.5 కోట్లపైనే వ్యాపారం జరుగుతుంది. పాడేరు, అనంతగిరి, అరకులోయ, జి.మాడుగుల, చింతపల్లి, రంపచోడవరం, మారేడుమిల్లి ప్రాంతాల్లో హోటళ్లు, ఇతర వ్యాపారులకు అధిక ఆదాయం సమకూరుతుంది. పర్యాటక ప్రాంతాల్లో స్థానిక గిరిజనులు కూడా పలు రకాల ఫుడ్ కోర్టులు,చికెన్ వంటకాలు, అటవీ,వ్యవసాయ ఉత్పత్తుల విక్రయాలతో జీవనోపాధి పొందుతున్నారు.

ప్రకృతి అందాలు కొలువైన 'గుడి'సె

రంపచోడవరం: దట్టమైన అడవి.. మధ్యలో ఎత్తైన కొండపై మెలికలు తిరిగే ఎర్రమట్టి దారి.. మార్గమధ్యంలో ఆకట్టుకునే జలపాతం ఇవన్నీ కలిపి ప్రకృతి అందాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారేడుమిల్లి కొండలు మారాయి. మారేడుమిల్లికి సుమారు 36 కిలోమీటర్ల దూరంలో తూర్పు కనుమల్లో ఆహ్లాదకరమైన వాతావరణంలో పచ్చని గడ్డి కొండలు(గ్రాస్ ల్యాండ్స్)లో ఉన్న గుడిసె అందాలు పర్యాటకులను కట్టిపడేస్తున్నాయి. ఎత్తైన కొండల మధ్య సూర్యోదయాన్ని, ప్రకృతి అందాలను తనివి తీరా చూసేందుకు రాష్ట్రాలు దాటి మరీ పర్యాటకులు వస్తున్నారు.

మారేడుమిల్లికి 36 కిలోమీటర్ల దూరం

మారేడుమిల్లికి 36 కిలో మీటర్ల దూరంలో ఉన్న గుడిసె పర్యాటక ప్రాంతాన్ని తిలకించేందుకు సందర్శకులు అధిక సంఖ్యలో వస్తున్నారు. మారేడుమిల్లి నుంచి 22 కిలోమీటర్ల దూరం ప్రయాణం చేసిన తరువాత ఆకుమామిడి కోట గ్రామం వస్తుంది. అక్కడ నుంచి మరో 14 కిలోమీటర్లు ప్రయాణిస్తే గుడిసె కొండలను చేరుకోవచ్చు. ఆకుమామిడి కోట వద్ద ఉన్న ఫారెస్టు చెక్‌పోస్టు వద్ద వాహనాలకు రూ. 300, మనిషికి రూ. 100 చెల్లించిన తరువాత ఆ రోడ్డులో ప్రయాణిస్తే పుల్లంగి గ్రామం వస్తుంది. అక్కడ నుంచి గుడిసె వెళ్లేందుకు ఎత్తైన కొండల మధ్య ఘాట్ రోడ్డులో ప్రయాణించాలి. కొండ పై భాగానికి చేరుకున్న తరువాత అక్కడ విశాలమైన గడ్డితో కూడిన మైదానం కనిపిస్తుంది. ఇక్కడి అందాలు, సూర్యోదయం దృశ్యాలు పర్యాటకులను మంత్ర ముగ్ధలను చేస్తాయి. గతంలో రాత్రి సమయంలో అక్కడే పర్యాటకులు ఉండేందుకు అటవీ శాఖ వారు అనుమతించారు. పర్యాటకుల సంఖ్య పెరిగిపోవడంతో అక్కడ విపరీతంగా ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. దీంతో రాత్రి బసను రద్దు చేశారు. ఆకుమామిడి కోట పరిసర ప్రాంతాల్లో రాత్రి బస చేసి, తెల్లవారుజాము 4 గంటల సమయంలో గుడిసెలో సూర్యోదయాన్ని చూసేందుకు పర్యాటకులు వెళతారు. గుడిసె ప్రాంతంలో పర్యాటకులు గడిపేందుకు నవంబర్ నుంచి ఫిబ్రవరి నెలాఖరు వరకూ అనుకూలంగా ఉంటుంది. ఆకుమామిడి కోట నుంచి గుడిసె కొండ మీదకు ప్రైవేట్ వాహనాల్లో పర్యాటకులను తీసుకువెళ్లేందుకు రూ. 3వేల వరకు చార్జి చేస్తున్నారు.

గుడిసె కొండపై సూర్యోదయం అందాలు

గుడిసె కొండపై ప్రకృతి సౌందర్యం

క్యాంపెయిన్ టెంట్లకు గిరాకీ

సీజన్‌లో రోజుకు కనీసం వెయ్యి మంది పర్యాటకులు ఈ ప్రాంతాన్ని సందర్శిస్తారు. దీంతో ఇక్కడ క్యాంపెయిన్ టెంట్లకు గిరాకీ పెరిగింది. రంపచోడవరం, మారేడుమిల్లిలో ఈ టెంట్లను అద్దెకు ఇస్తారు. టెంట్ సైజును బట్టి రూ.500 నుంచి రూ.750 వరకూ వసూలు చేస్తున్నారు. పర్యాటకుల్లో కొందరు మారేడుమిల్లిలో గల ప్రైవేట్, ఎకో టూరిజం గదుల్లో బస చేసి, తెల్లవారుజామున కొండమీదకు వెళతారు.

దుంపవలస జలపాతం

ఆకుమామిడి కోట నుంచి బోడ్లంక వెళ్లే రహదారిలో గల దారగెడ్డ గ్రామం నుంచి దుంపవలస వెళ్లాలి. అక్కడి జలపాతం పర్యాటకులను కట్టిపడేస్తోంది. గుడిసె వెళ్లేందుకు వచ్చిన పర్యాటకులు దుంపవలస జలపాతంలో స్నానాలు చేస్తూ ప్రకృతి అందాలను తిలకిస్తూ మైమరిచిపోతారు. ఆకుమామిడి కోట నుంచి సుమారు 25 కిలోమీటర్ల దూరంలో ఈ జలపాతం ఉంది.



దుంప వలస జలపాతం

సీబీఐకి అప్పగింతపైనే కాదు.. అన్ని అంశాలపైనా కౌంటర్ వేయండి

నకిలీ మద్యం కేసులో జోగి రమేష్ పిటిషన్‌పై ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

సాక్షి, అమరావతి: నకిలీ మద్యం కేసులో దర్యాప్తును సీబీఐకి అప్పగించాలని కోరుతూ వైఎస్సార్‌సీపీ నేత, మాజీ మంత్రి జోగి రమేష్ దాఖలు చేసిన వ్యాజ్యంలో పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 26కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి డాక్టర్ జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.వ్యాజ్యం విచారణార్హతపై కౌంటర్ దాఖలు చేస్తామని పబ్లిక్ ప్రాసిక్యూటర్ (పీపీ) లక్ష్మీనారాయణ చెప్పగా, కేవలం ఆ ఒక్క అంశంపైనే కాకుండా పిటిషనర్ తన వ్యాజ్యంలో లేవనెత్తిన అన్ని అంశాలపై కౌంటర్ దాఖలు చేయాలని న్యాయమూర్తి స్పష్టం చేశారు. నకిలీ మద్యం కేసులో ప్రభుత్వ దర్యాప్తు నిష్పాక్షికంగా జరగడం లేదని, ఈ నేపథ్యంలో నిష్పాక్షిక దర్యాప్తు కోసం కేసును సీబీఐకి అప్పగించాలని కోరుతూ జోగి రమేష్ 'తన అరెస్టుకు ముందు' హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అయితే ఈ వ్యాజ్యంపై గత వారం విచారణ జరిపిన న్యాయమూర్తి జస్టిస్ జ్యోతిర్మయి పిటిషనర్ జోగి రమేష్ అరెస్ట్ తరువాత పరిణామాలను వివరిస్తూ అదనపు అఫిడవిట్ దాఖలు చేయాలని ఆదేశించారు. తాజాగా బుధవారం ఈ వ్యాజ్యంపై జస్టిస్ జ్యోతిర్మయి మరోసారి విచారణ జరిపారు. కోర్టు ఆదేశాల మేరకు అదనపు అఫిడవిట్ దాఖలు చేశామని జోగి రమేష్ తరఫున సీనియర్ న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డి కోర్టుకు నివేదించారు.

రేపటి నుంచి విశాఖలో రెండు రోజుల పెట్టుబడుల సదస్సు

ప్రారంభించనున్న ఉపరాష్ట్రపతి

- విశాఖలో ఏర్పాట్లను పరిశీలించిన చంద్రబాబు
- ఇద్దరు కలెక్టర్లకు అదనపు బాధ్యతలు

సాక్షి, అమరావతి: శుక్రవారం నుంచి రెండు రోజుల పాటు విశాఖ వేదికగా 30వ సీఐఐ పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్–2025' జరగనుంది. 'ఇన్వెస్ట్ ఇన్ ఆంధ్రప్రదేశ్' అనే సందేశంతో నిర్వహిస్తున్న ఈ సమావేశాలను శుక్రవారం ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ ప్రారంభించనున్నారు. ఈ ప్రారంభోత్సవంలో కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్‌తో పాటు యూసుఫ్ అలీ, బాబా కళ్యాణి, కరణ్ అదానీ వంటి పారిశ్రామికవేత్తలు పాల్గొననున్నారు. గ్రీన్ ఎనర్జీ, ఐటీ, ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్స్, స్పేస్, డిఫెన్స్, టూరిజం రంగాల్లో భారీగా పెట్టుబడులు ఆకర్షించే లక్ష్యంతో విశాఖలోని ఆంధ్ర విశ్వ విద్యాలయ ఇంజనీరింగ్ కాలేజ్ గ్రౌండ్స్‌లో ఈ సదస్సు నిర్వహిస్తున్నారు. పార్టనర్స్ ఇన్ ప్రోగ్రెస్ – ఇండియాస్ రోడ్ మ్యాప్ టు వికసిత్ భారత్–2047' థీమ్‌తో నిర్వహిస్తున్న సదస్సులో 410కిపైగా ఒప్పందాలు రూ.9.80 లక్షల కోట్ల ఒప్పందాలు చేసుకోనున్నట్లు అధికారులు వెల్లడించారు. మొత్తంగా సదస్సులో 100కి పైగా అంతర్జాతీయ ప్రతినిధులు హాజరుకానున్నారు. ఈ సమావేశాలను పర్యవేక్షించడానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు బుధవారం రాత్రే విశాఖకు చేరుకున్నారు. సదస్సు విజయవంతానికి పరిశ్రమల శాఖ కార్యదర్శి ఎన్.యువరాజ్‌కు సహాయంగా అనకాపల్లి కలెక్టర్ కె.విజయ, నెల్లూరు జిల్లా కలెక్టర్ హిమాంన్షు శుక్లాలకు డిప్యుటేషన్‌పై అదనపు బాధ్యతలు అప్పగిస్తూ సీఎస్ విజయానంద్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఎస్సీ, ఎస్టీ యువతకు సివిల్స్ ఉచిత శిక్షణ

సాక్షి, అమరావతి: ఎస్సీ, ఎస్టీ నిరుద్యోగ యువతకు యూపీఎస్సీ సివిల్స్‌పై ఉచిత శిక్షణ ఇస్తున్నామని, అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో 340 మంది నిరుద్యోగ ఎస్సీ, ఎస్టీ యువతకు యూపీఎస్సీ సివిల్స్ ప్రిలిమినరీ ఎగ్జామ్‌కి ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు వెల్లడించారు. విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి అంబేడ్కర్ స్టడీ సర్కిళ్లలో శిక్షణ ఇస్తామని వెల్లడించారు. ఈ నెల 13వ తేదీ నుంచి 16వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. మహిళలకు 33శాతం సీట్లు కేటాయిస్తామని వివరించారు.

ముగిసిన మూడో దశ డిగ్రీ ప్రవేశాలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో మూడో దశ డిగ్రీ ప్రవేశాలు ముగిసినట్టు ఉన్నత విద్యా మండలి కార్యదర్శి ఆచార్య బి.తిరుపతిరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. సీట్లు పొందిన విద్యార్థులు ఏదైనా కారణంతో కళాశాలల్లో చేరకుంటే వారి ప్రవేశాలను 13, 14 తేదీల్లోగా రద్దు చేయాలని సూచించారు. విద్యార్థి ఫోన్ నంబర్‌కు వచ్చే ఓటీపీ ఆధారంగా ప్రవేశాలను రద్దు చేయాలన్నారు. ఆ మిగిలిన సీట్లను స్పాట్ ప్రవేశాల్లో ఖాళీలుగా గుర్తించాలని పేర్కొన్నారు. ఈ మేరకు ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాళ్లకు ఆదేశాలు జారీ చేశారు.

బిహార్‌లో ఏపీఎస్పీ కానిస్టేబుళ్ల ఇక్కట్లు

సాక్షి, అమరావతి: బిహార్ ఎన్నికల విధులకు వెళ్లిన రాష్ట్రానికి చెందిన ఏపీఎస్పీ కానిస్టేబుళ్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అక్కడ పట్టించుకునే వారు లేకపోవడంతో ఏం చేయాలో దిక్కుతోచక కొట్టుమిట్టాడుతున్నారు. రాష్ట్రంలోని మూడు బెటాలియన్లకు చెందిన 350 మంది ఏపీఎస్పీ కానిస్టేబుళ్లు ఎన్నికల విధుల కోసం గత నెల 20న బిహార్ వెళ్లారు. రెండు దశల పోలింగ్ ముగిసిన వెంటనే రాష్ట్రానికి వచ్చేయవచ్చని వారితో చెప్పారు. కాగా మంగళవారం బిహార్ పోలింగ్ ముగిసిన తరువాత ఉన్నతాధికారులు మాట మార్చారని కానిస్టేబుళ్లు వాపోతున్నారు. ఈ నెల 19 వరకు అక్కడే ఉండాలని ఆదేశించినట్లు చెబుతున్నారు. రామారావు అనే కానిస్టేబుల్ అక్కడ తీవ్ర అనారోగ్యానికి గురై ఆస్పత్రి పాలైనా ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం.

బకాయిలున్న ఇమామ్,మౌజన్ల గౌరవ వేతనాల బకాయిలు విడుదల

సాక్షి, అమరావతి: ఇమామ్‌లు, మౌజన్లకు ఇచ్చే గౌరవ వేతనాల చెల్లింపునకు రూ.90 కోట్లు విడుదల చేస్తూ ఆర్థిక శాఖ కార్యదర్శి వాడ్రేవు వినయ్ చంద్ బుధవారం ఉత్తర్వులిచ్చారు. 2024 జూలై నుంచి డిసెంబర్ వరకు ఇమామ్‌లు, మౌజన్‌లకు రూ.45 కోట్లను ఈ ఏడాది ఫిబ్రవరిలో విడుదల చేశామని, 2025 జనవరి నుంచి సెప్టెంబర్ వరకు బకాయిలున్న 9 నెలల వేతనాల సంబంధించి రూ.90 కోట్లను ప్రభుత్వం ఇప్పుడు విడుదల చేసిందని మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎండీ ఫరూఖ్ తెలిపారు.

మా ఒత్తిడితోనే విడుదల: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మైనారిటీ వింగ్

ఏడాదిగా బకాయిలున్న ఇమామ్‌లు, మౌజన్‌ల గౌరవ వేతనాల బకాయిలను ప్రభుత్వం విడుదల చేయడం వైఎస్సార్‌సీపీ మైనారిటీ వింగ్ నిరంతర ఒత్తిడి ఫలితమేనని వైఎస్సార్ సీపీ రాష్ట్ర మైనారిటీ వింగ్ అధ్యక్షులు వి. ఖాదర్ భాషా, ప్రెసిడెంట్ హాఫీజ్ ఖాన్ పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం తాడేపల్లిలో వారు ఒక సంయుక్త ప్రకటన విడుదల చేశారు. దీన్ని వైఎస్సార్‌సీపీ మైనారిటీ వింగ్ గట్టిగా పోరాడి సాధించిన విజయంగా వారు అభివర్ణించారు. కూటమి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురాకపోతే ఏ పథకమైనా అమలు కాదని తెలుస్తోందన్నారు. ఇప్పటికైనా ముస్లింలు మేలుకొని, ఎన్నికల సమయంలో వారికిచ్చిన హామీల అమలుకు అధికార పార్టీ నేతలను నిలదీయాలని పిలుపునిచ్చారు.

జర్నలిస్టుల అక్రిడిటేషన్‌కు దరఖాస్తుల ఆహ్వానం

సాక్షి, అమరావతి: రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో పని చేస్తున్న పాత్రికేయులకు రెండేళ్ల (2026–2027) కాల పరిమితితో నూతన అక్రిడిటేషన్లు జారీ చేసేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు సమాచార, పౌర సంబంధాల శాఖ డైరెక్టర్ కె.ఎస్. విశ్వనాథన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో జారీ చేసిన అక్రిడిటేషన్ కార్డుల గడువు ఈ ఏడాది నవంబర్ 30 నాటికి ముగుస్తున్నందున కొత్త అక్రిడిటేషన్స్ జారీ ప్రక్రియ చేపట్టామని పేర్కొన్నారు. నిబంధనల మేరకు అర్హత కలిగిన పాత్రికేయుల దరఖాస్తులు ఆన్‌లైన్ ద్వారా స్వీకరిస్తామని పేర్కొన్నారు. దరఖాస్తుల నమోదుకు ముందుగా మీడియా సంస్థల వివరాలు పోర్టల్‌లో పొందుపరచాల్సి ఉన్నందున సంబంధిత పత్రాల డాక్యుమెంట్లను పెన్‌డ్రైవ్‌లో పొందుపరిచి, జిరాక్స్ కాపీలను విజయవాడ పండిట్ నెహ్రూ బస్టాండ్‌లోని ఎన్టీఆర్ అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్ రెండో అంతస్తులో ఉన్న సమాచార పౌరసంబంధాలశాఖ కార్యాలయంలో స్వయంగా అందజేయాలన్నారు. అనంతరం పాత్రికేయులు నవంబర్ 14 వ తేదీ నుంచి ఆన్ లైన్ వెబ్ సైట్ : https://mediarelations.ap.gov.inలో సూచించిన విధంగా సంబంధిత పూర్తి వివరాలను నమోదు చేయాల్సి ఉంటుందని కేఎస్ విశ్వనాథన్ ఆ ప్రకటనలో తెలిపారు.

బీసీ వర్గీకరణ తర్వాతే స్థానిక ఎన్నికలు జరపాలి

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు

సాక్షి, అమరావతి: కుల గణనతోపాటు జనాభా దామాషా మేరకు కేటాయించే బీసీ రిజర్వేషన్లను చట్టబద్ధంగా వర్గీకరించిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్‌ను బుధవారం పలువురు బీసీ సంఘ ప్రతినిధులు కలిసి వినతిపత్రం అందించారు. బీసీలకు చట్టసభల్లో 33శాతం, స్థానిక సంస్థలు, నామినేటెడ్ పదవుల్లో 34శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. ఏయే సామాజికవర్గం ఎంత మంది ఉన్నారో తెలియకుండా రిజర్వేషన్ల వర్గీకరణ సాధ్యం కాదని, కుల గణన పూర్తి చేయకుండా స్థానిక ఎన్నికలు జరిపితే న్యాయం జరగదన్నారు. కుల గణన పూర్తి చేసి దామాషా ప్రకారం రిజర్వేషన్ వర్గీకరణ జరపాలన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు బీసీ రక్షణ చట్టాన్ని తేవాలన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శిని కలిసిన వారిలో శంకరరావుతోపాటు బీసీ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కుమ్మర క్రాంతికుమార్, బీసీ ఎంప్లాయీస్ కార్యదర్శి అప్పారావు, మల్లేశ్వరరావు, సతీష్ తదితరులు ఉన్నారు.

ఈ-పంట ఆధారంగానే పత్తి కొనాలి

- ఆచరణ సాధ్యంకాని యాప్‌లను రద్దుచేయాలి
- ఏపీ కౌలురైతుల సంఘం డిమాండ్

సాక్షి, అమరావతి: సీఎం యాప్, కపాస్ కిసాన్ యాప్‌లవల్ల పత్తి కొనుగోలులో ఏర్పడుతున్న ఆటంకాల వలన రైతులు నానా అగచాట్లు పడుతున్నారని ఏపీ కౌలు రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎ. కాటమయ్య, పి. జమలయ్య ఆందోళన వ్యక్తంచేశారు. ముఖ్యంగా సీసీఐ కొత్తగా తీసుకొచ్చిన కపాస్ కిసాన్ యాప్‌తో చాలా ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. ఈ పనికిమాలిన యాప్‌లు తొలగించి ఈ–పంట నమోదు ఆధారంగా పత్తిని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ హయాంలో ఈ–పంట ఆధారంగా సీసీఐ ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాల్లో రైతులు పత్తిని అమ్ముకునే వారని గుర్తుచేశారు. కానీ, ప్రస్తుతం ఈ–పంట నమోదుతో పాటు సీఎం యాప్, కపాస్ కిసాన్ యాప్‌లో నమోదు చేసుకుంటేనే కొనుగోలు చేస్తామన్న నిబంధనవల్ల రైతులు ఇబ్బందిపడుతున్నారన్నారు. ఈ యాప్‌లలో నమోదు చేసుకునేటప్పుడు ఓటీపీల సమస్య తీవ్రంగా ఉందని తెలిపారు. పత్తి అమ్ముకోవాలంటే స్మార్ట్ ఫోన్ కలిగిన రైతులకే సాధ్యమవుతుందని, పైగా.. సాంకేతికంగా పరిజ్ఞానం కలిగి ఉండాలన్నారు. 90 శాతం మంది రైతులకు స్మార్ట్‌ఫోన్లు లేవని, దీంతో ఆ తలనొప్పి పడలేక వారు క్వింటా రూ.3 వేల నుంచి రూ.4 వేలకు దళారులకు అమ్ముకుని తీవ్రంగా నష్టపోతున్నారని కాటమయ్య, జమలయ్య ఆందోళన వ్యక్తంచేశారు.

● నిర్మల వాణి

ఆత్మీయత.. అనురాగమే ఔషధంగా...

వనభోజనాలు

అనుకూలమైన వనంలో బంధు మిత్రుల కలయిక... అక్కడే వంటలు, ఆటలు, పాటలు, భోజనాలు. ఓ వైపు ఆధ్యాత్మిక వాతావరణం, మరో వైపు ఆహ్లాదకరమైన సామూహిక ఆనందం - కార్తీక మాసంలో వన సమారాధనలంటే మనకు గుర్తుకొచ్చేవి ఇవే. అయితే ఈ వన భోజనాల వెనుక చాలా లోతైన ఆధ్యాత్మిక కోణం దాగి ఉంది. బయటకు చాలా సరదాగా కనిపిస్తున్నే, లోపల చాలా లోతైన ఆధ్యాత్మిక ప్రయోజనాలను అందించే ఈ పిక్నిక్ యొక్క పరమార్థమేమిటో శ్రీ మాతాజీ నిర్మలా దేవి ప్రవచనాల నుంచి తెలుసుకోవచ్చును.

మన ప్రాచీన భారత దేశంలో ఋషులు, మునులు ఏర్పాటు చేసిన సంప్రదాయాలు అన్నీ మన సూక్ష్మ శరీరంలో కుండలినీ శక్తి జాగృతి కోసం, చక్ర నాడుల శుద్ధి కోసం ఉద్దేశించి చేసినవే. నైమిశారణ్యంలో సూత మహాముని తన తోటి మునులందరితో కలిసి ఉసిరి చెట్టు క్రింద వన భోజనాలు చేసినట్లుగా పురాణాలలో ఉంది.

అంతే కాకుండా ద్వాపర యుగంలో శ్రీ కృష్ణుడు కూడా గోపాలురతో కలిసి వనభోజనాలు చేసినట్లుగా మన పురాణాలలో ఉంది.

దేవతల ఆరాధన కన్నా మన చుట్టూ ఉన్న ప్రకృతిని ఆనందిస్తూ, గౌరవిస్తూ ఆరాధించడం ముఖ్యమని చెప్పారు. గోవర్ధన గిరిని పైకి ఎత్తి ఈ ప్రకృతి మనకు ఏ విధంగా గొడుగులా రక్షణగా నిలుస్తుందో చూపించారు. ఈ గోవర్ధన పూజ పర్వదినం కూడా కార్తీక మాసంలోనే శుక్ల పక్ష పాడ్యమి నాడు వస్తుంది.

మన చుట్టూ ఉండే ప్రకృతిని, గోవులను శ్రీ కృష్ణ భక్తులందరూ గౌరవించి, పూజలు చేస్తారు. అదే గౌరవ భావాన్ని మన దైనందిన జీవితంలో ప్రతి నిత్యం ప్రకృతి పట్ల మనం కలిగి ఉండాలి.

కార్తీక మాసంలో ఉసిరి చెట్టు కింద వన భోజనాలు చేస్తారు. ఉసిరి మన ఆరోగ్యానికి సంజీవని వంటిది. ఈ కాలంలోనే ఉసిరికాయలు బాగా కాస్తాయి. 'సి' విటమిన్ పుష్కలంగా ఉండే ఉసిరిని రోజూ ఏదో ఒక రూపంలో మనం తినాలి. ఇది మన జీర్ణ శక్తిని పెంచుతుంది. శరీర ఉష్ణోగ్రతను తగ్గిస్తుంది. ఈ చెట్టు గాలి కూడా చాలా మంచిది. ఉసిరిలో ఆరు రుచులలో ఒక్క లవణం (ఉప్పు) తప్ప మిగిలిన ఐదు రుచులూ ఉంటాయి. అంటే మధురం(తీపి), ఆమ్లం(పులుపు), కషాయం(వగరు), కటువు(కారం), తిక్తం (చేదు) ఈ ఐదు రుచుల సంగమం. ముఖ్యంగా ఉసిరిలో ఆమ్ల గుణం అంటే పులుపు ఎక్కువగా కనిపిస్తుంది.. కనుక దీనిని ఆమ్లా లేదా ఆమలకము అని పిలుస్తారు కూడా. కార్తీక మాసంలోనే ఉసిరికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వడంలో ఆరోగ్య రహస్యం దాగి ఉందని తెలుస్తోంది.

ఈ నెల నుంచి శీతాకాలం మొదలు అవుతుంది. దీంతో రుతు సంబంధ వ్యాధులతో పాటు దగ్గు, జలుబు వంటివి వచ్చే అవకాశం ఉంది. అందువల్ల ఈ నెలలో ఉసిరిని తినడం.. లేదా ఉసిరి చెట్టు నీడన ఉండడం వలన ఈ దోషాలు నివారింపబడతాయి. సకల మానవాళిని రక్షిస్తుందని.. వృద్ధాప్యాన్ని దరిచేరనివ్వని ఔషధ మొక్కలలో ఉసిరికి ఉసిరే సాటి అని చరక సంహిత పేర్కొంది.

మానవ శరీరం పంచ భూతాలైన భూమి, ఆకాశం, వాయువు, జలం, అగ్ని అనే ఐదు మూలకాలతో తయారవుతుంది. ఈ పంచ భూతాల తత్త్వాల తోనే మన సూక్ష్మ శరీరంలో ఆరు చక్రాలు రూపొందాయి. ఉదాహరణకు మన సూక్ష్మ శరీరంలో మొదటి శక్తి కేంద్రమైన



మూలాధార చక్రం భూతత్త్వంతో ఏర్పడుతుంది. ఈ శక్తి కేంద్రంలో ఏదైనా సమస్య ఏర్పడినప్పుడు, మనం భూమి మీద కూర్చొని, రెండు చేతులూ భూమి మీద పెట్టి సహజ యోగ పద్ధతిలో ధ్యానం చేస్తే, ఆ సమస్య నుండి విముక్తి పొందవచ్చు.

ఆ విధంగా పంచ భూతాత్మకమైన ఈ ప్రకృతి మానవుల సూక్ష్మ శరీరంలో ఉన్న శక్తి కేంద్రాలను చైతన్య పరిచి ఆరోగ్యాన్ని, ఆనందాన్ని ప్రసాదిస్తుంది. వన భోజనాల ద్వారా సమకూరే మరో ప్రయోజనం సహజ యోగులలో సామూహిక జీవనం మరింతగా బలపడుతుంది.

మానవుడు సంఘజీవి. సామూహికంగా అందరూ కలిసి జరుపుకునే పిక్నిక్ ల వలన సహజ యోగుల మధ్య అభిప్రాయ భేదాలు, మనస్పర్థలు ఏమైనా ఉంటే తొలగిపోయి, సామరస్యం ఏర్పడుతుంది. ఒక్కరి కోసం అందరూ, అందరి కోసం ఒక్కరూ కలిసి సహకరించుకోవడం వలన మనుష్యుల మధ్య ప్రేమ పూరితమైన వాతావరణం ఏర్పడుతుంది. అహంకార, ప్రత్యహంకారాలు కరిగిపోయి హృదయం విశాలమవుతుంది. అటువంటి వాతావరణం పెరుగుతున్న పిల్లల మీద సానుకూల ప్రభావాన్ని చూపించి, వారిలో సానుకూల దృక్పథం ఏర్పడేటట్లు చేస్తుంది.

మన విశుద్ధి చక్రం ఆకాశ తత్త్వాన్ని కలిగి ఉంటుంది. వన భోజనాల వంటి సామూహిక కార్యక్రమాలలో పాలుపంచుకొన్నప్పుడు, మన విశుద్ధి చక్రం అభివృద్ధి చెంది చక్కటి సంభాషణా చాతుర్యం అలవడి అందరితో సత్సంబంధాలను పెంపొందించుకొనగలుగుతాం. మన లోపల గల షట్చక్రాలు సహజమైన ప్రకృతిలో లభించే పంచ భూతాల తత్త్వాలతో చాలా వేగంగా స్పందిస్తాయి. కాబట్టి కనీసం ఏడాదికి ఒకసారి ఇలా కార్తీక మాసంలో వన భోజనాల ద్వారా అయినా ప్రకృతి ఒడిలో అందరూ మమేకమై, ధ్యానంతో, భజనలతో ఆట పాటలతో హాయిగా సేద తీరితే, సహజ కుటుంబాల సామూహికత మరింత బలోపేతం అవుతుందని ఆశిద్దాం.

– డా. పి. రాకేశ్
(మాతాజీ నిర్మలాదేవి ప్రసంగాలు, ప్రవచనాల ఆధారంగా)

నమోస్తు కాలభైరవా!

'కాలుడు' అంటే యముడు. యముని పేరు వింటేనే లోకమంతా భయపడుతుంది. అలాంటి యముడిని సైతం భయపెట్టే మహిమగల స్వామిగా శ్రీ కాలభైరవుడికి పేరు. ఈ పేరును స్వయంగా శివుడే తన కుమారునికి పెట్టాడని పురాణాలు చెబుతున్నాయి. సంసార బాధలతో సతమతమయ్యేవారు, అనారోగ్యాల బారిన పడ్డవారు, క్షుద్రశక్తుల విజృంభణతో నలిగిపోతున్నవారు శ్రీ కాలభైరవస్వామిని వేడుకుంటే సకల బాధలను హరింపజేసి భక్తులను రక్షిస్తాడని నమ్మకం. అందుకే నిత్యం అశేష భక్తుల తాకిడితో ఇసన్నపల్లి (రామారెడ్డి) శ్రీ కాలభైరవస్వామి ఆలయం ఎంతో విశిష్టతను సంతరించుకుంది. నవంబర్ 9, ఆదివారం కార్తీక బహుళ పంచమి నుంచి 13, గురువారం బహుళ నవమి వరకు కాలభైరవస్వామి జన్మదిన వేడుకల సందర్భంగా...

కామారెడ్డి జిల్లా ఎన్నో ప్రాచీన దేవాలయాలకు ప్రసిద్ధిగాంచింది. రాష్ట్ర రాజధాని నుంచి నాగ్‌పూర్ వెళ్లే ఎన్‌హెచ్–44 జాతీయ రహదారి పై కామారెడ్డి చేరుకున్న తర్వాత అక్కడ నుంచి మరో 10 కిలోమీటర్ల దూరంలో ఇసన్నపల్లి (రామారెడ్డి) గ్రామం ఉంటుంది. వందల యేళ్ల క్రితం ఇక్కడ వెలసిన శ్రీ కాలభైరవస్వామి దర్శనానికి నిత్యం వేలసంఖ్యలో జనం వస్తుంటారు.

దిగంబరునిగా ఎందుకున్నాడంటే..?

ఆలయంలో శ్రీ కాలభైరవస్వామి మూల విగ్రహం దిగంబరంగా ఉంటుంది. స్వామివారి మూలవిగ్రహం ఎప్పుడు వెలిసిందో కచ్చితంగా చెప్పే ఆధారాలు లభ్యం కాలేదు. క్రీ.శ 13వ శతాబ్దంలో జైనమతం బాగా వ్యాప్తి చెందిన సమయంలో ఆలయం నిర్మించి ఉంటారని కొందరు చెబుతుంటారు. అందుకే దిగంబరునిగా దర్శనమిస్తాడని కొందరి భావన. కానీ ఇసన్ననపల్లి–రామారెడ్డి గ్రామాలు క్రీ.శ 1550–1600 సంవత్సరాల మధ్య కాలంలో దోమకొండ సంస్థానాధీశుల పరిపాలనను నిర్మించబడినట్లు స్పష్టమైన ఆధారాలు కనబడుతున్న కారణంగా జైనవిగ్రహం అనడానికి వీలు లేదు. పురాణేతిహాసాల్లోనూ శ్రీ కాల భైరవుడిని దిగంబరుడిగానే పేర్కొనడం జరుగుతుంది.

స్థలపురాణం

ఇసన్నపల్లి గ్రామం ప్రారంభంలోనే శ్రీ కాలభైరవ స్వామి ఆలయం ఉంటుంది. అష్ట దిక్కులలో రామారెడ్డి గ్రామానికి అష్ట భైరవులు ఉన్నారు. వీరు ఎల్లప్పుడు గ్రామాన్ని రక్షిస్తుంటారని నానుడి. ఈ అష్టభైరవులలో ప్రధానుడు శ్రీ కాల భైరవస్వామి. మిగతా ఏడు భైరవ విగ్రహాలు కాల ప్రవాహంలో కనుమరుగైపోయాయి. గ్రామానికి ఒక కిలోమీటర్ దూరంలో కాశిపల్లి అనే చోట విశ్వేశ్వరుని ఆలయం, దానికి ముందుభాగంలో గ్రామం వైపు చూస్తున్న భైరవ విగ్రహం కూడా ఉన్నాయి. ఇలా రామారెడ్డి గ్రామం చుట్టు కాశీ (కాశిపల్లి), రామేశ్వరం (రామేశుని కుంట) ఇలాంటి పుణ్యక్షేత్రాల పేర్లతో శివాలయాలు, భైరవుని విగ్రహాలు దర్శనమిస్తాయి. శ్రీ కాలభైరవస్వామి తన తండ్రి పేరిట ఈశాన్య దిక్కునే ఉంచుకుని నిరంతరం గ్రామాన్ని, భక్తులనూ రక్షిస్తు ఉంటాడని చెబుతున్నారు. ఇక్కడి పుష్కరిణిని అమృతమయమైన నీళ్లను అందించే అక్షయ పాత్రగా భావిస్తారు. ఎన్ని నీళ్ల తోడుకున్నా తరిగిపోని జల సంపద ఈ పుష్కరిణి ప్రత్యేకత. ఈ పుష్కరిణిలో పుణ్యస్నానాలు చేసే వారికి అన్నిరకాల వ్యాధులు, భూత ప్రేత పిశాచ బాధలు తొలగిపోతాయని నమ్మకం. నిత్యపూజలతో పాటు ప్రతి మంగళవారం విశేష పూజ, అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తారు.

ప్రతి యేడాది వైశాఖ మాసంలో బ్రహ్మోత్సవాలు, కార్తికంలో జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహిస్తారు. మార్గశిర మాసంలోనూ ఒక రోజంతా సంతతాభిషేకం, విశేషపూజలు నిర్వహిస్తారు. ఆదివారం మొదలైన జయంతి వేడుకలు నేడు దక్షయజ్ఞం, ఆరున్నర నుంచి 8 గంటల వరకు పూర్ణాహుతితో ముగుస్తాయి.

– సేపూరి వేణుగోపాలాచారి
–సాక్షి, కామారెడ్డి,

● సువార్త

అద్వితీయ సత్య దేవుని నియామకం

'మీరు సిలువ వేసిన ఈ యేసునే దేవుడు ప్రభువుగాను క్రీస్తుగాను నియమించెను. ఇది ఇశ్రాయేలు వంశమంతయు రూఢిగా తెలిసికొనవలెనని చెప్పెను'
– అపో. కా. 2 : 36.

దేవదేవుని గొప్ప నియామకం ఏమంటే యేసును క్రీస్తుగా, ప్రభువుగా నియమించడం. ఇందుకే అపోస్తలులు అందరూ యేసే క్రీస్తు, యేసే మెస్సీయ అంటూ అనుదినము అంతటా ప్రకటిస్తూ యూదుల మనో నేత్రాలు వెలిగించారు.

పవిత్రాత్మ ప్రేరణతో ఏంతో ధైర్యంగా పేతురు లేచి నిలబడి సత్య లేఖనములు వివరిస్తూ ఉంటే యూదులు గుండెలు బాదుకున్నారు. వాక్యమనే కత్తి వారి హృదయాంతరంగాలలో దిగబడి పొడుచుట ద్వారా వారి మనస్సాక్షి దోషారోపణ చేయుట కారణాన అయ్యో అయ్యో అంటూ కలత చెందారు. మాయగాడు, మంత్రగాడు, అనామకుడు అనుకున్నాం.

ఈయనేనా? మేము మా పితరులు ఎంతగానో ఎదురు చూసినా మెస్సీయా... ఈయనేనా!? అంటూ విస్మయం వ్యక్తం చేయడమే కాక, ఆయనను ఘోర సిలువ మరణానికి అప్పగించినందుకు పశ్చాత్తాపడి రోదించారు.



దేవుని నియామకం ఆరోజున గొప్ప సంచలనం.

దేవుని కుడి పార్శ్వమున యేసు కూర్చోవడం, రాజులకు రాజుగా ప్రభువులకు ప్రభువుగా దేవుని పక్షాన ఏలుబడి చేయడం అనే సత్యం ఇశ్రాయేలీయులు రూఢిగా తెలుసుకొని ఆశ్చర్యచకితులయ్యారు. అంతరంగాన ఆత్మసంబంధ నాట్యాలు చేశారు. పూర్వపు పాతరోజులు, ఆ వైభవాలు సదా గుర్తుకు తెచ్చుకొనే యూదులంతా అన్య రాజుల పాలనలతో విసుగుచెంది ఉన్నారు. పూర్వం సమూయేలు కాలంలో ఉండి కొనసాగినట్టు నేడు కూడానూ మాకు ఒక భౌతిక రాజును నియమించమని, ఆ వాగ్దాన మెస్సీయాను తక్షణమే పంపమని దేవున్ని వారు ఎప్పుడూ వేడుకొని ప్రార్థనలు చేస్తూ ఉంటే ఆ యెహోవా దేవుడేమో ఉన్నతంగా అత్యున్నతంగా ఆత్మసంబంధ రాజుగా, అక్షయుడైన రాజుగా మెస్సీయ అనబడే క్రీస్తును ఏర్పాటు చేసి నియమించడం వైవిధ్యమే మరి. సూర్యుడు ఉన్నంతవరకు యుగ యుగాలు ఉండే అంతములేని క్రీస్తుదైన ఈ శాశ్వతరాజ్యమును, శాశ్వత రాజును గూర్చి తెలుసుకొనుటకు దేవుని వాగ్దానపు దావీదు వంశ చరిత్రను వారు తిరగేయడం మొదలుపెట్టారు.

ఇప్పుడైతే కొత్త నిబంధన సంబంధ బాంధవ్యాన్ని అనుసరించి చూస్తే క్రీస్తు ఏలుబడి చేసే ప్రభువుగా, పతిగా, అధిపతిగా, సర్వాధిపతిగా, భర్తగా, నాధుడుగా, వరుడుగా, పెండ్లి కుమారుడుగా ఉన్నాడు.

ఇప్పుడు ఇట్టి పదాలు బిరుదులతో దేవుని సంబోధించి కీర్తించి కొనియాడనవసరం లేదు. ఎందుకంటే ఆయన క్రీస్తును ప్రభువుగా నియమించాడు కాబట్టి ప్రభువుకు ఉన్న పర్యాయ పదాలు ఇప్పుడు క్రీస్తుకు మాత్రమే చెందుతాయి.

దేవుడు ప్రభువే, సకల యుగములలో రాజే అన్నది సత్యమే అయినప్పటికీ క్రీస్తు పాదముల కింద సర్వమూ ఉంచి క్రీస్తును తన పక్షాన ఏలుబడి చేసే రాజుగా నియమించుకున్నందున దేవుని పెద్ద మనస్సు, సహృదయత చాలా చాలా గొప్పవై ఉన్నాయి.

క్రీస్తును ప్రభువు రాజు అంటే దేవదేవుని మహిమ ఆ హోదా ఆ స్థాయి ఏమాత్రం తగ్గనే తగ్గవు.

దేవుడు చిన్నబుచ్చుకోడు. కారణం చూస్తే, క్రీస్తును ఆ మహా దేవుడే ప్రభువుగా తన అనాది నిత్య సంకల్పం చొప్పున నియమించాడు. క్రీస్తునందున్నవారు ప్రభువునందే అతిశయించాలి. ఇక్కడ ప్రభువు అంటే ప్రభువైన దేవుడు (1కొరింధీ 10:17). ఈ ఇద్దరిని ఏయే సందర్భాలలో, ఎక్కడెక్కడ ప్రభువుగా చూడాలో అనేది ఆత్మజ్ఞానం మీద, ఆయా యుగాల మీద, పాత క్రొత్త నిబంధనల మీద ఆధారపడి ఉంటుందన్నది గమనించాలి.

క్రీస్తుప్రభువు దగ్గరకు వస్తేనే తన పక్షాన ఆయనను ప్రభువుగా నియమించుకొన్న ఆ ప్రభువైన దేవుడు కూడా తేటగా అర్థం అవుతాడు.

– జేతమ్

లక్ష్మీదేవికి కమలం ఎందుకు ప్రీతికరం?

సిరిసంపదలకు అధిదేవత అయిన అమ్మవారిని వర్ణించే ప్రతి చిత్రంలోనూ లేదా విగ్రహంలోనూ కమలం తప్పక ఉంటుంది. ఆమె కమలంపై కూర్చుని ఉండటం చేతిలో కమలం ధరించి ఉండటం మనం చూస్తాం. దీని వెనుక పురాణ గాథలు, ఆధ్యాత్మిక కారణాలు రెండూ ఉన్నాయి.

ముఖ్యంగా లక్ష్మీ దేవి సముద్ర మథనం సమయంలో క్షీరసాగరం నుంచి ఉద్భవించింది. ఆ సమయంలో ఆమె చేతిలో కమలంతో వచ్చింది. అందుకే ఆమెను 'క్షీర సాగర కన్య' అని, అలాగే కమలంతో ముడిపడి ఉంది కాబట్టి 'పద్మ' 'కమల' 'పద్మప్రియ' వంటి పేర్లతో పిలుస్తారు.

ఆధ్యాత్మికంగా చూస్తే కమలం అనేది పరిశుభ్రతకు. వైరాగ్యానికి గొప్ప చిహ్నం. కమలం ఎల్లప్పుడూ బురద నీటిలో లేదా మురికి కొలనులో పెరుగుతుంది. కానీ ఆ బురదలోని ఒక్క అణువు కూడా కమలాన్ని అంటకుండా అది అత్యంత స్వచ్ఛంగా నిర్మలంగా వికసిస్తుంది. ఈ లక్షణమే కమలాన్ని లక్ష్మీదేవికి అత్యంత ప్రీతిపాత్రమైనదిగా మార్చింది.

ఇక్కడ దాగి ఉన్న లోతైన ఆధ్యాత్మిక సందేశం ఏమిటంటే. సంపద, ధనం అనేది 'బురద' వంటి ఈ లోక వ్యవహారాల మధ్యే ఉంటుంది. లక్ష్మీదేవిని ఆరాధించే భక్తులు సంపదను పొందినప్పటికీ, ఆ ధనమదం లేదా లోక కష్టాల ప్రభావం తమపై పడకూడదు. కమలంలాగే, ఈ ప్రపంచంలో ఉన్నా, దానికి అంటకుండా పరిశుద్ధంగా, నిర్లిప్తంగా జీవించాలి. ధనాన్ని కేవలం జీవితానికి ఒక సాధనంగా మాత్రమే చూడాలి, దానిలో మునిగిపోకూడదు. కమలంపై కూర్చునే లక్ష్మీదేవి ''నీ సంపదను ధర్మ మార్గంలో ఉంచు, దానిపై వ్యామోహం పెంచుకోకు'' అని పరోక్షంగా చెబుతుంది. అందుకే ఆధ్యాత్మిక సంపద మరియు భౌతిక సంపద రెండింటికి చిహ్నంగా కమలం ఆమెతో నిరంతరం ఉంటుంది.

మన మహర్షులు

రుషులు మహా తపశ్శక్తి సంపన్నులు. వారినుంచే గోత్రాలు, ప్రవరలు ఏర్పడ్డాయి. అటువంటి రుషులలో 108 మంది రుషుల పేర్లను తెలుసుకుందాం.

1)కశ్యప 2)అత్రి 3)భరద్వాజ 4)విశ్వామిత్ర 5)గౌతమ 6)జమదగ్ని 7)వశిష్ట 8)అగస్త్య 9) అరణ్యక 10)అష్టావక్ర 11)అర్వావసువు 12)అస్తీక 13)అంగీరస 14)అరుణి 15)ఉద్దాలక 16)ఉదంక 17)ఉపమన్యు 18)ఉతథ్య 19)రురు 20)రోమశ 21)రైభ్య 22)ఋచీక 23)ఋభు 24)ఋష్యశంగ 25)ఔరవ 26)బకదాల్భ్య 27)బృహస్పతి 28)భృగు 29)కచ 30)కణ్వ 31)కండు 32)కర్దమ 33)కాశ్యప 34)కపిల 35)కాత్యాయన 36)కామందక 37)కతువు 38)కౌశిక 39)గర్గ 40)గత్సమద 41)గౌరముఖ 42)చ్యవన 43)జడ 44)జరత్కప 45)జాబాలి 46)జైగీషవ్య 47)జైమిని 48)తండి 49)దధీచి 50)దక్ష 51)దత్తాత్రేయ 52)దీర్ఘతమ 53)దూర్వాసో 54)దేవల 55)దేవద్యుతి 56)ధౌమ్య 57)నరనారాయణ 58)నారద 59)నిదాఘ 60)నచికేతు 61)పరాశర 62)పరశురామ 63)పిప్పలాద 64)పులస్త్య 65)పైల 66)పృథు 67)మరీచి 68)మతంగ 69)మంకణ 70)మాండవ్య 71)మార్కండేయ 72)మాణిక్య వాచకర్ 73)మైత్రేయ 74)మతండు 75)ముద్గల 76)యాజ్ఞవల్క్య 77)లోమశ 78)వామదేవ 79)వాల్మీకి 80)వాత్స్యాయన 81)విపుల 82)విశ్రవస 83)విభాండక 84)వ్యాస 85)వ్యాఘ్రపాద 86)వైశంపాయన 87)సహస్రపాద 88)సనక,సనందన,సనత్కుమార, సనత్సుజాత 89)సంవర్త 90)సాందీపని 91)సారస్వత 92)సూత 93)స్థూలకేశ 94)సౌభరి 95)శక్తి 96)శంగి 97)శరభంగు 98)శతానంద 99)శమీక 100)శాండిల్య 101)శంఖు 102)లిఖిత 103)శిలాద 104)శుక 105)శుక్ర 106)శ్వేతకేతు 107)శౌనక 108)హరీత

● ఇస్లాం వెలుగు

ఆత్మసంతృప్తే అసలైన కలిమి

సమాజంలో ఆధునికత పెరుగుతున్న కొద్దీ అవినీతి, అక్రమాలు కూడా పెరిగిపోతున్నాయి. మనిషి బాగా స్వార్థపరుడై పోతున్నాడు. ఉదయం లేచింది మొదలు రాత్రి పడుకునే వరకూ ఎలా సంపాదించాలి.. అన్న ధ్యాస తప్ప, మరో యావ కనిపించడం లేదు. అర్థబలంతోనే అంగబలం.. అధికారం.. అందలం అన్నీ వస్తాయి అనే విధమైన ఆలోచనా ధోరణే అవినీతికి, అక్రమాలకు పురిగొలుపుతోంది. స్వార్థానికి బీజం వేస్తోంది. ఒక్కసారి ఈ స్వార్థం అనే దుర్గుణం మనసులో పురుడు పోసుకున్నదంటే, సమస్త దుర్గుణాలకూ తెర లేచినట్లే. స్వార్థపూరితుల ఆశ ఎన్నటికీ తీరదు. తాము మాత్రమే కాదు, తమ కొడుకులు, కూతుళ్ళు, మనవలు, మునిమనవలు సైతం కోటీశ్వరులైపోవాలని కోరుకుంటారు. కోట్లకు పడగలెత్తిన తరువాత, దాని సంరక్షణకు గూండాలను పోషిస్తారు. అధికారులకు లంచాలిస్తారు. తరువాత ఎన్నికల బరిలో నిలిచి, రాజకీయ రక్షణ కవచం సంపాదిస్తారు. వీటన్నిటికీ పెట్టిన ఖర్చులు వడ్డీతోసహా రాబట్టుకోడానికి పెద్దపెద్ద కుంభకోణాలకు తెరలేపుతారు. అయినప్పటికీ మానవుల ధనపిపాస తీరదు, సంతృప్తి లభించదు. ఈ విషయాన్ని ముహమ్మద్ ప్రవక్త(స) ఎంత సోదాహరణంగా చెప్పారో చూడండి...

''మానవుడికి బంగారంతో నిండిన ఒక పెద్ద గని లభిస్తే అతను మరొకటి కావాలని కోరుకుంటాడు. రెండవది కూడా లభిస్తే అతను మూడవది కావాలని అభిలషిస్తాడు. మానవుడి కడుపు మట్టితో మాత్రమే నిండుతుంది. అంటే, సమాధికి చేరిన తరువాతనే ధనాశ అంతమవుతుందని అర్థం. అయితే ప్రాపంచిక వ్యామోహాన్ని వదిలిపెట్టి, పశ్చాత్తాప హృదయంతో దేవుని వైపుకు మరలితే, ఆయన పశ్చాత్తాపాన్ని స్వీకరించి వారిని అనుగ్రహిస్తాడు. అలాంటి వారికి ఆత్మ సంతృప్తి ప్రాప్తమవుతుంది. ఒక్కటి గుర్తుంచుకోవాలి. అత్యధిక సిరి సంపదలతో కలిమి రాదు, అసలైన కలిమి ఆత్మ సంతృప్తి ద్వారానే ప్రాప్తమవుతుంది. అందుకని మనిషి వక్ర మార్గాలు విడిచి, స్వార్థబుద్ధిని విడనాడి, ధర్మబద్ధమైన జీవన విధానాన్ని అవలంబించాలి. ఆశ ఉన్నా, అది అత్యాశగా, దురాశగా మారకుండా జాగ్రత్త పడాలి. మధ్యేమార్గాన్ని అవలంబించాలి. సర్వకాల సర్వావస్థల్లో ధర్మాధర్మాలను దష్టిలో ఉంచుకోవాలి. ఎట్టి పరిస్థితి లోనూమంచి మార్గాన్ని విడిచి పెట్టకూడదు. కొంతమేరకైనా స్వార్థాన్ని వీడి సమాజం కోసం ఆలోచిస్తే అవినీతికి అణువంతైనా ఆస్కారం ఉండదు. దీని కోసం సర్వసంగ పరిత్యాగం చెయ్యవలసిన అవసరం లేదు. మంచీ చెడు, ధర్మం అధర్మం, సత్యం అసత్యం, న్యాయం అన్యాయం లాంటి విషయాలపట్ల విచక్షణ తెలుసుకొని, ఆచరించగలిగితేచాలు. ముహమ్మద్ ప్రవక్త(స) ప్రవచించినట్లు,'మనిషి తన స్వయానికి ఏస్థితిని కోరుకుంటాడో, పరుల విషయంలో కూడా అదే స్థితి ని అభిలషించే వాడైఉండాలి.' ప్రతిఒక్కరూ ఈ విధంగా ఆలోచిస్తే స్వార్థ బుద్ధి దూరమవుతుంది. సమాజాన్ని పట్టిపీడిస్తున్న సకల సమస్యలూ వాటంతట అవే పరిష్కారమైపోతాయి. దైవం అందరికీ ఇలాంటి మంచి బుద్ధిని ప్రసాదించాలని మనసారా కోరుకుందాం.

– ముహమ్మద్ ఉస్మాన్ ఖాన్

మార్జిన్ ట్రేడింగ్‌పై పెరుగుతున్న ఆసక్తి

- రూ. 1 లక్ష కోట్లకు ఎంటీఎఫ్ రుణాలు
- మరింతగా పెరిగేందుకు అవకాశాలు
- కోటక్ సెక్యూరిటీస్ సీడీబీవో ఆశీష్ నందా

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: మార్కెట్లపై ఆశావహ ధోరణి నెలకొన్న నేపథ్యంలో మార్జిన్ ట్రేడింగ్ ఫెసిలిటీ (ఎంటీఎఫ్)పై ఇన్వెస్టర్లలో గణనీయంగా ఆసక్తి పెరుగుతోందని కోటక్ సెక్యూరిటీస్ చీఫ్ డిజిటల్ బిజినెస్ ఆఫీసర్ ఆశీష్ నందా తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో పరిశ్రమ వ్యాప్తంగా సగటున రూ. 77,180 కోట్లుగా ఉన్న ఎంఎటీఎఫ్ రుణాలు ఆగస్టులో రూ. 1 లక్ష కోట్ల స్థాయికి చేరడం ఇందుకు నిదర్శనమని ఆయన చెప్పారు. గతేడాది సెప్టెంబర్‌లో రూ. 85,000 కోట్లుగా ఉన్న రుణాలు, ఈ ఏడాది తొలినాళ్లలో మార్కెట్ కరెక్షన్‌కి లోనైనప్పుడు రూ. 71,000 కోట్లకు తగ్గినప్పటికీ, ఆ తర్వాత మార్కెట్లతో పాటు చాలా వేగంగా పుంజుకున్నట్లు నందా వివరించారు. అయితే, చూడటానికి భారీగా అనిపిస్తున్నా, దేశీయంగా ఎంటీఎఫ్ ఇంకా ప్రారంభ దశలోనే ఉందని, మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్‌లో దీని వాటా కేవలం 0.1 శాతమేనని నందా వివరించారు. అదే అంతర్జాతీయంగా చూస్తే అమెరికాలో ఇది 1.6 శాతంగా, చైనాలో 2.7 శాతంగా ఉన్నట్లు చెప్పారు. దేశీయంగా ఈ మార్కెట్ విస్తరణకు మరింతగా అవకాశాలు ఉండటాన్ని ఇది సూచిస్తోందని పేర్కొన్నారు. ఎంటీఎఫ్ విధానంలో షేర్లు కొనుగోలు చేసేటప్పుడు ఇన్వెస్టర్లు స్వల్ప మొత్తాన్ని మార్జిన్‌గా కడితే, బ్రోకరేజీ సంస్థలు దానికి తగ్గ నిష్పత్తిలో మిగతా మొత్తాన్ని రుణంగా సమకూరుస్తాయి. దానిపై వడ్డీ వసూలు చేస్తాయి. మరిన్ని ముఖ్యాంశాలు ఆశీష్ నందా మాటల్లోనే ..

తక్కువ రిస్కులు..

రిటైల్ ఇన్వెస్టర్లకు డిస్కౌంట్ బ్రోకర్లు ఎంటీఎఫ్‌ను మరింత అందుబాటులోకి తేవడంతో దీనికి మరింత ప్రాచుర్యం పెరిగింది. అలాగే, వడ్డీ రేట్ల విషయంలోనూ పోటీ పెరిగింది. కొన్ని బ్రోకింగ్ సంస్థలు అత్యంత తక్కువగా 9.5 శాతం–9.75 శాతం శ్రేణిలో కూడా వడ్డీ రేటుకు దీన్ని ఆఫర్ చేస్తున్నాయి. డెరివేటివ్స్‌లో లభించే మార్జిన్ ఫెసిలిటీతో పోలిస్తే స్టాక్స్‌కి సంబంధించిన ఎంటీఎఫ్‌లో రిస్కులు కాస్త తక్కువ ఉంటాయి. ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్‌లో ఇది 5–50 రెట్ల వరకు లభిస్తే, స్టాక్స్ విషయంలో లీవరేజీ 2–4 రెట్లు మాత్రమే ఉంటుంది. పైగా స్ట్రయిక్ ప్రైస్, ఎక్స్‌పైరీ డేట్‌తో ముగిసిపోయే సంక్లిష్టమైన ఎఫ్అండ్‌వో కాంట్రాక్టులతో పోలిస్తే షేర్లు మన చేతిలో ఉండటం కాస్త భరోసానిచ్చే విషయంగా ఉంటుంది.

1,200 స్టాక్స్‌కి మాత్రమే అందుబాటులో..

సుమారు 6,500 పైగా లిస్టెడ్ స్టాక్స్ ఉన్నప్పటికీ 1,200 షేర్లకు మాత్రమే ఎంటీఎఫ్ వెసులుబాటు ఉంది. తీవ్ర ఒడిదుడుకులకు లోనయ్యే చాలా మటుకు స్టాక్స్‌కి ఈ సదుపాయం ఉండదు. షేరు రేట్లను బట్టి మార్జిన్ అవసరాలనేవి మారిపోతుంటాయి. రిస్కు చేసి ఎక్కువ మార్జిన్ తీసుకుందామనుకున్నా, నియంత్రణ సంస్థ నిర్దిష్ట పరిమితులు విధించడం వల్ల బ్రోకర్లు కూడా ఒక స్థాయికి మించి రుణం ఇవ్వడానికి కుదరదు. టీసీఎస్, టాటా మోటర్స్, రిలయన్స్, జియోలాంటి కొన్ని స్టాక్స్‌లో తప్ప టాప్ స్టాక్స్‌లో కూడా లీవరేజీ తక్కువగానే ఉంటోంది కాబట్టి ప్రస్తుతానికైతే దీనివల్ల వ్యవస్థాగతమైన రిస్కులేమీ లేవు. ఈ నేపథ్యంలో ఎంటీఎఫ్‌కి దేశీయంగా క్యాపిటల్ మార్కెట్ వ్యవస్థకు మూలస్తంభంగా ఎదిగేందుకు అవకాశాలు ఉన్నాయి. ఇన్వెస్టర్లు దీన్ని గురించి కూలంకషంగా తెలుసుకుని, రిస్కుల గురించి స్పష్టంగా అర్థం చేసుకుని, క్రమశిక్షణతో ఉపయోగించుకుంటే ప్రయోజనకరంగా ఉంటుంది.

టాటా ఈవీ 14 మెగా చార్జర్లు

హైదరాబాద్: ఎలక్ట్రిక్ వాహన సంస్థ టాటా.ఈవీ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ వ్యాప్తంగా 14 కొత్త మెగా చార్జర్లను ప్రారంభించినట్టు ప్రకటించింది. వోల్ట్రాన్ భాగస్వామ్యంతో వీటిని అభివృద్ధి చేసినట్టు తెలిపింది. ఇవి పూర్తిగా మనుషులతో నిర్వహించే చార్జర్లు అని.. సౌకర్యమైన, మన్నికైన సేవలను అందించడమే లక్ష్యమని ప్రకటించింది. రోజులో 24 గంటలూ వీటి సేవలు అందుబాటులో ఉంటాయని పేర్కొంది. దేశవ్యాప్తంగా ఇలాంటి మెగా చార్జర్లు 70 ప్రాంతాల్లో అందుబాటులో ఉన్నట్టు తెలిపింది.

దూర ప్రాంతాలకు ఫ్లిప్‌కార్ట్ ఈవీ ట్రక్కులు

ముంబై: ఫ్లిప్‌కార్ట్ దూర ప్రాంతాలకు సైతం ఎలక్ట్రిక్ ట్రక్కుల (ఈవీలు) ద్వారా ఉత్పత్తుల రవాణాను ప్రయోగాత్మకంగా ప్రారంభించింది. గోల్డెన్ ఏరో లాజిస్టిక్స్ సంస్థ భాగస్వామ్యంతో ఢిల్లీ–జైపూర్ కారిడార్‌లో దీన్ని చేపట్టింది. మధ్యస్థ దూర ప్రాంతాలకు ఎలక్ట్రిక్ ట్రక్కులను నడిపించడంలో ఉన్న సాధ్యాసాధ్యాలను పరిశీలించనుంది. వాహనాల పనితీరు, ఇంధన సామర్థ్యం, నష్టాల్లేని స్థితికి ఎంత కాలంలో చేరుకుంటాం అంశాలను ప్రయోగాత్మకంగా తెలుసుకోనుంది. 2030 నాటికి నూరు శాతం ఎలక్ట్రిక్ వాహనాలకు మళ్లాలన్నది కంపెనీ లక్ష్యంగా ఉంది.

టెక్నాలజీ అప్‌గ్రేడ్‌కు నిధులు కేటాయించాలి

కేంద్ర ఆర్థిక శాఖకు ఎంఎస్ఎంఈల డిమాండ్

న్యూఢిల్లీ: సాంకేతికపరమైన పురోగతికి ప్రత్యేకమైన నిధిని కేటాయించాలని సూక్ష్మ, చిన్న, మధ్యతరహా (ఎంఎస్ఎంఈ) పరిశ్రమలు కేంద్ర ఆర్థిక శాఖను కోరాయి. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఎంఎస్ఎంఈల ప్రతినిధులతో నిర్వహించిన బడ్జెట్ ముందస్తు సమావేశం ఇందుకు వేదికగా నిలిచింది. రుణాలను సులభంగా పొందేలా చర్యలు తీసుకోవాలని, ఎగుమతి అవకాశాలను సులభతరం చేయాలని ఎంఎస్ఎంఈ ప్రతినిధులు కోరారు. వ్యవసాయం తర్వాత ఎక్కువ మందికి ఉపాధి కల్పిస్తున్న ఎంఎస్ఎంఈ రంగం, జీడీపీలో 30 శాతం వాటా కలిగి ఉండడం గమనార్హం. ఎగుమతుల్లో 40 శాతం ఎంఎస్ఎంఈలే నిర్వహిస్తున్నాయి. కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి, ఆర్థిక శాఖ కార్యదర్శులు, ఎంఎస్ఎంఈ శాఖ సీనియర్ అధికారులు సమావేశంలో పాల్గొన్నారు. లఘు ఉద్యోగ్ భారతి, కౌన్సిల్ ఫర్ లెదర్ ఎక్స్‌పోర్ట్స్, తిరుపూర్ ఎక్స్‌పోర్ట్స్ అండ్ మ్యానుఫాక్చరర్స్ అసోసియేషన్, కాన్ఫెడరేషన్ ఆఫ్ ఉమెన్ ఎంటర్‌ప్రెన్యూర్స్ ప్రతినిధులు హాజరయ్యారు. రానున్న బడ్జెట్‌కు సంబంధించి కేంద్ర ఆర్థిక శాఖ నిర్వహించిన మూడో సమావేశం ఇది. ఈ వారంలోనే వివిధ ఆర్థిక వేత్తలు, వ్యవసాయ రంగం, పరిశోధన సంస్థల ప్రతినిధులతోనూ ఆర్థిక మంత్రి భేటీ కావడం గమనార్హం.

క్యూ2లో జీడీపీ వృద్ధి 7.2 శాతం

- ప్రైవేటు వినియోగమే చోదకం
- ఇండియా రేటింగ్స్ అంచనా

న్యూఢిల్లీ: దేశ జీడీపీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ద్వితీయ త్రైమాసికంలోనూ (జూలై–సెప్టెంబర్) బలమైన పనితీరు చూపిస్తుందని, 7.2 శాతం వృద్ధిని నమోదు చేస్తుందని ఇండియా రేటింగ్స్ అండ్ రీసెర్చ్ (ఇండ్–రా) అంచనా వేసింది. ప్రైవేటు వినియోగం కీలక చోదకంగా నిలుస్తుందని తెలిపింది. క్రితం ఆర్థిక సంవత్సరం ద్వితీయ త్రైమాసికంలో జీడీపీ వృద్ధి రేటు 5.6 శాతంగా ఉండడం గమనార్హం. ఇక ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో (ఏప్రిల్–జూన్) జీడీపీ 7.8 శాతం వృద్ధిని నమోదు చేయడం తెలిసిందే. క్యూ2 జీడీపీ గణాంకాలు ఈ నెల 28న విడుదల కానున్నాయి. ''ఉన్నత, మధ్యాదాయ వర్గాల వారికి ఆదాయం స్థిరంగా పెరుగుతుండడం ప్రైవేటు వినియోగానికి కీలక చోదకంగా నిలుస్తుంది. సేవల రంగం బలమైన పనితీరు, వస్తు ఎగుమతుల పెరుగుదల జీడీపీ వృద్ధిని మరింత పైకి తీసుకెళుతుంది''అని ఇండ్–రా ఆర్థికవేత్త పరాస్ జస్రాయ్ పేర్కొన్నారు. దేశీ డిమాండ్ బలంగా ఉండడం, ఆర్‌బీఐ అంచనాలకంటే వేగంగా రిటైల్ ద్రవ్యోల్బణం తగ్గుముఖం పట్టడం వేతన వృద్ధికి, వినియోగానికి మద్దతుగా నిలుస్తున్నట్టు ఈ నివేదిక తెలిపింది. ప్రైవేటు వినియోగం క్యూ2లో 8 శాతం వృద్ధి చెందొచ్చని అంచనా వేసింది. క్రితం ఆర్థిక సంవత్సరం క్యూ2లో 6.4 శాతం వృద్ధి నమోదు కాగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం క్యూ1లో ఇది 7 శాతం పెరిగినట్టు తెలిపింది. ఆదాయపన్ను తగ్గింపులు సైతం వినియోగానికి మద్దతుగా నిలుస్తాయని పేర్కొంది.

అడ్కాక్‌లో నాట్కోకు వాటా

35.75 శాతం వాటా కొనుగోలు

న్యూఢిల్లీ: ఫార్మా రంగ దక్షిణాఫ్రికా కంపెనీ అడ్కాక్ ఇన్‌గ్రామ్ హోల్డింగ్స్‌లో హైదరాబాద్ కంపెనీ నాట్కో ఫార్మా 35.75 శాతం వాటా చేజిక్కించుకుంది. దీంతో జోహాన్నెస్‌బర్గ్ స్టాక్ ఎక్స్ఛేంజీ నుంచి కంపెనీ డీలిస్ట్ అయినట్లు నాట్కో ఫార్మా వెల్లడించింది. దక్షిణాఫ్రికాలోని అతిపురాతన కంపెనీలలో ఒకటైన అడ్కాక్ ఇన్‌గ్రామ్‌లో 35.75 శాతం వాటాను నాట్కో 22.6 కోట్ల డాలర్లకు కొనుగోలు చేసింది. పనాడో, మైప్రాడోల్, ఎపీ–మ్యాక్స్, సిట్రో–సోడా, అలెర్జెక్స్ బ్రాండ్ల కంపెనీ అడ్కాక్ ఇన్‌గ్రామ్ 1891లో ఏర్పాటైంది. కాగా.. అడ్కాక్ వాటాదారులకు నాట్కో 2025 జూలైలో ఒక్కో షేరుకి 4.36 డాలర్ల చొప్పున ఆఫర్ చేసిన సంగతి తెలిసిందే. 2025 అక్టోబర్‌లో ఇందుకు వాటాదారుల ఆమోదం లభించింది. తద్వారా దక్షిణాఫ్రికా మార్కెట్లో నాట్కో ఫార్మా కార్యకలాపాలు విస్తరించింది. అడ్కాక్ ఇన్‌గ్రామ్‌లో వాటా కొనుగోలు ప్రపంచవ్యాప్త విస్తరణ వ్యూహాలలో ముందడుగుగా నాట్కో ఫార్మా సీఈవో రాజీవ్ నన్నపనేని పేర్కొన్నారు. దీంతో దక్షిణాఫ్రికాసహా ఇతర మార్కెట్లలో అడ్కాక్‌కున్న అత్యున్నత సామర్థ్యాలను మరింత సమర్థవంతంగా వినియోగించుకోనున్నట్లు తెలియజేశారు.

బీఎస్ఈలో నాట్కో ఫార్మా షేరు 4 శాతం జంప్‌చేసి రూ. 823 వద్ద ముగిసింది.

ఏజీఆర్ బకాయిలపై దీర్ఘకాలిక పరిష్కారం కావాలి

వొడాఫోన్ ఐడియా సీఈఓ అభిజిత్ కిషోర్

న్యూఢిల్లీ: అప్పుల ఊబిలో కూరుకుపోయిన వొడాఫోన్ ఐడియా(వీఐ).. సర్దుబాటు చేసిన స్థూల ఆదాయ (ఏజీఆర్) బకాయిల విషయంలో తగిన, దీర్ఘకాలిక పరిష్కారాన్ని ఆశిస్తోంది. ఈ సమస్యపై ప్రభుత్వంతో చురుగ్గా సంప్రదింపులు జరుగుతున్నాయని కంపెనీ సీఈఓ అభిజిత్ కిశోర్ పేర్కొన్నారు. ఈ ఏడాది సెప్టెంబర్ నాటికి దాదాపు రూ.78,500 కోట్ల ఏజీఆర్ బకాయిలు పేరుకుపోగా, దీనికి సంబంధించి తగిన నిర్ణయం తీసుకోవాలని తాజాగా సుప్రీం కోర్టు ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే. కాగా, క్యూ2 ఫలితాల అనంతరం అభిజిత్ ఇన్వెస్టర్లతో మాట్లాడుతూ.. నిధుల సమీకరణ కోసం బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలతో సహా పలు మార్గాలను అన్వేషిస్తున్నామని చెప్పారు. ఏజీఆర్ పరిష్కారంపైనే ఈ ప్రయత్నాలన్నీ ఆధారపడి ఉంటాయన్నారు. కాగా, 2025–26 సెప్టెంబర్‌తో ముగిసిన ప్రథమార్ధంలో వీఐ నికర నష్టం రూ.12,132 కోట్లుగా నమోదైంది. కంపెనీ మొత్తం రుణ భారం రూ.2.02 లక్షల కోట్లకు చేరింది.

ఎంఎస్ఎంఈలు, సాగుకు రుణ వితరణ పెంచండి

ప్రభుత్వరంగ బ్యాంకులను కోరిన ఆర్థిక శాఖ

న్యూఢిల్లీ: తక్కువ వ్యయాలతో కూడిన డిపాజిట్లు పెరుగుతుండడంతో ఎంఎస్ఎంఈలు, వ్యవసాయ రంగానికి రుణ వితరణ పెంచాలంటూ ప్రభుత్వ రంగ బ్యాంకులను (పీఎస్‌బీలు) కేంద్ర ఆర్థిక శాఖ కోరింది. రిస్క్ నిర్వహణ, అండర్‌రైటింగ్ విధానాలను మరింత బలోపేతం చేసుకోవాలని పీఎస్‌బీలతో నిర్వహించిన సమావేశంలో కేంద్ర ఆర్థిక వ్యవహారాల కార్యదర్శి ఎం.నాగరాజు సూచించారు. కస్టమర్‌తో అనుసంధానత పెంచుకోవాలని, ఆర్థిక క్రమశిక్షణను కొనసాగించాలని.. ఆవిష్కరణలు, సమ్మిళితత్వంతో బ్యాంకింగ్ రంగంలో పరివర్తనను ముందుకు నడిపించాలని పీఎస్‌బీల సీఈవోలను కోరారు. డిజిటల్ బ్యాంకింగ్, మొబైల్ యాప్ ఆధారిత సేవల్లో సాధించిన పురోగతిని పీఎస్‌బీలు ఈ సందర్భంగా తెలియజేశాయి. డిజిటల్ బ్యాంకింగ్ అందరికీ, మరింత సురక్షితంగా ఉండేందుకుగాను సైబర్ భద్రతను పెంచుకోవాలని, ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించాలని నాగరాజు కోరారు. కేంద్ర పథకాలైన పీఎం సూర్య ఘర్ ముఫ్తి బిజ్లీ యోజన, పీఎం విద్యా లక్ష్మీ యోజన, పీఎం విశ్వకర్మ యోజనను మరింత పటిష్టంగా అమలు చేయాలన్నారు.

స్టార్టప్‌ల రుణాలకు కొత్త సదుపాయం

అన్ని ప్రభుత్వరంగ బ్యాంకుల పరిధిలో స్టార్టప్‌లు సులభంగా రుణాలు పొందేందుకు గాను జన్ సమర్థ్ పోర్టల్‌పై ఆర్థిక శాఖ కొత్త సదుపాయాన్ని ప్రవేశపెట్టింది. కేంద్ర ప్రభుత్వానికి సంబంధించి 14 రుణ అనుసంధాన పథకాలకు ఈ పోర్టల్ కేంద్రంగా ఉంటుంది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

13-11-2025

విశాఖ	590-00
చిత్తూరు	597-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	605-00
విజయవాడ	600-00
రిటైల్ ధర (డజను)	84.00
హైదరాబాద్	595-00
వరంగల్	597-00
రిటైల్ ధర	6.55

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
ASIANPAINT	2,832.00	6.58
ADANIENT	2,485.20	5
TECHM	1,457.00	3.48
TCS	3,125.10	2.56
BAJAJFINSV	2,039.00	2.49

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
TMCV	330	-1.49
TMPV	402.3	-1.3
TATASTEEL	178.7	-1.29
SHRIRAMFIN	822.1	-1.23
BEL	423.4	-0.91

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	7,965
ఎన్ఎస్ఈ	1,15,992
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	1,62981
ఎఫ్ఐఐ	- 1,750
డీఐఐ	+ 5,127

ముడిచమురు... (బ్యారెల్)

	రాత్రి 11.30కు	క్రితం ముగింపు
నైమెక్స్ లైట్ స్వీట్	58.67	$ 61.04
బ్రెంట్	62.72	$ 65.16

క్యూ2 ఆర్థిక ఫలితాలు

ఏషియన్ లాభాల పెయింట్స్

షేరుకి రూ. 4.5 డివిడెండ్

న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ దేశీ దిగ్గజం ఏషియన్ పెయింట్స్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025–26) రెండో త్రైమాసికంలో ఆకర్షణీయ ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జూలై–సెప్టెంబర్(క్యూ2)లో నికర లాభం 47 శాతం జంప్‌చేసి రూ. 1,018 కోట్లను అధిగమించింది. గతేడాది(2024–25) ఇదే కాలంలో కేవలం రూ. 694 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం 6 శాతంపైగా వృద్ధితో రూ. 8,514 కోట్లకు చేరింది. గత క్యూ2లో రూ. 8,003 కోట్ల అమ్మకాలు సాధించింది. మొత్తం వ్యయాలు 4 శాతం పెరిగి రూ. 7,377 కోట్లకు చేరాయి. వాటాదారులకు కంపెనీ బోర్డు షేరుకి రూ. 4.5 చొప్పున మధ్యంతర డివిడెండ్ ప్రకటించింది. ఈ కాలంలో డెకొరేటివ్ బిజినెస్ అమ్మకాలు 11 శాతం పుంజుకోగా.. ఆదాయం 6 శాతం బలపడింది. ఇందుకు మెరుగుపడిన కన్జూమర్ సెంటిమెంటు, పండుగల సీజన్ సహకరించినట్లు కంపెనీ పేర్కొంది. ఫలితంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో అమ్మకాలు పుంజుకున్నట్లు తెలియజేసింది. అంతర్జాతీయ అమ్మకాలు 10 శాతం ఎగసి రూ. 846 కోట్లను తాకాయి. ఇతర ఆదాయంతో కలసి మొత్తం టర్నోవర్ 6 శాతం వృద్ధితో రూ. 8,730 కోట్లయ్యింది.

ఫలితాల నేపథ్యంలో కంపెనీ షేరు బీఎస్ఈలో 4.5% జంప్‌చేసి రూ. 2,773 వద్ద ముగిసింది.

అశోక్ లేలాండ్ లాభం అప్

షేరుకి రూ.1 డివిడెండ్

న్యూఢిల్లీ: వాణిజ్య వాహన రంగ దిగ్గజం అశోక్ లేలాండ్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025–26) రెండో త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జూలై–సెప్టెంబర్(క్యూ2)లో నికర లాభం 7 శాతం వృద్ధితో రూ. 820 కోట్లను తాకింది. అమ్మకాలలో వృద్ధి ఇందుకు సహకరించింది. గతేడాది(2024–25) ఇదే కాలంలో రూ. 767 కోట్లు ఆర్జించింది. వాటాదారులకు కంపెనీ బోర్డు షేరుకి రూ. 1 చొప్పున మధ్యంతర డివిడెండ్ ప్రకటించింది. ఈ కాలంలో స్టాండెలోన్ నికర లాభం కంపెనీ చరిత్రలోనే అత్యధికంగా రూ. 771 కోట్లకు చేరింది. గత క్యూ2లో ఇది రూ. 770 కోట్లుకాగా.. మొత్తం ఆదాయం మరింత అధికంగా రూ. 11,142 కోట్ల నుంచి రూ. 12,577 కోట్లకు ఎగసింది. ఎంహెచ్‌సీవీ, ఎల్‌సీవీ పరిశ్రమ సానుకూల వృద్ధిని చూపినట్లు కంపెనీ పేర్కొంది. దీంతో ఎంహెచ్‌సీవీ విక్రయాలు 3 శాతం పుంజుకుని 26,307 యూనిట్లను తాకగా.. ఎల్‌సీవీ అమ్మకాలు 6 శాతం ఎగసి 17,697 యూనిట్లకు చేరాయి. ఎగుమతులు 45 శాతం జంప్‌చేసి 4,784 యూనిట్లుగా నమోదయ్యాయి.

ఫలితాల నేపథ్యంలో కంపెనీ షేరు బీఎస్ఈలో 2.5 శాతం క్షీణించి రూ. 14 వద్ద ముగిసింది.

జ్యోతి ల్యాబ్స్ లాభం క్షీణత

రూ. 88 కోట్లు

న్యూఢిల్లీ: ఎఫ్ఎంసీజీ రంగ దేశీ దిగ్గజం జ్యోతి ల్యాబ్స్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025–26) రెండో త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జూలై–సెప్టెంబర్(క్యూ2)లో నికర లాభం 16 శాతం పైగా క్షీణించి రూ. 88 కోట్లకు పరిమితమైంది. గతేడాది(2024–25) ఇదే కాలంలో రూ. 105 కోట్లు ఆర్జించింది. ఉజాలా, ప్రిల్, మార్గో, ఎక్సో బ్రాండ్ల కంపెనీ మొత్తం ఆదాయం మాత్రం నామమాత్ర వృద్ధితో రూ. 736 కోట్లను తాకింది. గత క్యూ2లో రూ. 733 కోట్ల అమ్మకాలు అందుకుంది. మొత్తం వ్యయాలు రూ. 634 కోట్లను దాటాయి.

ఫలితాల నేపథ్యంలో జ్యోతి ల్యాబ్స్ షేరు బీఎస్ఈలో 1% నీరసించి రూ. 310 వద్ద ముగిసింది.

స్పైస్‌జెట్‌కు పెరిగిన నష్టాలు

రూ. 635 కోట్లు

న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ విమానయాన కంపెనీ స్పైస్‌జెట్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025–26) రెండో త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జూలై–సెప్టెంబర్(క్యూ2)లో నష్టాలు భారీగా పెరిగి రూ. 635 కోట్లను దాటాయి. ఇందుకు విదేశీ మారక నష్టాలు, విమానాలు నిలిచిపోవడంతో పెరిగిన అదనపు వ్యయాలు, సర్వీసులపై నిషేధాలు తదితరాలు ప్రభావం చూపినట్లు కంపెనీ పేర్కొంది. ఫారెక్స్ నష్టాలను మినహాయిస్తే రూ. 448 కోట్ల నష్టం మాత్రమే నమోదైనట్లు చౌక ధరల విమానయాన కంపెనీ తెలియజేసింది. విమానాలు నిలిచిపోవడంతో రూ. 120 కోట్ల వ్యయాలు భరించవలసి వచ్చినట్లు వెల్లడించింది. గతేడాది(2024–25) ఇదే కాలంలో రూ. 424 కోట్ల నష్టం ప్రకటించింది. కాగా.. మొత్తం ఆదాయం సైతం రూ. 1,078 కోట్ల నుంచి రూ. 835 కోట్లకు క్షీణించింది.

ఫలితాల నేపథ్యంలో స్పైస్‌జెట్ షేరు బీఎస్ఈలో 4.2 శాతం జంప్‌చేసి రూ. 35.5 వద్ద ముగిసింది.

సెంచురీప్లై లాభం హైజంప్

రూ. 71 కోట్లు

న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ కంపెనీ సెంచురీప్లైబోర్డ్స్(ఇండియా) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025–26) రెండో త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జూలై–సెప్టెంబర్(క్యూ2)లో నికర లాభం 77 శాతం జంప్‌చేసి రూ. 71 కోట్లను తాకింది. కీలక విభాగాలలో పటిష్ట డిమాండుకుతోడు మార్జిన్లు మెరుగుపడటం ఇందుకు సహకరించింది. కోల్‌కతా కంపెనీ మొత్తం ఆదాయం సైతం 17 శాతం ఎగసి రూ. 1,386 కోట్లకు చేరింది. ఇది ఒక త్రైమాసికంలో కంపెనీ చరిత్రలోనే అత్యధికంకాగా.. గత క్యూ2లో రూ. 1,184 కోట్ల అమ్మకాలు సాధించింది. నిర్వహణ లాభం(ఇబిటా) సైతం రికార్డ్ నెలకొల్పుతూ రూ. 182 కోట్లకు చేరింది. మార్జిన్లు 10.3 శాతం నుంచి 13.1 శాతానికి బలపడ్డాయి. వ్యయ నియంత్రణసహా.. అమ్మకాలు పుంజుకోవడం ఇందుకు దోహదపడింది. తాజా త్రైమాసికంలో ప్లైవుడ్, లామినేట్స్, ఎండీఎఫ్ విభాగాలు రికార్డ్ ఆదాయాలు సాధించినట్లు కంపెనీ చైర్మన్, ఎండీ సజ్జన్ భజంకా పేర్కొన్నారు.

ఫలితాల నేపథ్యంలో సెంచురీప్లై షేరు బీఎస్ఈలో 3 శాతం లాభపడి రూ. 765 వద్ద ముగిసింది.

పీసీ జ్యువెలర్ అప్

లాభం రూ. 210 కోట్లు



న్యూఢిల్లీ: బంగారు ఆభరణ వర్తక సంస్థ పీసీ జ్యువెలర్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025–26) రెండో త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జూలై–సెప్టెంబర్(క్యూ2)లో నికర లాభం 17 శాతం వృద్ధితో రూ. 210 కోట్లకు చేరింది. గతేడాది(2024–25) ఇదే కాలంలో రూ. 179 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం మరింత అధికంగా 63 శాతం జంప్‌చేసి రూ. 895 కోట్లను తాకింది. గత క్యూ2లో రూ. 549 కోట్ల టర్నోవర్ అందుకుంది. ఆదాయ పన్ను రిఫండ్, వడ్డీ మినహాయించిన తదుపరి నికర లాభం రూ. 102 కోట్ల నుంచి రెట్టింపై రూ. 203 కోట్లకు చేరినట్లు కంపెనీ పేర్కొంది.

వియ్‌వర్క్ డీలా

లాభం రూ. 6 కోట్లు

న్యూఢిల్లీ: రియల్టీ రంగ కంపెనీ వియ్‌వర్క్ ఇండియా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025–26) రెండో త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు ప్రకటించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జూలై–సెప్టెంబర్(క్యూ2)లో నికర లాభం భారీగా క్షీణించి రూ. 6 కోట్లకు పరిమితమైంది. అయితే డిఫర్డ్ ట్యాక్స్ క్రెడిట్ కారణంగా గతేడాది(2024–25) ఇదే కాలంలో అధిక లాభాలు నమోదుకావడం(హైయర్ బేస్) ప్రభావం చూపినట్లు కంపెనీ పేర్కొంది. పన్ను లాభాలతో కలిపి గత క్యూ2లో రూ. 204 కోట్లు ఆర్జించింది. కాగా.. మొత్తం ఆదాయం రూ. 499 కోట్ల నుంచి రూ. 586 కోట్లకు బలపడింది.

నాన్న దిద్దిన చాంపియన్

షూటర్ అంటే రొటీన్ అథ్లెట్ కాదు. సొంతంగా నేర్చుకోలేడు. సహచరులతో కలిసి ఆడితే వచ్చేది కాదు. బూట్లు లేకపోయినా స్ప్రింటర్‌గా మారొచ్చు. బ్యాట్ లేకపోయినా చెక్కతో క్రికెటర్ కావొచ్చు. అసలేమీ లేకపోయినా కండబలంతో రెజ్లర్‌గా పట్టు పట్టొచ్చు. గుండెబలంతో కొలనులో చాంపియన్ స్విమ్మర్‌గా ఎదగొచ్చు. కానీ... ఓ పిస్టల్, తుపాకీ, గన్ లేకుండా ఎవరైనా షూటర్ అవుతారా? ముమ్మాటికి కాదు. గన్ కావాలి. ఓ స్థాయి షూటింగ్ రేంజ్ కాకపోయినా సాధారణ అకాడమీ, ఓ కోచ్ అవసరం. కానీ కోచ్, అకాడమీ లేకుండా నాన్న ఇచ్చిన పిస్టల్, నాన్న నేర్పిన పాఠాలతోనే సామ్రాట్ రాణా చరిత్రకెక్కే చాంపియన్ అయ్యాడు.

-సాక్షి క్రీడా విభాగం

- పతకాలపై గురిపెడుతున్న పిస్టల్ షూటర్ సామ్రాట్ రాణా
- ప్రపంచ చాంపియన్‌షిప్‌లో రెండు స్వర్ణాలు, రజతం సొంతం
- తండ్రి పాఠాలు... తనయుడి పతకాలు

మన సామ్రాట్ రాణా మామూలోడు కాదు. చేనులో మొలిచిన చాంపియన్. తన తండ్రి అశోక్ కుమార్ రాణాకు షూటింగ్ అంటే ఉన్న పిచ్చి, వ్యామోహం వల్లే తనయుడు ప్రపంచ చాంపియన్ అయ్యాడు. 35 ఏళ్ల క్రితం అశోక్ ఆటగా మొదలు పెట్టిన షూటింగ్... ఆ ఆటలో అతన్ని మొనగాణ్ని చేయలేకపోయింది. 1990 దశకంలో హరియాణాలోని కర్నాల్ ప్రాంతంలో అశోక్ వాళ్లది మోతుబరి కుటుంబమే! కానీ తనకు ఇష్టమైన షూటింగ్‌పై ఎదగొచ్చు, రాణించొచ్చు అని అంతంత మాత్రమే తెలుసు. అందుకే గురిపెట్టగలిగాడు. కానీ పతకం పట్టుకొచ్చే షూటర్ కాలేకపోయాడు. అయితేనేం తను సొంతంగా నేర్చుకున్న షూటింగ్ తనయుడు సామ్రాట్ రాణాకు కోచ్‌గా అయ్యేందుకు బాగా ఉపయోగపడింది. ఎంతలా ఉపయోగపడిందంటే ఓ షూటింగ్ రేంజ్ కానీ వ్యవసాయ క్షేత్రంలో... ఆధునిక వసతుల్లేకపోయినా... తనయుడిని ప్రపంచ చాంపియన్ షూటర్‌గా మలిచేంతలా తండ్రి అశోక్ ప్రావీణ్యం సామ్రాట్‌ను పంట చేనులో ప్రపంచ చాంపియన్‌గా తయారు చేసింది. ఈజిప్ట్ రాజధాని కైరోలో జరుగుతున్న ప్రపంచ చాంపియన్‌షిప్‌లో సామ్రాట్ 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ వ్యక్తిగత ఈవెంట్‌లో స్వర్ణం... వరుణ్ తోమర్, శ్రవణ్ కుమార్‌లతో కలిసి టీమ్ ఈవెంట్‌లో స్వర్ణం... ఇషా సింగ్‌తో కలిసి మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో రజతం సాధించి భారత్ షూటింగ్ భవిష్యత్ తారగా మెరిశాడు.

ఇంట నేర్పించి... రచ్చ గెలిపించి...

తండ్రి ఇంటి నుంచే రచ్చ గెలిచే చాంపియన్‌గా సామ్రాట్‌ను తీర్చిదిద్దిన వైనం అద్భుతం. పలక బలపం పట్టి అక్షరాలు దిద్దించినట్లే ఓ తుపాకీ ఇచ్చి గురి నేర్పించాడు నాన్న. అందుకే అతని షూటింగ్ ప్రయాణంలో అతనికెప్పుడూ రాళ్లు రప్పలు, ఎత్తుపల్లాలు అన్నవే లేకుండా హైవే రోడ్డుపై హై ఎండ్ కారుతో సాగినట్లుగా సాఫీగా సాగిపోయింది. కైరోకు తీసుకెళ్లి సరికొత్త చరిత్రను లిఖించేలా చేసింది. సామ్రాట్ నాన్న అశోక్ రాణా తనకున్న వ్యవసాయ క్షేత్రంలో 2017లో ఓ షూటింగ్ రేంజ్‌ను ఏర్పాటు చేశాడు. అప్పుడతని కుమారుడి వయసు పన్నెండేళ్లే. అలా చిన్న వయసులో తండ్రి సిద్ధం చేసిన షూటింగ్ బరిలో లక్ష్యంపై గురిపెట్టిన తనయుడు తర్వాత్తర్వాత జాతీయ, అంతర్జాతీయ వేదికలపై పతకాలపై పెడుతున్నాడు. దీనిపై అశోక్ ఏమన్నాడంటే 'మొదట్లో నేను 10 మీటర్ల దూరంతో ఒక చెక్క పెట్టెతో కాగితపు లక్ష్యాన్ని పెట్టేవాణ్ని. 12 ఏళ్ల తనయుడికి ఎయిర్ పిస్టల్ ఇచ్చి గురిచూసి కాల్చమని చెప్పేవాణ్ని. తూటా లక్ష్యాన్ని చేరిందా లేదా అని తెలుసుకునేందుకు కెమెరాను కూడా అమర్చాను. అలా షూటింగ్‌లో నా కుమారుడికి ఓనమాలు నేర్పించాను' అని తన తొలినాళ్ల శిక్షణ గురించి వివరించారు.

పోటీల కోసం అకాడమీకి...

అశోక్ తన తనయుడికి నేర్పించిన షూటింగ్ గురి పెట్టేందుకు ఉపకరించాయి. ప్రతిభగల షూటర్‌కు ఉండాల్సిన లక్షణాల్ని అబ్బేలా చేశాయి. ఈవెంట్లు, పతకాల విభాగాలు కూడా తెలుసుకోవాలి. పోటీలకు దీటుగా సానబెట్టాలి. అందుకే తను తెలుసుకోలేకపోయినా రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ పోటీలు, షూటింగ్ క్రీడాంశాలు కూడా ఔపోసన పట్టేందుకు స్థానికంగా ఉండే షూటింగ్ అకాడమీలో సామ్రాట్‌ను చేర్పించాడు. అక్కడ కోచ్‌ల శిక్షణలో రాటుదేలిన సామ్రాట్ ఇంటికొస్తే చేనులో ప్రాక్టీసు చేసేవాడు. పోటీల వివరాలు, విధి విధానాలు, అర్హతలు తెలుసుకున్న సామ్రాట్ ఇక వెనుదిరిగే అవసరమే లేకుండా ముందడుగు వేశాడు. రెండు, మూడేళ్లకే పోటీల్లో పాల్గొనే షూటర్‌గా ఎదిగాడు. 17 ఏళ్ల వయసులో జాతీయ స్థాయిలో పోటీపడ్డాడు. అలా క్రమం తప్పకుండా పోటీల్లో గురిపెట్టిన అతని పిస్టల్ ఇప్పుడు ప్రపంచ వేదికలపై పతకాలపై గురిపెడుతోంది.

క్షేత్రం నుంచి చరిత్రకెక్కాడు

అలా ఓ క్షేత్రంలో (ఫలాన రేంజ్, అకాడమీ కాకుండా) మొదలైన సామ్రాట్ షూటింగ్ ప్రస్థానం కైరోలో చరిత్రకెక్కేలా చేసింది. ప్రపంచ చాంపియన్‌షిప్‌లో 10 మీటర్ల ఎయిర్ పిస్టల్‌లో స్వర్ణం నెగ్గిన తొలి భారతీయుడిగా ఘనతకెక్కించింది. ప్రపంచ మేటి షూటర్లనే మట్టికరిపించే చైనా షూటర్ హు కైని అదికూడా ఫైనల్లో కంగు తినిపించడం గొప్ప విశేషం. హు కై ఖాతాలో నాలుగు ప్రపంచకప్ టైటిళ్లు, ఆసియా చాంపియన్‌షిప్ స్వర్ణాలు ఉన్నాయి. అలాంటి చాంపియన్ షూటర్ చివరకు భారత సామ్రాట్‌కు తలవంచాడు. అశోక్ తన చేనులో తీర్చిదిద్దిన చాంపియన్‌తో ఇప్పుడు షూటింగ్‌లో శిక్షణ పద్ధతులు సైతం కొత్త పుంతలు తొక్కుతాయేమో వేచి చూడాలి. ఎందుకంటే తనయుడు ఓనమాల దశలో అశోక్ అవలంబించిన పద్ధతులన్నీ కూడా భిన్నమైనవి. ఓ ప్రముఖ షూటింగ్ రేంజ్ నుంచో... లేదంటే ఓ అకాడమీ నుంచో కాపీ కొట్టినవి కావు. కొత్త ఆలోచించి, కొత్తగా గురి కుదిరేందుకు చేసిన అతని ప్రయత్నాలు ఇప్పుడు పతకాల రూపంలో సాఫల్యమయ్యాయి.

అనాహత్ పరాజయం

న్యూఢిల్లీ: చైనా ఓపెన్ అంతర్జాతీయ స్క్వాష్ టోర్నమెంట్‌లో భారత స్టార్ అనాహత్ సింగ్ పోరాటం ముగిసింది. షాంఘైలో బుధవారం జరిగిన మహిళల సింగిల్స్ రెండో రౌండ్‌లో అనాహత్ 11–5, 6–11, 4–11, 7–11తో ప్రపంచ 15వ ర్యాంకర్, ఎనిమిదో సీడ్ సనా ఇబ్రహీం (ఈజిప్ట్) చేతిలో ఓడిపోయింది. తొలి గేమ్ గెలిచిన అనాహత్ ఆ తర్వాత అదే జోరును కొనసాగించడంలో విఫలమైంది. మరోవైపు సిడ్నీలో జరుగుతున్న బోండి ఓపెన్ టోర్నీలో భారత ప్లేయర్ రథిక సుథాంధీర సీలన్ (భారత్) సెమీఫైనల్లోకి ప్రవేశించింది. క్వార్టర్ ఫైనల్లో రథిక 11–7, 11–3, 11–3తో అనాంతాన (థాయ్‌లాండ్)పై గెలిచింది.

భారత్‌కు రెండో విజయం

న్యూఢిల్లీ: మహిళల టి20 అంధుల ప్రపంచ కప్ క్రికెట్ టోర్నమెంట్‌లో భారత జట్టు వరుసగా రెండో విజయం సాధించింది. ఆ్రస్టేలియా జట్టుతో బుధవారం జరిగిన మ్యాచ్‌లో భారత్ 209 పరుగుల తేడాతో గెలిచింది. ముందుగా భారత్ 4 వికెట్లు కోల్పోయి 292 పరుగులు చేసింది. కెప్టెన్ టీసీ దీపిక (బీ3 కేటగిరీ) 91 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచింది. మరో ప్లేయర్ ఫులా సరేన్ (బీ3 కేటగిరీ) 54 పరుగులు చేసింది. అనంతరం ఆ్రస్టేలియా 19.3 ఓవర్లలో 57 పరుగులకే కుప్పకూలింది. మరో మ్యాచ్‌లో నేపాల్ తొమ్మిది వికెట్ల తేడాతో శ్రీలంకను ఓడించింది.

భారత బృందం పతాకధారిగా జెర్లిన్

రేపటి నుంచి టోక్యోలో డెఫిలింపిక్స్

న్యూఢిల్లీ: బధిర క్రీడాకారుల కోసం నిర్వహించే డెఫిలింపిక్స్‌లో పాల్గొనే భారత బృందానికి తమిళనాడుకు చెందిన జెర్లిన్ అనిక జయరాత్‌చగన్ పతాకధారిగా వ్యవహరిస్తుంది. ఈనెల 15 నుంచి 26వ తేదీ వరకు జపాన్ రాజధాని టోక్యోలో డెఫిలింపిక్స్ జరుగుతాయి. బ్యాడ్మింటన్ ప్లేయర్ అయిన 21 ఏళ్ల జెర్లిన్... బ్రెజిల్ ఆతిథ్యమిచ్చిన 2021 డెఫిలింపిక్స్ క్రీడల్లో మూడు స్వర్ణ పతకాలు (సింగిల్స్, మిక్స్‌డ్ డబుల్స్, టీమ్) సాధించింది. ఈసారి భారత్ నుంచి 11 క్రీడాంశాల్లో (అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, గోల్ఫ్, జూడో, కరాటే, షూటింగ్, స్విమ్మింగ్, టేబుల్ టెన్నిస్, తైక్వాండో, రెజ్లింగ్, టెన్నిస్) 111 మంది క్రీడాకారులు ఈ మెగా ఈవెంట్‌లో పోటీపడుతున్నారు. బుధవారం న్యూఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖ సెక్రటరీ హరి రంజన్ రావు భారత బృందానికి వీడ్కోలు పలికారు. 1924 నుంచి ఇప్పటి వరకు 24 సమ్మర్, 18 వింటర్ డెఫిలింపిక్స్ జరిగాయి. సమ్మర్ ఒలింపిక్స్ జరిగిన మరుసటి ఏడాది డెఫిలింపిక్స్ నిర్వహిస్తారు. 2021 డెఫిలింపిక్స్‌లో భారత్ 8 స్వర్ణాలు, 1 రజతం, 7 కాంస్యాలతో కలిపి 16 పతకాలు నెగ్గి తొమ్మిదో స్థానంలో నిలిచి తమ అత్యుత్తమ ప్రదర్శన నమోదు చేసింది. తెలంగాణ షూటర్ ధనుష్ శ్రీకాంత్ రెండు స్వర్ణ పతకాలు నెగ్గగా... ఈసారి పతాకధారిగా వ్యవహరించనున్న జెర్లిన్ మూడు పసిడి పతకాలు సొంతం చేసుకుంది.

రన్నరప్ ఆంధ్ర

ఫైనల్లో కర్ణాటక చేతిలో పరాజయం

కోల్‌కతా: భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) అండర్–19 మహిళల టి20 ట్రోఫీ ఎలైట్ టోర్నమెంట్‌లో ఆంధ్ర జట్టు రన్నరప్‌గా నిలిచింది. బుధవారం జరిగిన ఫైనల్లో ఆంధ్ర జట్టు ఏడు వికెట్ల తేడాతో కర్ణాటక జట్టు చేతిలో ఓడిపోయింది. మొహమ్మద్ మెహక్ సారథ్యంలోని ఆంధ్ర జట్టు మొదట బ్యాటింగ్‌కు దిగి నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 119 పరుగులు సాధించింది. ఆంధ్ర ఓపెనర్ కాట్రగడ్డ దీక్ష (21 బంతుల్లో 36; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) క్రీజులో ఉన్నంతసేపు ధాటిగా ఆడింది. సేతు సాయి (46 బంతుల్లో 45; 6 ఫోర్లు) టాప్ స్కోరర్‌గా నిలిచింది. గ్రీష్మ సైనీ (12 బంతుల్లో 11; 2 ఫోర్లు), అంజుమ్ (22 బంతుల్లో 14; 1 సిక్స్) ఫర్వాలేదనిపించారు. ఈ నలుగురు మినహా మిగతా బ్యాటర్లు రెండంకెల స్కోరును అందుకోలేకపోయారు. కర్ణాటక బౌలర్లలో జె.దీక్ష 21 పరుగులిచ్చి 5 వికెట్లు పడగొట్టగా... వందిత రావు, వేద వర్షిణి 2 వికెట్ల చొప్పున తీశారు. అనంతరం 120 పరుగుల లక్ష్యాన్ని కర్ణాటక 17.4 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి అందుకొని చాంపియన్‌గా అవతరించింది. ఒకదశలో 55 పరుగులకు 3 వికెట్లు కోల్పోయిన కర్ణాటక జట్టును సీడీ దీక్ష (39 బంతుల్లో 47 నాటౌట్; 4 ఫోర్లు, 1 సిక్స్), కాష్వీ కందికుప్ప (20 బంతుల్లో 27 నాటౌట్; 4 ఫోర్లు) విజయతీరాలకు చేర్చారు. వీరిద్దరు నాలుగో వికెట్‌కు అజేయంగా 65 పరుగులు జోడించారు. ఆంధ్ర బౌలర్లలో తమన్నా, బీఎస్ దీప్తి, అంజుమ్ ఒక్కో వికెట్ తీశారు.

మొత్తం 30 జట్లు పాల్గొన్న ఈ టోర్నీలో గ్రూప్ 'ఎ'లో ఉన్న ఆంధ్ర జట్టు లీగ్ మ్యాచ్‌లు ముగిశాక రెండో స్థానంలో నిలిచి నాకౌట్ దశకు అర్హత సాధించింది. ప్రిక్వార్టర్ ఫైనల్లో ఆంధ్ర 27 పరుగుల తేడాతో రాజస్తాన్‌ను ఓడించి క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. గుజరాత్ జట్టుతో జరిగిన క్వార్టర్ ఫైనల్లో ఆంధ్ర ఐదు వికెట్ల తేడాతో నెగ్గి సెమీఫైనల్లోకి అడుగు పెట్టింది. బెంగాల్‌తో జరిగిన సెమీఫైనల్లో ఆంధ్ర ఐదు వికెట్ల తేడాతో విజయం సాధించి టైటిల్ పోరుకు చేరుకుంది.

త్వరలో తెలంగాణ కాలేజీ బాస్కెట్‌బాల్ లీగ్

వోక్సెన్ యూనివర్సిటీతో ఒప్పందం

సాక్షి, హైదరాబాద్: వోక్సెన్ స్పోర్ట్స్ అకాడమీ మరియు తెలంగాణ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ (టీబీఏ) 2025 సీజన్ కోసం సమగ్ర భాగస్వామ్య వ్యవస్థను ఏర్పాటు చేయడానికి అవగాహన ఒప్పందంపై అధికారికంగా సంతకం చేశాయి. ఈ భాగస్వామ్యంలో భాగంగా తెలంగాణ రాష్ట్రంలో మొదటిసారిగా వోక్సెన్ యూనివర్శిటీ ఆధ్వర్యంలో కాలేజీ బాస్కెట్‌బాల్ లీగ్ నిర్వహిస్తారు. ఈ అవగాహన ఒప్పందం, లీగ్ ప్రారంభ కార్యక్రమానికి తెలంగాణలోని వోక్సెన్ యూనివర్సిటీ ఉపాధ్యక్షుడు డాక్టర్ రౌల్ విల్లామరిన్ రోడ్రిగెజ్, హెడ్ ఆఫ్ స్పోర్ట్స్ విశాల్, తెలంగాణ బాస్కెట్‌బాల్ సంఘం అధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి, పృథ్వీశ్వర్ రెడ్డి హాజరయ్యారు. వీరు లీగ్ లక్ష్యాలు మరియు రాష్ట్రవ్యాప్తంగా యువ క్రీడాకారులకు అందే అవకాశాలపై తమ అభిప్రాయాలను పంచుకున్నారు. 'తెలంగాణ బాస్కెట్‌బాల్ సంఘం తరపున వోక్సెన్ యూనివర్సిటీతో భాగస్వామ్యం కానుండటం గర్వకారణం. ఈ ఒప్పందంతో యువ క్రీడాకారులకు ప్రపంచస్థాయి శిక్షణా సదుపాయాలు లభిస్తాయి. తెలంగాణ కాలేజీ బాస్కెట్‌బాల్ లీగ్ ప్రారంభం, తెలంగాణ బాస్కెట్‌బాల్ అకాడమీ స్థాపనతో ఉత్తమ ప్రతిభను గుర్తించి పెంపొందించడంలో ఈ ఒప్పందం కీలకపాత్ర పోషిస్తుంది. ఈ భాగస్వామ్యంతో తెలంగాణ బాస్కెట్‌బాల్‌ను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లగలమనే నమ్మకం ఉంది' అని శ్రీధర్ రెడ్డి వ్యాఖ్యానించారు. '15 సంవత్సరాల క్రితం నేను స్పెయిన్‌లో ప్రొఫెషనల్ బాస్కెట్‌బాల్ ఆడిన తర్వాత భారత్‌కు వచ్చాను. ఇక్కడ అపారమైన సామర్థ్యం ఉన్నప్పటికీ, దిశానిర్దేశం లోపించింది. భారత్‌లో బాస్కెట్‌బాల్ పురోభివృద్ధికి పాటుపడటమే మా లక్ష్యం. త్వరలోనే మేము తెలంగాణలో లీగ్‌ను ప్రారంభిస్తాం' వోక్సెన్ యూనివర్సిటీ ఉపాధ్యక్షుడు రోడ్రిగెజ్ తెలిపారు.

తొలి రౌండ్‌లోనే తరుణ్ అవుట్

- కిరణ్ జార్జి, ఆయుశ్ శెట్టి కూడా
- లక్ష్య సేన్, ప్రణయ్ ముందంజ

లక్ష్య సేన్

తరుణ్

కుమామోటో: జపాన్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–500 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో భారత ప్లేయర్లకు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. పురుషుల సింగిల్స్‌లో లక్ష్య సేన్, ప్రణయ్ ప్రిక్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లగా... హైదరాబాద్ ప్లేయర్ తరుణ్ మన్నేపల్లి, ఆయుశ్ శెట్టి, కిరణ్ జార్జి తొలి రౌండ్‌లోనే వెనుదిరిగారు. ప్రపంచ 15వ ర్యాంకర్ లక్ష్య సేన్ 39 నిమిషాలపాటు జరిగిన తొలి రౌండ్ మ్యాచ్‌లో 21–12, 21–16తో ప్రపంచ 26వ ర్యాంకర్ కోకి వతనాబె (జపాన్)ను ఓడించాడు. ప్రపంచ 35వ ర్యాంకర్ ప్రణయ్ 68 నిమిషాల్లో 16–21, 21–13, 23–21తో ప్రపంచ 22వ ర్యాంకర్ లియోంగ్ జున్ హావో (మలేసియా)పై గెలుపొందాడు. ఇతర తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో తరుణ్ మన్నేపల్లి 9–21, 19–21తో జియోన్ హైయోక్ జిన్ (దక్షిణ కొరియా) చేతిలో, కిరణ్ జార్జి 20–22, 10–21తో కోక్ జింగ్ హాంగ్ (మలేసియా) చేతిలో, ఆయుశ్ శెట్టి 16–21, 11–21తో కొడాయ్ నరోకా (జపాన్) చేతిలో ఓడిపోయారు. మిక్స్‌డ్ డబుల్స్ తొలి రౌండ్‌లో గద్దె రుత్విక శివాని–రోహన్ కపూర్ (భారత్) ద్వయం 12–21, 21–19, 20–22తో ప్రెస్లీ స్మిత్–జెనీ గాయ్ (అమెరికా) జంట చేతిలో పరాజయం పాలైంది. నేడు జరిగే సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో ప్రపంచ 20వ ర్యాంకర్ జియా హెంగ్ జేసన్ తె (సింగపూర్)తో లక్ష్య సేన్; ప్రపంచ 30వ ర్యాంకర్ రస్ముస్ గెమ్కే (డెన్మార్క్)తో ప్రణయ్ తలపడతారు. ముఖాముఖి రికార్డులో లక్ష్య సేన్ 3–0తో జియా హెంగ్‌పై, ప్రణయ్ 4–2తో రస్ముస్ గెమ్కేపై ఆధిక్యంలో ఉన్నారు.

ఫైనల్లో అభిషేక్ జోడీ

ఢాకా: ఆసియా ఆర్చరీ చాంపియన్‌షిప్ కాంపౌండ్ మిక్స్‌డ్ టీమ్ విభాగంలో భారత్‌కు ఒక పతకం ఖాయమైంది. భారత్‌కు చెందిన అభిషేక్ వర్మ–దీప్షిక జోడీ ఫైనల్లోకి ప్రవేశించి స్వర్ణ, రజత పతకాల కోసం పోటీపడనుంది. బుధవారం జరిగిన సెమీఫైనల్లో అభిషేక్–దీప్షిక ద్వయం 156–153తో రొక్సానా–ఆండ్రీ ట్యుటిన్ (కజకిస్తాన్) జంటను ఓడించింది. అంతకుముందు భారత జోడీ క్వార్టర్ ఫైనల్లో 159–155తో వియత్నాం ద్వయంపై, తొలి రౌండ్‌లో 158–144తో యూఏఈ జంటపై గెలుపొందింది. మరోవైపు రికర్వ్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో యశ్‌దీప్–అన్షిక కుమారి (భారత్) జోడీ కాంస్యం కోసం బరిలో నిలిచింది. సెమీఫైనల్లో యశ్‌దీప్–అన్షిక జంట 1–5తో సీమా అక్తర్–రామకృష్ణ సాహా (బంగ్లాదేశ్) జోడీ చేతిలో ఓడిపోయింది.



గింగిరాలు తిరుగుతూ ఈ రోబో అందరి దృష్టిని ఆకర్షించింది.

రోబో డ్యాన్స్‌ను ఆసక్తిగా తిలకిస్తున్న జనం

పోర్చుగల్‌లోని లిస్బన్ నగరంలో వెబ్ సమ్మిట్ టెక్నాలజీ సదస్సులో మంగళవారం మర మనుషుల విన్యాసాలు చూపరులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

ప్రజాస్వామ్య పునరుద్ధరణ జరిగితేనే..

ఆ తర్వాతే స్వదేశానికి తిరిగివెళ్తా..

- అవామీ లీగ్ పార్టీపై నిషేధం ఎత్తివేయాలి
- స్వేచ్ఛగా, పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించాలి
- బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా డిమాండ్
- భారత్‌తో సంబంధాలు బలోపేతం చేసుకోవాలని యూనస్‌కు హితవు

కోల్‌కతా: బంగ్లాదేశ్‌లో 'ప్రాతినిధ్య ప్రజాస్వామ్యం'పునరుద్ధరణ జరిగితేనే తాను అక్కడికి తిరిగి వెళ్తానని మాజీ ప్రధానమంత్రి షేక్ హసీనా చెప్పారు. తమ అవామీ లీగ్ పార్టీపై నిషేధం ఎత్తివేయాలని అన్నారు. బంగ్లాదేశ్‌లో స్వేచ్ఛగా, పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. పదవిచ్యుతురాలైన షేక్ హసీనా ప్రస్తుతం భారత్‌లో గుర్తు తెలియని ప్రాంతంలో ఆశ్రయం పొందుతున్నారు. ఆమె తాజాగా ఓ వార్తా సంస్థకు ఈ–మెయిల్ ద్వారా ఇంటర్వ్యూ ఇచ్చారు. పలు కీలక అంశాలపై స్పందించారు. తన అభిప్రాయాలు పంచుకున్నారు. ప్రజల చేత ఎన్నిక కాని మహ్మద్ యూనస్ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలు అమలు చేస్తోందని ఆరోపించారు. భారత్‌తో సంబంధాలు తెంచేసుకోడానికి ప్రయత్నిస్తోందని, ఇది చాలా ప్రమాదకరమైన ధోరణి అని ఆందోళన వ్యక్తంచేశారు. మరోవైపు తీవ్రవాద శక్తులకు ప్రభుత్వం అండగా ఉంటోందని ధ్వజమెత్తారు. తీవ్రవాదులు బలపడితే ప్రజలకు ముప్పు తప్పదని తేల్చిచెప్పారు.

భారత ప్రభుత్వానికి ధన్యవాదాలు

తమ ప్రభుత్వ హయాంలో భారత్, బంగ్లాదేశ్ మధ్య విస్తృతమైన, లోతైన సంబంధాలు ఉండేవని షేక్ హసీనా గుర్తుచేశారు. యూనస్ నేతృత్వంలో మధ్యంతర ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆ సంబంధాలు నానాటికీ బలహీనపడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇండియాతో మెరుగైన సంబంధాలు ఉంటేనే బంగ్లాదేశ్ ప్రజలకు భరోసా లభిస్తుందని పరోక్షంగా స్పష్టంచేశారు. అనవసరమైన రిస్క్ చేయొద్దని యూనస్‌కు హితవు పలికారు. తనకు ఆశ్రయం కల్పిస్తున్నందుకు భారత ప్రభుత్వానికి హసీనా ధన్యవాదాలు తెలియజేశారు. తనకు ఇక్కడ చక్కటి గౌరవ మర్యాదలు లభిస్తున్నాయని, భారత ప్రభుత్వానికి, ప్రజలకు ఎల్లప్పుడు కృతజ్ఞురాలినై ఉంటానని వ్యాఖ్యానించారు.

ఎన్నికల బహిష్కరణ పిలుపు ఇవ్వలేదు

తాను స్వదేశానికి తిరిగి వెళ్లాలంటే అక్కడ ప్రజాస్వామ్య పునరుద్ధరణ జరగాల్సిందేనని షేక్ హసీనా తేల్చిచెప్పారు. బంగ్లాదేశ్ ప్రజలంతా అదే కోరుకుంటున్నారని స్పష్టంచేశారు. అత్యధిక కాలం బంగ్లాదేశ్ ప్రధానమంత్రిగా పనిచేసిన నేతగా ఆమె రికార్డు సృష్టించారు. ప్రభుత్వ వ్యతిరేక నిరసనలు, హింసాకాండ నేపథ్యంలో 2024 ఆగస్టు 5న పదవికి రాజీనామా చేసి, దేశం వీడి వెళ్లాల్సి వచ్చింది. అప్పటి హింసాకాండను నియంత్రించడంలో తాము విఫలమైన మాట నిజమేనని షేక్ హసీనా అంగీకరించారు. అందుకు విచారిస్తున్నామని చెప్పారు. ఆ దురదృష్టకర సంఘటనల నుంచి నేర్చుకోవాల్సిన పాఠాలు ఎన్నో ఉన్నాయని అభిప్రాయపడ్డారు. విద్యార్థి సంఘాల నాయకులమని చెప్పుకొంటున్న కొందరు దుర్మార్గులు కుట్రపూరితంగా హింసను ప్రేరేపించారని మండిపడ్డారు. వారు బాధ్యతలేకుండా ప్రవర్తించారని విమర్శించారు. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో జరగనున్న ఎన్నికలను బహిష్కరించాలంటూ తాను పిలుపునిచ్చినట్లు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. అలాంటి పిలుపు తాను ఇవ్వలేదని పేర్కొన్నారు. అవామీ లీగ్ ప్రమేయం లేకుండా ఏ ఎన్నికలు జరిగినా వాటికి చట్టబద్ధత ఉండదని వెల్లడించారు. బంగ్లాదేశ్‌లో తమకు కోట్లాది మంది మద్దతు పలుకుతున్నారని గుర్తుచేశారు. అసలైన ప్రజాబలం ఉన్న పార్టీయే అధికారంలోకి రావాలన్నారు. అవామీ లీగ్‌పై నిషేధాన్ని రద్దు చేయాలని, ఎన్నికల్లో పోటీ చేసేందుకు అవకాశం కల్పించాలని తేల్చిచెప్పారు. బంగ్లాదేశ్ రాజకీయాల్లో అవామీ లీగ్ పాత్ర ఉండాల్సిందేనని అన్నారు.

బలహీన పాలకుడు యూనస్

బంగ్లాదేశ్‌కు భారత్ అత్యంత కీలకమైన అంతర్జాతీయ భాగస్వామి అని షేక్ హసీనా వివరించారు. భారత్ ఎప్పటికీ విశ్వసనీయ మిత్ర దేశమేనని చెప్పారు. మహ్మద్ యూనస్ దౌత్య విధానాలను తాను ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. తనన తాను ఓడించుకొనే విధానాలను ఆయన తలకెత్తుకున్నారని విమర్శించారు. యూనస్ ఒక బలహీన పాలకుడు అని తేల్చిచెప్పారు. తీవ్రవాదుల మద్దతుపై ఆధారపడి పాలన సాగిస్తున్నారని ఆక్షేపించారు. విదేశాలతో దౌత్యం విషయంలో తప్పులు చేయడం ఇకనైనా మానుకోవాలని యూనస్‌కు సూచించారు. పొరుగు దేశాలతో సంబంధాలు బలోపేతం చేసుకోవాలని అన్నారు. బంగ్లాదేశ్ పరిణామాలు భారత్‌కు కూడా ఆందోళన కలిగిస్తున్నాయని తెలిపారు. మధ్యంతర ప్రభుత్వం బంగ్లాదేశ్ ప్రజల ఆకాంక్షలకు ప్రాతినిధ్యం వహించడం లేదని, భారత్ ఎప్పటికీ మిత్రదేశంగానే ఉంటుందని షేక్ హసీనా వివరించారు. తనపై వచ్చిన ఆరోపణలకు ఇంటర్నేషనల్ క్రిమినల్ కోర్టులో విచారణకు సిద్ధంగా ఉన్నానని వెల్లడించారు. న్యాయం తనవైపే ఉందని, నిర్దోషిగా బయటపడతానని ధీమా వ్యక్తంచేశారు. బంగ్లాదేశ్‌లోని ఇంటర్నేషనల్ క్రైమ్స్ ట్రిబ్యునల్‌లో తనపై విచారణ ప్రారంభించడాన్ని ఆమె తప్పుపట్టారు. రాజకీయ ప్రత్యర్థులు తనపై కుట్రలకు వేదికగా ఆ ట్రిబ్యునల్‌ను వాడుకుంటున్నారని ధ్వజమెత్తారు. తనను, తన పార్టీని అంతం చేయాలన్నదే వారి అసలు అజెండా అని మండిపడ్డారు. ప్రత్యర్థుల ఆటలు సాగవని స్పష్టంచేశారు.

27వ రాజ్యాంగ సవరణ బిల్లుకు పాక్ జాతీయ అసెంబ్లీ ఆమోదం

ఇస్లామాబాద్: పాకిస్తాన్‌లో కొత్తగా చీఫ్ ఆఫ్ డిఫెన్స్ ఫోర్సెస్(సీడీఎఫ్) పదవిని సృష్టించడంతోపాటు రాజ్యాంగ కోర్టు ఏర్పాటుకు వీలుగా 27వ రాజ్యంగ సవరణ బిల్లును బుధవారం జాతీయ అసెంబ్లీలో ఆమోదించారు. ఈ వివాదాస్పద బిల్లుకు మూడింట రెండొంతుల మెజార్టీతో ఆమోదం లభించింది. బిల్లును మంగళవారం న్యాయ శాఖ మంత్రి అజం నజీర్ తరార్ సభలో ప్రవేశపెట్టారు. పెద్దగా చర్చ లేకుండానే ఒక రోజు తర్వాత ఆమోదముద్ర వేశారు. బిల్లును వ్యతిరేకిస్తూ ప్రతిపక్షాలు సభ నుంచి వాకౌట్ చేశాయి. ఇమ్రాన్ ఖాన్ నేతృత్వంలోని తెహ్రీక్–ఇ–ఇన్సాఫ్ పార్టీ సభ్యులు బిల్లు ప్రతులను చించివేసి నిరసన వ్యక్తంచేశారు. బిల్లుకు అధ్యక్షుడు అసిఫ్ అలీ జర్దారీ ఆమోదం తెలపాల్సి ఉంది. ఆయన ఆమోదముద్ర వేస్తే చట్టంగా మారుతుంది. పాక్ ఆర్మీ చీఫ్ ఫీల్డ్ మార్షల్ అసిమ్ మునీర్‌ను చీఫ్ ఆఫ్ డిఫెన్స్ ఫోర్సెస్‌ను నియమించడానికి రంగం సిద్ధమవుతోంది. తద్వారా సైన్యంపై ఆయన పట్టు మరింత పెరుగుతుంది. ప్రతిపక్షాల అభ్యంతరానికి ఇదే ప్రధాన కారణం. అలాగే సమాఖ్య రాజ్యాంగ కోర్టును ఏర్పాటు చేయబోతున్నారు. సుప్రీంకోర్టు కంటే దీనికే ఎక్కువ అధికారాలు ఉంటాయి. సుప్రీంకోర్టు ఇకపై సాధారణ సివిల్, క్రిమినల్ కేసుల విచారణకు మాత్రమే పరిమితం అవుతుంది.

మా నగరాలపై దాడి చేయొచ్చు... మా ఆత్మలను కదిలించలేరు: నెతన్యాహు

జెరూసలేం: ఢిల్లీ కారు బాంబు పేలుడు ఘటనను ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు తీవ్రంగా ఖండించారు. భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీతోపాటు భారతీయులకు తన మద్దతు ప్రకటించారు. ఈ విపత్కర సమయంలో భారత్‌కు తాము అండగా ఉంటామని తెలిపారు. ఉగ్రవాదులు మన నగరాలపై దాడులు చేయొచ్చేమో గానీ మన ఆత్మలను ఎప్పటికీ కదలించలేరని నెతన్యాహు బుధవారం సోషల్ మీడియా పోస్టులో తేల్చిచెప్పారు. బాధిత కుటుంబాలకు సానుభూతి ప్రకటించారు. భారత్, ఇజ్రాయెల్‌లు ప్రాచీన నాగరికత కలిగిన దేశాలని, ఎల్లప్పుడూ సత్యం వైపే స్థిరంగా ఉంటాయని వెల్లడించారు. ఉగ్రవాదులకు పరాభవం తప్పదని స్పష్టంచేశారు.

నెతన్యాహును క్షమించండి

ఇజ్రాయెల్ అధ్యక్షుడికి ట్రంప్ లేఖ

జెరూసలేం: ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహును క్షమించాలంటూ ఆ దేశ అధ్యక్షుడు ఇసాక్ హెర్జోగ్‌కు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బుధవారం లేఖ రాయడం చర్చనీయాంశంగా మారింది. నెతన్యాహుపై పెద్ద ఎత్తున అవినీతి ఆరోపణలు వచ్చాయి. కోర్టుల్లో విచారణ జరుగుతోంది. దోషిగా తేలితే పదవి నుంచి తప్పుకోవాల్సిందే. ఈ నేపథ్యంలో నెతన్యాహుకు మద్దతుగా ట్రంప్ లేఖ రాయడం గమనార్హం. నెతన్యాహుపై ఆరోపణలన్నీ రాజకీయ ప్రేరేపితమని ట్రంప్ పేర్కొన్నారు. ఆయనను విచారించడం న్యాయ సమ్మతం కాదని అభిప్రాయపడ్డారు. ఇజ్రాయెల్‌ను శాంతి మార్గంలో నడిపిస్తున్నారంటూ నెతన్యాహును ప్రశంసించారు. మరోవైపు ఇజ్రాయెల్ అంతర్గత వ్యవహారాల్లో ట్రంప్ పెత్తనం పెరిగిపోతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ట్రంప్ గత నెలలో ఇజ్రాయెల్ పార్లమెంట్‌లో ప్రసంగించారు. అప్పుడు కూడా నెతన్యాహును వెనకేసుకొచ్చారు. ఆయనను పెద్ద మనసుతో క్షమించాలని అన్నారు.

లోయలో పడిన బస్సు.. 37 మంది మృతి

లిమా: పెరూలో బుధవారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. పికప్ ట్రక్కును ఢీకొన్న ఒక ప్యాసింజర్ బస్సు లోయలో పడిపోయింది. దీంతో 37 మంది మృతి చెందారు. 13 మంది గాయపడ్డారు. ఈ ప్రమాదం ఒకోనా నది ఒడ్డున జరిగింది. పెరూలో ప్రాణాంతక బస్సు ప్రమాదాలు సాధారణం. నిర్లక్ష్యమైన డ్రైవింగ్, అతి వేగం వల్ల ఇక్కడ ప్రమాదాలు జరుగుతుంటాయి. ఆగస్టులో, ఒక హైవేపై బస్సు బోల్తా పడి 10 మంది మరణించారు. జూలైలో లిమా నుంచి పెరూలోని అమెజాన్‌కు వెళ్తున్న మరో బస్సు కూడా బోల్తా పడి 18 మంది మరణించారు. 48 మంది గాయపడ్డారు. జనవరిలో ఒక బస్సు నదిలో పడి ఆరుగురు మరణించారు. 32 మంది గాయపడ్డారు.

20 మంది సైనికులు మృతి

అంకారా: జార్జియాలో కూలిన తుర్కియే సైనిక విమానంలో ఉన్న మొత్తం 20 మంది సిబ్బంది మరణించారు. ఈ మేరకు తుర్కియే రక్షణ మంత్రి బుధవారం ప్రకటించారు. 'కార్గో విమానం ఇ–130 నవంబర్ 11, 2025న జార్జియా–అజర్‌బైజాన్ సరిహద్దు సమీపంలో కూలిపోయి మా వీరోచిత సహచరులు అమరులయ్యారు' అని రక్షణ మంత్రి యాసర్ గులెర్ గీలో పోస్ట్ చేశారు. ఇ–130 విమానం అజర్‌బైజాన్‌లోని గంజా నుంచి బయలుదేరి తుర్కియేకు తిరిగి వెళుతుండగా అజర్‌బైజాన్ సరిహద్దు సమీపంలో మంగళవారం జార్జియాలోని సిగ్నాఘి మునిసిపాలిటీలో కూలిపోయింది. తుర్కియే దర్యాప్తు బృందం బుధవారం తెల్లవారుజామున ప్రమాద స్థలానికి చేరుకుంది. జార్జియన్ అధికారుల సమన్వయంతో విమాన శిథిలాలను పరిశీలిస్తోంది. వ్యవసాయ భూములు, కొండలతో నిండి ఉన్న మైదానం ప్రాంతంలో శిథిలాలు చెల్లాచెదురుగా పడ్డాయి. సిబ్బందిని రవాణా చేయడానికి మరియు లాజిస్టికల్ కార్యకలాపాలను నిర్వహించడానికి ఇ–130 సైనిక కార్గో విమానాలను తుర్కియే సాయుధ దళాలు ఉపయోగిస్తున్నాయి. తుర్కియే, అజర్‌బైజాన్ చాలాకాలంగా సైనిక సహకారాన్ని కొనసాగిస్తున్నాయి. నవంబర్ 8న బాకులో జరిగిన అజర్‌బైజాన్ విజయ దినోత్సవ వేడుకలకు తుర్కియే అధ్యక్షుడు హాజరయ్యారు.

లిబియా తీరంలో మునిగిన పడవ

42 మంది వలసదారులు మృతి.. ఐక్యరాజ్యసమితి ప్రకటన

కైరో: లిబియా తీరంలో పడవ మునిగి 42 మంది మృతి చెందారు. యూరప్‌కు వెళ్తున్న ఒక పడవ లిబియాలోని టోబ్రూక్ సమీపంలో నవంబర్ 3న తెల్లవారు జామున బోల్తా పడింది. ఈ సమయంలో పడవలో 49 మంది ఉన్నారు. వారిలో ఏడుగురు మాత్రమే ప్రాణాలతో బయటపడ్డారు. 42 మంది గల్లంతయ్యారని, వారు చనిపోయినట్లు భావిస్తున్నట్లు ఐక్యరాజ్యసమితి వలస సంస్థ బుధవారం తెలిపింది. గల్లంతైన వారిలో 29 మంది సూడాన్‌కు చెందినవారు, ఎనిమిది మంది సోమాలియా వాసులు, ముగ్గురు కామెరూన్ జాతీయులు, నైజీరియాకు చెందిన ఇద్దరు వ్యక్తులు ఉన్నట్లు సమాచారం. ప్రాణాలతో బయటపడిన వారిని ఆరు రోజుల తరువాత శనివారం లిబియా అధికారులు అల్–బురి ఆయిల్ ఫీల్డ్ సమీపంలో రెస్క్యూ మిషన్ నిర్వహించి రక్షించారు. ప్రాణాలతో బయటపడిన వారికి అత్యవసర చికిత్స, ఆహారం అందించారు. వలసదారులకు లిబియా ఒక ప్రధాన రవాణా కేంద్రంగా ఉంది. ఈ ఏడాది ప్రారంభం నుంచి 1,000 మందికి పైగా మరణించారు, వీరిలో లిబియా తీరంలో 500 మందికి పైగా గల్లంతయ్యారు. గత నెలలో, వాయువ్య లిబియాలోని అల్–జావియా నుంచి బయలుదేరిన వలస చెక్క పడవ బోల్తా పడి 18 మంది మరణించారు.

నిఘా వైఫల్యంతోనే ఢిల్లీ పేలుడు: అఖిలేష్

లక్నో: ఢిల్లీలో పేలుడుకు నిఘా వైఫల్యమే కారణమని సమాజ్‌వాదీ పార్టీ అధినేత, ఉత్తరప్రదేశ్ మాజీ సీఎం అఖిలేష్ యాదవ్ ఆరోపించారు. ఈ ఘటనకు సంబంధిత అధికార వర్గాలు బాధ్యత వహించాలని, ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఆయన బుధవారం మీడియాతో మాట్లాడారు. నిఘా వర్గాలు పదేపదే ఎందుకు విఫలమవుతున్నాయని ప్రశ్నించారు. ఇది ప్రభుత్వ నిర్వాకం కాదా? అని నిలదీశారు. ఇలాంటి పేలుళ్లు భవిష్యత్తులో పునరావృతం కాకుండా నిఘా వ్యవస్థను బలోపేతం చేయాలని చెప్పారు. బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయేకే మళ్లీ విజయం సాధిస్తుందంటూ వెల్లడించిన ఎగ్జిట్ పోల్స్ ఫలితాలను అఖిలేష్ యాదవ్ కొట్టిపారేశారు. ప్రతిపక్షాలను నిరుత్సాహపర్చాలన్న దురుద్దేశంతో ఇలాంటి ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

డ్రోన్ వేట..

వధూవరులిద్దరూ ఆనందడోలికల్లో మునిగి తేలుతూ కొత్త జీవితాన్ని ప్రారంభిస్తున్న శుభ సందర్భం అది. డీజే సౌండ్‌తో, అతిథుల కేరింతలతో పెళ్లి వేదిక కళకళలాడుతోంది. సరిగ్గా అదే సమయంలో వివాహ వేదికపైకి ఒక వ్యక్తి చేరుకున్నాడు. అందరూ చూస్తుండగానే వరుడిని అత్యంత దారుణంగా కత్తితో పొడిచి పారిపోయాడు. ఊహించని ఈ సంఘటనతో అంతా నిశ్చేష్టులయ్యారు. అప్పుడే ఒక అద్భుతం జరిగింది. పెళ్లిని చిత్రీకరిస్తున్న డ్రోన్ కెమెరా ఒక్కసారిగా తన దిశను మార్చుకుంది. నిందితుడిని, అతడి సహచరుడిని పెళ్లి మండపం నుంచి ఏకంగా రెండు కిలోమీటర్ల దూరం వెంబడించింది. మహారాష్ట్రలోని అమరావతిలో జరిగిన ఈ సంఘటన, సినిమాను మించిన రియల్ థ్రిల్లర్‌ను తలపించింది. డ్రోన్ రికార్డు చేసిన ఈ ఉత్కంఠభరిత ఫుటేజ్ పోలీసుల దర్యాప్తులో అత్యంత కీలకంగా మారిందిప్పుడు.

మహారాష్ట్రలోని అమరావతిలో ఒక పెళ్లి వేడుక క్రైమ్ సీన్‌గా మారింది. బాడ్నేరా రోడ్డులోని సాహిల్ లాన్‌లో సోమవారం రాత్రి 22 ఏళ్ల సుజల్ రామ్ సముద్ర వివాహ వేడుక జరుగుతోంది. రాత్రి 9.30 గంటల సమయంలో వేదికపైకి నిందితుడు దూసుకొచ్చాడు. వరుడు సుజల్‌ను కత్తితో మూడుసార్లు పొడిచాడు. దీంతో సుజల్‌కు తొడ, మోకాలిపై లోతైన గాయాలయ్యాయి. దాడి జరిగిన వెంటనే అతిథులు, బంధువులు భయంతో పరుగులు తీశారు. అయితే, పెళ్లి వేడుకలను రికార్డు చేయడానికి అక్కడే ఉన్న డ్రోన్ ఆపరేటర్ సమయస్ఫూర్తితో వ్యవహరించాడు. దాడిని రికార్డు చేస్తూనే, పారిపోతున్న నిందితుడిని డ్రోన్‌తో వెంబడించాడు. రెండు కిలోమీటర్ల దూరం వరకు నిందితుని కదలికలను చిత్రీకరించగలిగాడు. నిందితుడిని రాఘో జితేంద్ర బక్షిగా పోలీసులు గుర్తించారు. ఈ వీడియోలో, నారింజ రంగు హూడీ ధరించిన నిందితుడు వేదిక నుంచి పరుగు లంకించుకుని, బయట పార్క్ చేసిన బైక్‌పై ఎక్కి పరారయ్యాడు. నల్లటి దుస్తులు ధరించిన మరో వ్యక్తి అతనికి తోడై బైక్‌పై పరారయ్యాడు. ఆ సమయంలో వధూవరుల బంధువుల్లో ఒకరు వారిని పట్టుకోవడానికి ప్రయత్నించినా ఫలితం లేకపోయింది.

డ్రోన్ ఆపరేటర్ సమయస్ఫూర్తి

డీజే వివాదమే దాడికి కారణం

ప్రాథమిక దర్యాప్తు ప్రకారం, డీజే కార్యక్రమం జరుగుతున్నప్పుడు వరుడు, నిందితునికి మధ్య జరిగిన చిన్న తోపులాట ఈ దాడికి కారణమైంది. డ్యాన్స్ చేస్తున్నప్పుడు జరిగిన వాగ్వాదంతో బక్షి ఆగ్రహానికి లోనై ఈ దాడికి పాల్పడినట్లు తెలుస్తోంది. కత్తి దాడి తర్వాత, నిందితుడు.. వరుడి తండ్రి రామ్జీ సముద్రపై కూడా దాడికి యత్నించాడు.

డ్రోన్ ఫుటేజ కీలక ఆధారం

'డ్రోన్ ఆపరేటర్ ప్రదర్శించిన అప్రమత్తత మాకు ఎంతగానో ఉపయోగపడింది. నిందితులను గుర్తించడానికి, వారి ఆచూకీ తెలుసుకోవడానికి ఈ వీడియో చాలా కీలకం'.. అని స్టేషన్ హౌస్ ఆఫీసర్ సునీల్ చౌహాన్ తెలిపారు. ఈ సంఘటనపై బాడ్నేరా పోలీస్ స్టేషన్ కేసు నమోదైంది. ఎస్‌హెచ్‌వో సందీప్ హివాలే పర్యవేక్షణలో దర్యాప్తు జరుగుతోంది. పోలీసులు డ్రోన్ ఫుటేజీ ఆధారంగా నిందితుడి కదలికలను తెలుసుకుని, గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. గాయపడిన వరుడిని వెంటనే అమరావతిలోని రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. సుజల్‌కు లోతైన గాయాలయ్యాయని, అయితే ప్రస్తుతం అతని పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

స్వీట్ వార్!

- బీజేపీ 501 కేజీల లడ్డూల ఆర్డర్
- జేడీ(యూ) అభ్యర్థి 'మటన్' పార్టీ!
- ఫలితాలకు ముందే పార్టీల ఏర్పాట్లు

బిహార్ అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు మొదలవ్వడానికి ఇంకా రెండు రోజులు ఉండగానే పార్టీలన్నీ పండగ వాతావరణంలో మునిగిపోయాయి! ఫలితం అధికారికంగా రాకముందే, గెలుపు సంబరాల కోసం బీజేపీ ఏకంగా 501 కేజీల లడ్డూలు ఆర్డర్ చేసిందట. ఇదెక్కడి ఓవర్ కాన్ఫిడెన్స్ అనుకుంటున్నారా?

ఖుషీఖుషీగా కమలదళం

ఎగ్జిట్ పోల్స్ అన్నీ ఎన్డీఏకే పట్టం కట్టడంతో, కమలదళం నాయకులకు ఆనందానికి అవధు లేకుండా పోయాయి. 'కౌంటింగ్ రోజు మాకు హోలీ, దసరా, దీపావళి, ఈద్.. అన్ని పండగలూ ఒకేసారి వచ్చేస్తాయి!'.. అంటూ బీజేపీ కార్యకర్త కృష్ణ కుమార్ కల్లూ తెగ సంబరపడుతున్నారు. ఈ భారీ లడ్డూల ఆర్డర్ రావడం నిజమేనని పట్నాలోని మిఠాయి కొట్టు యజమాని కూడా ధ్రువీకరించారు. ఏకంగా 501 కేజీల లడ్డూలను నవంబర్ 14 ఉదయం డెలివరీ చేయాల్సి ఉందట. అంటే.. బీజేపీ కార్యాలయాలు మిఠాయి దుకాణలను తలపించబోతున్నాయన్నమాట!

మర్డర్ కేసు అభ్యర్థి 'మాంసం' విందు!

ఇదొక్కటే కాదు.. ఈసారి గెలుపుపై ఆశలు పెట్టుకున్న మరో కీలక అభ్యర్థి సంబరం ఇంకాస్త 'గట్టిగా' ఉంది. జేడీ(యూ)కి చెందిన మోకామా అభ్యర్థి అనంత్ సింగ్, ఒక హత్య కేసులో జైలులో ఉన్నప్పటికీ, తన విజయాన్ని ఘనంగా జరుపుకోవాలని నిర్ణయించుకున్నారు. అనంత్ సింగ్‌కు ఇప్పటికే ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన రికార్డు ఉంది. అందుకే, ఆయన ఈసారి తన మద్దతుదారులు, ఓటర్ల కోసం నవంబర్ 14న పట్నాలో భారీ విందు ఏర్పాటు చేశారు. అంతా ఊహించినట్టే జరిగితే, ఆ రోజు అక్కడ పెద్ద మటన్ బిర్యానీ పార్టీ జరిగే అవకాశం ఉంది!

– సాక్షి, నేషనల్ డెస్క్

'లడ్డూలు వెర్సెస్ మటన్' వార్

మొత్తానికి, ఓట్ల లెక్కింపు ముందే బిహార్‌లో 'లడ్డూలు వెర్సెస్ మటన్' వార్ మొదలైందన్నమాట! ఈ అతి విశ్వాసాన్ని చూసి ఆర్జేడీ యువనేత తేజస్వీ యాదవ్ నవ్వుకుంటున్నారు. ఎగ్జిట్ పోల్స్ అన్నీ బీజేపీ అత్యున్నత నాయకత్వం కనుసన్నల్లోనే వస్తున్నాయని కొట్టిపారేస్తున్నారు! నవంబర్ 14న కౌంటింగ్ తర్వాత ఈ 501 కేజీల లడ్డూలు అందరి నోరు తీపి చేస్తాయో లేక ఈ భారీ 'స్వీట్' ఆర్డర్ చూసి మిగిలిన పార్టీలు కన్నీరు పెట్టుకుంటాయో చూడాలి.

ఆ లాయర్‌ను వెంటనే వదిలేయండి

గురుగ్రామ్ పోలీస్ కమిషనర్‌కు సుప్రీంకోర్టు ఆదేశం

న్యూఢిల్లీ: గ్యాంగ్‌స్టర్‌ల తరపున వాదిస్తున్నాడని, హత్య కేసులో అన్యాయంగా న్యాయవాదిని హరియాణా పోలీసులు అరెస్ట్‌చేశారని దాఖలైన పిటిషన్‌పై సర్వోన్నత న్యాయస్థానం వేగంగా స్పందించింది. చట్టవ్యతిరేకంగా లాయర్ నడుచుకున్నట్లు తమకు అనిపించట్లేదని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కె.వినోద్ చంద్రన్, జస్టిస్ ఎన్‌వీ అన్జారియాల ధర్మాసనం వ్యాఖ్యానించింది. '' తక్షణం న్యాయవాది విక్రమ్ సింగ్‌ను విడుదలచేయండి. రూ.10,00 విలువైన బాండు పూచీకత్తుపై ఆయనను వదిలేయండి. మా ఆదేశాలు త్వరగా గురుగ్రామ్ పోలీస్ కమిషనర్‌కు చేరేలా చూడండి'' అని సుప్రీంకోర్టు జ్యూడీషియల్ రిజిస్ట్రార్‌ను ధర్మాసనం ఆదేశించింది. గురుగ్రామ్ పోలీసుల ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఢిల్లీకి చెందిన న్యాయవాది విక్రమ్‌సింగ్‌ను వెంటనే విడుదల చేయాలని దాఖలైన పిటిషన్‌పై వాదనల సందర్భంగా సుప్రీంకోర్టు పైవిధంగ ఆదేశాలిచ్చింది. ఈ కేసులో న్యాయవాది తరపున హాజరైన సీనియర్ న్యాయవాది వికాస్‌సింగ్ వాదనలు వినిపించారు. '' పోలీసుల ఇలాంటి అత్యంత కఠిన చర్యల కారణంగా న్యాయవాదులు నేర చట్టాలపై కేసులను వాదించడానికి ముందుకురాబోరు. న్యాయవాదులపై పోలీసుల ఈ తరహా వైఖరి ఏమాత్రం ఆమోదయోగ్యం కాదు'' అని సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కూడా అయిన వికాస్‌సింగ్ ఆవేదన వ్యక్తంచేశారు. సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైనందున ఈ అంశంపై సమ్మె కొనసాగించవద్దని ఢిల్లీ న్యాయవాదులను ఒప్పించానని ఆయన సుప్రీంకోర్టుకు తెలిపారు. ఈ కేసుకు సంబంధించి పిటిషనర్‌పై ఉన్న అన్ని క్రిమినల్ చర్యలను రద్దు చేయాలని కూడా కోరారు. న్యాయవాది విక్రమ్‌సింగ్ 2019 జులైలో బార్ కౌన్సిల్ ఆఫ్ ఢిల్లీలో న్యాయవాదిగా తన పేరు నమోదుచేయించుకున్నారు.

కాలుష్య నియంత్రణకు తీసుకుంటున్న చర్యలేంటి?

పంజాబ్, హరియాణా సర్కార్‌లను ఆదేశించిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: ఢిల్లీలో వాయు కాలుష్యం పెరగడానికి పంజాబ్, హరియాణాలో పంట వ్యర్థాల తగలబెట్టడం సైతం ప్రధాన కారణమంటూ ఆ రెండు రాష్ట్ర ప్రభుత్వాలపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. పొలాల్లో వ్యర్థాలను తగలబెట్టకుండా, పరిస్థితిని నియంత్రించడానికి తీసుకున్న చర్యలపై నివేదిక ఇవ్వాలని ఆయా రాష్ట్రాలను సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కె.వినోద్ చంద్రన్, జస్టిస్ ఎన్వీ అంజారియాల ధర్మాసనం ఆదేశించింది. కోర్టు సహాయకురాలు(అమికస్ క్యూరీ)గా వ్యవహరిస్తున్న సీనియర్ మహిళా అపరాజితా సింగ్ కోర్టు ఎదుట పలు అంశాలను ప్రస్తావించారు. ''పంజాబ్, హరియాణాలో పంట వ్యర్థాల దహనాలు ఢిల్లీలో గాలి నాణ్యత స్థాయిలను మరింత దిగజార్చాయి. ఈ రెండు రాష్ట్రాల్లో పంట వ్యర్థాల దహనం కారణంగానే ఈ పరిస్థితి దాపురించిందని స్వయంగా నాసా వారి ఉపగ్రహ చిత్రాలు సైతం రుజువుచేస్తున్నాయి. గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలను రాష్ట్రాలు పెడచెవిన పెట్టాయి. ఇప్పుడైనా రాష్ట్రాలు ఏపాటి చర్యలు తీసుకుంటాయో చూద్దాం'' అని ఆమె అన్నారు. 'పంట వ్యర్థాలను తగలబెట్టకుండా నియంత్రించడానికి తీసుకున్న చర్యలేంటో రాష్ట్రాలు స్పష్టంచేయాలి' అని జస్టిస్ గవాయ్ ఆదేశించారు. కాలుష్యనియంత్రణ మాత్రమేకాదు నిర్మాణ కార్యకలాపాలకు సంబంధించి ఆదేశాలిస్తామని సీజేఐ అన్నారు. ఈ కేసు తదుపరి విచారణను నవంబర్ 17వ తేదీన చేపట్టనున్నారు.

మండల పరిషత్‌ను ఎప్పుడు ప్రవేశపెట్టారు?

01 బల్వంత్‌రాయ్ మెహతా కమిటీ సూచనల మేరకు ఆంధ్రప్రదేశ్‌లో రెండో అంచె లేదా మధ్యస్థ స్థాయి అంచెగా పంచాయతీ సమితిని ఏర్పాటు చేశారు.

02 1986లో పంచాయతీ సమితి వ్యవస్థను రద్దు చేసి, వాటి స్థానంలో మండల పరిషత్ వ్యవస్థను ప్రవేశపెట్టారు. ఈ మండల పరిషత్ వ్యవస్థ 1987 నుంచి అమల్లోకి వచ్చింది.

03 అంతకుముందున్న పంచాయతీ సమితులనే మండల పరిషత్తులుగా తక్కువ వైశాల్యంతో విడగొట్టారు.

04 73వ రాజ్యాంగ సవరణ ద్వారా పంచాయతీ వ్యవస్థకు రాజ్యాంగ ప్రతిపత్తి కల్పించారు.

05 73వ రాజ్యాంగ సవరణకు అనుగుణంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 1994లో ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చట్టాన్ని రూపొందించింది.

06 1986లో రూపొందించిన మండల పరిషత్ చట్టంలోని నియమాలే తర్వాతి సవరణలు చేయనంత వరకు వర్తిస్తాయి.

మండల పంచాయతీని ఒక్కో రాష్ట్రంలో ఒక్కో పేరుతో పిలుస్తున్నారు. గుజరాత్, కర్ణాటకల్లో 'తాలూకా పంచాయతీ' అని, మధ్యప్రదేశ్‌లో 'జన్‌పథ్ పంచాయతీ', తమిళనాడులో 'పంచాయతీ సంఘ్', అరుణాచల్‌ప్రదేశ్‌లో 'అంచల్ కమిటీ', ఉత్తరప్రదేశ్‌లో 'క్షేత్ర పంచాయతీ', ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో 'మండల పరిషత్' అని వ్యవహరిస్తున్నారు.

నిర్మాణం

మధ్య స్థాయిలో గల స్థానిక సంస్థే 'మండల పరిషత్'. ఇది స్థానిక సంస్థలకు సంబంధించి జనాభా, భౌగోళిక ప్రాతిపదికన విభజించిన భాగం. సాధారణంగా పరిపాలనా సౌలభ్యం కోసం జిల్లాను మండలాలుగా విభజిస్తారు. అవి రెవెన్యూ పరంగా ఉంటాయి. కాబట్టి వాటిని రెవెన్యూ మండలాలు అంటారు. జిల్లాల్లో రెవెన్యూ మండల సరిహద్దులు, మండల పరిషత్ సరిహద్దులు ఒకే విధంగా ఉంటాయి. అయితే నగరాల్లో మాత్రం రెవెన్యూ మండలాల సంఖ్యకు, మండల పరిషత్‌ల సంఖ్యకు సంబంధం ఉండదు. నగరాల్లో రెవెన్యూ మండలాలు ఉంటాయి. కానీ, మండల పరిషత్తులు ఉండకపోవచ్చు.

మండల పరిషత్‌లో సభ్యులు

- మండల పరిషత్ సభ్యులు
- కో-ఆప్టెడ్ సభ్యులు
- హోదా రీత్యా సభ్యులు
- శాశ్వత ఆహ్వానితులు
- ప్రత్యేక ఆహ్వానితులు
- మండల పరిషత్ అధ్యక్షుడు/ఉపాధ్యక్షుడు
- మండల పరిషత్ అభివృద్ధి అధికారి
- మండల మహాసభ



ఎంపీటీసీ

మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాల సభ్య (ఎంపీటీసీ)లను నేరుగా ఓటర్లు ఐదేళ్ల వ్యవధికి ఎన్నుకుంటారు. వీరి ఎన్నిక పార్టీ పరంగా జరుగుతుంది. సుమారు 3 వేల నుంచి 4 వేల జనాభా కలిగిన ప్రాంతాలను ఎంపీటీసీ స్థానాలుగా ఏర్పాటు చేస్తారు. ఒక మండలంలో కనిష్టంగా 7 ఎంపీటీసీ స్థానాల నుంచి గరిష్టంగా 23 స్థానాల వరకు ఉంటాయి.

- **కో- ఆప్టెడ్ సభ్యులు:** మైనారిటీ వర్గానికి చెందిన ఒక సభ్యుడిని తమకున్న ఎంపీటీసీ స్థానాలను బట్టి ఆయా పార్టీలు కో-ఆప్టెడ్ సభ్యుడిగా ఎన్నుకుంటాయి.
- **హోదా రీత్యా సభ్యులు:** సంబంధిత మండలంలో పూర్తిగా లేదా పాక్షికంగా తమ నియోజకవర్గ పరిధి విస్తరించి ఉన్న విధానసభ సభ్యుడు, లోక్‌సభ సభ్యుడు, ఆ మండలంలో ఓటరుగా నమోదైన రాజ్యసభ సభ్యుడు హోదా రీత్యా మండల పరిషత్‌లో సభ్యులుగా ఉంటారు. వీరికి మండలాధ్యక్షుడు, ఉప మండలాధ్యక్షుడి ఎన్నికల్లో ఓటు వేసే అధికారం ఉండదు.
- **శాశ్వత ఆహ్వానితులు:** పై సభ్యులే కాకుండా మండల పరిషత్ సమావేశాలకు శాశ్వత ఆహ్వానితులుగా కింద పేర్కొన్నవారు హాజరవుతారు. వీరికి ఎలాంటి ఓటింగ్ హక్కులు ఉండవు.
  - జిల్లా కలెక్టర్
  - మండల పరిషత్ పరిధిలోని గ్రామ పంచాయతీ సర్పంచులు
  - జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులు
  - జిల్లా పరిషత్ చైర్మన్
  - జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్
- **ప్రత్యేక ఆహ్వానితులు :** సంబంధిత మండల పరిషత్తులోని ఏదైనా రంగంలో విశేష అనుభవం ఉన్న వ్యక్తులను మండల పరిషత్ అధ్యక్షుడితో సంప్రదించి ప్రత్యేక ఆహ్వానితులుగా పిలవొచ్చు.

మండల పరిషత్ అధ్యక్ష/ఉపాధ్యక్షులు

మండల పరిషత్‌కు అధ్యక్ష, ఉపాధ్యక్షులు ఉంటారు. ఎంపీటీసీ సభ్యులు పార్టీ ప్రాతిపదికపై వీరిని ఎన్నుకుంటారు. వీరి పదవీ కాలం ఐదేళ్లు.

- **తొలగింపు, రాజీనామా:** అవిశ్వాస తీర్మానం ద్వారా మండలాధ్యక్షుడిని, ఉప మండలాధ్యక్షుడిని తొలగించవచ్చు. అవిశ్వాస తీర్మానం నోటీసుపై మొత్తం సభ్యుల్లో 50 శాతం సభ్యులు సంతకాలు చేసి ఆ నోటీసును సంబంధిత రెవెన్యూ డివిజన్ అధికారికి ఇవ్వాలి. మొత్తం సభ్యుల్లో మూడింట రెండు వంతులకు తగ్గని మెజారిటీతో తీర్మానాన్ని ఆమోదిస్తే వారు తొలగింపునకు గురవుతారు. ఈ ప్రక్రియలో ఎన్నికైన సభ్యులు (ఎంపీటీసీలు) మాత్రమే పాల్గొంటారు. అయితే ఎన్నికైన మొదటి నాలుగేళ్లలో అవిశ్వాస తీర్మానాన్ని ప్రతిపాదించేందుకు అవకాశం లేదు. రాష్ట్ర ప్రభుత్వం కూడా వీరిని అధికార దుర్వినియోగం, అవినీతి కారణాలపై తొలగించవచ్చు.
- మండల పరిషత్ అధ్యక్షుడు తన రాజీనామా పత్రాన్ని మండల పరిషత్‌కు సమర్పిస్తారు. అలా కాని పక్షంలో జిల్లా పంచాయతీ కార్యనిర్వహణ అధికారికి సమర్పిస్తారు.

ఎంపీడీవో - అధికార విధులు

మండల పరిషత్ ముఖ్య కార్య నిర్వహణాధికారే మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో). వీరిని రాష్ట్ర ప్రభుత్వం నియమిస్తుంది. గ్రూప్-1 సర్వీసుకు చెంది ఉంటారు.

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
ఇండియన్ పాలిటీ

చట్టపరమైన విధులు

- మండల పరిషత్ సమావేశాల ఏర్పాటు, అజెండా తయారుచేయడం.
- మండల పరిషత్ చేసిన తీర్మానాలను అమలు చేయడం. దీంతో పాటు మండలాల్లో జరిగే వివిధ అభివృద్ధి కార్యక్రమాలను పర్యవేక్షిస్తారు.
- గత సమావేశం నుంచి 90 రోజుల్లోపు మరొక సమావేశం ఏర్పాటు చేయకపోతే ఎంపీడీవోపై క్రమశిక్షణ చర్య తీసుకుంటారు.
- మండల పరిషత్ సమావేశానికి హాజరై చర్చలో పాల్గొనవచ్చు. ఓటు వేయడానికి, తీర్మానాలను ప్రతిపాదించడానికి హక్కు లేదు. మండల పరిషత్‌కు బడ్జెట్‌ను తయారుచేసి జిల్లా పరిషత్ ఆమోదానికి పంపాలి.
- మండల పరిషత్ పరిపాలన నివేదికను తయారుచేసి మండల పరిషత్ ఆమోదానికి పంపుతారు.

పరిపాలనాధికారాలు

మండల పరిషత్‌లో పనిచేసే సిబ్బందిపై పరిపాలనా నియంత్రణ ఉంటుంది. నెలకు కనీసం 2 పర్యాయాలు గ్రామాల్లో బస చేయాలి. అలాగే నెలకు 16 రోజులు మండల పర్యటన చేయాలి. షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డ్ తెగలు, బీసీ హాస్టళ్లను తనిఖీ చేసే అధికారం ఉంటుంది.

విద్యా సంబంధిత అధికారాలు

- మండల పరిషత్ పాఠశాలలకు సెక్రటరీ, కరస్పాండెంట్‌గా ఉంటారు. మండల విద్యా కమిటీకి వైస్ చైర్మన్‌గా వ్యవహరిస్తారు. మండల పరిధిలోని టీచర్ల బదిలీల్లో మెంబర్‌గా వ్యవహరిస్తారు.
- గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తారు.
- మండలంలో జరిగే గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలు అన్నీ ఎంపీడీవో పర్యవేక్షణ, నియంత్రణలో ఉంటాయి.

మండల మహాసభ

మండల పరిషత్‌కు మండల మహాసభ సలహాపూర్వక అంగంగా వ్యవహరిస్తుంది. మండల పరిషత్తు పరిధిలో గ్రామ పంచాయితీ సర్పంచ్‌లు, మండల పరిషత్తు సభ్యులు ఉంటారు. దీని సమావేశాలకు మండల పరిషత్ అధ్యక్షుడు అధ్యక్షత వహిస్తారు. మండల మహాసభ.. మండల పరిషత్తుకు సంబంధించిన వార్షిక బడ్జెట్, ఆడిట్ నివేదిక, గత సంవత్సర వార్షిక బడ్జెట్, గత ఏడాది వార్షిక పరిపాలనా నివేదిక మొదలైన అంశాలను చర్చిస్తుంది. మండల పరిషత్తుకు, గ్రామాల మధ్య వారధిగా జిల్లా పరిషత్తు పనిచేస్తుంది.

మండల పరిషత్తు అధికార విధులు

- సమాజ అభివృద్ధికి సంబంధించిన అన్ని కార్యక్రమాలను మండల పరిషత్ అమలు చేస్తుంది.
- వ్యవసాయ రంగంలో అధికోత్పత్తిని సాధించేందుకు రైతులకు నాణ్యమైన విత్తనాల సరఫరా, గొట్టపు బావుల తవ్వకం, రుణ సదుపాయాలు, ఎరువుల పంపిణీ వంటి చర్యలు చేపడుతుంది.
- గ్రామీణ వైద్యశాలలు, తాగునీటి సౌకర్యాలను కల్పిస్తుంది.
- ప్రాథమిక, ప్రాథమికోన్నత విద్య, కుటీర పరిశ్రమలు, మహిళా, శిశు సంక్షేమం, సాంఘిక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తుంది.

ఆదాయ మార్గాలు

మండల పరిషత్‌కు కింది పద్ధతుల్లో ఆదాయం సమకూరుతుంది.

- రాష్ట్ర ప్రభుత్వ భూమి శిస్తు, పన్నుల్లో వాటా
- రిజిస్ట్రేషన్ శాఖ ఆస్తి బదిలీలపై వేసే 2 శాతం సర్‌చార్జీలను గ్రామ పంచాయతీ, మండల పరిషత్, జిల్లా పరిషత్‌లకు 3:1:1 నిష్పత్తిలో పంపిణీ చేస్తారు.
- లఘు ఖనిజాలపై కొంత సీనరేజ్ రుసుం పంచాయతీ, మండల పరిషత్, జిల్లా పరిషత్తులకు 25:50:25 నిష్పత్తిలో పంపిణీ అవుతుంది. అలాగే, ఇసుకపై వచ్చే సీనరేజ్ రుసుంను కూడా పై నిష్పత్తిలోనే పంపిణీ చేస్తారు.
- వినోదపు పన్నులో 90% శాతాన్ని గ్రామ పంచాయతీ, మండలాలకు 60:40 నిష్పత్తిలో కేటాయిస్తారు.
- సామాజిక అభివృద్ధి గ్రాంట్లు
- గ్రామ పంచాయతీలకు లెవీ ద్వారా వచ్చే వసూళ్లు.
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే నిధులు.
- అఖిల భారత సంస్థలు విడుదల చేసే సహాయక గ్రాంట్లు

విద్య, ఉద్యోగ సమాచారం

పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లో 750 లోకల్ బ్యాంక్ ఆఫీసర్ పోస్టులు

పంజాబ్ నేషనల్ బ్యాంక్(పీఎన్‌బీ) దేశవ్యాప్తంగా వివిధ శాఖల్లో లోకల్ బ్యాంక్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 750.
- **రాష్ట్రాల వారీగా ఖాళీలు:** ఆంధ్రప్రదేశ్-5, గుజరాత్-95, కర్ణాటక-85, మహారాష్ట్ర-135, తెలంగాణ-88, తమిళనాడు-85, పశ్చిమ బెంగాల్-90, జమ్మూ-కశ్మీర్-20, లడాఖ్-3, అరుణాచల్‌ప్రదేశ్-5, అస్సాం-86, మణిపూర్-8, మేఘాలయ-8, మిజోరాం-5, నాగాలాండ్-5, సిక్కిం-5, త్రిపుర-22.
- **అర్హత:** ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. కనీసం ఏడాది బ్యాంకింగ్ అనుభవం అవసరం. అభ్యర్థులు సంబంధిత రాష్ట్ర స్థానిక భాష చదవడం, రాయడం, మాట్లాడడంలో ప్రావీణ్యం కలిగి ఉండాలి.
- **వయసు:** 20 నుంచి 30 ఏళ్ల మధ్య ఉండాలి.
- **వేతనం:** నెలకు రూ.48,480 నుంచి రూ.85,920.
- **ఎంపిక విధానం:** ఆన్‌లైన్ రాతపరీక్ష, ఇంటర్వ్యూ, డాక్యుమెంట్ వెరిఫికేషన్, స్థానిక భాష పరీక్ష ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 03.11.2025
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 23.11.2025
- **ఆన్‌లైన్ పరీక్ష తేది:** డిసెంబర్ 2025/జనవరి 2026.
- **వెబ్‌సైట్:** https://pnb.bank.in/hi

ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ కామన్ అడ్మిషన్ టెస్ట్ (ఏఎఫ్ క్యాట్)

ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ ఉన్నత ఉద్యోగాల భర్తీకి ఎయిర్‌ఫోర్స్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్(ఏఎఫ్ క్యాట్-01/2026) నోటిఫికేషన్ విడుదలైంది.

కోర్సుల వివరాలు:

- **ఏఎఫ్ క్యాట్ ఎంట్రీ:** ఫ్లయింగ్/గ్రౌండ్ డ్యూటీ (టెక్నికల్)/గ్రౌండ్ డ్యూటీ(నాన్-టెక్నికల్), ఎన్‌సీసీ స్పెషల్ ఎంట్రీ: ఫ్లయింగ్.
- **అర్హత:** ఇంటర్(ఫిజిక్స్, మ్యాథ్స్), సంబంధిత విభాగంలో బ్యాచిలర్ డిగ్రీ/బీఈ, బీటెక్ ఉత్తీర్ణతతో పాటు నిర్దిష్ట శారీరక ప్రమాణాలు కలిగి ఉండాలి.
- **వయసు:** ఫ్లయింగ్ బ్రాంచ్‌కు 20 నుంచి 24 ఏళ్లు ఉండాలి. గ్రౌండ్ డ్యూటీ(టెక్నికల్/నాన్ టెక్నికల్) బ్రాంచ్‌కు 20 నుంచి 26 ఏళ్ల మధ్య ఉండాలి.
- **పే స్కేల్:** ఫ్లయింగ్ ఆఫీసర్‌కు రూ.56,100 నుంచి రూ.1,77,500.
- **దరఖాస్తు విదానం:** ఆన్‌లైన్ ద్వారా.
- **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 10.11.2025
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 09.12.2025
- **వెబ్‌సైట్:** https://afcat.cdac.in

ఎముకల్లో ఫాస్పరస్ ఏ రూపంలో ఉంటుంది?

ఎముకల్లోని ఫాస్ఫరస్ గాలిలో మండి కాంతిని వెదజల్లుతుంది. ఈ దృగ్విషయాన్ని 'ఫాస్ఫారిసెన్స్' అంటారు. శ్మశానాల్లో రాత్రిపూట దెయ్యాలుగా భ్రమపడే మంటలకు కారణమిదే. గాలిలో మండే స్వభావం ఉండటం వల్ల దీన్ని నీటిలో నిల్వ చేస్తారు. దీనికి వెల్లుల్లి వాసన ఉంటుంది. ఇది విష పదార్థం.

టెట్/డీఎస్సీ ప్రత్యేకం
రసాయన శాస్త్రం

ఫాస్ఫరస్

ఆవర్తన పట్టికలో నైట్రోజన్ కుటుంబం (Vవ గ్రూప్)లోని రెండో మూలకం ఫాస్ఫరస్ (భాస్వరం). ఇది చతుర్ పరమాణుక అణువు. ఫాస్ఫరస్ అత్యంత చురుకైన మూలకం. ఎముకల దృఢత్వానికి కాల్షియంతో పాటు ఫాస్ఫరస్ కూడా అత్యంత ప్రధానమైనది. ఎముకలో 50 శాతం వరకు కాల్షియం ఫాస్ఫేట్ ఉంటుంది. ఫాస్ఫరస్ రంగు లేని మైనం లాంటి మెత్తని ఘన పదార్థం. దీనికి గాలిలో మండే స్వభావం ఉంటుంది.

ఒక మూలకం ఒకటి కంటే ఎక్కువ భౌతిక రూపాల్లో లభించడాన్నే 'రూపాంతరత (Allotropy)' అంటారు. ఫాస్ఫరస్‌కు ఎర్ర భాస్వరం, తెల్ల (పసుపు) భాస్వరం, ఎరుపు (స్కార్లెట్) భాస్వరం, నల్ల భాస్వరం, ఊదారంగు భాస్వరం అనేవి రూపాంతరాలు. వీటిలో ఎర్ర, తెల్ల భాస్వరాలు ప్రధానమైనవి. ఈ రూపాంతరాలన్నింటికీ ఒకే రసాయన ధర్మాలుంటాయి. కానీ, వేర్వేరు భౌతిక ధర్మాలుంటాయి. వీటిలో తెల్ల భాస్వరం విషపూరితం, గాలిలో మండుతుంది. దీనికి వెల్లుల్లి వాసన ఉంటుంది. ఎర్ర భాస్వరం గాలిలో మండదు, విష రహితం, వాసన లేనిది.

ఉపయోగాలు:

- తెల్ల భాస్వరాన్ని ఎలుకలను చంపడానికి, బాంబులు, పేలుడు పదార్థాల తయారీలో, అగ్గిపెట్టెల పరిశ్రమలో ఉపయోగిస్తారు.
- ఫాస్ఫర్ బ్రాంజ్ అనేది రాగి (కాపర్), తగరం (టిన్), ఫాస్ఫరస్‌ల మిశ్రమం.
- ఫాస్ఫరస్ విరివిగా ఉపయోగపడే పరిశ్రమల్లో అగ్గిపెట్టెల పరిశ్రమ ఒకటి. సురక్షితమైన అగ్గిపుల్ల (Safety Matches) తలలో పొటాషియం క్లోరేట్, ఆంటిమొనీసల్ఫైడ్, బంకమన్ను ఉంటుంది. అగ్గిపెట్టె పక్కభాగంలో ఎర్ర భాస్వరం, ఆంటిమొనీ సల్ఫైడ్‌తోపాటు గరుకుదనం కోసం గాజుపొడి ఉంటుంది. అగ్గిపుల్ల గీసినప్పుడు, పెట్టె పక్క భాగంలో ఉండే ఎర్ర భాస్వరం మండి అగ్గిపుల్ల చివరన ఉన్న ఆంటిమొనీ సల్ఫైడ్‌ను మండిస్తుంది. కావలసిన ఆక్సిజన్ 'పొటాషియం క్లోరేట్' నుంచి లభిస్తుంది.
- ఫాస్ఫీన్, ఫాస్ఫారికామ్లాల తయారీలో ఫాస్ఫరస్‌ను ఉపయోగిస్తారు.
- ఫాస్ఫారికామ్లాన్ని పులుపు లాంటి ఒక రకమైన రుచి కోసం శీతల పానీయాల్లో కలుపుతారు.
- ఫాస్ఫరస్ సమ్మేళనమైన 'ఫాస్ఫీన్'ను 'హోల్మె సంకేతాల్లో' (Holme's Signals) ఉపయోగిస్తారు. నావికులు కాల్షియం కార్బైడ్, కాల్షియం ఫాస్ఫైడ్ ఉన్న డబ్బాలకు రంధ్రాలు చేసి సముద్రంలోకి విసిరేస్తారు. ఆ సమ్మేళనాలు నీటితో చర్య జరపడం వల్ల విడుదలయ్యే ఎసిటలీన్, ఫాస్ఫీన్ వాయువులు మండి సంకేతాలుగా పనిచేస్తాయి.

మాదిరి ప్రశ్నలు

1. ఒక మూలకం ఒకటి కంటే ఎక్కువ భౌతిక రూపాల్లో ఉండటాన్ని ఏమంటారు?
   1) రూపాంతరత
   2) విద్రావణీయత
   3) స్ఫటికీకరణం
   4) అంశికీకరణం
2. కిందివాటిలో ఫాస్ఫరస్ రూపాంతరం కానిది ఏది?
   1) తెల్ల ఫాస్ఫరస్ 2) ఎర్ర ఫాస్ఫరస్
   3) నల్ల ఫాస్ఫరస్ 4) ఫాస్ఫీన్
3. అగ్గిపుల్లల తయారీలో ఉపయోగించే ఫాస్ఫరస్ ఏది?
   1) తెల్ల ఫాస్ఫరస్ 2) నల్ల ఫాస్ఫరస్
   3) ఎర్ర ఫాస్ఫరస్ 4) పచ్చ ఫాస్ఫరస్
4. ఎలుకలను చంపడానికి ఉపయోగించే పదార్థం ఏది?
   1) ఎర్ర భాస్వరం 2) తెల్ల భాస్వరం
   3) నల్ల భాస్వరం 4) పచ్చ భాస్వరం
5. చీకట్లో భాస్వరం (ఫాస్ఫరస్)ను ఉంచితే నెమ్మదిగా గాలిలో మండి మెరుస్తుంది. ఈ ప్రక్రియను ఏమంటారు?
   1) ఫ్లోరోసెన్స్ 2) ఫాస్ఫారిసెన్స్
   3) ప్లాస్టిసెన్స్ 4) ఉత్పతనం
6. భాస్వరాన్ని ఎందులో నిల్వ ఉంచుతారు?
   1) గాలి 2) కిరోసిన్
   3) నీరు 4) క్లోరోఫాం
7. కిందివాటిలో చీకట్లో మెరిసే పదార్థం ఏది?
   1) నైట్రోజన్ 2) ఫాస్ఫరస్
   3) సిలికాన్ 4) కార్బన్
8. కిందివాటిలో బాహ్యాణుక స్వభావం కలిగినది ఏది?
   1) పచ్చ భాస్వరం 2) ఎర్ర భాస్వరం
   3) స్కార్లెట్ భాస్వరం
   4) నైట్రోజన్
9. వెల్లుల్లి వాసన కలిగిన మూలకం ఏది?
   1) కార్బన్ 2) సల్ఫర్
   3) సోడియం 4) ఫాస్ఫరస్
10. ఫాస్ఫరస్ సంబంధ పరిశ్రమల్లో పనిచేసే కార్మికుల దవడ ఎముకలు నశిస్తాయి. ఈ వ్యాధిని ఏమంటారు?
    1) ఫాసీజా 2) ఫ్లోరోసిస్
    3) ఫాస్ఫారిసెస్ 4) కీలోసిస్
11. పొగల తెరల (Smoke Screen)లో ఉపయోగించే సమ్మేళనం ఏది?
    1) ఫాస్ఫారికామ్లం
    2) సల్ఫ్యూరికామ్లం
    3) ఫాస్ఫీన్ 4) అమ్మోనియా
12. శీతల పానీయాల్లో వాడే ఆమ్లం ఏది?
    1) హైడ్రోక్లోరికామ్లం
    2) ఫాస్ఫారికామ్లం
    3) నైట్రికామ్లం
    4) సల్ఫ్యూరికామ్లం
13. నావికులు సముద్రంలో వారి ఉనికిని తెలపడానికి ఉపయోగించే 'హోల్మె సంకేతాల్లో' వాడే సమ్మేళనం ఏది?
    1) కాల్షియం సల్ఫేట్
    2) కాల్షియం ఫాస్ఫేట్
    3) కాల్షియం ఫాస్ఫైడ్
    4) ఫాస్ఫరస్ పెంటాక్సైడ్
14. కిందివాటిలో అగ్గిపెట్టె పక్క భాగంలో ఉండని పదార్థం ఏది?
    1) ఎర్ర భాస్వరం
    2) ఆంటిమొని సల్ఫైడ్
    3) గాజుపొడి
    4) పొటాషియం క్లోరేట్
15. కిందివాటిలో ఫాస్ఫరస్ లభించే పదార్థం ఏది?
    1) గుడ్డు సొన 2) ఎముక మజ్జ
    3) మెదడు 4) పైవన్నీ
16. అగ్గిపెట్టెల పరిశ్రమల్లో ప్రధానంగా వాడే మూలకం ఏది?
    1) తెల్ల భాస్వరం 2) ఎర్ర భాస్వరం
    3) నల్ల భాస్వరం
    4) స్కార్లెట్ భాస్వరం
17. అగ్గిపుల్లను గీసినప్పుడు జరిగే ప్రక్రియ?
    1) పెట్టె పక్క భాగంలోని ఎర్ర భాస్వరం మండుతుంది
    2) అగ్గిపుల్ల చివరలోని ఆంటిమొనీ సల్ఫైడ్‌ను మండిస్తుంది
    3) కావలసిన ఆక్సిజన్‌ను పొటాషియం క్లోరేట్ అందిస్తుంది
    4) పైవన్నీ
18. అగ్గిపుల్ల తలభాగం పొటాషియం క్లోరేట్, ఏ పదార్థ మిశ్రమంతో పూత పూసి ఉంటుంది? *(గ్రూప్-2, 2012)*
    1) అల్యూమినియం ట్రై క్లోరైడ్
    2) ఆంటిమొనీ ట్రై సల్ఫైడ్
    3) బిస్మత్ నైట్రేడ్
    4) అల్యూమినియం ఫాస్ఫేట్
19. ఫాస్ఫరస్ పెంటాక్సైడ్ (P_2O_5) నీటిలో కరిగి ఏర్పరిచే ఆమ్లం ఏది?
    1) ఫాస్ఫారికామ్లం
    2) పైరో ఫాస్ఫారికామ్లం
    3) ఫాస్ఫరస్ ఆమ్లం
    4) మెటా ఫాస్ఫారికామ్లం
20. ఎలుకలను చంపడానికి ఉపయోగించే విష పదార్థం ఏది?
    1) జింక్ ఫాస్ఫేట్
    2) కాల్షియం ఫాస్ఫేట్
    3) జింక్ ఫాస్ఫైడ్
    4) కాల్షియం ఫాస్ఫైడ్
21. వ్యవసాయంలో ఉపయోగించే ఏ రసాయనాల్లో నైట్రోజన్, భాస్వరం, పొటాషియం ఎక్కువగా ఉంటాయి?
    1) ఎరువులు 2) పురుగు మందులు
    3) హెర్బిసైడ్‌లు 4) ఏదీకాదు
22. సూపర్ ఫాస్ఫేట్ ఆఫ్ లైమ్ అనేది ఒక..?
    1) నత్రజని ఎరువు
    2) ఫాస్ఫాటిక్ ఎరువు
    3) పొటాషియం ఎరువు
    4) కాల్షియం ఎరువు
23. ఎముకల్లో ఫాస్ఫరస్ ఏ రూపంలో ఉంటుంది?
    1) కాల్షియం ఫాస్ఫైడ్
    2) కాల్షియం ఫాస్ఫేట్
    3) కాల్షియం ఫాస్ఫైట్
    4) సోడియం ఫాస్ఫేట్
24. కిందివాటిలో రసాయన ఎరువుల్లో ఉండని మూలకం ఏది? *(గ్రూప్-2, 2008)*
    1) నైట్రోజన్ (N)
    2) ఫాస్ఫరస్ (P)
    3) పొటాషియం (K)
    4) క్లోరిన్ (Cl)
25. బేకింగ్ పరిశ్రమల్లో బేకింగ్ పౌడర్‌తోపాటు, పిండిని గుల్లగా చేయడానికి ఉపయోగించే పదార్థం ఏది?
    1) ఫాస్ఫారికామ్లం
    2) కాల్షియం డై హైడ్రోజన్ ఫాస్ఫేట్
    3) కాల్షియం ఫాస్ఫేట్
    4) కాల్షియం ఫాస్ఫైడ్
26. పంటి 'ఎనామిల్'లో ఉండే పదార్థం ఏది?
    1) కాల్షియం హైడ్రాక్సీ ఎపటైట్
    2) కాల్షియం డై హైడ్రోజన్ ఫాస్ఫేట్
    3) కాల్షియం ఫ్లోరైడ్
    4) ఏదీకాదు
27. మానవ శరీరంలో కాల్షియం తర్వాత అత్యధికంగా ఉండే ఖనిజం ఏది?
    1) సల్ఫర్ 2) ఫాస్ఫరస్
    3) సిలికాన్ 4) సెలినియం
28. మానవ శరీరంలో ఫాస్ఫరస్ ఏ భాగంలో ఉంటుంది?
    1) ఎముకలు 2) దంతాలు
    3) కణజాలం 4) పైవన్నీ
29. శరీరంలో విటమిన్ 'బి' సమర్థ వినియోగానికి అవసరమైన మూలకం ఏది?
    1) ఫాస్ఫరస్ 2) సెలినియం
    3) ఐరన్ 4) మెగ్నీషియం
30. పళ్లపై గారను తొలగించి వాటిని తెల్లగా చేయడానికి ఉపయోగించే ఆమ్లం ఏది?
    1) హైడ్రోక్లోరికామ్లం
    2) నైట్రికామ్లం
    3) సల్ఫ్యూరికామ్లం
    4) ఫాస్ఫారికామ్లం
31. వాంతిని అరికట్టే ఔషధాల తయారీలో ఉపయోగించే ఆమ్లం ఏది?
    1) ఫాస్ఫారికామ్లం
    2) నైట్రికామ్లం 3) కార్బోనికామ్లం
    4) ఎసిటికామ్లం

సమాధానాలు

1) 1; 2) 4; 3) 3; 4) 2; 5) 2;
6) 3; 7) 2; 8) 2; 9) 4; 10) 1;
11) 3; 12) 2; 13) 3; 14) 4; 15) 4;
16) 2; 17) 4; 18) 2; 19) 1; 20) 3;
21) 1; 22) 2; 23) 2; 24) 4; 25) 2;
26) 1; 27) 2; 28) 4; 29) 1; 30) 4
31) 1.

తొలి టెక్నాలజీ మిషన్ ఎప్పుడు ప్రవేశపెట్టారు?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

సైన్స్ అండ్ టెక్నాలజీ

టెక్నాలజీ మిషన్

ప్రాంతాలు, సామాజిక వర్గాలకు అతీతంగా టెక్నాలజీ అభివృద్ధి ఫలాలను దేశంలోని ప్రజలందరికీ వేగంగా అందించాలనే లక్ష్యంతో రూపొందించిన కార్యక్రమమే Technology Mission. భారత ప్రభుత్వం 1986లో తొలిసారి టెక్నాలజీ మిషన్ విధానాన్ని రూపొందించి అమలు చేసింది. తర్వాత కాలంలో ఎదురైన సవాళ్లను దృష్టిలో పెట్టుకొని ఎప్పటికప్పుడు టెక్నాలజీ మిషన్‌లో కొత్త లక్ష్యాలను చేర్చుతోంది.

టెక్నాలజీ మిషన్ ప్రధాన లక్ష్యాలు

- ఆహార ధాన్యాలు, పప్పు దినుసులు, నూనె గింజల ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించడం. దిగుమతులను తగ్గించేందుకు చర్యలు. అధిక దిగుబడి ఇచ్చే వంగడాలను వృద్ధి చేయడం ద్వారా ఫలాలు, కూరగాయలు, పుష్పాల ఉత్పత్తిని పెంచి ఉద్యానవన రంగాన్ని అభివృద్ధి చేయడం.
- జమ్ము– కశ్మీర్, ఈశాన్య రాష్ట్రాల్లో నిరుద్యోగ సమస్యను అధిగమించడానికి ప్రత్యేక కార్యక్రమాలను రూపొందించడం. అత్యాధునిక ఇన్ఫర్మేషన్, కమ్యూనికేషన్ టెక్నాలజీ (ICT) ద్వారా దేశవ్యాప్తంగా ఉన్నత, సాంకేతిక విద్యా ప్రమాణాలను పెంపొందించడం.
- గ్రామీణ ప్రాంతాల్లో కనీస మౌలిక సదుపాయాలైన.. తాగునీటి సరఫరా, పారిశుద్ధ్య సేవలు, రోడ్ల నిర్మాణం వంటి వాటిని అభివృద్ధి పరచడం.
- దేశవ్యాప్తంగా 85% అక్షరాస్యత సాధన.
- ప్రాథమిక వైద్య కేంద్రాలు, వైద్య వాలంటీర్లు, మొబైల్ మెడికల్ యూనిట్స్, టీకాలు, శిశు వైద్యం వంటి వాటిని గ్రామీణ ప్రాంతాలకు త్వరితగతిన విస్తరించి గ్రామీణ ప్రాంత ఆరోగ్య భద్రతను పెంపొందించడం.
- శీతోష్ణస్థితి మార్పుల వల్ల తలెత్తే వ్యవసాయ, తాగునీటి, ఆరోగ్య రంగ సవాళ్లను దృష్టిలో పెట్టుకొని వాటికి అనుగుణంగా కార్యక్రమాలను అమలు చేయడం.
- శక్తి భద్రతను సాధించే దిశలో పునర్వినియోగ శక్తి వనరులను; ముఖ్యంగా సౌర శక్తిని అభివృద్ధి చేయడం, శక్తి సామర్థ్యాన్ని పెంపొందించడం.
- నానో టెక్నాలజీపై పరిశోధనలను ప్రోత్సహిస్తూ ఆరోగ్య, నిర్మాణ, శక్తి రంగాల్లో అత్యాధునిక పరికరాలను అందుబాటులోకి తీసుకురావడం.

జాతీయ సైన్స్ విధానం

శాస్త్ర, సాంకేతిక రంగాల పురోగతి ద్వారానే దేశ సామాజిక, ఆర్థిక ప్రగతి సాధ్యమవుతుంది. భావి భారత్‌కు సైన్స్, టెక్నాలజీలు మూల స్తంభాల వంటివని తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ పేర్కొన్నారు. ఇందులో భాగంగా స్వాతంత్ర్యానంతరం ఈ రంగంలో అనేక కార్యక్రమాలను అమలు చేయడంతోపాటు జాతీయ సైన్స్ విధానాన్ని విడుదల చేశారు.

శాస్త్ర, సాంకేతిక రంగాల్లో త్వరితగతిన అభివృద్ధి సాధించేందుకు ఒక జాతీయ విధానం అవసరం. దీన్ని గుర్తించిన నాటి కేంద్ర ప్రభుత్వం 1958లో తొలిసారి జాతీయ సైన్స్ తీర్మానాన్ని ప్రకటించింది. ఆ తర్వాత అవసరాలు, ఎదురైన సవాళ్ల దృష్ట్యా ఈ విధానంలో అనేక మార్పులు చోటు చేసుకున్నాయి. ఫలితంగా ప్రభుత్వం 1983, 2003ల్లో నూతన టెక్నాలజీ పాలసీ స్టేట్‌మెంట్‌లను ప్రకటించింది. దేశంలో సైన్స్, టెక్నాలజీలను ప్రోత్సహించడంలో నవీకరణ ప్రాధాన్యతను దృష్టిలో పెట్టుకొని 2013లో Science & Technology, Innovation (STI) విధానాన్ని తీసుకొచ్చింది.

లక్ష్య సాధన-ప్రభుత్వ చర్యలు

1958 నాటి సైన్స్ విధాన తీర్మానంలో శాస్త్ర సాంకేతిక రంగం, మానవ వనరులు, సహజ వనరుల అభివృద్ధి కోసం ఒక జాతీయ విధానం అవసరమని గుర్తించారు. ఇందులో భాగంగా ప్రభుత్వం సైన్స్ విద్యను ప్రోత్సహించడం, ఉన్నత ప్రమాణాలు కలిగిన శాస్త్రవేత్తలు, పరిశోధకులను అందుబాటులోకి తీసుకురావడం, స్త్రీ పురుషులను సమానంగా ప్రోత్సహించడం, వ్యవసాయ సంరక్షణ, మానవ వనరుల శిక్షణ వంటి లక్ష్యాలను ప్రభుత్వం నిర్దేశించుకుంది. వీటి సాధనకు వ్యవసాయ, పారిశ్రామిక రంగాల్లో పెట్టుబడులను పెంచింది.

పారిశ్రామిక రంగ అభివృద్ధి ద్వారా దేశవ్యాప్తంగా ఉద్యోగ అవకాశాలు లభించినా బలహీన వర్గాల్లో నిరుద్యోగ సమస్య కూడా పెరిగింది. హరిత విప్లవం ద్వారా ఆహార భద్రత పెరిగింది. అయితే దాన్ని వర్షాధార ప్రాంతాల్లో విస్తరించకపోవడం వల్ల కరువు తీవ్రత అధికమైంది. శక్తి డిమాండ్లను ముందుగా అంచనా వేయడంలో కూడా ఆలస్యం జరిగింది. కానీ, పునర్వినియోగ వనరుల ప్రాధాన్యతను ప్రభుత్వం గుర్తించింది.

ఈ రకమైన సవాళ్లను అధిగమించడం, పర్యావరణాన్ని పరిరక్షించడంతోపాటు సంప్రదాయ విజ్ఞానాన్ని, దేశీయ టెక్నాలజీని అభివృద్ధి చేసే లక్ష్యంతో ప్రభుత్వం 1983లో సరికొత్త టెక్నాలజీ పాలసీ స్టేట్‌మెంట్‌ను విడుదల చేసింది. ఇందులో భాగంగా తక్కువ పెట్టుబడితో అధిక అభివృద్ధికి తోడ్పడే టెక్నాలజీ రూపకల్పన, పర్యావరణ పరిరక్షణ, సంప్రదాయ నైపుణ్య ప్రోత్సాహం, పునర్వినియోగ శక్తి వనరుల అభివృద్ధి వంటి లక్ష్యాల సాధనకు అనేక కార్యక్రమాలను నిర్వహించింది. ఇన్‌శాట్, ఐఆర్ఎస్ వ్యవస్థల అభివృద్ధి, కరువు నివారణ కార్యక్రమాల అమలు, పర్యావరణ పరిరక్షణ చట్ట రూపకల్పన వంటి వివిధ చర్యలను చేపట్టింది.

జాతీయ సైన్స్ విధానం-2003

సైన్స్ అండ్ టెక్నాలజీ అభివృద్ధి ద్వారా ఆహార భద్రత పెరిగినప్పటికీ పోషణ భద్రత ఆశించినంతగా సాధించకలేకపోయాం. శీతోష్ణస్థితి మార్పు సమస్యలు పెరిగి విపత్తులు పెరిగాయి. మేధోసంపత్తి హక్కుల ప్రాధాన్యతను కూడా దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం 2003లో కొత్త సైన్స్ విధానాన్ని విడుదల చేసింది. ఆయా అంశాలను అంతర్జాతీయ స్థాయిలో ప్రోత్సహిస్తే మినహా దేశీయ టెక్నాలజీ డిమాండ్‌ను చేరుకోలేమన్న భావన ఉంది. దీన్నే 2013లో సైన్స్ అండ్ టెక్నాలజీ ఇన్నోవేషన్ విధానానికి ప్రేరణగా చెప్పవచ్చు. 2020 నాటికి ప్రపంచ శాస్త్ర, సాంకేతిక రంగాల్లో తొలి ఐదు దేశాల సరసన భారత్‌ను నిలబెట్టడం, దేశ జీడీపీలో పరిశోధనల అభివృద్ధి వ్యయాన్ని 2 శాతానికి పెంచడం, ఐదేళ్లలో దేశంలోని శాస్త్రవేత్తలను 66 శాతానికి పెంచడం వంటివి 2013 STI విధాన ప్రధాన లక్ష్యాలు.

Nano Science & Technology Mission (Nano Mission)

దేశ సామాజిక, ఆర్థిక ప్రయోజనాల్లో భాగంగా నానో టెక్నాలజీ అభివృద్ధిని ప్రోత్సహించే లక్ష్యంతో 2007 మేలో కేంద్ర ప్రభుత్వం Nano-Science & Technology Missionను ప్రారంభించింది. సీఎన్ఆర్ రావు అధ్యక్షుడిగా ఉన్న నానో మిషన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో ఈ మిషన్ అమలవుతోంది. ఇందులో భాగంగా సలహాదారు సంస్థలైన Nano Science Advisory Technology Advisory Group (NSAG), Nano Applications and Technology Advisory Group (NATAG)లు టెక్నికల్ కార్యక్రమాలను అమలు చేస్తాయి.

నానో మిషన్ - ప్రధాన లక్ష్యాలు

- పదార్థాన్ని ప్రాథమిక స్థాయిలో అర్థం చేసుకొని నానోమీటర్ స్థాయిలో దాన్ని వినియోగించేందుకు కృషి చేయడం.
- నానో టెక్నాలజీ అభివృద్ధికి కావాల్సిన Transmission Electron Microscope (TEM), Scanning Probe Microscope (SPM), Optimal Tweezer వంటి పరికరాలను అభివృద్ధి చేయడం.
- నానో టెక్నాలజీ అభివృద్ధికి పబ్లిక్–ప్రైవేటు భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం.
- ఈ రంగంలో నిష్ణాతులైన మానవ వనరులను అందుబాటులోకి తేవడంతోపాటు నానో క్రిస్టల్స్, నానో ట్యూబ్స్ అభివృద్ధికి కృషి చేయడం.

నిర్వహించిన కార్యక్రమాలు

అమెరికా, జర్మనీ, ఫ్రాన్స్, ఇటలీ, రష్యా, జపాన్ వంటి దేశాలతో నానో టెక్నాలజీ అభివృద్ధికి ఉద్దేశించిన సహకార కార్యక్రమాలను ప్రారంభించారు.

చెన్నైలో Nano Functional Material Technology Centre (NFMTC) ఏర్పాటు చేశారు. సెరామిక్స్ ఉత్పాదనలో అవసరమయ్యే నానో క్రిస్టలైన్ ఆక్సైడ్ పౌడర్స్, కార్బన్ నానో ట్యూబ్స్‌ను అభివృద్ధి చేశారు.

టైర్ ఇంజనీరింగ్‌లో ఉపయోగపడే హై పర్ఫార్మెన్స్ రబ్బరు నానో కాంపోజిట్స్ అభివృద్ధి. మొహాలి, హైదరాబాద్, బెంగళూరు, కోల్‌కతాల్లో Institute of Nano Science and Technologyలను ఏర్పాటు చేశారు.

సైన్స్ విధానం (2003) - వ్యూహాలు

దేశంలోని శాస్త్రవేత్తలు, పరిశోధకులను సైన్స్ అండ్ టెక్నాలజీ రంగ అభివృద్ధికి ఉద్దేశించిన ప్రణాళికల్లో భాగస్వాములను చేయడం. ముఖ్యంగా సామాజిక, ఆర్థిక ప్రగతికి ఉద్దేశించిన సైన్స్ విధానాలు కార్యక్రమాల రూపకల్పనలో దేశంలోని ప్రధాన పరిశోధనా సంస్థలు, కేంద్రాలను తప్పనిసరిగా భాగస్వామ్యం చేయాలి. వివిధ ప్రాంతాల్లోని సమస్యల పరిష్కారానికి కృషి చేసేలా కార్యక్రమాలను రూపొందించాలి. విశ్వవిద్యాలయాలు, R&D యూనిట్‌లు, అన్ని S&T వ్యవస్థలకు పూర్తి స్థాయి స్వయం ప్రతిపత్తిని కల్పించి వాటిని బలోపేతం చేయాలి. సైన్స్ అండ్ టెక్నాలజీ వ్యవస్థ అభివృద్ధికి మారుతున్న అవసరాలకు అనుగుణంగా తగిన మార్పులను ఎప్పటికప్పుడు తీసుకురావాలి. సైన్స్ ఆధారిత మంత్రిత్వ శాఖలు, విభాగాలన్నింటినీ సైంటిస్టులు, టెక్నాలజిస్టుల ఆధ్వర్యంలో నడిచే విధంగా చూడాలి. వీటితోపాటు సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ ఉన్నత స్థాయి సాంకేతిక సలహా కమిటీలను ఏర్పాటు చేయాలి. ఉన్నత విద్య, S&T అభివృద్ధికి బడ్జెట్‌లో అధిక కేటాయింపులు ఉండాలి. GDPలో 2% మేర S&T రంగంలో పెట్టుబడులను పెంచాలి. అదే విధంగా పారిశ్రామిక రంగం కూడా R&D విభాగంపై పెట్టుబడులను పెంచాల్సిన అవసరం ఉంది. ఈ రకమైన చర్యల ద్వారా దేశ సామాజిక, ఆర్థిక అభివృద్ధి లక్ష్యాలను చేరుకోవచ్చు.

ప్రధానమంత్రి నరేంద్రమోదీ దేశవ్యాప్తంగా డిజిటల్ అక్షరాస్యతను సాధించే లక్ష్యంతో 2014 ఆగస్టు 21న జాతీయ డిజిటల్ లిటరసీ మిషన్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి డిజిటల్ సాక్షరత అభియాన్ (DISHA) అని నామకరణం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో డిజిటల్ అక్షరాస్యతను విస్తరించడంతోపాటు సమాచార సాంకేతికత ద్వారా గ్రామీణుల్లో సాధికారత సాధించడమే ఈ కార్యక్రమ ప్రధాన లక్ష్యం. ఇందులో భాగంగా అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు, రేషన్ డీలర్లతో పాటు సుమారు 52.5 లక్షల మందికి ఐటీ శిక్షణ అందించనున్నారు.

దేశంలోని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఈ మిషన్ అమల్లో ఉంటుంది. జనాభా ప్రాతిపదికన రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలను 3 విభాగాలుగా విభజించి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. 14 నుంచి 60 ఏళ్లలోపు డిజిటల్ నిరక్షరాస్యులు అంతా ఈ కార్యక్రమం కింద శిక్షణ పొందవచ్చు.

డిజిటల్ లిటరసీ మిషన్‌లో అందించే ఐటీ శిక్షణకు ఉద్దేశించిన ట్రైనింగ్ మెటీరియల్‌ను నాస్‌కామ్ ఫౌండేషన్ అభివృద్ధి చేసింది. Basics of Digital Literacy కరిక్యులంను ఏడు మాడ్యుల్స్‌గా విభజించారు. అవి..

1. పవర్ ఇన్ యువర్ హ్యాండ్స్
2. ఇంటర్నెట్
3. ఇ–మెయిల్ అండ్ సోషల్ మీడియా
4. ఉపయోగిత సమాచారం
5. ప్రభుత్వం
6. ఈ– కామర్స్
7. ఐటీ సెక్యూరిటీ

ఈ కార్యక్రమానికి ఇంటెల్, మైక్రోసాఫ్ట్, గూగుల్ వంటి సంస్థల నుంచి సహకారం లభించింది. కాగ్నిజెంట్ టెక్నాలజీ వంటి సంస్థలకు చెందిన వాలంటీర్లు.. ట్రైనింగ్ కంటెంట్‌ను స్థానిక భాషల్లోకి అనువదించడంలో కీలకపాత్రను పోషించారు.

What does CAMPA Stand for?

BANK EXAMS

BANKING AWARENESS

1. Recently, the Union Finance Ministry launched India Aspiration Fund (IAF) to boost start-ups in India. Who will be the partner and co-investor in the IAF?
a) LIC b) SIDBI
c) NABARD d) RBI e) SEBI
2. State Bank of India on 18 August 2015 launched a mobile wallet app, SBI Buddy, in collaboration with Accenture and ?
a) Visa b) Paytm
c) Paypal d) Mastercard
e) Maestro
3. In context with banking, a Certificate of Deposit is ___
a) Money Market Instrument
b) Negotiable Instrument
c) Transferable instrument
d) All of above e) None
4. The maturity of Treasury Bills in India is always less than ____
a) 91 Days b) 182 Days
c) 365 Days d) 730 Days
e) 425 Days
5. Which of the following is/are salient features of Treasury Bills?
a) They have zero default risk
b) They are highly liquid
c) No tax is deducted at source
d) All of above
e) None of these
6. Which of the following bank's head office is not located in New Delhi?
a) Punjab National bank
b) Punjab and Sind bank
c) Bank of India
d) Bharatiya Mahila Bank
e) None of these
7. Which one of the following is an example for Long Term Investment Option?
a) Fixed deposit
b) Money market
c) Public provident fund
d) Saving accounts
e) None of these
8. Which of the following is not the quantitative tool of the Reserve Bank of India (RBI)?
a) OMO b) Reserve ratios
c) Rationing of credit
d) Statutory Pre-emption
e) None of these
9. In which year, Insurance Regulatory and Development Authority (IRDA) was constituted?
a) 1999 b) 1998 c) 1997
d) 1996 e) 1992
10. Which Insurance policy gives holder the benefits of both Insurance and Investment?
a) Term Insurance Policies
b) Money-back Policies
c) Unit-linked Investment Policies
d) Pension Policies
e) None of these
11. Which of the following banks has been declared by Reserve Bank of India (RBI) as Domestic Systemically Important Banks (D- SIBs)?
a) HDFC and ICICI
b) ICICI and SBI
c) SBI and HDFC
d) PNB and SBI
e) HDFC and SBI
12. Recently, the Government of India (GoI) launched e-payment module to deposit compensatory levies into CAMPA Funds. What does CAMPA Stand for?
a) Compensatory Affordable Fund Management and Planning Authority
b) Compensatory Affectable Fund Management and Planning Authority
c) Compensatory Affectation Fund Management and Planning Authority
d) Compensatory Afforestation Fund Management and Planning Authority
e) None of these
13. Which of the following banks recently launched "Smart Vault" digital locker facility?
a) SBI b) HDFC c) PNB
d) NABARD e) ICICI
14. Union Government has recently notified the merger of commodities market regulator Forward Markets Commission (FMC) with?
a) SEBI b) IDBI c) NABARD
d) All of the above
e) None of the above
15. Which of the following is used by RBI for sterilization of the Capital Inflows?
a) Base Rate System
b) CRAR Obligations
c) Open Market Operations
d) Credit Authorization Scheme
e) None of these
16. In India, Infrastructure Debt Fund can be established as a Trust or a company. Which of the following regulated the Infrastructure Debt Fund set up as a trust?
a) SEBI b) RBI c) IRDA
d) Ministry of Corporate Affairs
e) IFCI
17. How do we label the risk of collapse of an entire financial system or entire market?
a) Seismic Risk
b) Systemic Risk
c) Systematic Risk
d) Market Risk e) None of these
18. How many parties primarily involved in a Promissory Note?
a) Two b) Three c) Four
d) Five e) six
19. Which Union Ministry launched the Smart National Common Mobility Card (NCMC), recently?
a) Ministry of Railways
b) Ministry of Home Affairs
c) Ministry of Foreign Affairs
d) Ministry of Urban Development
e) None of these
20. Which of the following banks launched the "IndPay" mobile app service recently?
a) Indian Bank b) Dena Bank
c) Punjab National Bank
d) Karnataka Bank
e) Axis Bank
21. What is the minimum net owned fund (NOF) mandatory for a Infrastructure Finance Company (IFC) in India?
a) Rs. 200 Crore
b) Rs. 300 Crore
c) Rs. 500 Crore
d) Rs. 100 Crore
e) Rs. 400 Crore
22. When two or more distinct insurance policies combined into a single contract, it is known as
a) CMO b) Package Policy
c) Mortgage Insurance
d) Micro Insurance
e) None of these
23. When a promissory note or bill of exchange has been dishonoured by non-acceptance or non-payment, the holder may, within a reasonable time, cause such dishonour to be noted and certified by ___
a) Notary b) Magistrate
c) Collector of that region
d) All true e) None of these
24. For what purpose, a web-based Portal "Vidya Lakshmi" has been launched by Union Government?
a) Direct subsidy for farmers
b) Women Empowerment
c) Home loans
d) Educational Loans
e) None o f these
25. The National Payments Corporation of India (NPCI) has announced the nationwide e-payment literacy workshop. Who among the following is the present chairman of the NPCI?
a) Jyotsna Suri
b) umit Mazumder
c) M Balachandran
d) All of the above
e) None of these
26. What is sold and purchased during Open Market Operations by RBI?
a) Government Securities
b) Commercial Papers
c) Certificates of Deposits
d) Global Depository Receipts
e) None of these
27. Which of the following is not a type of mutual fund?
a) Open-ended scheme
b) Closed-ended scheme
c) Long forward scheme
d) Exchange-traded funds
e) None of these
28. Headquarters of State Bank of Mysore is located at?
a) Hyderabad b) New Delhi
c) Mumbai d) Bangalore
e) Karnataka
29. RBI takes "Prompt Corrective Action" when a bank is faced to?
a) Market Riskb) Credit Risk
c) Liquidity Risk
d) Low Capital Adequacy
e) None of these

KEY

1) a; 2) d; 3) d; 4) c; 5) d;
6) c; 7) c; 8) c; 9) a; 10) c;
11) b; 12) d; 13) e; 14) a; 15) c;
16) a; 17) b; 18) a; 19) d; 20) a;
21) b; 22) b; 23) a; 24) d; 25) c;
26) a; 27) c; 28) d; 29) d

Non-Banking Financial Company (NBFC)

A Non-Banking Financial Company (NBFC) is a company

a) Registered under the Companies Act. 1956,
b) Its principal business is lending, investments in various types of shares/stocks/bonds /debentures/securities, leasing, hire-purchase, insurance business, chit business
c) Its principal business is receiving deposits under any scheme or arrangement in one lump sum or in installments.

However, a Non-Banking Financial Company does not include any institution whose principal business is agricultural activity, industrial activity, trading activity or sale/-purchase/construction of immovable property. (Section 45 I (c) of the RBI Act, 1934) .

One key aspect to be kept in view is that the financial activity of loans/advances as stated in 45 I (c), should be for activity other than its own. In the absence of this provision, all companies would have been NBFCs.

NBFCs whose asset size is of Rs.100 cr or more as per last audited balance sheet are considered as systemically important NBFCs.

The rationale for such classification is that the activities of such NBFCs will have a bearing on the financial stability in our country.

The Reserve Bank of India regulates and supervises Non-Banking Financial Companies which are into the business of (i) lending (ii) acquisition of shares, stocks, bonds, etc., or (iii) financial leasing or hire purchase. The Reserve Bank has been given the powers under the RBI Act 1934 to register, lay down policy, issue directions, inspect, regulate, supervise and exercise surveillance over NBFCs that meet the 50-50 criteria of principal business.

The Reserve Bank can penalize NBFCs for violating the provisions of the RBI Act or the directions or orders issued by RBI under RBI Act. The penal action can also result in RBI cancelling the Certificate of Registration issued to the NBFC, or prohibiting them from accepting deposits and alienating their assets or filing a winding up petition.

RBI tightened Tier 1 capital requirements and said NBFCs would need to hold capital levels of at least of Rs 1 crore ($162,668) by the end of March 2016 and Rs 2 crore by March-end 2017 to avoid losing their right to operate.

The country's apex bank also said only certain investment-grade NBFCs would be allowed to take deposits, saying the firms would have until the end-March 2016 to acquire a credit rating. RBI capped deposit-taking at 1.5 times the size of a firm's minimum capital - down from four times previously.

NBFCs lend and make investments and hence their activities are akin to that of banks; however there are a few differences as given below:

i. NBFC cannot accept demand deposits;
ii. NBFCs do not form part of the payment and settlement system and cannot issue cheques drawn on itself;
iii. deposit insurance facility of Deposit Insurance and Credit Guarantee Corporation is not available to depositors of NBFCs, unlike in case of banks.